# ఈనాడు



విజయవాడ 9-7-2025 బుధవారం సిటీ సంపుటి 51 . సంచిక 330
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

# రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక బ్లూప్రింట్

- సాగునీటి సంఘాలతో అమరావతిలో భారీ సమావేశం
- ముఖ్యమంత్రి చంద్రబాబు
- శ్రీశైలంలో కృష్ణమ్మకు పూజలు, సారె సమర్పించిన సీఎం
- డ్యాం గేట్లు ఎత్తడంతో దిగువకు పరవళ్లు

**నా జీవితంలో సంతోషకరమైన రోజు**

జులైలోనే శ్రీశైలం ప్రాజెక్టు నిండింది. నీటివిలువ తెలిసినవాడిని. అందుకే జలహారతి ఇచ్చాను. నా జీవితంలో ఇది సంతోషకరమైన రోజు. వాస్తవానికి ఏపీలో ఇంకా వర్షాలు పూర్తిస్థాయిలో పడలేదు. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన వర్షాల కారణంగా ఎక్కువగా నీళ్లు వచ్చి శ్రీశైలం జలాశయం నిండింది. నీళ్లు మన సంపద. జలాలుంటే సంపద సృష్టించొచ్చు. శ్రీశైలం పవిత్ర పుణ్యక్షేత్రం. మల్లికార్జునస్వామి చల్లగా చూసినంతవరకు రాయలసీమ సుభిక్షంగా ఉంటుంది. - చంద్రబాబు





కృష్ణమ్మకు నమస్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ★ శ్రీశైలం గేట్లు ఎత్తడంతో దిగువకు కృష్ణమ్మ పరుగులు

ఈనాడు, కర్నూలు, న్యూస్‌టుడే, సున్నిపెంట సర్కిల్: రాయలసీమ అభివృద్ధికి తనవద్ద ప్రత్యేక బ్లూప్రింట్ ఉందని.. ఏ జిల్లాకు ఏం చేయాలన్న అంశంపై స్పష్టత ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు వద్ద మంగళవారం కృష్ణమ్మకు పూజలు చేసి సారె సమర్పించి నాలుగు గేట్లు తెరిచి నీటిని దిగువకు వదిలారు. అనంతరం సున్నిపెంటలోని ప్రాజెక్టు ఉన్నత పాఠశాల మైదానంలో 'జలహారతి' పేరిట నిర్వహించిన బహిరంగసభలో మాట్లాడారు. 'ఎగువ రాష్ట్రాల్లో సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో జులైలోనే శ్రీశైలం డ్యాం నిండడం సంతోషకరం. కృష్ణా పరీవాహక ప్రాంతం కళకళలాడే పరిస్థితి వచ్చింది. శ్రీశైలం రాగానే మల్లికార్జున స్వామికి ప్రత్యేక ప్రార్థనలు చేశా. రాయలసీమ రతనాల సీమ కావాలని ప్రార్థించా. దేవుళ్లను ఎంత పవిత్రంగా ప్రార్థిస్తామో శ్రీశైలం జలాశయం నుంచి వచ్చే నీటినీ అంతే పవిత్రంగా పూజించాలి. అప్పుడే రైతుల కష్టాలు, సమస్యలు తీరుతాయి. మసీదులు, చర్చిలు, దేవాలయాలు ఉండొచ్చు గానీ అందరికీ అవసరమయ్యే జలాశయాలే ఆధునిక దేవాలయాలు. దురదృష్టం కొద్దీ ఐదేళ్లు ఒక పార్టీ అధికారంలోకి వచ్చింది. దాని పేరు కూడా చెప్పను. 2014-19 మధ్య తెదేపా సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.68 వేల కోట్లు ఖర్చుపెడితే ఆ పార్టీ కేవలం రూ.2 వేల కోట్లు ఖర్చుపెట్టింది. ఆ మొత్తం జీతాలు ఇవ్వడానికి కూడా సరిపోదు' అని ఎద్దేవా చేశారు.

**15 నాటికి జీడిపల్లికి నీళ్లు తీసుకెళ్తాం**

'కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.3,850 కోట్లు ఖర్చు పెట్టి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ నుంచి 40 టీఎంసీల నీరు రాయలసీమకు ఇచ్చేలా కార్యాచరణ ప్రణాళిక తయారుచేశాం. 11న పంపులు ప్రారంభిస్తాం. 15వ తేదీకి జీడిపల్లికి నీళ్లు తీసుకెళ్తాం. అక్కడి నుంచి ఈ నెల 30 నాటికి మదనపల్లె, కుప్పం వరకు నీళ్లు తీసుకెళ్తాం. ప్రస్తుత రాయలసీమ ఒకప్పటి రాయలసీమ కాదు. జాతీయ, రాష్ట్ర రహదారులను పూర్తి చేయడంతోపాటు పెండింగులో ఉన్న నీటి పారుదల ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తాం. సీమలో సాగునీటి విషయంలో తెదేపాకే పేటెంట్ ఉంటుంది. తెలుగుగంగ, పోతిరెడ్డిపాడు, గాలేరు-నగరి, హంద్రీనీవా తదితరాలన్నీ ఎవరి హయాంలో ప్రారంభమయ్యాయో గుర్తుచేసుకోవాలి. గత పాలకులు ఐదేళ్లు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. చెడిపోయిన వ్యవస్థల్ని (మిగతా 2లో)

# మోదీకి బ్రెజిల్ అత్యున్నత పురస్కారం

- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి గుర్తింపు
- సుస్థిరతకు మూలస్తంభం.. ఇరు దేశాల భాగస్వామ్యం: ప్రధాని మోదీ



బ్రెజిల్ అత్యున్నత పౌర పురస్కారాన్ని ప్రధాని మోదీకి ప్రదానం చేసి, అభినందిస్తున్న ఆ దేశాధ్యక్షుడు లులా డ సిల్వా

బ్రసీలియా: భారత ప్రధాని నరేంద్రమోదీకి బ్రెజిల్ అత్యున్నత పౌర పురస్కారమైన 'గ్రాండ్ కాలర్ ఆఫ్ ది నేషనల్ ఆర్డర్ ఆఫ్ ది సదర్న్ క్రాస్' లభించింది. ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం చేయడంలో ఆయన కృషి, కీలకమైన ప్రపంచ వేదికలపై ఇరు దేశాల సహకారాన్ని పెంపొందిస్తున్న తీరుకు గానూ బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వా మంగళవారం దీనిని మోదీకి ప్రదానం చేశారు. ఇలాంటి అంతర్జాతీయ పురస్కారాలను మోదీ అందుకోవడం ఇది 26వ సారి. ఈ పురస్కారం తనకు మాత్రమే కాకుండా 140 కోట్లమంది భారతీయులకూ గర్వకారణమని, ఇవి ఉద్వేగపూరిత క్షణాలని ఆయన పేర్కొన్నారు. డ సిల్వాతో ద్వైపాక్షిక చర్చల అనంతరం మోదీ మాట్లాడుతూ- అన్ని వివాదాలనూ చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలనేది తమ ఏకాభిప్రాయమని చెప్పారు. అనిశ్చితి, ఉద్రిక్తతలు రాజ్యమేలుతున్న తరుణంలో సుస్థిరత, సమతౌల్యతకు (మిగతా 2లో)

# నాలుగేళ్లల్లో ఏ ఒక్క ఏడాది ఇతర రాష్ట్రాల్లో చదివినా స్థానికేతరులే..

- రాష్ట్రంలోని స్థానికేతర కోటాను ఏపీ విద్యార్థులకు కేటాయించేలా ఇటీవల ప్రభుత్వ ఉత్తర్వులు
- ఈఏపీసెట్ కౌన్సెలింగ్‌కు హాజరైన తెలంగాణలో చదివిన విద్యార్థుల్లో ఆందోళన
- తల్లిదండ్రులు ఏపీలో ఉంటున్నట్లు సర్టిఫికెట్లు సమర్పిస్తే స్థానికేతర కోటాకు అర్హత

ఈనాడు, అమరావతి, నందికొట్కూరు, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ ప్రవేశాలకు నిర్వహించే ఈఏపీసెట్ కౌన్సెలింగ్‌లో పదో తరగతి వరకు ఏపీలో చదివి..తెలంగాణలో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులను స్థానికేతర కోటాలో చూపడంతో కొందరు తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. వృత్తి విద్య, డిగ్రీ, ఇంజినీరింగ్ వంటి ఉన్నత విద్య కోర్సుల్లో ప్రవేశాలకు 2024 వరకు ఉన్న స్థానిక, స్థానికేతర రిజర్వేషన్ విధానంలో ఇటీవల ప్రభుత్వం మార్పు చేసింది. రాష్ట్రంలోని సీట్లన్నీ ఏపీ వారికే లభించేలా మే నెలలో కొత్త జీఓను జారీ చేసింది. 2025-26 విద్యా (మిగతా 2లో)



**ఏపీ బాండ్లు కొనొద్దంటూ..**

# 200 ఆర్థిక సంస్థలకు మెయిల్స్

## రాష్ట్రానికి డబ్బు రాకుండా వైకాపా కుట్రలు



- హైకోర్టులో వ్యాజ్యం వేయించారు.. ప్రధాని మోదీ, ఆర్‌బీఐకి ఫిర్యాదులిప్పించారు
- రాష్ట్రం పరువు తీసేది చాలక ప్రెస్‌మీట్లు.. ఏడుపులా?
- తప్పుడు ఫిర్యాదులు చేయించిన జగన్, బుగ్గనలను ప్రాసిక్యూట్ చేయాలి: ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

ఈనాడు - అమరావతి

రాష్ట్రప్రభుత్వం ఏపీఎండీసీ (ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ) ద్వారా జారీచేసే బాండ్లలో పెట్టుబడులు పెట్టవద్దంటూ.. ఉదయభాస్కర్ అనే వ్యక్తితో 200 జాతీయ, అంతర్జాతీయ కంపెనీలకు మాజీ సీఎం జగన్, మాజీ ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి మెయిల్స్ చేయించారని రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ధ్వజమెత్తారు. అయినా ఆర్థిక సంస్థలు వాటిని పట్టించుకోకుండా చంద్రబాబుపై నమ్మకంతో బాండ్లు కొనుగోలు చేశాయని వివరించారు. తప్పుడు ఫిర్యాదులతో రాష్ట్రం పరువు తీసిన ఉదయభాస్కర్‌పై దేశద్రోహ నేరం కింద కేసు పెట్టడంతోపాటు.. ఆయన్ను ప్రోత్సహించిన జగన్, బుగ్గనలను ప్రాసిక్యూట్ చేయాలని సీఎం చంద్రబాబును కోరారు. మంగళవారం సచివాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. 'బాండ్లలో పెట్టుబడులు పెట్టొద్దంటూ మెయిల్స్ పంపిన ఉదయభాస్కర్ ఉండేది జర్మనీలో. ఆయన ఫేస్‌బుక్ ప్రొఫైల్ జగన్ ఫొటోతో ఉండటమే వైకాపాతో సంబంధాలకు నిదర్శనం. ఐదేళ్ల తన పాలనలో ఏపీ బ్రాండ్ ధ్వంసం చేసిన జగన్.. ఇప్పుడు మళ్లీ అదే చేస్తున్నారు' అని దుయ్యబట్టారు.

'ఉదయభాస్కర్ మెయిల్స్ పంపినా.. పెట్టుబడిదారుల్లో నమ్మకం సడల్లేదు. దీంతో లేళ్ల అప్పిరెడ్డి ద్వారా హైకోర్టులో పిల్ వేయించారు. ఆ వెంటనే వ్యాజ్యం కోర్టు విచారణలో ఉందంటూ మళ్లీ మెయిల్స్ పెట్టారు. ప్రెస్‌మీట్లు పెట్టారు. ఏడుపులు, పెడబొబ్బలతో సొంతపత్రికలో వార్తలు రాయించారు. అప్పటికీ వారి అక్కసు తీరలేదు. ఎంపీ, పార్లమెంటు ఆర్థిక కమిటీ సభ్యుడైన వైవీ సుబ్బారెడ్డితో ప్రధాని మోదీకి, ఆర్‌బీఐ, సెబీ సహా ఎన్నో సంస్థలకు ఫిర్యాదులు చేయించారు. సెబీ విచారణ చేసి, అన్నీ సరిగా ఉన్నాయని తేలడంతో ఆమోదం తెలిపింది. దీని వల్ల రుణం తీసుకోవడంలో 15 రోజులు జాప్యం జరిగింది. ఇదంతా జగన్, బుగ్గనల అక్కసు ఫలితమే' అని కేశవ్ మండిపడ్డారు. 'వైకాపా ప్రభుత్వ హయాంలో (మిగతా 2లో)




మంత్రి లోకేశ్‌ను సత్కరిస్తున్న సత్వ గ్రూపు డైరెక్టర్ మహేష్ కైతన్, ఎండీ విజయ్ అగర్వాల్, ప్రొక్యూర్‌మెంట్ విభాగ ఉపాధ్యక్షుడు ప్రద్యుమ్న మిశ్ర

# ఆరునెలల్లోనే క్వాంటమ్ వ్యాలీ

- విశాఖలో జీసీసీ ఇన్నోవేషన్ క్యాంపస్
- మంత్రి నారా లోకేశ్ ప్రకటన

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో పెట్టుబడులకు ఇదే సరైన సమయమని పారిశ్రామికవేత్తలకు ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. కృత్రిమమేధ, క్వాంటమ్ టెక్నాలజీ లాంటి అధునాతన సాంకేతిక రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్‌లో కేపబులిటీ సెంటర్లపై పెట్టుబడులు పెట్టాలని సూచించారు. గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల ప్రతినిధులతో మంగళవారం ఆయన బెంగళూరులోని మాన్యత ఎంబసీ బిజినెస్ పార్కులో ముఖాముఖి మాట్లాడారు. దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో దేశంలో తొలిసారిగా మరో ఆరు నెలల్లో 'క్వాంటమ్ వ్యాలీ'కి రూపునిస్తామని ధీమా వ్యక్తం చేశారు. దార్శనిక నేత- ఏపీ సీఎం చంద్రబాబు నేతృత్వంలో (మిగతా 2లో)

## ఇదీ సంగతి!




# వైకాపాది నీచ సంస్కృతి

ప్రసన్నకుమార్‌రెడ్డి మురికి వ్యాఖ్యలపై పెల్లుబికిన ఆగ్రహం

- తీవ్రంగా మండిపడిన మహిళాలోకం
- నియోజకవర్గంలోకి అడుగు పెట్టనీయబోమని హెచ్చరిక
- నెల్లూరు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి
- ప్రజలు ఓడించినా వైకాపా నేతల్లో మార్పు రాలేదని మంత్రులు, ఎమ్మెల్యేల విమర్శలు


13లో




ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ నెల్లూరులో నినాదాలు చేస్తూ ప్రదర్శనగా వెళ్తున్న మహిళలు

# మోదీకి బ్రెజిల్ అత్యున్నత పురస్కారం

(మొదటి పేజీ తరువాయి)


మోదీకి అశ్వాల కవాతుతో ఘన స్వాగతం పలుకుతున్న బ్రెజిల్ అధ్యక్షుడు లులా డ సిల్వా

ఇరు దేశాల భాగస్వామ్యం మూలస్తంభంలా నిలుస్తుందన్నారు. రక్షణ రంగంలో సహకారం బలోపేతం కావడం పరస్పర విశ్వాసానికి చిహ్నమని పేర్కొన్నారు. పర్యావరణం, శుద్ధ ఇంధనం రెండు దేశాలకూ ప్రధానాంశాలని, రాబోయే ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2,000 కోట్ల డాలర్లకు చేర్చాలనేది లక్ష్యమని చెప్పారు. ఉగ్రవాదాన్ని, దానికి మద్దతు ఇచ్చేవారిని తీవ్రంగా వ్యతిరేకిస్తామని సంయుక్త పత్రికా ప్రకటనలో మోదీ స్పష్టంచేశారు. ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు తావు లేదన్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, ఆరోగ్యం, ఔషధాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలపై నేతలు చర్చించుకున్నారు. వారి సమక్షంలో పలు ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. బ్రిక్స్ సదస్సులో పాల్గొని రియో డీ జనీరో నుంచి బ్రసీలియాకు వచ్చిన మోదీకి వినూత్న రీతిలో 114 అశ్వాల కవాతుతో స్వాగతం లభించింది.

### ప్రపంచ చక్రవర్తి అవసరం లేదు: బ్రెజిల్

మారిన పరిస్థితుల్లో ప్రపంచానికి చక్రవర్తి అవసరం లేదని డ సిల్వా వ్యాఖ్యానించారు. అమెరికా విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరించే బ్రిక్స్ అనుకూల దేశాలపై అదనంగా 10 శాతం సుంకం విధిస్తానంటూ అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన బెదిరింపులపై ఆయన స్పందిస్తూ గట్టి చురకలు వేశారు. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ముగింపు సందర్భంగా లులా మాట్లాడారు. 'ప్రపంచం మునుపటిలా లేదు.. మారిపోయింది. కాబట్టి చక్రవర్తి అవసరం లేదు. మన దేశాలు సార్వభౌమాధికారాన్ని కలిగిఉన్నాయి. ట్రంప్ సుంకాలను విధిస్తే.. ఇతర దేశాలకు అదే చేసే హక్కు ఉంది. సుంకాల గురించి అగ్రరాజ్య అధ్యక్షుడు సోషల్ మీడియాలో ప్రపంచాన్ని బెదిరించడం బాధ్యతారాహిత్యంగా భావిస్తున్నా. ఇలాంటి అంశాలపై ఇతర దేశాలతో మాట్లాడేందుకు చాలా వేదికలున్నాయి' అని పేర్కొన్నారు. ఒకరిని ఎదుర్కోవడం కోసం బ్రిక్స్ ఎవరికీ హాని చేయదని, కానీ రాజకీయాలకు మరో వేదిక ఉండాలని మాత్రమే కోరుకుంటోందని లులా వ్యాఖ్యానించారు.




సమావేశంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు. వేదికపై కేసీ కాలువ డబ్ల్యూ.యు.ఏ. అధ్యక్షుడు (వేల్పనూరు) జి.ఆదినారాయణరెడ్డి, కేసీ కాలువ డీసీ ఛైర్మన్ రామలింగారెడ్డి, కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డి, మంత్రి రామానాయుడు, ఎంపీ శబరి, మంత్రులు ఫరూక్, బీసీ జనార్దనరెడ్డి, ఎమ్మెల్యే అఖిలప్రియ


కృష్ణమ్మకు జలహారతి ఇస్తున్న సీఎం చంద్రబాబు

# రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక బ్లూప్రింట్

(మొదటి పేజీ తరువాయి)

చక్కదిద్దేందుకు రేయింబవళ్లు పనిచేస్తున్నా. నాకు 24 గంటలు చాలట్లేదు. ఆరోగ్యంగా ఉంటే మరికొన్నేళ్లు బతుకుతాం. చెడు అలవాట్లు... చెడు ఆలోచనలు ఉంటే త్వరగా పోతాం' అని పేర్కొన్నారు.

### అత్యధిక ప్రాజెక్టులు నిర్మించాం

'రాయలసీమకు హరిత ఇంధనం, పర్యాటకం, జాతీయ రహదారుల వ్యవస్థ, పారిశ్రామిక కారిడార్లు వస్తున్నాయి. లేపాక్షి-ఓర్వకల్లు కారిడార్‌కు డిఫెన్స్, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్ సిటీ, ఆటోమొబైల్స్, డ్రోన్, హరిత ఇంధన ప్రాజెక్టులు వస్తాయి. శ్రీశైలం, తిరుపతి, ఒంటిమిట్ట, శ్రీకాళహస్తి, కాణిపాకం, అహోబిలం, మంత్రాలయం, పుట్టపర్తి, కడప దర్గా తదితరాలన్నీ రాయలసీమకు పెద్ద ఆస్తులు. శ్రీశైలం డ్యాం, జీడిపల్లి, పీఏబీఆర్, మిడ్‌పెన్నార్, చాగల్లు, సీబీఆర్, పైడిపాలెం, గండికోట, అవుకు, గోరుకల్లు, బ్రహ్మంసాగర్, భైరవానితిప్ప, అప్పర్‌పెన్నార్, గొల్లపల్లి, చెర్లోపల్లి, శ్రీనివాసపురం, అడవిపల్లి, మైలవరం, సర్వారాయసాగర్, కండలేరు, సోమశిల తదితర ఆధునిక దేవాలయాలకు కూడా పూజలు చేసి భూతల్లిని చల్లగా చూడాలని కోరుకోవాలి. ఆయా ఆధునిక దేవాలయాల్లో అత్యధిక ప్రాజెక్టులను నేనే నిర్మించా. కొందరికి అవకాశం వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయారు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

### కష్టపడి సంపద సృష్టిస్తాం

'ఏపీలో 1,004 టీఎంసీలు నిల్వ చేసుకునే అవకాశం ఉండగా ప్రస్తుతం 554 టీఎంసీల నీటినిల్వ ఉంది. రాబోయే రోజుల్లో 450 టీఎంసీలు వస్తే ప్రాజెక్టులన్నీ కళకళలాడతాయి. నీటిని సమర్థంగా ఉపయోగించుకుంటే కరవు అనే మాట రాదు. కష్టపడి సంపద సృష్టిస్తామని, ఆదాయన్ని ఆర్జిస్తామని, సంక్షేమంతో పాటు అభివృద్ధి చేస్తామని చెప్పాను. అదే చేస్తున్నాను. అన్నదాతా సుఖీభవ కింద కేంద్రం ఇచ్చే మొత్తానికి సమానంగా రైతుల ఖాతాల్లో ఎప్పటికప్పుడు నగదు జమచేస్తాం. ఆగస్టు 15 తర్వాత మహిళలు జిల్లాలో ఎక్కడికైనా బస్సులో ఉచితంగా ప్రయాణించవచ్చు' అని తెలిపారు.

### సాగునీటి సంఘాలకే అధికారాలు, బాధ్యతలు

'రాష్ట్రంలో 6,047 సాగునీటి సంఘాలు, 267 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 58 ప్రాజెక్టు కమిటీలున్నాయి. వారందరితో వారం, పది రోజుల్లో అమరావతిలో ఒక భారీ సమావేశం ఏర్పాటుచేసి వారికి పూర్తి అధికారాలు, నిధులిచ్చే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది. చెరువులు, రిజర్వాయర్లు, ప్రాజెక్టులు, జలాశయాల్లో వచ్చే నీటిని వాడుకుని, భూమినే జలాశయంగా మార్చుకునేలా భూగర్భజలాలను పెంచుకోవాలి. ఆయా బాధ్యతలను సాగునీటి వినియోగదారుల సంఘాలకు అప్పగిస్తాం. రైతులు ముందుకొస్తే ప్రభుత్వమే డబ్బులిచ్చి సౌర పంపుసెట్లు ఏర్పాటు చేయిస్తుంది' అని ముఖ్యమంత్రి వివరించారు.

### ఐదేళ్ల తర్వాత రాష్ట్రంలో నవ్వు ముఖాలు

'తల్లికి వందనం ఇచ్చినందుకు పిల్లలు, తల్లులు ఎంతో ఆనందంగా ఉన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో నవ్వు ముఖం కనపడలేదు. నాటి పాలకులు నవ్వితే కొట్టారు. మేము నవ్విస్తూ పాలన చేస్తున్నాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తుచేశారు. ఈ కార్యక్రమానికి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అధ్యక్షత వహించారు. మంత్రులు బీసీ జనార్దనరెడ్డి, ఫరూక్, నిమ్మల రామానాయుడు, ఎంపీ బైరెడ్డి శబరి, నంద్యాల జిల్లా ఎమ్మెల్యేలు హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు హెలికాప్టర్ ద్వారా డ్యాం నుంచి నీరు విడుదలయ్యే దృశ్యాలను తిలకించారు.


### పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తాం

రాయలసీమను ఎవరూ కాపాడలేరని, ఇది రాళ్లసీమగా మారుతుందని గతంలో అందరూ మాట్లాడారని, కానీ సంకల్పం ఉంటే ఏదైనా చేయగలుగుతామని, సీమ గతిని, స్థితిని, భవిష్యత్తును మార్చడానికి రూపకల్పన చేసిన వ్యక్తి ఎన్టీఆర్ అని చంద్రబాబు గుర్తుచేశారు. రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. 'రాయలసీమలో ఒకప్పుడు రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు తినేవాళ్లం. ఎన్టీఆర్ రూ.2కే కిలో బియ్యం పథకం ప్రవేశపెట్టిన తర్వాత అందరూ తెల్లగా ఉండే భోజనం తినడం సామాజిక హోదాగా మారింది. బియ్యం కారణంగా అందరూ మధుమేహ బాధితులుగా మారుతున్నారు. చిన్న వయసులోనే బీపీ, ఇతర అనారోగ్యాలకు గురవుతున్నారు. మళ్లీ ప్రపంచమంతా చిరు ధాన్యాల వైపు మళ్లుతున్నారు. పండ్లు, కూరగాయలకు డిమాండు భారీగా పెరుగుతోంది. ఆయా పండ్లు అత్యధికంగా పండే ప్రాంతం రాయలసీమే' అని సీఎం గుర్తుచేశారు. 1997లో పీక్‌లోడ్ ఫ్యాక్టర్ సమస్య వచ్చినప్పుడు శ్రీశైలం ప్రాజెక్టులో రివర్సబుల్ పంపుసెట్ల వ్యవస్థను దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏర్పాటు చేశామన్నారు.

# మల్లన్న సేవలో సీఎం చంద్రబాబు


ఆలయ వృషభానికి గ్రాసం తినిపిస్తున్న సీఎం చంద్రబాబు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్లను ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మహాద్వారం వద్ద దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి వినయ్‌చంద్, ఇన్‌ఛార్జి కమిషనర్ రామచంద్రమోహన్, ఈవో ఎం.శ్రీనివాసరావు సాదర స్వాగతం పలికారు. అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారి ఆలయం చుట్టూ ముఖ్యమంత్రి ప్రదక్షిణ చేశారు. అనంతరం మల్లికార్జునస్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. త్రిఫలవృక్షం వద్ద దేవస్థానం వృషభానికి గ్రాసం తినిపించారు. భ్రమరాంబాదేవికి అర్చనలు చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ముఖ్యమంత్రికి దేవస్థానం అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనం పలికారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, దేవాదాయశాఖ అధికారులు సీఎంకు జ్ఞాపిక అందజేశారు. సీఎం వెంట మంత్రి బీసీ జనార్దనరెడ్డి, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఆళ్లగడ్డ, నందికొట్కూరు ఎమ్మెల్యేలు అఖిలప్రియ, జయసూర్య, మాజీ ఎమ్మెల్యే కొట్ల సుజాతమ్మ, నంద్యాల పార్లమెంటు నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్, కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్, ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా ఉన్నారు.


చంద్రబాబుకు స్వామి, అమ్మవార్ల చిత్రపటం అందజేస్తున్న శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, దేవాదాయశాఖ కార్యదర్శి వినయ్‌చంద్, దేవాదాయశాఖ ఇన్‌ఛార్జి కమిషనర్ రామచంద్రమోహన్. చిత్రంలో ఆలయ ఈవో శ్రీనివాసరావు, నేతలు

### పూర్ణాహుతి క్రతువులో పాల్గొన్న సీఎం

సంకల్పం నెరవేరాలని కోరుతూ ముఖ్యమంత్రి ఆలయ ప్రాంగణంలో రుద్రహోమం, చండీహోమాలు నిర్వహించారు. రుద్రహోమ పూర్ణాహుతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

# ఆరునెలల్లోనే క్వాంటమ్ వ్యాలీ

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడిదారులకు స్నేహపూరిత విధానాలను అనుసరిస్తున్నామని చెప్పారు. లోవ్స్ ఇండియా ఎండీ అంకుర్ మిత్తల్, రోల్స్ రాయిస్ ఉపాధ్యక్షుడు హరి గణేశన్, శాక్స్ గ్లోబల్ ఇండియా ఉపాధ్యక్షుడు మధు నటేశన్, జేసీ పెన్నీ ఇండియా ఎండీ కౌశిక్ దాస్, లులూ లెమన్ ఉపాధ్యక్షుడు ప్రవీణ్ మైసూరు, డెల్టా ఎయిర్‌లైన్స్ డైరెక్టర్ సైఫ్ అహ్మద్ షరీఫ్, విక్టోరియా సీక్రెట్ ఉపాధ్యక్షుడు వసుధారిణి శ్రీనివాస్, ననుని ఇండియా సీనియర్ డైరెక్టర్ పెద్దరెడ్డప్ప, ఏఎన్‌జేసీఎఫ్ ప్రతినిధి కవిత రమేశ్, ఆస్ట్రల్ ల్యాబ్ సీనియర్ ఉపాధ్యక్షుడు శివానంద ఆర్ కోటేశ్వర్, జాగ్వార్ ల్యాండ్ రోవర్ సీఈఓ లలితా ఇంద్రకంటి, ఏపీ ఐటీశాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

### ఉద్యోగాల కల్పన

విశాఖపట్నంలో జీసీసీ ఇన్నోవేషన్ క్యాంపస్ ఏర్పాటుకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. పదివేల ఉద్యోగాలు కల్పించేందుకు ఏఎన్‌ఎస్ఆర్ సంస్థతో ఒప్పందం కుదిరిందని వెల్లడించారు. ఏఎన్‌ఎస్ఆర్ సీఈఓ లలిత్ అహూజాతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నాక లోకేశ్ విలేకరులతో మాట్లాడారు. విశాఖ మధురవాడ ఐటీ క్లస్టర్‌లో జీసీసీ ఇన్నోవేషన్ క్యాంపస్‌లో పెట్టుబడులు పెట్టి, రానున్న ఐదేళ్లలో పదివేల మందికి ఉద్యోగాలను కల్పిస్తుందని తెలిపారు. దేశంలోని టాప్-100 ఐటీ కంపెనీలను ఏపీకి రప్పించాలన్నదే లక్ష్యమని వివరించారు. గూగుల్ సంస్థ తొలిసారిగా అమెరికా వెలుపల అతిపెద్ద డేటా సెంటర్‌ను నిర్మిస్తోందన్నారు. అతి పెద్ద డేటా సిటీని విశాఖలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రకటనలకు పరిమితం కాకుండా ఫలితాలపై శ్రద్ధ వహిస్తున్నామని తెలిపారు. మెరుగైన ఎయిర్ కనెక్టివిటీ కోసం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నామని గుర్తుచేశారు. ఎమర్జింగ్ సిటీస్ ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా అమరావతి, తిరుపతి, అనంతపురం, కాకినాడ వంటి నగరాల్లో స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి చేస్తున్నామని విశదీకరించారు.


బెంగళూరులో పారిశ్రామికవేత్తలతో లోకేశ్

### రూ.65 వేల కోట్లతో పనులు

రాజధాని అమరావతిలో రూ.65వేల కోట్లతో పనులు శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి లోకేశ్ తెలిపారు. ప్రెస్టీజ్ గ్రూప్ అధ్యక్షుడు ఇర్ఫాన్ రజాన్, ఈడీ జాయాద్ నోమాన్‌లతో ఆయన మంగళవారం బెంగళూరులో సమావేశమయ్యారు. ఏడాది సమయంలోనే వివిధ సంస్థలు రాష్ట్రంలో రూ.9.5 లక్షల కోట్ల పెట్టుబడులకు ముందుకు వచ్చాయని వారికి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలిస్తామని లోకేశ్‌కు ఇర్ఫాన్ రజాన్ హామీ ఇచ్చారు.

## ఏపీ బాండ్లు కొనొద్దంటూ 200 ఆర్థిక సంస్థలకు మెయిల్స్

(మొదటి పేజీ తరువాయి)

ఏపీఎండీసీ ద్వారా రూ.7వేల కోట్ల రుణం తీసుకునేందుకు 2024 మార్చి 15న ఉత్తర్వులిచ్చారని.. అప్పట్లో ఆర్థికశాఖ మంత్రిగా ఉన్నది తానేనని బుగ్గన మరచిపోయారా? తప్పు అప్పుడు జరిగిందా? ఇప్పుడా?' అని కేశవ్ ప్రశ్నించారు.

**రాష్ట్ర ఆదాయంలో 99% జీతాలు, పింఛన్లకే:** రాష్ట్ర సొంత ఆదాయంలో 99% జీతాలు, పింఛన్లకే ఖర్చవుతోందని కేశవ్ వివరించారు. గత నాలుగేళ్లలో ఒక సంవత్సరంలో 107% ఖర్చు ఉందని.. అంటే ఆదాయం చాలక అప్పు తెచ్చి చెల్లింపులు చేశారని తెలిపారు. తెలంగాణలో ఇది 45% మాత్రమే అని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాలతోనూ దీనిపై చర్చించామన్నారు.

## రాజధానిలో ఎన్టీఆర్ విగ్రహానికి 10 నమూనాలు

**కన్సల్టెన్సీ ప్రతినిధులకు మంత్రి నారాయణ సూచన**

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో నిర్మించే ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు సంబంధించి పది నమూనాలు సిద్ధం చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ సంబంధిత కన్సల్టెన్సీ ప్రతినిధులకు సూచించారు. వీటిపై ముఖ్యమంత్రి చంద్రబాబు తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. రాజధానిలోని నీరుకొండ హిల్ ఏరియాలో ఎన్టీఆర్ భారీ విగ్రహం, స్మారకాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. విగ్రహ నమూనా, దాని చుట్టుపక్కల చేపట్టే నిర్మాణాలపై కన్సల్టెన్సీ ప్రతినిధులతో పురపాలకశాఖ మంత్రి సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. విగ్రహ నమూనాలు, ఇతర డిజైన్లపై ప్రాథమిక ప్రతిపాదనలను షెలాడియా సంస్థ ప్రతినిధులు వివరించారు. నిర్మాణ ప్రాంతంలో మట్టి పరీక్షలు, ఇతర సర్వేలు చేస్తున్నట్లు చెప్పారు. నమూనాల రూపకల్పనలో తెదేపా నేత టీడీ జనార్దన్ సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి వారికి సూచించారు.

# నాలుగేళ్లలో ఏ ఒక్క ఏడాది ఇతర రాష్ట్రాల్లో చదివినా స్థానికేతరులే..

(మొదటి పేజీ తరువాయి)

సంవత్సరంలో స్థానికేతర కోటా 15% సీట్లనూ రాష్ట్ర విద్యార్థులకే కేటాయించేలా దీన్ని తీసుకొచ్చారు. దీనిపై అవగాహన లేని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇంజినీరింగ్ ప్రవేశానికి ముందు నాలుగేళ్లలో ఏ ఒక్క ఏడాది బయట రాష్ట్రంలో చదివినా వాళ్లను స్థానికేతరులుగానే పరిగణిస్తారు. గతంలో ఉస్మానియా, శ్రీవేంకటేశ్వర, ఆంధ్ర విశ్వవిద్యాలయాల రీజియన్లు ఉండగా.. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయినందున ఉస్మానియా రీజియన్ను తొలగించి, కొత్త రిజర్వేషన్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉద్యోగ, ఉపాధి కారణాల రీత్యా తల్లిదండ్రులు ఇతర రాష్ట్రాల్లో ఉంటున్నా.. ఇద్దరిలో ఎవరైనా ఒకరు గతంలో పదేళ్లపాటు ఏపీలో నివసించి ఉంటే వీరు స్థానికేతర కోటా 15% కింద పోటీ పడొచ్చు. కొంతమంది తల్లిదండ్రులు ఏపీలో ఉంటున్నా.. పిల్లలను తెలంగాణలో ఇంటర్మీడియట్ చదివించారు. ఇప్పుడు వీళ్లు స్థానికేతర కోటాను పొందాలంటే 10ఏళ్లు ఏపీలో ఉంటున్నట్లు సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. పిల్లలకు స్థానిక కోటా లభించకపోవడంపై కొందరు తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

నందికొట్కూరు పట్టణానికి చెందిన శ్రీనివాసులు తన కుమార్తెను తెలంగాణలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎంపీసీ చదివించారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. ఈఏపీసెట్‌లో మంచి ర్యాంక్ రావడంతో కర్నూలు ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ వస్తుందని ఆశించారు. అయితే దరఖాస్తు సమయంలో నాన్‌లోకల్ అని చూపడంతో ఆందోళన చెందుతున్నారు. పదో తరగతి వరకు చదువుకున్న పాఠశాలను పరిగణనలోకి తీసుకుని లోకల్ కింద తీసుకోవాలని తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు.

## గ్రహం అనుగ్రహం

**9-7-2025 బుధవారం**

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; గ్రీష్మ రుతువు, ఆషాఢ మాసం, శుక్లపక్షం
చతుర్దశి: రా. 1-02 తదుపరి పూర్ణిమ
మూల: తె. 5-09 తదుపరి పూర్వాషాఢ
వర్జ్యం: ఉ. 11-57 నుంచి 1-40 వరకు
తిరిగి రా. 3-26 నుంచి 5-09 వరకు
అమృత ఘడియలు: రా. 10-16 నుంచి 11-59 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-38 నుంచి 12-30 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.5.35; సూర్యాస్తమయం: సా.6.35

## వాతావరణం

| ప్రాంతం | గరిష్ఠ | కనిష్ఠ |
|---|---|---|
| నెల్లూరు | 39.0 | 29.5 |
| రాజమహేంద్రవరం | 39.0 | 26.0 |
| తిరుపతి | 38.7 | 28.0 |
| ఒంగోలు | 38.6 | 29.8 |
| కడప | 37.0 | 27.0 |
| విజయనగరం | 37.0 | 26.0 |
| విజయవాడ | 36.8 | 25.0 |
| తాడేపల్లిగూడెం | 35.7 | 27.2 |
| కర్నూలు | 35.0 | 25.2 |
| విశాఖపట్నం | 34.4 | 27.2 |
| శ్రీకాకుళం | 32.0 | 27.0 |

## అధ్యాపకుడి పరిశోధనలకు మూడు ప్రభుత్వ పేటెంట్లు

మైలవరం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా మైలవరంలోని లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకుడు జె.రాముడు చేసిన మూడు పరిశోధన అంశాలపై భారత ప్రభుత్వం పేటెంటు హక్కులు కల్పించింది. ✦ గోరింటాకు మొక్కల్లో ఉండే లాసోన్ అనే రంగు పదార్థం, బయోమాలిక్యూల్స్, ప్రొటీన్లతో రసాయనిక చర్యల ద్వారా యూరిన్‌లో ఉండే ప్రొటీన్లను గుర్తించవచ్చని ఆయన శోధించారు. ✦ చెరకు పిప్పిని ఉపయోగించి కీటక నివారణను మెరుగుపరిచే పద్ధతిని కనుగొన్నారు. ✦ కైటినేజ్ అనే ఎంజైమ్ ద్వారా హెర్బల్ షాంపూ తయారీతో చుండ్రు, జుట్టు రాలడం, పేలు నివారణ పద్ధతులను కనిపెట్టారు. పేటెంట్ సాధించిన అధ్యాపకుడు రాముడును మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఇళ్ల రవి, ఉప ప్రిన్సిపల్ కె.అప్పారావు, తోటి అధ్యాపకులు బి.సుభాషిణి, ఎం.దేవానంద్‌కుమార్, హరిబాబు తదితరులు అభినందించి సత్కరించారు.


అధ్యాపకుడిని జె.రాముడును అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఇళ్ల రవి తదితరులు


# ఈనాడు

## వర్ధమాన దేశాల వాణి

దేశాల నడుమ వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకుంటూ ప్రపంచ శాంతిని పరిరక్షించుకోవాలి... సార్వభౌమత్వం, సమాన హక్కుల ప్రాతిపదికన పరస్పర సహాయ సహకారాలూ స్నేహబంధాలతో సమష్టిగా అభివృద్ధి చెందాలన్న మానవాళి సంకల్పంలోంచి ఐక్యరాజ్యసమితి పురుడుపోసుకుంది. ఎనభై ఏళ్ల ప్రస్థానంలో ఐరాస వైఫల్యానికి గుర్తుగా అంతర్జాతీయంగా నేడు బహుళపక్షవాదం (మల్టీలాటరలిజం) పలుచనవుతోంది. ట్రంప్ శల్యసారథ్యంలో విశ్వ వేదికలపైనుంచి అమెరికా వెనక్కి తగ్గుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రపంచ జనాభాలో దాదాపు యాభైశాతం, జీడీపీలో 40శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న 'బ్రిక్స్'... భౌగోళిక రాజకీయాల్లో శక్తిమంతమైన కూటమి అయ్యింది. ఏకధ్రువ ప్రపంచ పోకడలను తోసిపుచ్చుతున్న 'బ్రిక్స్' దేశాలు- అంతర్జాతీయ వ్యవహారాల్లో న్యాయబద్ధత, సమానావకాశాలకోసం పట్టుబడుతున్నాయి. బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో జరిగిన శిఖరాగ్ర సదస్సులోనూ అవి ప్రపంచ శ్రేయస్సుకు హానికారకమైన ఏకపక్ష వాణిజ్య విధానాలను, ముఖ్యంగా అమెరికా సుంకాల బాదుడును బలంగా నిరసించాయి. వచ్చే ఏడాదిలో 'బ్రిక్స్'కు అధ్యక్షత వహించనున్న ఇండియా- అంతర్జాతీయ సంస్థలలో సంస్కరణల అవసరంపై రియోలో గట్టిగా గళమెత్తి, వర్ధమాన దేశాల వాణిని తన స్వరంలో ప్రతిధ్వనింపజేసింది!

సంపన్న దేశాల ఆధిపత్య కాంక్షల కొలిమిలో కరిగిపోతున్న వర్ధమాన రాజ్యాల ఆకాంక్షలకు జీవం పోయడానికి పదహారేళ్ల క్రితం బ్రెజిల్, రష్యా, చైనా, ఇండియా చేతులు కలిపి ఒకే వేదికపైకి వచ్చాయి. తరవాత దక్షిణాఫ్రికాను కలుపుకొని 'బ్రిక్స్'గా అవతరించాయి. సమన్వయం, సహకారాలతో ఉమ్మడి ప్రయోజనాలను సిద్ధింపజేసుకోవాలన్నది కూటమి కట్టుబాటు. దానికి అనుగుణంగానే 'బ్రిక్స్' సభ్యదేశాల నడుమ అంతర్గత వాణిజ్యం 2017-2022 మధ్యకాలంలో 56శాతం పెరిగింది. ఆ వాణిజ్య విలువ ప్రస్తుతం లక్ష కోట్ల డాలర్లకు చేరినట్లు అంచనా. పదకొండు సభ్యదేశాలు, పది భాగస్వామ్య రాజ్యాలతో 'బ్రిక్స్' మరింతగా విస్తరించిన నేపథ్యంలో- అంతర్గత వాణిజ్య వృద్ధికి, తద్వారా కలిసికట్టుగా ప్రగతిపథంలో దూసుకుపోయేందుకు కూటమికి ఇప్పుడు అవకాశాలు అధికమవుతున్నాయి. అమెరికన్ డాలర్‌పై ఆధారపడే దురవస్థను తగ్గించుకోవడానికి జాతీయ కరెన్సీలలో వాణిజ్య లావాదేవీలను జరపాలన్న 'బ్రిక్స్' దేశాల స్థిరనిశ్చయం స్వాగతించదగినదే. డాలర్‌ను పక్కనపెట్టే ప్రయత్నాలు చేస్తే సుంకాల మోత మోగిస్తామంటున్న ట్రంప్ బెదిరింపులన్నీ అగ్రరాజ్య పెత్తందారీతనంలోంచి ఎగదన్నుతున్నవే!

అంతర్జాతీయ వ్యవహారాల్లో, ప్రధానంగా భద్రతామండలి (యూఎన్ఎస్‌సీ) కార్యకలాపాల్లో తమ భాగస్వామ్యాన్ని పెంచాలనే వర్ధమాన దేశాల డిమాండ్‌కు రియో తీర్మానం మద్దతు పలికింది. యూఎన్ఎస్‌సీలో శాశ్వత సభ్యత్వం కోసం ఇండియా, బ్రెజిల్ చేస్తున్న ప్రయత్నాలకు సహకరిస్తామని చైనా, రష్యా మాటిచ్చినట్లు పేర్కొంది. కానీ, భద్రతామండలిలో భారతావని చేరికకు మోకాలడ్డుతోంది చైనాయే! ఈవీలు, డ్రోన్లు, సెమీకండక్టర్ల తయారీకి అత్యవసరమైన అరుదైన లోహాలపై గుత్తాధిపత్యం బీజింగ్‌దే. స్వప్రయోజనాల కోసం ఆ శక్తిని చైనా దుర్వినియోగం చేస్తోంది. దానివల్ల సరఫరా గొలుసులు దెబ్బతింటున్న తరుణంలో కీలక ఖనిజాలను ఆయుధాలుగా మార్చి ప్రయోగించే దుర్విధానాలను అనుమతించరాదన్న ప్రధాని మోదీ పిలుపు ఆచరణీయమైనది. ఈమేరకు చైనాను కట్టడి చేయడంలో 'బ్రిక్స్' సఫలమైతే- ప్రపంచానికి మేలు జరుగుతుంది. అలాగే, ఉగ్రవాదంపై పోరులో ద్వంద్వ ప్రమాణాలకు తావులేదన్న రియో తీర్మాన పాఠాన్ని సైతం బీజింగ్ ఎంత త్వరగా చెవికెక్కించుకుంటే అంత మంచిది!



**మనుషులందరూ ఎవరికి వారే ప్రత్యేకంగా ఉండేలా తయారుచేస్తుంది ప్రకృతి. అయితే వారందరినీ ఒకేలా ఉంచే మూసను కనిపెట్టింది సంస్కృతి. 'పర్ఫెక్ట్ మ్యాన్' అనే ఒక ఆదర్శాన్ని మన ముందుంచింది సమాజం. వాటిలో ఇమడడానికి మన ప్రవర్తననీ ఆలోచనల్నీ నియంత్రించుకుంటూ ఉంటాం.**

– ఉప్పలూరి గోపాలకృష్ణ మూర్తి (యుజీకే)

## విశ్వభావన

కష్టాల ఊబిలో కూరుకుపోయినప్పుడో, వైపరీత్యాలు చుట్టుముట్టినప్పుడో 'భగవంతుడా అందరినీ చల్లగా చూడు' అని ప్రార్థిస్తూ ఉంటాం. ఆ ప్రార్థన మనకోసమే అయినా మన చుట్టూ ఉన్న వారందరూ బాగుండాలని కోరుకుంటాం. మంచి మనసు నుంచి వచ్చే ఆశీస్సులకు, శుభాకాంక్షలకు సానుకూల శక్తి ఉంటుంది.

ఆలయంలో ధ్వజస్తంభం చుట్టూ భక్తులు గుమిగూడి ఉన్నారు. వెళ్లి చూస్తే అక్కడ వారు నాణేలను నిలబెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఆశ్చర్యంగా చూస్తున్న యువతికి 'మనసులో ఏదైనా కోరుకుని నాణేన్ని నిలబెడితే కోరిక నెరవేరుతుంద'ని చెప్పాడు ఓ భక్తుడు. చాలామంది నాణేలను నిలబెట్టడానికి విఫలయత్నం చేస్తున్నారు. ఆ యువతి తన సంచిలోంచి రూపాయి బిళ్ల తీసి కళ్లకద్దుకుని పెట్టింది. అది చక్కగా నిలబడింది. అందరూ చప్పట్లు కొట్టారు. 'ఏం కోరిక కోరావమ్మా' అడిగింది ఓ పెద్దావిడ. ఆ యువతి నవ్వుతూ 'సర్వేజనాః సుఖినోభవంతు' అంది. స్వచ్ఛమైన మనసుతో అందరి కోసం కోరుకునే కోరికకు ఆ విశ్వం నుంచి ఎప్పుడూ సానుకూలమైన స్పందన లభిస్తుంది. 'అమ్మా' అని ఆర్ద్రతతో పిలవగానే సంతుష్టురాలయ్యే ఆ జగదంబ భక్తుల వెంటే ఉంటుందంటారు ఆదిశంకరులు.



దీర్ఘాయువును కాంక్షిస్తూ పలికే 'శతమానం భవతి' అనేది వేదాశీర్వచనం. దానికి ఉన్న శక్తి అసామాన్యమైనది. నిండు మనసుతో ఎదుటివారి క్షేమాన్ని కోరుకునే పెద్దలు ఎవరైనా ఇలా దీవిస్తే- అది పిన్నలకు కచ్చితంగా వరమవుతుంది. అలాంటి మహానుభావులు, తల్లిదండ్రులకు నమస్కరించి వారి దీవెనలు పొందడం సదా శ్రేయస్కరం.

**అంతర్వాణి**

'స్తంభాలేమీ లేకపోయినా ఆకాశం కింద పడిపోకుండా అలాగే ఎలా నిలబడి ఉంది?' అని అడిగాడు మనవడు తాతగారిని. దానికి ఆయన 'రేపు ఈ ఊళ్లో అయిదిళ్లకు వెళ్లి అన్నం పెట్టమని అడుగు అప్పుడు నీకే అర్థమవుతుంది' అన్నాడట. ఆ బాలుడు అలాగే చేశాడు. మొదటి నలుగురు తిట్టి తరిమేశారట. అయిదో ఇంటి వారు మాత్రం 'బాగా ఆకలి మీద ఉన్నట్లున్నాడు పాపం పిల్లాడు' అని పాలు తాగించి మరీ పంపించారట. విషయం విన్న తాతగారు 'చూశావా.. ఇలాంటివారు కొంతమందైనా ఉండబట్టే ఆకాశం పడిపోకుండా నిలబడుతోంది' అన్నారు.

'మన కోసం', 'మనందరం' అన్న ఆలోచన జీవితంలో శుభప్రదమైన మార్పులు రావడానికి దోహదపడుతుంది. మనం ఈ ప్రపంచానికి ప్రేమని పంచగలిగితే అదే ప్రేమ తిరిగి వస్తుంది. ద్వేషాన్ని, అసూయని, హింసని పంచితే అవే మరిన్ని రెట్లయ్యి మన ఇంటి ముందుంటాయి. యుద్ధం వద్దంటూ శ్రీకృష్ణ పరమాత్మ స్వయంగా రాయబారానికి వెళ్లాడు. దుర్యోధనుడు సంధికి ససేమిరా అన్నాడు. ఫలితం తాను రగిలించిన విద్వేషమే మడుగులో తన మరణానికి దారితీసింది. అందుకే మన మనోవికారాలను బయటకు వెళ్లగక్కేముందు ఒక్క క్షణం ఆలోచించాలి. మనం ఎగరేసిన బంతి ఎప్పటికైనా మన ముంగిట్లోనే పడుతుంది. అది ఆవేశమైనా ఆనందమైనా!

– గంటి ఉషాబాల

# అందరి భాగస్వామ్యంతో... చదువుల పండుగ!



నారా లోకేష్

**"విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పూర్వ విద్యార్థులు, దాతలు, స్థానికులు... వీరందరి తోడ్పాటుతోనే విద్యా వికాసం సాధ్యమవుతుంది. ఆ దిశగా గత డిసెంబర్‌లో మొత్తం 44,956 ప్రభుత్వ బడుల్లో కోటి మందితో మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్(పీటీఎం) నిర్వహించాం. సీఎం చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమాన్ని మరింత ప్రయోజనాత్మకంగా ఏటా రెండుసార్లు నిర్వహిస్తామని ప్రకటించారు. ఆ మేరకు రేపు 'మెగా పీటీఎం 2.0' నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేశాం. ఈసారి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలూ కళాశాలల్లో ఈ ఆత్మీయ సమావేశాలను ఒకే అజెండాతో, ఒకే సమయానికి నిర్వహిస్తున్నాం. అందరి సహకారంతో ఈ కార్యక్రమం గిన్నిస్ బుక్ రికార్డులకెక్కి సరికొత్త చరిత్ర సృష్టిస్తుందని ఆశిస్తున్నాను."**

ఏపీలో గత ప్రభుత్వ హయాంలో చెట్లను నరికేయడంతో పక్షుల గూళ్లు కూలిపోయాయి. చెట్ల కొమ్మలపై ఆడుకునే ఉడుతలు పరారయ్యాయి. అలాంటి మోడుబారిన చెట్ల ముందు నిల్చున్నాను. సవాళ్లతో కూడిన విద్యాశాఖ బాధ్యతలు తీసుకున్నప్పుడు నా చుట్టూ ప్రశ్నలే. ఎటుచూసినా సమస్యలే. మిస్సైల్‌మ్యాన్ అబ్దుల్ కలామ్ మాట నాలో స్ఫూర్తి నింపి, నన్ను కార్యోన్ముఖుణ్ని చేసింది. "చిలుకను పెంచాను ఎగిరిపోయింది. ఉడుతను తెచ్చాను పారిపోయింది. మొక్కను పెంచాను... ఆ రెండూ వచ్చి చేరాయి!" ఇదే విద్యావ్యవస్థలో మేం చేపట్టిన సేంద్రియ సేద్యం. విత్తనం నాటి, మొక్కగా పెంచి, పచ్చని చెట్లుగా పాఠశాలలు ఎదిగేందుకు కావాల్సిన సహజసిద్ధ వాతావరణం కల్పించే చర్యలు చేపట్టాం. మన విద్యావిధానంలో లోపాలూ సమస్యలు, ఇతర రాష్ట్రాల్లో విజయవంతంగా అమలవుతున్న విద్యావ్యవస్థలపై అధ్యయనం చేశాం. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనకు అనుగుణంగా సంస్కరణలకు శ్రీకారం చుట్టాం. ప్రపంచానికి అవసరమైన మేలిమి మానవ వనరులుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కేజీ నుంచి పీజీ వరకు కరిక్యులంలో మార్పులు చేశాం.

### నైతిక విలువలకు ప్రాధాన్యం


విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేలా, మహిళలను గౌరవించేలా పాఠ్యాంశాలు రూపొందించాం. సులభమైన భాష, ఆకట్టుకునే బొమ్మలతో పుస్తకాలు అందించాం. నైతిక విలువల సలహాదారుడిగా ప్రఖ్యాత ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును నియమించాం. ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే' అమలు చేస్తున్నాం. ఆ రోజు పిల్లలకు నైతిక విలువల బోధన, ఆటపాటలే ఉంటాయి. బడులు తెరిచేనాటికే 35,94,774 మందికి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు అందజేశాం. నాణ్యమైన యూనిఫాం, బ్యాగు, షూ, బెల్ట్, పుస్తకాలను వాటిపై ఎవరి పేర్లూ బొమ్మలు లేకుండానే ఇచ్చాం. పారదర్శక టెండర్ల వల్ల కిట్లలో రూ.63.80 కోట్లు ఆదా అయ్యాయి. పేదరికం కారణంగా ఎవరూ చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో- ఎంతమంది పిల్లల్ని చదివిస్తే అంతమందికీ రూ.13 వేల చొప్పున అర్హులైన 67.27 లక్షల మంది పాఠశాల విద్యార్థుల తల్లుల ఖాతాల్లో దాదాపు రూ.10వేల కోట్లు జమచేశాం.

### రుచిగా శుచిగా భోజనం

నాణ్యమైన విద్యను అందించేందుకు 'ఒక క్లాసుకు ఒక టీచర్' విధానంలో 9,600 మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటయ్యాయి. అవినీతికీ, రాజకీయ నాయకుల ప్రమేయానికీ తావులేకుండా 68వేల మంది ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాం. 4,477 మందికి పదోన్నతులు కల్పించాం. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి విజయవంతంగా పరీక్షలు పూర్తయ్యాయి. 'డొక్కా సీతమ్మ' మధ్యాహ్న భోజన పథకం ద్వారా పిల్లలకు పోషక విలువలు, రుచీ శుచీ కలిగిన ఆహారం అందిస్తున్నాం. గత ప్రభుత్వం నిలిపేసిన ఇంటర్ విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకాన్ని తిరిగి ప్రారంభించాం. లక్ష మంది ఇంటర్ విద్యార్థులకు నీట్, జేఈఈ వంటి పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ అందజేశాం. గత పాలనలో కుల మతాల ఆధారంగా పదవులు కట్టబెట్టిన సంస్కృతికి అడ్డుకట్ట వేసి... విద్యా రంగానికి విశిష్ట సేవలు అందించిన వారినే విశ్వవిద్యాలయాల ఉపకులపతులుగా నియమించాం. ఇన్ని సంస్కరణలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి సమాజ సహకారం అత్యవసరం.

### పాఠశాలల ప్రగతి కోసం...

పేరెంట్-టీచర్ మీటింగ్ అంటే, ఒక గదిలో కూర్చోబెట్టి పిల్లాడి విద్యాప్రగతిని తల్లిదండ్రులకు వివరించి పంపేయడం కాదు. ఇది బడితో విద్యార్థుల తల్లిదండ్రులకు ముడిపడే బంధం. పాఠశాలల అభివృద్ధికి దిశానిర్దేశం చేసే సమావేశం. పీటీఎంలో విద్యా ప్రగతి, అభిరుచి, ప్రవర్తన, ఆరోగ్యం, హాజరు మొదలైన అంశాలతో కూడిన ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థులకు అందించి, తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు ముఖాముఖి మాట్లాడతారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపుపై సమీక్షిస్తారు. ప్రభుత్వ పథకాలు, బడి వాతావరణం, వసతులు, విద్యా నాణ్యత, సమస్యలపై తల్లిదండ్రుల అభిప్రాయాలు తీసుకుంటారు. పిల్లలతో పాటు తల్లిదండ్రులూ ఆటలు ఆడి, పాటలు పాడే వేదికగా మెగా పీటీఎం 2.0 నిలుస్తుంది. ఇందులో భాగంగా- పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం ఆవశ్యకతను విద్యార్థులకు వివరిస్తూ 'అమ్మ పేరుతో ఒక మొక్క' నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నాం. విద్యార్థులతో సుమారు 45 లక్షల మొక్కలను నాటించి, వారికి 'గ్రీన్ పాస్‌పోర్ట్'లను అందిస్తారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, డ్రగ్ ఎడిక్షన్, సైబర్ మోసాల పట్ల, పాజిటివ్ పేరెంటింగ్ గురించి సంబంధిత నిపుణులు అవగాహన కల్పిస్తారు. తల్లిదండ్రులను గౌరవించి వారి పాదాలకు విద్యార్థులు నమస్కరించే కార్యక్రమమూ ఉంటుంది. ప్రతి బడిలోనూ ఫోటో బూత్‌ను ఏర్పాటు చేస్తున్నాం. బడుల భవిష్యత్తుకు బంగారు బాటలు పరచే ఈ చదువుల పండుగలో ప్రతీ ఒక్కరూ భాగమై, మెగా పీటీఎం 2.0ను చరిత్రలో నిలపాలి. దేశానికి దిక్సూచిగా ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ కోసం సాగిస్తున్న విద్యా ప్రయాణంలో అందరూ భాగస్వాములు కావాలి.




రచయిత– ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి



# నాడు నేరస్థుడు... నేడు న్యాయవాది!

పోయిన చోటే వెతుక్కోవాలన్నది సామెత. ఆయన అదే చేశాడు. ఎక్కడ పోగొట్టుకున్నాడో అక్కడే దాన్ని సంపాదించుకున్నాడు. దాందేముంది, కష్టపడి వెతికితే దొరుకుతుంది కదా అనుకోవచ్చు. కానీ ఆయన పోగొట్టుకున్నది డబ్బో మరొకటో కాదు, పరువు... ప్రతిష్ఠ. డబ్బంటే ఎలాగో తెచ్చుకోవచ్చు. కానీ ఒకసారి పోయిన పరువును తిరిగి సంపాదించుకోవడం సాధ్యమేనా? మనిషి మీద పడిన మచ్చ మాసిపోతుందా? ఈ ప్రశ్నకు సమాధానం తెలియాలంటే ఐజాక్ రైట్ జూనియర్ జీవితం గురించి తెలుసుకోవాలి.

ఐజాక్‌ది సాఫీగా సాగిపోతున్న జీవితం. తండ్రి మిలిటరీ అధికారి కావడంతో వేర్వేరు నగరాల్లో చదువుకున్నాడు. ప్రపంచాన్ని చూశాడు. పెళ్లయింది. ఒక పాప. భార్యాభర్తలిద్దరూ కలిసి మ్యూజిక్ గ్రూప్ నిర్వహించేవారు. టీవీ షోలతో, టాలెంట్ మేనేజరుగా సొంత బాధ్యతలతో బిజీగా, హ్యాపీగా నడిచిపోతోంది జీవితం. ఉన్నట్టుండి ఓరోజు పోలీసులు వచ్చి ఐజాక్‌ని అరెస్టు చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో మాదకద్రవ్యాలు సరఫరా చేసే గ్యాంగ్‌కు లీడర్ అతడేనన్న అతి పెద్ద ఆరోపణ నెత్తిన మోపారు. దాంతోపాటు కొకైన్ అమ్మాడని, అలాంటివే మొత్తం పది కేసులు పెట్టారు. రెండేళ్ల విచారణ తరవాత ఐజాక్‌కు జీవిత ఖైదుతో పాటు అదనంగా మరో 72 ఏళ్ల శిక్ష పడింది. విషాదం ఏంటంటే- అసలతడికి డ్రగ్స్ అలవాటూ లేదు, వాళ్లు పెట్టిన ఏ ఒక్క కేసుతోనూ సంబంధమూ లేదు. అయినా సరే అతడు నేరస్థుడేనని నిరూపించి శిక్ష వేయించారు అధికారులు. ఊహించని విధంగా జీవితనౌక తలకిందులైనందుకు ఐజాక్ బాధపడ్డాడు కానీ భయపడలేదు. జైల్లో ఉండి లా చదవడం మొదలెట్టాడు. తోటి ఖైదీల కేసుల్ని పరిశీలించి వాటి విచారణలో తోడ్పడ్డాడు. దాంతో ఇరవై మంది నిర్దోషులుగా విడుదలయ్యారు. అదే క్రమంలో తన కేసునీ తిరిగి వాదించుకున్నాడు. 1989లో అరెస్టు అయ్యి 1991లో శిక్ష ఖరారు కాగా 1996లో నిర్దోషిగా విడుదలయ్యాడు ఐజాక్. అతణ్ని తప్పుడు కేసులో ఇరికించి శిక్ష పడటానికి కారకుడైన ప్రాసిక్యూటర్ ఆ తరవాత ఆత్మహత్య చేసుకున్నాడు.

బయటికి వచ్చాక ఐజాక్ లా డిగ్రీ చదివి న్యూజెర్సీలో బార్ ఎగ్జామ్ పాసయ్యాడు. అయితే అతడికి వెంటనే ప్రాక్టీసు చేసుకునే అవకాశం ఇవ్వలేదు. దాదాపు తొమ్మిదేళ్ల పాటు అతడి గుణగణాల్ని ప్రవర్తనను గమనించి చివరికి బార్‌లో సభ్యత్వం ఇచ్చారు. అప్పటి నుంచి లాయరుగా వ్యవస్థల్లో, సంస్థల్లో అవినీతిని ఎండగట్టే కేసులనే వాదిస్తున్నాడు ఐజాక్. అతడి జీవితం ఆధారంగా స్టీవ్‌బర్గ్ రాసిన కథని 'ఫర్ లైఫ్' అనే టెలివిజన్ సిరీస్‌గా తీశారు. 2020లో విడుదలై రెండు సీజన్లు ప్రసారమైన ఈ షో బహుళ ప్రజాదరణ పొందింది. తన కేసును తానే వాదించుకుని జీవిత ఖైదు నుంచి నిర్దోషిగా బయటపడ్డ ఒకే ఒక్క వ్యక్తిగా అమెరికాలో చరిత్ర సృష్టించాడు ఐజాక్.

– విస్మయ



## మారిన అలవాట్లు

**మారుతున్న కాలాన్నిబట్టి మనదేశంలో ప్రజల ఆహార అలవాట్లలో చాలా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రోజువారీ తలసరి ప్రొటీన్ అవసరాలను తీర్చడంలో తృణధాన్యాల వాటా బాగా తగ్గిపోయింది. మరో వైపు అదే సమయంలో పప్పుధాన్యాల వినియోగం పల్లెల్లో స్వల్పంగా పెరిగితే, పట్టణాల్లో ఒకశాతం మేర పడిపోయింది. గుడ్లు, చేపలు, మాంసం వినియోగం రెండుచోట్లా పెరిగింది. 2009-10, 2023-24 మధ్య దేశీయంగా ఆహార అలవాట్లలో వచ్చిన మార్పులు (శాతాల్లో)**


| | పల్లెలు | | పట్టణాలు | |
|---|---|---|---|---|
| | 2009–10 | 2023–24 | 2019–10 | 2023–24 |
| తృణధాన్యాలు | 60.2 | 45.9 | 51.3 | 38.7 |
| పప్పుధాన్యాలు | 8.3 | 8.7 | 10.1 | 9.1 |
| పాలు, పాల ఉత్పత్తులు | 9.4 | 11.0 | 12.5 | 12.9 |
| గుడ్లు, చేపలు, మాంసం | 5.9 | 12.4 | 7.6 | 14.1 |
| ఇతర ఆహారాలు | 16.3 | 22.0 | 18.5 | 25.3 |

(ఆధారం: న్యూట్రిషన్ ఇన్‌టేక్ ఇన్ ఇండియా నివేదిక)

# అర్థాంతర మరణాలను అడ్డుకోలేమా?

**అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినా, దేశంలో పాము కాటు మృతుల సంఖ్య తగ్గడం లేదు. ఈ తరహా మరణాలు ప్రపంచంలో ఎక్కువగా మన దేశంలోనే సంభవిస్తుండటం దురదృష్టకరం. దేశవ్యాప్తంగా ఏడాదికి సుమారు యాభై వేల మంది పాము కాటుకు బలవుతున్నారు. అంతకన్నా ఎక్కువ మంది శరీర భాగాలు చచ్చుబడి, శాశ్వత అంగవైకల్యంతో బాధపడుతున్నారు. ఇవి తెలిసిన లెక్కలు మాత్రమే. రికార్డుల్లోకి రానివి అనేకం.**

దేశంలో పాము కాటు మరణాలు 90శాతం గ్రామాల్లోనే చోటు చేసుకుంటున్నాయి. మార్చి-సెప్టెంబరు మధ్యలోనే ఈ కేసులు అత్యధికంగా నమోదవుతున్నాయి. ఇంటి చుట్టు పక్కల చెత్తాచెదారం పేరుకుపోవడం, శుభ్రత లేకపోవడంతో పాముల బెడద ఎక్కువ అవుతోంది. పొలం పనుల్లో నిమగ్నమైనవారూ పాము కాట్ల బారిన పడుతున్నారు. మూఢనమ్మకాలతో ఆస్పత్రికి వెళ్లకపోవడం మరణాలకు దారి తీస్తోంది. పాము కాటుకు గురైన బాధితుల్లో కేవలం 20-30శాతం మందే ఆస్పత్రులకు వెళ్తున్నారు. కొన్నిచోట్ల ఆస్పత్రులు అందుబాటులో లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. 2000-2020 మధ్య దేశవ్యాప్తంగా దాదాపుగా 12 లక్షల మంది పాము కాటుతో మృతి చెందినట్లు ఓ నివేదిక చెబుతోంది. మన దేశంలో డెబ్బై శాతం పాము కాటు మరణాలు సంభవిస్తున్న ఎనిమిది రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లూ ఉన్నాయి. 'నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ)' గణాంకాల ప్రకారం తెలంగాణలో 2024లో 2479 పాము కాటు కేసులు నమోదయ్యాయి. 2018-2022 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో 1700 పాము కాటు మరణాలు చోటు చేసుకున్నాయి. ఇలాంటి మరణాలను 2030 నాటికి సగానికి తగ్గించాలంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నిర్దేశించిన లక్ష్యం నెరవేరాలంటే వ్యవస్థాగతంగా జరగాల్సిన కృషి చాలా ఉంది.



### పడని ముందడుగు

ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో పాము కాటుకు చికిత్స చేయడంతో పాటు యాంటీ వీనమ్ అందుబాటులో ఉంచేలా ఆదేశాలు ఇవ్వాలని ఇటీవల సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. పాము కాటుకు గురైన వ్యక్తికి 24 గంటల్లో యాంటీ వీనమ్ అందించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సర్వోన్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. దానికి అనుగుణంగా కేంద్రం పలు చర్యలు తీసుకుంటోంది. పాము కాటును నోటిఫై చేయదగిన వ్యాధిగా గుర్తించాలని గతేడాది నవంబరులో అన్ని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది. కానీ ఇప్పటి వరకు కర్ణాటక, తమిళనాడు మాత్రమే ఇందుకు అనుగుణంగా నిర్ణయం తీసుకున్నాయి. నోటిఫై చేసిన వ్యాధిగా గుర్తిస్తే, అన్ని ఆస్పత్రులు పాము కాటు కేసులను ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంటుంది. తద్వారా డేటా సేకరణ, చికిత్స ఏర్పాట్లూ మెరుగవుతాయి. ఈ విషయంలో నేటికీ తెలుగు రాష్ట్రాలు ముందడుగు వేయడం లేదు. రాష్ట్రాల వారీగా 'యాంటీ స్నేక్ వీనమ్ ఇంజెక్షన్' నిల్వలు ఎన్ని ఉన్నాయి? బాధితులకు సకాలంలో అందుతున్నాయా, లేదా? అనే విషయాలు ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ఇటీవల కేంద్ర ప్రభుత్వం 'జూవిన్' అనే డిజిటల్ వేదికను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రయోగాత్మకంగా ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్, దిల్లీ, మధ్యప్రదేశ్, అస్సాం, పుదుచ్చేరిలలో అమలవుతోంది.

### అవగాహన అవసరం..

వ్యవసాయ కార్మికులు, రైతులు పొలాల్లో పని చేస్తున్నప్పుడు రబ్బరు బూట్లు, గ్లౌజులు ధరించాలి. రాత్రి వేళ పొలానికి వెళ్లేటప్పుడు టార్చిలైట్లు వినియోగించడం ద్వారా పాము కాటుకు గురి కాకుండా చూసుకోవచ్చు. ఏది విష సర్పం, ఏది విష రహితం అనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించాలి. పాముల ప్రవర్తన, విష ప్రభావం ఎలా ఉంటుందనే విషయాలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. విషం చేసే హాని కంటే, పాము కరిచిందనే ఆందోళనతోనే కొంతమంది బాధితులు ప్రాణాలు కోల్పోతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం ద్వారా బాధితుల్లో అనవసర భయం, అపోహలు తగ్గించవచ్చు. పాము కాటుకు గురైన వ్యక్తిని వెంటనే ఆస్పత్రికి తరలించాలే గానీ పసరు మందులతో తగ్గిపోతుందని అనుకోకూడదు. దీనిపై పల్లెల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలి. కరపత్రాలు, బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేకంగా గ్రామ సభలు నిర్వహించి విషయాన్ని వివరించాలి. బాధితులు తక్షణమే సమీప ఆసుపత్రులకు వెళ్లేలా గ్రామాల్లో అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలి. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో యాంటీ స్నేక్ వీనమ్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉండేలా చూడాలి.

–మధు శానాల

## భలే బుజ్జి కారు!

హాయ్ ఫ్రెండ్స్..! కారు అనగానే ఎంచక్కా నలుగురైదుగురు కూర్చోవచ్చు. ఎటంటే అటు వెళ్లిపోవచ్చు.. అనుకుంటాం కదా! కానీ ఈ కారు మాత్రం కాస్త వింతగా ఉంటుంది. అదేంటో తెలుసుకుందామా!

ఇటలీకి చెందిన ఆండ్రియా మరాజ్జీ అనే ఒక మెకానిక్ సింగిల్ సీటర్ కారును తయారుచేశాడు. అందులో ఒక్కరు మాత్రమే కూర్చునే వీలుంటుంది. అంటే డ్రైవింగ్ చేసే వాళ్లు మాత్రమే అన్నమాట. 1993 మోడల్ ఫియట్ పాండాని చిన్న కారుగా మార్చాడు. దీన్ని తయారుచేయడానికి దాదాపు సంవత్సరం పట్టిందట. ఈ బుజ్జి కారుని 'ఫ్లాట్ ఫియట్' అని పిలుస్తున్నారు. ఇది ప్రపంచంలోనే అత్యంత సన్న కారన్న పేరు సొంతం చేసుకుంది. 50సెం.మీ. వెడల్పుతో ఉండే ఈ కారు.. గంటకు 15కి.మీ. వేగంతో ప్రయాణిస్తుంది. ఒకే హెడ్‌లైట్, స్కూటర్ ఇంజిన్, బ్యాటరీలతో నడుస్తుంది. ఇది ఒకసారి ఛార్జింగ్ చేస్తే 25కి.మీ. వరకు వెళ్తుంది. దీని బరువు 264కిలోలు మాత్రమే. ఈ కారును తయారు చేసిన మరాజ్జీ యూట్యూబర్ కూడా. కారు డ్రైవ్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది కాస్తా వైరల్ అయ్యింది. 'బుజ్జి కారు భలే ఉంది' అంటూ చాలామంది కామెంట్లు చేస్తున్నారు. అంత వైరల్ అయిన ఈ కారు.. రోడ్డు మీద తిరగడానికి మాత్రం అక్కడి ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదట. అందుకే తన బిజినెస్‌ని డెవలప్ చేసుకోవడానికి ఈ కారును ఉపయోగించుకుంటున్నాడట మరాజ్జీ. దీన్ని చూడగానే.. కాస్త పెద్దగా ఉన్న బొమ్మ కారు అనుకున్నారు కదా నేస్తాలూ మీరు!




★

## పదవలయం

**కింద ఇచ్చిన ఆధారాలతో వచ్చే పదాలను రాయండి. అన్నీ 'మ' అక్షరంతోనే ప్రారంభమవుతాయి.**

1. గౌరవం లాంటిది
2. స్త్రీ మరోలా
3. మాట్లాడేవి..
4. రోడ్డు మీద ఉండేది
5. మచ్చ
6. మేఘాలు
7. మర్చిపోవడం
8. మానవుడు




[illegible]




## శుభకరి.. శాకంబరి

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ మంగళవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం వెలుపల, బయట కూరగాయలతో సుందరంగా అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి అమ్మకు నివేదించగా మరికొంత మంది సారె సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వనమాతా పాహిమాం అంటూ అమ్మవారిని దర్శించుకున్నారు.
- ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

## పవిత్ర సంగమానికి గోదారి జలాలు

◆ మంత్రి నిమ్మలతో జలహారతి నేడు

**ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే :** పట్టిసీమ ఎత్తిపోతల (పోలవరం కుడి కాలువ) ద్వారా విడుదలైన గోదావరి జలాలు మంగళవారం ఉమ్మడి కృష్ణా జిల్లాకు చేరాయి. ఇవి బుధవారం వేకువజామున కృష్ణా నదిలో ఇబ్రహీంపట్నం వద్ద పవిత్ర సంగమంలో విలీనం కానున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పవిత్ర సంగమం వద్ద ఉదయం 7.30 గంటలకు జల హారతి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నెల 3వ తేదీ సాయంత్రం పట్టిసీమ ద్వారా గోదారి జలాలను మంత్రి నిమ్మల విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇవి 5 రోజుల పాటు పయనించి.. ఉమ్మడి జిల్లాకు చేరాయి.


# ఈనాడు అమరావతి

ఎన్టీఆర్

బుధవారం జులై 9, 2025




# నిఘా నేత్రాల వీక్షణం

### అన్ని ప్రార్థనా మందిరాల్లో సీసీ కెమెరాలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

'ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాలు జరగకూడదు. జరిగినా 24 గంటల్లోనే నిందితులను పట్టుకోవాలి' అనే నినాదంతో.. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరాలు బిగించారు. ఇటీవల 'సురక్ష 360' పేరుతో సంబరాలు నిర్వహించారు. తాజాగా ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లోనూ నూరు శాతం సీసీ కెమెరాలు పెట్టాలన్న లక్ష్యంతో అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

**8 స్టేషన్ల పరిధిలో పూర్తి:** ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 28 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. వీటిలో 8 స్టేషన్ల పరిధిలోని దేవాలయాలు, ప్రార్థనామందిరాల్లో నూరు శాతం సీసీ కెమెరాలు పెట్టేశారు. వీటిలో విజయవాడలో 7, వత్సవాయిలో 1 చొప్పున ఉన్నాయి. మరో 20 స్టేషన్ల పరిధిలో పెట్టాల్సి ఉంది. మొత్తం 2,689 ప్రార్థనామందిరాలు ఉండగా.. వీటిలో 1,926 మందిరాల్లో నిఘా కళ్లు బిగించారు. ఈ కార్యక్రమానికి దాతలు కూడా తమవంతు సహకారం అందిస్తున్నారు. దేవీ సీ ఫుడ్స్ సంస్థ రూ.10 లక్షలు విరాళం అందించింది. మరికొందరు నిధులు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. దసరా లోపు వంద శాతం పూర్తి చేసేందుకు అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.



గవర్నర్‌పేట శివాలయంలో..

**కమిషనరేట్‌లో..**

| | |
|---|---|
| దేవాలయాలు | 1,415 |
| చర్చిలు | 980 |
| మసీదులు | 288 |
| ఇతరాలు | 6 |

**త్వరలో అన్నింట్లోనూ..**

'సురక్ష 360' పేరుతో ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలో అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరాలు పెట్టాం. రెండో విడత కార్యక్రమాల్లో భాగంగా ప్రార్థనా మందిరాల్లో పెట్టేందుకు సిద్ధమవుతున్నాం. గత నెల 28న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఇప్పటికి మూడు వంతులు పూర్తి చేశాం. త్వరలో అన్నింట్లోనూ పెట్టేస్తాం. దీంతో ఎన్టీఆర్ కమిషనరేట్ మొత్తం నిఘా పరిధిలోకి వచ్చేసినట్లే.
- రాజశేఖరబాబు, పోలీస్ కమిషనర్

# రూ.400 కోట్లతో తిరువూరులో తోళ్ల పరిశ్రమ

### జగ్గయ్యపేట, నందిగామ మధ్యలో డిఫెన్స్ క్లస్టర్...

### జిల్లా.. నియోజకవర్గాల వారీగా కార్యాచరణ ప్రణాళిక

ఈనాడు, అమరావతి

'తిరువూరులో రూ.400 కోట్లతో తోళ్ల పరిశ్రమ ఏర్పాటు కానుంది. జగ్గయ్యపేట, నందిగామ మధ్యలో కేంద్ర ప్రభుత్వ డిఫెన్స్ క్లస్టర్ వస్తోంది. వీటి రాకతో ఆదాయ వృద్ధి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. జక్కంపూడిలోని ఎకనమిక్ జోన్ సిటీలో మూడు టవర్లలో ఒక టవర్ నిర్మాణం త్వరలో పూర్తిచేస్తాం. ఇక్కడ మహిళలకు ఎక్కువగా ఉద్యోగాలు కల్పించే యూనిట్లను ఏర్పాటు చేయబోతున్నాం. ఇందుకు ఎలీప్ వంటి సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటున్నాం.' - కలెక్టర్ లక్ష్మీశ



జిల్లా, నియోజకవర్గాల వారీగా ప్రత్యేక విజన్ యాక్షన్ ప్లాన్లు సిద్ధం చేశాం. పర్యాటక, ఆతిథ్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నాం. జిల్లాలో ఎక్కడెక్కడ ఏమేం చేయబోతున్నామనేది.. 'ఈనాడు-ఈటీవీ' ముఖాముఖిలో వివరించారు.

ముఖాముఖి

✦ **విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు:** జిల్లాకు డిస్ట్రిక్ట్ విజన్ యాక్షన్ ప్లాన్ (డీవీఏపీ), ప్రతి నియోజకవర్గానికి వేర్వేరుగా యాక్షన్ ప్లాన్(సీవీఏపీ) యూనిట్లను సిద్ధం చేశాం. డీవీఏపీకి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఛైర్మన్‌గా, కలెక్టర్ వైస్ ఛైర్మన్‌గా, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జడ్పీ ఛైర్మన్, మేయర్ సభ్యులుగా ఉన్నారు. సీవీఏపీలో ఎమ్మెల్యే ఛైర్మన్‌గా, ఓ జిల్లా అధికారి వైస్ ఛైర్మన్‌గా ఉంటారు. స్థానిక అవకాశాలు ఏంటి? తద్వారా ఆదాయ వృద్ధి ఎలా పెంచాలో ఈ కమిటీ దృష్టి పెడుతుంది.

✦ **తలసరి ఆదాయం రూ.62 లక్షలు:** జిల్లాలో తలసరి ఆదాయం రూ.3.52 లక్షలుంది. వచ్చే ఏడాదికి రూ.4.15 లక్షలకు చేరబోతోంది. 2047 నాటికి రూ.62 లక్షలకు పెంచాలనేది లక్ష్యం. ఏటా 18.5 శాతం వృద్ధిని అన్ని రంగాల్లో తేవాలి. ప్రస్తుతం సేవా రంగంలో 70 శాతం వృద్ధి కనిపిస్తోంది. వ్యవసాయంలో 13-15 శాతం, పారిశ్రామిక ప్రగతిలో 20-25 శాతం వృద్ధి ఉంటోంది. వచ్చే 25 ఏళ్లు ఇలాగే ఉంటేనే లక్ష్యాన్ని చేరగలం.

✦ **ఉద్యాన సిరులు:** ప్రస్తుతం ఎక్కువ మంది రైతులు జిల్లాలో వరినే పండిస్తున్నారు. వీరిలో ఏటేటా కొందరిని ఉద్యాన పంటల వైపు మళ్లించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. దీనివల్ల వృద్ధి రేటు అధికంగా ఉంటుంది. రైతులు సైతం సానుకూలంగా ముందుకొస్తున్నారు.

✦ **10వేలకు పైగా ఎంఎస్ఎంఈలు:** నియోజకవర్గాల వారీగా ఎంఎస్ఎంఈ పార్కులు పెట్టేందుకు భూసేకరణ పూర్తయింది. ప్రస్తుతం 14 వేల పరిశ్రమలు ఉండగా.. ఈ పార్కులతో మరో 10 వేలు అదనంగా రాబోతున్నాయి. ఉద్యోగ అవకాశాలతోపాటు రూ.కోట్లలో టర్నోవర్ పెరగబోతోంది.

✦ **పర్యాటక ఆకర్షణీయం:** మన జిల్లాలో సేవా రంగంపైనే 60 శాతంపైగా ఆదాయం వస్తోంది. దీనిని 80 శాతానికి తీసుకెళ్లేలా లక్ష్యం. ఆలయాలకు వచ్చే భక్తులను.. పర్యాటక ప్రదేశాలకు తీసుకెళ్లడం.. విజయవాడ ఉత్సవ్ వంటి పెద్ద ఎగ్జిబిషన్లు, ఈవెంట్స్ నిర్వహిస్తాం. పుష్కలంగా హోటళ్లు, సౌకర్యాలు మన దగ్గర ఉన్నాయి. ఎక్కువ మంది వస్తే.. స్థానిక ఆదాయ వనరులు పెరుగుతాయి.

✦ **జెడ్ సిటీలో మూడు టవర్లు:** జక్కంపూడిలో జెడ్ సిటీలో మూడు టవర్లు నిర్మిస్తున్నాం. మొదటి టవర్ ఇప్పటికే 80 శాతం పూర్తయింది. మిగతాది పీపీపీ విధానంలో పూర్తి చేసి కార్యకలాపాలు ఆరంభిస్తాం. మరో రెండు టవర్లు నిర్మిస్తాం. ఇక్కడ మహిళలు ఎక్కువగా పనిచేసే పరిశ్రమలు పెట్టబోతున్నాం. ఎలీప్ వంటి సంస్థలతో ఒప్పందం చేసుకోనున్నాం. మరో ఏడాదిలో కార్యరూపం దాల్చనుంది.

## పాఠశాలల్లో సమస్యలున్నాయా?.. పథకాలు అందలేదా?

**డీఈఓ సుబ్బారావుతో ఫోన్‌ఇన్ నేడు**



ఈనాడు మీతోడు

ఇటీవలే విద్యా సంవత్సరం మొదలైంది. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు దృష్టికి తీసుకువచ్చే అవకాశం 'ఈనాడు-మీతోడు' కల్పిస్తోంది. పాఠశాలల్లో వసతుల లేమి, తల్లికి వందనం, విద్యా మిత్ర కిట్లు రాజపోవడం, ప్రైవేటు పాఠశాలల గుర్తింపు, ఫీజులు, పేద విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు, తరగతి గదులు, తాగునీటి ఇబ్బందులు తదితర సమస్యలపై ఫోన్ చేసి డీఈఓకు సమాధానాలిస్తారు. మీరు చేయాల్సిందల్లా దిగువ సెల్ నంబరుకు కాల్ చేయడమే. - విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

97041 69998 | తేదీ: బుధవారం 9.7.2025 | సమయం: ఉదయం 11 నుంచి 12 వరకు

## ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్‌కు 376 మంది



అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

**కరెన్సీనగర్, న్యూస్‌టుడే:** ప్రస్తుత విద్యా సంవత్సరం ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఏపీఈసెట్ కౌన్సెలింగ్ ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల విద్యార్హత ధ్రువపత్రాల పరిశీలన మంగళవారం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ కేంద్రానికి 376 మంది అభ్యర్థులు వచ్చారు. ఆర్మీ సంతతికి సంబంధించి 1 నుంచి 20,000 ర్యాంకుల వరకు పిలవగా... 20 మంది, స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో 154 మంది, ఎన్‌సీసీ విభాగానికి 202 మంది అభ్యర్థులు వచ్చి తమ ధ్రువీకరణ పత్రాలను పరిశీలన చేయించుకున్నారు. బుధవారం ఆర్మీ కేటగిరీలో 20,001 నుంచి చివరి ర్యాంకు వరకు, ఎన్‌సీసీ విభాగానికి 15,001 నుంచి చివరి ర్యాంకు వరకు, పీహెచ్, స్కౌట్ అండ్ గైడ్స్ కేటగిరీలో ఒకటి నుంచి ఆఖరి ర్యాంకు వరకు అభ్యర్థులు హాజరుకావాలని అధికారులు తెలిపారు.

## చకచకా నిర్మాణ పనులు



మొదటి టవర్ వద్ద ప్రారంభమైన పనులు

ఐఐటీ మద్రాసు నిపుణుల బృందం రాజధానిలో పర్యటించిన తర్వాత నిర్మాణాల పనులు ఊపందుకున్నాయి. గత నెలలో అమరావతికి వచ్చిన నిపుణుల బృందం.. ఐకానిక్ టవర్లు, శాశ్వత హైకోర్టు పునాదులను పరిశీలించింది. వారి సూచనల మేరకు ముందుకు సాగుతున్నారు. 16 ఎంఎం కంటే తక్కువ పరిమాణంలో ఉన్న రాడ్లను శుభ్రం చేసి వినియోగిస్తున్నారు. పాడైన ఐదు రాడ్లకు ఒకటి అదనంగా వేసి బలోపేతం చేసి పనులు తిరిగి ప్రారంభించారు. టవర్ల పార్కింగ్ ప్రాంతాల్లో ఇంకా పునాదుల కోసం తవ్వనిచోట్ల పునాదుల లోతు పెంచుతున్నారు. శాశ్వత హైకోర్టు నిర్మాణంలో ఓ వైపున కాంక్రీట్ వేయకుండా ఉన్న ఇనుప రాడ్లు బాగా దెబ్బతిన్నాయి. కాంక్రీట్ వేసే సమయానికి పనులు నిలిచిపోయాయి. మట్టిలో కూరుకుపోయిన వీటిని తొలగిస్తున్నారు. వీటి స్థానంలో కొత్తవి వేయాలనే ఐఐటీ బృందం సూచనల మేరకు మారుస్తున్నారు.
- ఈనాడు, అమరావతి



శాశ్వత హైకోర్టు పునాది వద్ద ఇంకా కాంక్రీట్ వేయని ప్రాంతంలో రాడ్ల తొలగింపు



# ఆశల వల.. కన్నీరే ఆవల!

■ రెట్టింపు లాభాల ఎరేసి రూ.కోట్లలో వసూళ్లు..
■ సొంత అవసరాలకు వాడేసి చెల్లించలేక దివాలా

ఈనాడు, అమరావతి

'తక్కువ పెట్టుబడి పెట్టినా.. రెట్టింపు ఆదాయం. సభ్యులను చేర్పిస్తే.. అదనంగా బోనస్. ఈప్రకటనలు చూసి నిరుపేద, మధ్యతరగతి వారు డబ్బు కడుతున్నారు. ఆపై బోర్డు తిప్పేస్తున్నారు. సంస్థ గురించి ఏ మాత్రం ఆలోచించకుండానే పెట్టుబడి పెడుతున్నారు. అత్యాశకుపోయి మోసగాళ్ల వలలో చిక్కి అల్లాడుతున్నారు. ఉమ్మడి కృష్ణాలో ఇటీవల ఇలాంటివి ఎక్కువయ్యాయి.'

**తీయటి మాటలతో బురిడీ..**

☛ ప్రైవేటు బీమా కంపెనీ ఉద్యోగి ఆదిత్య.. అద్విక ట్రేడింగ్ కంపెనీ పెట్టి 1,600 మంది నుంచి రూ.380 కోట్లు వసూలు చేశాడు. ఫారెక్స్ ట్రేడింగ్, ఈక్విటీల్లో పెట్టుబడుల పేరుతో ఆకర్షణీయ ప్రచారం చేశాడు. రూ. లక్షకు నెలకు ఆరు శాతం వడ్డీ చొప్పున రూ.6 వేలు ఇస్తామని నమ్మించాడు. వసూలు చేసిన సొమ్మును ట్రేడింగ్‌లో పెట్టి, లాభాల్లో వడ్డీ ఇస్తానని ఆశపెట్టి ఉమ్మడి కృష్ణా, ఏలూరు జిల్లాల్లో ఏజెంట్లను పెట్టి డిపాజిట్లు వసూలు చేశాడు. చివరకు ఎనిమిది నెలలుగా డబ్బులు ఇవ్వకపోవడంతో కేసు నమోదైంది.

☛ హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పేరుతో వైకాపా నేత గోగుల రమణారావు కుమారుడు లక్ష్మీ విజయ్‌కుమార్ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లావాసుల నుంచి రూ.కోట్లు కొల్లగొట్టాడు. మూడు పథకాల పేరుతో వల వేసి బురిడీ కొట్టించి.. రూ.కోట్లు కాజేశాడు.




పెట్టుబడులను షేర్ మార్కెట్లు, ఫారెక్స్ ట్రేడింగ్, తదితర మార్గాల్లో పెట్టనున్నట్లు నమ్మిస్తున్నారు. వచ్చిన లాభాలు పంచుతామంటున్నారు. వీటిని నమ్మి ప్రజలు తమ నగదుకు తోడు అప్పు తెచ్చి పెట్టుబడి పెడుతున్నారు. ఎక్కువ మందిని ఆకట్టుకోవడానికి స్కీంలు ప్రకటిస్తూ.. పేద, మధ్య తరగతిని తమ ఉచ్చులో పడేస్తున్నారు. కొన్నాళ్లు నమ్మకంగా ఇస్తారు.. ఠంచనుగా డబ్బు వస్తోంది కదా అని అందినకాడికి అప్పు చేసి పెడుతున్నారు. అంతా అయిపోయాక కానీ విషయం తెలడంలేదు.

**ఆకర్షణీయ ప్రచారంతో:** ఆకర్షణీయ ప్రచారాన్ని నమ్మి.. కంపెనీల గురించి తెలుసుకోకుండానే ప్రజలు డిపాజిట్ చేస్తున్నారు. బోర్డు తిప్పే వరకు సమాచారం బయటకు రావడం లేదు. ఆకర్షణీయ వడ్డీ, ఆకట్టుకునే ప్రకటనలతో వల వేసి ముంచుతున్నాయి సంస్థలు. అద్విక కంపెనీ ఎండీ ఆదిత్య సామాజిక మాధ్యమాల్లో ఇంతే ప్రచారం చేశాడు. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లో పలువురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లతో ప్రచారం చేయించాడు. సాంకేతిక అవరోధాలతో ఈ తరహా మోసాల్లో పోలీసుల దర్యాప్తు చివరి వరకు సాగడం లేదు. ఫిర్యాదులు వచ్చి దర్యాప్తు ప్రారంభించి బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసే లోపే నిందితులు సొమ్ములు మళ్లిస్తున్నారు. వెరసి బాధితుల్లో ఎక్కువ మందికి పోగొట్టుకున్న సొమ్ము అందడం లేదు.

☛ సినిమాలకు యానిమేషన్ సాఫ్ట్‌వేర్ అందిస్తానని సత్యనారాయణపురంలో కార్యాలయం తెరిచిన కిరణ్.. రూ.కోట్లు వసూలు చేశాడు. రూ.లక్ష చెల్లిస్తే నెలకే రూ.లక్ష లాభమని వసూళ్లకు పాల్పడ్డాడు. రూ.10 లక్షల నుంచి రూ.కోట్లలో పెట్టుబడి పెట్టారు. ఈ డబ్బుకు యూపిక్స్ గ్రూప్ పేరుతో ఒప్పందాలు రాసిచ్చాడు. చివరకు బోర్డు తిప్పేయడంతో చిరుద్యోగులు, వ్యాపారులు, అధికారులు తల్లడిల్లుతున్నారు.

## ఉద్యాన పంటల సాగుతో ఆదాయం రెట్టింపు

**గోసవీడు (గంపలగూడెం), న్యూస్‌టుడే:** తిరువూరు నియోజకవర్గ రైతులు ఉద్యాన పంటల సాగుపై దృష్టి పెట్టాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. వరి, పత్తి, మిరప పంటలు సాగు చేసే వారు పండ్ల తోటల పెంపకం ద్వారా ఏటా రెట్టింపు ఆదాయం పొందవచ్చన్నారు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా అవసరమైన మొక్కలు, నిర్వహణ ఖర్చు ఉచితంగా అందిస్తున్నారు. మండలంలోని గోసవీడులో మంగళవారం ఉద్యాన పంటల సాగు మెగా మేళా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఇమ్మణి నాగమణికి చెందిన 115 సెంట్ల భూమిలో 60 మామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మెగా మేళాలో 645 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటినట్లు చెప్పారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన అనే మహా యజ్ఞం జరుగుతోందని, ఇందులో అధికారులు భాగస్వామ్యులు కావాలన్నారు. కర్షకులను ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సహించాలన్నారు. రైతులు అడిగితేనే చెప్పాలనే భావనను అధికారులు వీడాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో గ్రామాల్లో పర్యటించి ఉద్యాన పంటలపై రైతులను ప్రశ్నిస్తానని, నాకు తెలియదు, చెప్పలేదని ఎవరైనా చెబితే సదరు ఉద్యోగులను అక్కడికక్కడే తొలగిస్తానని హెచ్చరించారు. గ్రామాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యాలు, రైతులను ప్రోత్సహించే బాధ్యతను డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్. ఆర్డీవో

## ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఏసీ బోగీలు

**విజయవాడ(రైల్వేస్టేషన్):** ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈనెల 13వ తేదీ నుంచి పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా ఒక థర్డ్ ఏసీ బోగీని ఏర్పాటు చేస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12711/12712 విజయవాడ-చెన్నై, 12713/12714 విజయవాడ-కాచిగూడ, 17201/17202 గుంటూరు-సికింద్రాబాద్ రైళ్లకు వీటిని ఏర్పాటు చేయనున్నారు.





## నదులు ఉప్పొంగె.. కృష్ణా డెల్టా రైతుకు డబుల్ ఇంజిన్

**ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే :** ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని 13.08 లక్షల ఎకరాల కృష్ణా డెల్టా ఆయకట్టుకు విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి సాగునీరు అందుతోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజనులో కృష్ణా నది ఎగువలోనూ, మరోవైపు గోదావరి నదిలోనూ నీరు అధికంగా ఉంది. కృష్ణా నదిలో శ్రీశైలం నుంచి దిగువకు నాగార్జునసాగర్ వైపు నీరు విడుదల చేసిన రోజే.. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు కృష్ణా నది సమీపానికి చేరాయి. కృష్ణా నీరు నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులకు చేరి, ప్రకాశం బ్యారేజీకి రావడానికి కొంత సమయం పడుతుంది. ఈలోగా పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు మళ్లిస్తూ.. కృష్ణా డెల్టా ఆయకట్టులో సాగునీటి అవసరాలు తీరుస్తారు. ఇలా కృష్ణా, గోదావరి నీటిని వినియోగించుకునేలా జలవనరుల శాఖ అధికారులు ఒక ప్రణాళికతో ఉన్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటి మట్టానికి గాను ప్రస్తుతం 10.1 అడుగులు ఉంది. గోదావరి జలాలు కృష్ణాలో విలీనమైతే బ్యారేజీ వద్ద నీటి మట్టం పెరిగే అవకాశం ఉంది. డెల్టాలోని పంట కాలువలకు అవసరాలకు తగినంత నీరు ఇవ్వొచ్చు. రెండు నదుల్లో ఆశాజనక పరిస్థితులు ఉన్న నేపథ్యంలో కృష్ణా డెల్టా రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

**పంట కాల్వలకు 7,501 క్యూసెక్కులు:** కృష్ణా డెల్టా పరిధిలోని కాలువలకు ప్రకాశం బ్యారేజీ నుంచి మంగళవారం 7,501 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 6,985, పశ్చిమ ప్రధాన కాలువకు 516 క్యూసెక్కులు విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 3,707, ఏలూరు 1,065, బందరు 1,205, కేఈబీ కాల్వకు 1,008 క్యూసెక్కుల చొప్పున నీరు ఇస్తున్నారు.

## పిల్లల వేడుక.. పాఠశాలే వేదిక..

**10న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు**

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం రాగానే విద్యా విధానంలో మార్పులు తీసుకొచ్చింది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో అడుగులు వేస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి కిట్లను అందించారు. మధ్యాహ్న భోజన పథకానికి సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. పాఠశాల ప్రగతిలో తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, ప్రముఖులను భాగస్వాములు చేయాలనే ఆలోచనతో మెగా పీటీఎం (పేరెంట్స్, టీచర్స్ మీటింగ్) 2.0 నిర్వహణకు విద్యాశాఖాధికారులు సిద్ధమవుతున్నారు.

**ఇప్పటికే ఆహ్వానాల అందజేత**

జిల్లాలో మొత్తం 1,453 పాఠశాలలు ఉన్నాయి. 937 ప్రభుత్వ పాఠశాలల్లో 90,509 మంది, 516 ప్రైవేటు పాఠశాలల్లో 2,12,574 మంది, మొత్తం 3,03,083 మంది విద్యార్థులు చదువుతున్నారు. 185 జూనియర్ కళాశాలల్లో 78,162 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. 3.81 లక్షల మందితో ఈ నెల 10న అన్ని పాఠశాలలు, కళాశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించనున్నారు. మెగా విద్యా వేడుక నిర్వహణకు జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు పర్యవేక్షణలో పాఠశాలలు సిద్ధం అవుతున్నాయి. ఇప్పటికే ప్రజాప్రతినిధులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, దాతలు, పూర్వ విద్యార్థులను కలిసి ప్రధానోపాధ్యాయులు ఆహ్వాన పత్రాలు అందించారు. పాఠశాలలో చదివి ఉన్నత స్థానానికి ఎదిగిన వారిని కూడా ఆహ్వానించి సత్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ✪ విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ పోటీలు ఏర్పాటు చేస్తున్నారు. తల్లులకు రంగవల్లులు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నారు. తల్లి పేరుతో ఒక్క మొక్క నాటించి పర్యావరణాన్ని పరిరక్షణకు కృషి చేయనున్నారు.



## అంగన్‌వాడీల్లో బాలల పథకాల అమలు

**ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే :** నగరంలోని కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఇగ్నైట్ సెల్‌లో ఏర్పాటు చేసిన జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ స్టాల్‌ను జేసీ ఎస్.ఇలక్కియా మంగళవారం ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలల విద్య, ఆరోగ్యం, పోషణకు అందజేస్తున్న వివిధ పథకాలను ఆ శాఖ అధికారులు జేసీకి వివరించారు. ప్రీ-స్కూల్, బాల సంజీవని కిట్, గుడ్లు, పాలు, చిన్నారుల దత్తత, చైల్డ్ హెల్ప్ లైన్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అందిస్తున్న సేవలు తెలియజేశారు. సీడీపీవోలు భానుమతి, జ్యోత్స్న, డీసీపీవో ఎం.రాజేశ్వరరావు, దుర్గా భవానీ, జాన్సన్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్టాల్ ప్రారంభిస్తున్న జేసీ ఇలక్కియా

# నొక్కేసినోళ్లను... మూయించేలా!

★ అక్రమ ఆస్తులు త్వరలో జప్తు
★ చిట్టా సిద్ధం చేస్తున్న పోలీసులు

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - పటమట

అధిక ట్రేడింగ్ కంపెనీ బోర్డు తిప్పేసిన కేసులో సంస్థ ఆస్తులను జప్తు చేసేందుకు పోలీసులు సన్నద్ధం అవుతున్నారు. లాభాల ఆశ చూపి రూ.380 కోట్ల మేర డిపాజిట్లు వసూలు చేసి.. పలువురికి ఎగ్గొట్టిన వ్యవహారంలో నిందితుడు ఆదిత్య కూడబెట్టిన ఆస్తులను పోలీసులు గుర్తిస్తున్నారు. కోర్టు అనుమతితో గుర్తించిన ఆస్తులను త్వరలో జప్తు చేయనున్నారు. వీటి క్రయవిక్రయాలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వానికి లేఖ రాసి.. జీవో తెచ్చే ప్రయత్నాల్లో ఉన్నారు. ఆ ఆస్తుల జాబితాను రిజిస్ట్రేషన్ శాఖకు పంపి చేతులు మారకుండా చూడనున్నారు.

**విదేశాల్లో లెక్కలు తేల్చేలా..:** ఆదిత్య దుబాయ్‌లో మూడు కార్యాలయాలు ప్రారంభించాడు. అక్కడ ఫారెక్స్ ట్రేడింగ్ కోసం భారీగా పెట్టుబడులు పెట్టాడు. వీటిని కూడా రాబట్టేందుకు చూస్తున్నారు. ఇవికాక.. మరికొన్నిచోట్ల రూ.10 కోట్ల మేర ఆస్తులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీటిని స్వాధీనం చేసుకునేలా న్యాయసలహాలు తీసుకుంటున్నారు. బాధితులు ఎందరు? వారికెంత చెల్లించాలి? మిగిలిన నగదు ఎక్కడ? పోలీసులు ఆరా తీస్తున్నారు. మరోవైపు బాధితులు ఇంకా ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు.

**గోవాలో సోలార్ ప్రాజెక్టులో పెట్టుబడి:** నిరుడు ఆదిత్య.. గోవా వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ ఓ సోలార్ ప్రాజెక్టులో భారీగా పెట్టుబడి పెట్టినట్లు తెలిసింది. ప్రకాశం జిల్లాలో కొండలు కొనుగోలు చేసినట్లు సమాచారం. అతను అప్పటికే రూ.50 లక్షల మేర పెట్టుబడి పెట్టాడు. ఆదిత్య, మరికొందరిని కొండల స్వయంగా విమానం టిక్కెట్లు బుక్ చేయించి తీసుకెళ్లాడు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు ఎదురుగా కార్యాలయాన్ని ప్రారంభించాడు. దీనికి నెలకు రూ.లక్ష వరకు చెల్లిస్తున్నాడు. తద్వారా రూ.35 కోట్ల మేర డిపాజిట్లు వసూలు చేసినట్లు బయటపడింది.

**యూపీఎస్ ఆస్తుల జప్తు...:** అధిక వడ్డీ ఇస్తామని ప్రజల నుంచి రూ.వందల కోట్లు వసూలు చేసి మోసం చేసిన యూపీఎస్ సంస్థ ఆస్తులను జప్తు చేయనున్నారు. సంస్థ నిర్వాహకులకు చెందిన ఆస్తులను పోలీసులు అటాచ్‌లో తీసుకోనున్నారు. నిందితులు రూ.178 కోట్ల వరకు పెట్టుబడుల రూపంలో వసూలు చేశారని దర్యాప్తులో గుర్తించారు. రూ.123 కోట్ల వడ్డీలు, మిగిలిన సొమ్ము రూపంలో బాధితులు, ఏజెంట్లకు చెల్లించినట్లు తేలింది. సుమారు రూ.55 కోట్ల లెక్క తేలడం లేదు. దీంతో కిరణ్ ఆస్తులపై పోలీసులు దృష్టి పెట్టారు.. వివిధ ప్రాంతాల్లో రూ.20 కోట్ల వరకు ఆస్తులున్నట్లు వెలుగుచూసింది. వీటి జప్తు ప్రక్రియ వేగవంతం చేశారు. ఎక్కువ మంది లెక్కల్లో చూపని నల్లధనాన్ని పెట్టుబడిగా పెట్టడంతో వారు ఫిర్యాదు ఇచ్చేందుకు ఇప్పటి వరకు ముందుకు రాలేదు.

# శాకంబరి.. నమోస్తుతే


అంతరాలయంలో భక్తుల రద్దీ


కూరగాయలతో దేవతామూర్తుల రూపాలు


భక్తులకు కదంబ ప్రసాదం పంపిణీ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై శాకంబరి ఉత్సవాలు మంగళవారం అంబరాన్ని తాకింది. దుర్గమ్మ ప్రధాన ఆలయంతోపాటు ఉపాలయాలైన మల్లేశ్వరాలయం, నటరాజస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, క్షేత్రపాలక ఆంజనేయస్వామి ఆలయాల్లో దేవతామూర్తులను కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. దుర్గమ్మ గుడి అంతరాలయ ప్రాంగణం మొత్తాన్ని తలపించింది. రాజగోపుర ప్రాంగణంలో కూరగాయలతో చేసిన శివలింగం, విఘ్నేశ్వరుడు, కుమారస్వామి, దుర్గమ్మ రూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శాకంబరిని దర్శనం చేసుకున్న భక్తులకు ఉచిత ప్రసాదంగా కదంబం(కూరగాయలతో తయారు చేసిన అన్నం) దేవస్థానం ఈవో శీనానాయక్ పంపిణీ చేశారు. మహామండపం ఆరో అంతస్తులో ఆషాఢ సారె సమర్పించే దుర్గమ్మ ఉత్సవమూర్తిని శాకంబరీదేవిగా అలంకరించారు. పలువురు భక్తులు సంప్రదాయబద్ధంగా ఆషాఢ సారె సమర్పించారు.

## పీ-4 యజ్ఞంలో రెడ్‌క్రాస్ భాగస్వామ్యం

278 బంగారు కుటుంబాల దత్తత


ప్రతిజ్ఞ పత్రాన్ని కలెక్టర్ లక్ష్మీశకు అందజేస్తున్న డాక్టర్ సమరం, జోషి, పక్కన చిట్టిబాబు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం కూటమి ప్రభుత్వం పీ-4 మహా యజ్ఞానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగస్వాములు కావాలని కలెక్టర్ జి.లక్ష్మీశ ఇచ్చిన పిలుపు మేరకు కొద్ది రోజుల వ్యవధిలోనే జిల్లా రెడ్‌క్రాస్ కార్యవర్గం తక్షణమే స్పందించింది. నగరంలోని రాజరాజేశ్వరిపేటకు చెందిన 278 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటామని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ జి.సమరం, సభ్యులు స్పష్టం చేశారు. ఆయా కుటుంబాలు ఉన్నతికి.. ఆరోగ్య, ఆనంద ఆంధ్రా సాకారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశకు మంగళవారం ప్రతిజ్ఞా పత్రాన్ని అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'పేదరికం లేని సమాజ స్థాపన లక్ష్యంతో సీఎం చంద్రబాబు దార్శనికతతో పీ-4 విధానాన్ని తీసుకొస్తున్నారు' అని చెప్పారు. దీనికి బాసటగా నిలిచిన రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. జిల్లాలో 86,000 బంగారు కుటుంబాలు ఉండగా, 400 మందికి పైగా మార్గదర్శకులు ఉన్నారని ఆయన వివరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ ఛైర్మన్ వెంకట జోషి, కార్యదర్శి ఐ.చిట్టిబాబు పాల్గొన్నారు.

## కమిషనరేట్‌కు మరో రెండు పోలీస్ జాగిలాలు


సీపీ రాజశేఖరబాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న పోలీసు జాగిలం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రముఖ బందోబస్తు పర్యవేక్షణ నిమిత్తం కమిషనరేట్‌కు మరో రెండు పోలీసు జాగిలాలను ప్రభుత్వం కేటాయించింది. రాష్ట్ర రాజధాని అయిన కారణంగా విజయవాడకు ప్రముఖుల రాకపోకలు విస్తృతంగా పెరిగాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తారు. నిషేధిత వస్తువులు, పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాలు గుర్తించి, నేరస్థుల ఆచూకీ కనుగొనేందుకు పోలీసు జాగిలాలను వినియోగిస్తారు. వీటిలో ఉన్న సునిశిత ఘ్రాణశక్తి కారణంగా వీటి సేవలను వినియోగించుకుంటారు.

**కెన్నల్స్ పనులకు భూమి పూజ**

ఎన్టీఆర్ కమిషనరేట్‌లో ప్రస్తుతం 5 జాగిలాలు సేవలు అందిస్తున్నాయి. వీటికి అదనంగా మరో రెండు వస్తున్నాయి. ప్రస్తుతం ఇవి శిక్షణలో ఉన్నాయి. ఆగస్టులో విజయవాడకు తీసుకువస్తారు. పర్యవేక్షించడానికి ఒక్కో జాగిలానికి ఒక్కో హ్యాండ్లర్ ఉంటారు. వీటికి సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో ప్రత్యేకమైన బస ఉంటుంది. ఒక్కో గది ఏర్పాటు చేస్తారు. దీనిని కెన్నెల్ అంటారు. కొత్తగా వచ్చే వాటి కెన్నల్స్ నిర్మించేందుకు మంగళవారం పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సీపీకి పోలీసు జాగిలం పుష్పగుచ్ఛం ఇచ్చి సాదర స్వాగతం పలికింది. డీసీపీలు కె.జి.వి. సరిత, ఉదయరాణి, ఎస్.వి.డి.ప్రసాదరావు, ఏఆర్ ఏడీసీపీ కె.కోటేశ్వరరావు, ఏసీపీలు కృష్ణంరాజు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబుతోనే సుపరిపాలన


మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే శ్రీనివాసరావు

కొత్తపల్లి(గంపలగూడెం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో సుపరిపాలన ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. గంపలగూడెం మండలం కొత్తపల్లి ఎస్సీ కాలనీలో మంగళవారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. కార్యక్రమంలో రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ ఛైర్మన్ శావల దేవదత్, ఏఎంసీ ఛైర్‌పర్సన్ ఆర్.లక్ష్మీలత, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రాజేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి జి.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## దుర్గగుడి సీఆర్‌వో నిర్మాణానికి ఏర్పాట్లు


పనులు పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్, ఇంజినీరింగ్ అధికారులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: మల్లికార్జునపేట అర్జున వీధిలో ఆక్రమణలు తొలగించిన దుర్గగుడి స్థలంలో సెంట్రల్ రిసెప్షన్ ఆఫీస్(సీఆర్‌వో) నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఈవో శీనానాయక్ మంగళవారం పరిశీలించారు. సీఆర్‌వోలో విశాలంగా వెయిటింగ్ హాల్, పూజలు, సేవల బుకింగ్ కౌంటర్లు ఉండేలా ఏర్పాట్లు చేస్తామని ఈవో తెలిపారు. కొండ దిగువనే దీనిని ఏర్పాటు చేయడంతో భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు, టోల్‌గేట్ ఫీజు, మొబైల్ డిపాజిట్ వంటివి తొలగుతాయన్నారు. దర్శనం టిక్కెట్లు తీసుకున్నవారు నేరుగా కనకదుర్గనగర్ లిఫ్ట్ మార్గం, ఘాట్ రోడ్డు మార్గాల్లో అమ్మవారిని దర్శించుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. సీఆర్‌వోలో ప్రసాదం కౌంటర్, ఆర్జిత సేవల బుకింగ్, దేవస్థానం పబ్లికేషన్స్ అందుబాటులోకి తీసుకు వస్తామని తెలిపారు.

## కన్నప్ప నిర్మించడం పూర్వజన్మ సుకృతం


విలేకరులతో మాట్లాడుతున్న నటుడు మోహన్‌బాబు, పక్కన శివబాలాజీ, నాగ సాధువులు, పీఠాధిపతులు, మాతాజీలు తదితరులు

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: సీనియర్ నటుడు మోహన్‌బాబు మంగళవారం విజయవాడలో సందడి చేశారు. కన్నప్ప చిత్రం విజయోత్సవ వేడుకలో భాగంగా బెంజ్ సర్కిల్‌లోని క్యాపిటల్ సినిమాస్‌లో 'సేవ్ టెంపుల్స్ భారత్' సంస్థ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ నేతృత్వంలో నాగ సాధువులు, మాతాజీలతో కలిసి మోహన్‌బాబు కన్నప్ప చిత్రాన్ని చూశారు. తెలుగు అఘోరాలు, నాగ సాధువులు, పీఠాధిపతులు, మాతాజీలను సత్కరించారు. అనంతరం విలేకరులతో మోహన్‌బాబు మాట్లాడుతూ.. 'కన్నప్ప చిత్రాన్ని నిర్మించడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. శ్రీకాళహస్తిలోని భక్త కన్నప్ప జీవిత చరిత్రను ఆధారంగా చేసుకుని కొన్ని మార్పులు చేసి చిత్రాన్ని నిర్మించాం. ప్రపంచ స్థాయిలో ప్రేక్షకుల నుంచి విశేష స్పందన రావడం ఆనందంగా ఉంది. తెలుగు ప్రజలందరూ సినిమా తప్పక చూడాలి. కన్నప్ప పాత్రలో మంచు విష్ణు నటన సినిమాకు హైలైట్. ఇందులో ప్రముఖ నటులు ప్రభాస్, అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్, శరత్‌కుమార్ నటించడం సంతోషకరం. నాగ సాధువులు, పీఠాధిపతులు, మాతాజీలను సత్కరించుకోవడం అదృష్టంగా భావిస్తున్నా' అని అన్నారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలుగు ప్రజలందరూ సినిమా చూసి కన్నప్ప జీవిత చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. నటుడు శివబాలాజీ, నాగ సాధువులు, పీఠాధిపతులు, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు, మాతాజీలు పాల్గొన్నారు.

### బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -102 రిటైల్ ధర 124 చికెన్ విత్ స్కిన్ - 180, చికెన్ స్కిన్‌లెస్ - 205. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 110, 118, 129 చికెన్ విత్ స్కిన్ - 210 చికెన్ స్కిన్‌లెస్ - 220.

### నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 550 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

## పుణ్యక్షేత్రాల సందర్శనలో విషాదం

### రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకుల దుర్మరణం


జశ్వంత్‌సాయి, పద్మావతి (పాత చిత్రాలు)


నుజ్జయిన కారు

చంద్రగిరి, చిట్టినగర్, న్యూస్‌టుడే: అతివేగం ఓ కుటుంబంలో అంతులేని విషాదం మిగిల్చింది. పుణ్యక్షేత్రాల సందర్శన కోసం వచ్చిన కుటుంబంలో తల్లీకుమారుడు మృతిచెందగా మరో మహిళ అపస్మారక స్థితిలోకి చేరుకున్న ఘటన చంద్రగిరి పరిధిలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. విజయవాడ కేఎల్‌రావునగర్‌లోని సిండికేట్ బ్యాంకు కాలనీకి చెందిన కోటేశ్వరరావు, భార్య పద్మావతి (38), కుమారుడు జశ్వంత్‌సాయి (21), అక్క హేమలతతో కలిసి సొంత కారులో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వర స్వామివారిని దర్శించుకుని విజయవాడకు వెళ్తుండగా చంద్రగిరి మండలం తొండవాడ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వీరు ప్రయాణిస్తున్న కారు ముందు వెళ్తున్న పాల ట్యాకర్‌ను బలంగా ఢీకొనడంతో పద్మావతి ఘటనా స్థలంలోనే దుర్మరణం పాలయ్యారు. ఎయిర్ బెలూన్ తెరుచుకోవడంతో డ్రైవింగ్ సీటులో ఉన్న వెంకటేశ్వరరావు స్వల్పగాయాలతో బయటపడ్డారు. జశ్వంత్‌సాయి, హేమలత తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నారు. భాకరాపేట సీఐ ఇమ్రాన్ బాషా, స్థానిక పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను రుయా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ జశ్వంత్‌సాయి మృతిచెందారు. పద్మావతి మృతదేహాన్ని ఎస్వీ వైద్య కళాశాలకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సూపర్‌వైజర్‌పై దౌర్జన్యం.. దాడి

### బిల్డర్, అతని అనుచరులపై కేసు


ప్రవీణ్‌పై చేయి చేసుకుంటున్న శివ

విజయవాడ, న్యూస్‌టుడే: గుణదలలోని కేవీఆర్ కైలాష్ హైట్స్ అపార్ట్‌మెంట్లలో ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న బల్ల వెంకట ప్రవీణ్‌పై దాడి చేసిన బిల్డర్ మల్లాది కాశీ విశ్వనాథ్, అతని అనుచరులపై గుణదల పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం.. కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామానికి చెందిన ప్రవీణ్.. కేవీఆర్ కైలాష్ హైట్స్ అపార్ట్‌మెంట్లకు ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం అపార్ట్‌మెంట్ బ్లాక్ సీలో పని చేస్తుండగా లచ్చన్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స యజమాని మల్లాది కాశీ విశ్వనాథ్, అతని అనుచరులైన పవన్‌కుమార్, స్వామి, మహేష్, పెయింటర్ రవి, చిన్న, సుబ్బారావు, శివ, సంపత్, శ్రీనివాసరావు, నవీన్ తదితరులు బ్లాక్ సీ లోకి దౌర్జన్యంగా చొరబడ్డారు. ఎలక్ట్రికల్ ప్యానల్ బోర్డుకు రక్షణగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ తాళాలు పగలగొట్టారు. సీసీ కెమెరా వైర్లను కట్ చేశారు. కాశీ విశ్వనాథ్ అనుచరుడైన శివ.. తనను దుర్భాషలాడి చెంప మీద కొట్టినట్లు ప్రవీణ్ చెప్పారు. ఈ మేరకు గుణదల పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు శివ, మల్లాది కాశీ విశ్వనాథ్ తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు..** ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం జరిగిన వెంటనే గుణదల పోలీసులకు ఫిర్యాదు చేసినా.. సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ స్పందించలేదు. దీంతో కేవీఆర్ కైలాష్ హైట్స్ అపార్ట్‌మెంట్‌కు చెందిన బిల్డరు.. సెంట్రల్ ఏసీపీ దామోదర్ దృష్టికి ఈ అంశాన్ని తీసుకువచ్చారు. దీనిపై ఆయన జోక్యం చేసుకుని, విచారణ చేసి కేసు నమోదు చేయాలని ఆదేశించడంతో ఎట్టకేలకు సోమవారం రాత్రి 9 గంటలకు కేసు నమోదు చేశారు. దీనిపై పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబుకు కూడా ఫిర్యాదు చేయగా.. సదరు ఫిర్యాదును ఏసీపీ సెంట్రల్ జోన్ దామోదర్‌కు ఎండార్స్ చేశారు. మంగళవారం రాత్రి ఏసీపీ దామోదర్.. గుణదల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విచారించారు. ఫిర్యాది ప్రవీణ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసుల వద్ద నిందితుల వివరాలు పూర్తి స్థాయిలో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫిర్యాదు వచ్చి దాదాపు 30 గంటలు గడిచినా పోలీసులు సరిగా స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా గతంలోనూ ఇదే తరహాలో పలుమార్లు గొడవలు జరిగాయని.. అప్పట్లో పోలీసులు సరిగా స్పందించకపోవటం వల్లే తరచూ పునరావృతం అవుతున్నాయని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

## ముసుగు దొంగలు.. కెమెరాలో దృశ్యాలు

### నేరస్థలంలో వేలిముద్రలు లభ్యం


అర్ధరాత్రి 1.07 గంటలకు నేరస్థుల కదలికలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 5వ తేదీ జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఘటనాస్థలంలో 7 వేలిముద్రలు లభ్యం కాగా.. వాటిని నేషనల్, స్టేట్ క్రైం రికార్డ్స్‌తో పోల్చి చూశారు. పాత నేరస్థుల వేలిముద్రలతో అవి సరిపోలలేదు. ఇది కొత్త ముఠా పని కావొచ్చని ఒక నిర్ధారణకు వచ్చారు. నిందితుల ప్రవర్తన, ముసుగులు వేసుకున్న తీరును బట్టి.. చెడ్డీ గ్యాంగ్ అని అనుమానించినా, వారి వేలిముద్రలు సరిపోలకపోవడంతో ఆ గ్యాంగ్ కాకపోవచ్చని భావిస్తున్నారు. నేరస్థలం పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరా పుటేజీలు సేకరించారు. ఒక్క చోట మాత్రమే నిందితులు కెమెరాకు చిక్కారు.

**నడిచి వచ్చారా?..** ఇంటి వెనుక.. గోడ కూలిన వైపు నుంచి లోపలికి వచ్చి.. తిరిగి అటు వైపు నుంచే వెళ్లిపోయినట్లు గుర్తించారు. నగరంలో ఏ సీసీ కెమెరాల్లోనూ వారి కదలికలు నమోదు కాకపోవడంతో.. నడిచి వచ్చి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. నేరస్థలానికి సమీపంలోనే విశాఖపట్నం రైల్వేలైను ఉండడంతో దాని వెంబడి వచ్చి.. తిరిగి అదే మార్గంలో వెళ్లిపోయి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. విల్లా పరిసరాల్లో లభ్యమైన సీసీ పుటేజీలో.. ముగ్గురు ముసుగులో వెళుతున్నట్లు రికార్డైంది. సమీపంలోని ఏ సీసీ కెమెరాలోనూ స్పష్టత లేదు. వారి ముఖాలు కనిపించి ఉంటే.. 'న్యాట్ గ్రిడ్' అనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కనిపెట్టేసేవారు. మరో రకంగా నిందితులను పట్టుకునేందుకు సీసీఎస్ పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. టవర్ డంప్, టోల్ గేట్ డేటా వంటి వివరాలు సేకరించి విశ్లేషిస్తున్నారు.

## విజయవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకం

**గొల్లపూడి:** విజయవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఎక్స్ అఫీషియో) బి.రాజశేఖర్ మంగళవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 20 మందితో కమిటీని నియమించారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ గౌరవ ఛైర్మన్‌గా, నర్రా వాసు ఛైర్మన్‌గా, పాల మాధవ వైస్ ఛైర్మన్‌గా నియమించారు. సభ్యులుగా అడ్డూరి లక్ష్మి, అవుతి సంతోషం, బసవ వెంకట ఉమామహేశ్వరరావు, భూక్యా రమణతేజ, చెరుకుమిల్లి రాధిక, ఈడే రామకృష్ణ, గరిమెళ్ల నాగమణి, కంఠమనేని చైతన్య, మైలపల్లి అప్పలరాజు, పితాని పద్మావతి, చుండూరి వెంకటఅరుణ్‌కుమార్, కొర్రా అపర్ణ, సుగసాని రత్నశ్రీలను నియమించారు.

## జిల్లాలో పలు చోట్ల వర్షం

**ఎన్టీఆర్ కలెక్టరేట్:** రెండు రోజుల విరామం తర్వాత జిల్లాలోని పలు చోట్ల వర్షం కురిసింది. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. జి.కొండూరు 14.4 మి.మీ., విజయవాడ గ్రామీణ 9.2, విజయవాడ సెంట్రల్, పశ్చిమ 8.2, విజయవాడ తూర్పు 8, విజయవాడ ఉత్తరం, కంచికచర్ల 7.8, ఇబ్రహీంపట్నం 7.6, చందర్లపాడు 3.6, వీరులపాడులో 3.2 మి.మీ. మేర వర్షం పడింది.

# ‘తల్లికి వందనం’తో తల్లుల సంతోషం

**వినగడప (గంపలగూడెం), న్యూస్‌టుడే:** ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ప్రతి కుటుంబంలో చదువుకుంటున్న పిల్లలందరికీ ‘తల్లికి వందనం’ అమలు చేసినట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం తమ పిల్లల చదువులకు ఎంతో ఉపయుక్తంగా ఉందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వినగడపలో పల్లె స్తుతి చెందిన జడ్పీ ఉన్నత పాఠశాలను, తెదేపా నేత మాజీ ఎంపీపీ కోటగిరి శ్రీనివాసరావు, తన తండ్రి రంగస్వామి జ్ఞాపకార్థం నిర్మించిన కళా వేదికను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. శివాల దేవదత్, ఏఎంసీ ఛైర్‌పర్సన్ ఆర్.లక్ష్మీలత తదితరులు పాల్గొన్నారు.

# తిరువూరు

• తిరువూరు • మైలవరం

## అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ ఆశయాలు అనుసరణీయం

**పోలిశెట్టిపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఆలోచనలు, ఆశయాలు అనుసరణీయమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పోలిశెట్టిపాడులో ఏర్పాటు చేసిన అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఎంపీ, ఎమ్మెల్యే మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. సమాజం కోసం ఎంతోకొంత తిరిగి ఇవ్వాలన్న అంబేడ్కర్ నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని సీఎం చంద్రబాబు పీ4 విధానం తీసుకొచ్చారని ఎంపీ అన్నారు. నియోజకవర్గంలో త్వరలో నిర్వహించే పీ4 సభకు చంద్రబాబు వస్తున్నారన్నారు. వి.మునియ్య, బి.చిట్టిబాబు, జి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాస్ పుస్తకం ఇప్పించండి సార్



మూలపాడు పీఏసీఎస్ వద్ద పెట్రోల్ సీసాతో నిరసన తెలుపుతున్న రైతు, కుటుంబ సభ్యులు

**ఇబ్రహీంపట్నం (గ్రామీణం), న్యూస్‌టుడే:** మూలపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి నిగ్గు తేల్చాలని రైతు కాకి జోజి మంగళవారం పెట్రోల్ సీసాతో సంఘం ముందు బైఠాయించారు. తన భూమికి సంబంధించిన పాస్ పుస్తకం తనకు ఇవ్వాలని, లేకుంటే పెట్రోలు పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు. ఆయనకు తల్లి మార్తమ్మ, మరో మహిళా రైతు సరోని మద్దతుగా నిలిచారు. తన పాస్ పుస్తకం తీసుకుని ఇబ్బందులు పెడుతున్నారని గత సంవత్సరం సంఘం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆ రోజు గ్రామ పెద్దలు, పోలీసులు జోక్యంతో నిరసనను తాత్కాలికంగా విరమించారు. ఆయన కొంతకాలం కిందట సంఘంలో రూ.75 వేలు రుణం తీసుకున్నారు. ఈ రుణాన్ని రెండు నెలల కిందట చెల్లించినట్లు తెలిపారు. దీనికి సంబంధించి సంఘం ఎన్‌వోసీ ఇచ్చింది. అప్పటి నుంచి పాస్ పుస్తకం ఇవ్వకుండా తిప్పుకుంటున్నారని, దీంతో విసిగిపోయి నిరసనకు దిగినట్లు తెలిపారు. ఈ సంఘంలో విధులు నిర్వహించిన ఉద్యోగి విరమణ చేసిన ఓ ఉద్యోగి కూడా పెద్ద మొత్తంలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపించారు. వీటిపై అధికారులు స్పందించకపోవడంతో తిరిగి నిరసనకు దిగినట్లు వివరించారు. జిల్లా కలెక్టరు స్పందించి న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ విషయం తెలిసి పోలీసులు రైతుతో పాటు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న విశ్రాంత ఉద్యోగిని ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. ఈ విషయంపై ఇబ్రహీంపట్నం కేడీసీసీ బ్యాంకు పర్యవేక్షకులు సుబ్బారావు మాట్లాడుతూ రుణం చెల్లించిన వెంటనే ఎన్‌వోసీ, భూమికి సంబంధించిన దస్త్రాలు ఆయనకు ఇచ్చినట్లు సంఘంకు చెందిన రికార్డుల్లో ఉందన్నారు. విశ్రాంత ఉద్యోగి అవినీతి ఆరోపణలపై విచారణ జరుగుతుందన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం

• పట్టణంలోని ఏడో సచివాలయ పరిధి 13వ వార్డులో డ్రైనేజీలో పూడిక పేరుకుపోవడంతో స్థానికులు ‘మేమున్నాం.. మీకు తోడుగా’కు చేసిన ఫిర్యాదును పురపాలిక కమిషనర్ మనోజ్ దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి కార్మికులతో పూడిక తీయించారు. • పట్టణంలోని ఏడో సచివాలయం పరిధిలో 19వ వార్డులో రజక బజార్‌లో డ్రైనేజీలో పూడిక పేరుకుపోయిందని స్థానికులు ‘మేమున్నాం..మీకు తోడుగా’కు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి పురపాలిక కార్మికులతో డ్రైనేజీలో పూడిక తొలగించారు. • పట్టణంలోని 18వ వార్డులో మసుముల్లా రహదారిలో డ్రైనేజీలో పూడిక పేరుకుపోయినట్లు స్థానికులు ‘మేమున్నాం..మీకు తోడుగా’కు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి, కార్మికులతో పూడిక తీయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు

? కుంటముక్కల గ్రామంలో రోడ్డు పక్కనే శ్మశానవాటికలో పంచాయతీ బోరు పాడై నీటి సరఫరా నిలిచిపోయింది. - వంశీ, గ్రామస్థుడు ✔ తక్షణమే మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరిస్తాం. - మురళీ, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, జి.కొండూరు

## నేడు పవిత్ర సంగమం వద్ద జలహారతి

**ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే:** జలహారతిలో భాగంగా ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద బుధవారం ఉదయం 7 గంటలకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జలవనరుల శాఖ మంత్రి కార్యాలయ సిబ్బంది తెలిపారు. మంత్రి నిమ్మల రామానాయుడు, వివిధ శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొంటారని ప్రకటించారు.

## విద్యుత్తు సరఫరాలో అంతరాయం

**కొండపల్లి, న్యూస్‌టుడే:** విద్యుత్తు నిర్వహణ పనుల నిమిత్తం కొండపల్లిలో బుధవారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పవిత్రారాణి తెలిపారు. అప్పల్ వద్ద సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్తు నిర్వహణ పనులు నిర్వహిస్తున్నామన్నారు. అందువల్ల ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఖిల్లా రోడ్డు, కొత్తగేటుతో పాటు అనేక ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని చెప్పారు.

# బాబోయ్ కుక్కలు.. పట్టేస్తున్నాయ్ పిక్కలు

★ **కొండపల్లి పాట్టి శ్రీరాములు మార్కెట్‌లో** గత నెల 12న వస్తువులు కొనుగోలు చేయడానికి వచ్చిన మోక్షజ్ఞపై కుక్క దాడి చేయడంతో చెంపపై గాయాలయ్యాయి.

★ **కొండపల్లి బ్యాంకు కూడలిలో** మరో బాలుడిపై గత నెల చివర్లో మరో కుక్క దాడి చేసి నడుము వద్ద గాయపరిచింది.

★ **ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద** వాకింగ్ చేస్తున్న ఓ విశ్రాంత ఉద్యోగిని కుక్క వెనుక నుంచి వచ్చి గాయపరిచింది. మూడు చోట్ల గాయాలయ్యాయి.



కుక్క దాడిలో గాయపడిన బాలుడు

న్యూస్‌టుడే, కొండపల్లి

**కొం**డపల్లి పురపాలికలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. పురపాలిక శాంతినగర్, బి.కాలనీ, ఎస్టీకాలనీ, ఈలప్రోలు రోడ్డు, ఖిల్లా రోడ్డుతో పాటు ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ ప్రాంతం, దుర్గాకాలనీ, ఫెర్రీ, ప్రసాద్ నగర్, ఖాజీమాన్యం వద్ద ఎక్కడ చూసినా శునకాలే. వీటి తాకిడికి ఉదయం, రాత్రివేళల్లో చిన్నారులు, మహిళలు సైతం బయటకు రావడానికి భయపడుతున్నారు. పురపాలిక అధికారులకు ఈ విషయంపై స్థానికులు అనేకసార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఆరు నెలల కిందట ఓ బృందం ద్వారా 28 శునకాలు పట్టుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకూ మళ్లీ ఆ పనిని పురపాలిక అధికారులు చేయలేదు.

**భయంలో బాధితులు..** కుక్కకాటు సంభవించిన తరవాత కొన్ని సందర్భాల్లో కుక్కలు చనిపోతున్నాయి. ఇలాంటి ఘటనలు గత నెలలోనే పురపాలిక పరిధిలో రెండు చోట్ల చేసుకొన్నాయి. కుక్కలు చనిపోతే తమకు తీవ్ర అనారోగ్యం సంభవిస్తుందని బాధితులు భయపడుతున్నారు.

**కేసులు ఇలా..**

| పీహెచ్‌సీలు | ఏప్రిల్ 25 | మే 25 | జూన్ 25 |
|---|---|---|---|
| కొండపల్లి | 12 | 14 | 18 |
| ఇబ్రహీంపట్నం | 9 | 11 | 13 |

**రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది: వైద్యులు రాథోడ్**

కుక్క కాటు కేసులు పీహెచ్‌సీకి అధికంగానే వస్తున్నాయి. వాటిల్లో టీకాలకు కొరత లేదు. టీకాలు తీసుకున్న బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కుక్కలకు అనేక రకాల వ్యాధులు ఉంటాయి. కుక్కకాటు జరిగిన తరవాత అవి చనిపోయినా భయపడాల్సిన పనిలేదు. వాటి నివారణకే రేబిస్ వ్యాక్సిన్ ఇస్తున్నాం. వయస్సును బట్టి 3 నుంచి 5 ఇంజెక్షన్లు ఇస్తాం.

**అధికారుల ఆదేశాలతో చర్యలు: మేనేజర్ వెంకటరత్నం**

కుక్కల సంతతి తగ్గించడానికి ఓ టీం ఉంది. వారి పర్యవేక్షణలో వాటిని పట్టుకొని శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ ప్రక్రియ నిర్వహిస్తాం.

## రాష్ట్ర స్థాయి పోటీలకు పుల్లూరు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు, వ్యాయామ ఉపాధ్యాయుడు

**మైలవరం, న్యూస్‌టుడే:** మండలంలోని పుల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఐదుగురు బేస్ బాల్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎ.కుసుమకుమారి తెలిపారు. ఆదివారం కృష్ణా జిల్లా నాగాయలంకలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు ఎం.వెంకటర్రావు, ఎస్.సాక్షి థామ్సన్, బి.వినయ్‌కుమార్, అభినవ్, పి.కార్తీక్ సత్తా చాటినట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 12న అనంతపురంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్తిపాటి శ్రీనివాసరావు, పల్లప విద్య కమిటీ ఛైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

## గుంతల దారి.. నరకంగా మారి..

జాతీయ రహదారి-30 నుంచి కుంటముక్కల గ్రామంలోకి వెళ్లే ప్రధాన అనుసంధాన రహదారి గుంతలు పడి ప్రయాణానికి నరక ప్రాయంగా మారింది. దాదాపు కిలోమీటరు మేర ఉన్న రోడ్డు తారు మొత్తం కోల్పోయి రాళ్లు పైకి తేలి వాహన చోదకులను ఇబ్బందులకు గురిచేస్తోంది. మొనదేలిన రాళ్ల వల్ల వాహనాలు జారి పడిపోవడం, తరచుగా టైర్లు పంక్చర్లు పడి నానా



తంటాలు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు.

- జి.కొండూరు, న్యూస్‌టుడే



రైతు పొలంలో మామిడి మొక్కలు నాటుతున్న ఎం.నాగేశ్వరరెడ్డి, అధికారులు, తెదేపా నాయకులు

## పండ్ల తోటలతో ఆదాయం పొందాలి

**రెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** రైతులు పండ్లతోటలు పెంచి మంచి ఆదాయం పొందాలని తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు ఎం.నాగేశ్వర రెడ్డి అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల పొలాల్లో పండ్ల తోటల పెంపకాన్ని మంగళవారం ప్రారంభించారు. ఉపాధిహామీ పథకం ద్వారా అందించే సదుపాయాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రభాకరరావు, రెడ్డిగూడెం పంచాయతీ ఉపసర్పంచి కె.వెంకటేశ్వరరావు(బాబు), తెదేపా నాయకులు జె.వేణుగోపాలరెడ్డి, సీహెచ్.చందా, సోమేశ్వరరావు రైతులు పాల్గొన్నారు.

## ఆధునికీకరణ పనుల తనిఖీ

**తిరువూరు, న్యూస్‌టుడే:** ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం అమలు చేయనున్న నేపథ్యంలో తిరువూరు ఆర్టీసీ డిపోలోని బస్సులను సిద్ధం చేయాలని, సిబ్బంది కూడా సేవలు అందించేందుకు సన్నద్ధంగా ఉండాలని విజయవాడ జోన్-2 ఈడీ జి.విజయరత్నం సూచించారు. తిరువూరు ఆర్టీసీ డిపోలో జరుగుతున్న ఆధునికీకరణ పనులను మంగళవారం డీపీటీవో ఎంవై దానం, ఈఈ రాజశేఖర్‌తో కలిసి పరిశీలించారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న డీఎం కార్యాలయం, విచారణ కేంద్రం, మహిళా కండక్టర్ల విశ్రాంతి గది, గ్యారేజీ సిబ్బంది భోజనశాల, సెక్యూరిటీ గది, గ్యారేజీలో పలు విభాగాలను వారు చూశారు. పనుల్లో చేర్పులు, మార్పులపై పలు సూచనలు చేశారు. తదుపరి విస్సన్నపేట బస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. తిరువూరు డిపో మేనేజర్ ఎ.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న అధికారులు

# తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలకు ఏర్పాట్లు

**గంపలగూడెం, విస్సన్నపేట, తిరువూరు, ఎ.కొండూరు, న్యూస్‌టుడే:** తిరువూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గురువారం మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే వాటి నిర్వహణపై ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తల్లిదండ్రులకు విద్యార్థుల ద్వారా ఆహ్వాన పత్రాలు పంపిస్తున్నారు. పాఠశాల, విద్యార్థి ప్రగతి పత్రాలను సిద్ధం చేస్తున్నారు. గ్రామాల్లో పెద్దలు, దాతలు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించనున్నారు. ఈ ఏడాది జూనియర్ కళాశాలల్లో కూడా మెగా తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. అదే రోజు 1 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు హోలి స్టిక్ కార్డులు (ప్రగతి నివేదిక) పంపిణీ చేస్తారు.

**వివరాలు ఇలా..** తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలు 243, విద్యార్థులు 13,606, ప్రైవేటు విద్యాలయాలు 43, విద్యార్థులు 14,603 ఉన్నారు. నాలుగు మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు 15 వరకు ఉండగా 5 వేల మంది వరకు విద్యార్థులు ఉన్నారు.

★ రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్.. విద్యాలయాల్లో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. విద్యార్థుల భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలనే లక్ష్యంతో నిర్వహించే మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాల నిర్వహణకు 31 అంశాలను పొందుపరిచి 19 కమిటీలను ఏర్పాటు చేశారు. పాఠశాల నిధి(స్కూల్ గ్రాంట్) నుంచి 20 శాతం వరకు సమావేశాల నిర్వహణకు ఖర్చు చేయొచ్చు. తల్లిదండ్రుల హాజరుపై వివిధ శాఖల ఉద్యోగులతో సాక్ష్యం కూడా తీసుకుంటారు.

**ఆహ్వానాలు పంపుతున్న అధికారులు**



తెల్లదేవరపల్లిలో తల్లిదండ్రులను ఆహ్వానించాలని విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈవో సుధాకర్

**పండగ వాతావరణంలో..**

ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు ఆహ్వానాలు పంపిస్తున్నాం. పండగ వాతావరణంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు సమావేశాలు నిర్వహిస్తాం.

- ఎ.శ్యామ్‌సుందరరావు, ఎంఈవో తిరువూరు మండలం



తిరువూరు: ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు

## చట్టాలు రద్దు కోరుతూ ఆందోళన

**తిరువూరు, న్యూస్‌టుడే:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయనున్న నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ సీపీఐ, ఏఐటీయూసీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం తిరువూరులో ఆందోళన చేశారు. బుధవారం నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ప్రదర్శన చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో నిర్వహించిన ఆందోళనలో నాయకులు టి.కృష్ణయ్య, ఎస్కే నాగుల్‌మీరా, ఎం.ఉదయ్, సుభాని, గురుబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె విజయవంతానికి పిలుపు



కార్మికులతో కలిసి సీఐటీయూ నాయకుల నినాదాలు

**మైలవరం, న్యూస్‌టుడే:** దేశవ్యాప్త సమ్మెను కార్మిక, కర్షక సంఘాలు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ సుధాకర్ కోరారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి సమ్మెపై నినాదాలు చేశారు. సమస్యల పరిష్కారం కోసం బుధవారం జరిగే సమ్మెకు అంతా కలిసి రావాలని సూచించారు. కార్మిక సంఘ నాయకులు వీరమ్మ, శివ, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు: ఎంపీ

**జి.కొండూరు, న్యూస్‌టుడే:** కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతోందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. మండలంలోని చెవుటూరు గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ఆయన ఇంటింటికి తిరిగి కూటమి చేపట్టిన పథకాలను వివరించారు. ప్రస్తుతం సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీసి భవిష్యత్తులో అమలు చేసే పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో జంపాల సీతారామయ్య, ధారూనాయక్, ఉయ్యూరు వెంకటనరసింహారావు, పజ్జూరు రవికుమార్, లంకా రామకృష్ణ, ఉమ్మడి వెంకటస్వామి, పామర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సంక్షేమ పత్రాన్ని అందజేస్తున్న కేశినేని శివనాథ్(చిన్ని), జంపాల సీతారామయ్య తదితరులు

## ‘వైకాపా నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలి’

**గొల్లపూడి, న్యూస్‌టుడే:** వైకాపా నాయకులు నోటిని అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, మహిళలను కించపరిచేలా మాట్లాడితే సహించేది లేదని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గొల్లపూడిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు శాసన సభ్యురాలు ప్రశాంతిరెడ్డిపై వైకాపా నాయకుడు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అసభ్యకర వ్యాఖ్యలను చేయడం తగదన్నారు. మహిళల గౌరవానికి భంగం కలిగించేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ విషయంలో సుమోటోగా కేసు నమోదు చేయాలన్నారు. వైకాపా నాయకులకు అసభ్యకరంగా వ్యాఖ్యలు చేయటం పరిపాటిగా మారిందని, అలాంటి వారికి మహిళా సమాజం తగిన సమాధానం చెబుతుందన్నారు.



గొల్లపూడిలో దేవినేని ఉమా ప్రచారం

## మత్తు పదార్థాలు నిషేధించాలి

**జి.కొండూరు, న్యూస్‌టుడే:** బాలలు మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు బానిసలు కాకుండా తగిన చర్యలు చేపట్టాలని నవజీవన్ బాలల సదన్ సంస్థ ప్రతినిధి డాక్టర్ విజయ్‌కుమారి పేర్కొన్నారు. వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో ఆశాలు, ఆరోగ్య సిబ్బందికి మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

**భవానీపురం:** రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడినట్లు భవానీపురం స్టేషన్ పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ..గొల్లపూడి ఎస్సీ కాలనీకి చెందిన జి.రాజు ఈనెల 6వ తేదీ రాత్రి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా నవీన్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంతో ఢీకొట్టాడు. దీంతో గాయపడిన రాజును సమీపంలోని ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నాడు. భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వివాహమైన ఐదు రోజులకే అదృశ్యం

**చిట్టినగర్, న్యూస్‌టుడే:** వివాహమైన ఐదు రోజులకే మహిళ అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బ్రైజర్‌పేటకు చెందిన వ్యక్తి ఈనెల 2న ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈనెల 6న నూతన వరుడు నిద్రపోతుండగా వధువు తనకు ఫోన్ వచ్చిందని అత్తకు చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయింది. తిరిగి ఆమె ఎంతకీ రాకపోవడంతో కొడుకుని నిద్ర నుంచి లేపి కోడలు కనిపించడం లేదని చెప్పింది. అన్ని చోట్ల ఆరా తీసినా ఆచూకీ తెలియ లేదు. ఈమేరకు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

## విగ్రహావిష్కరణ

**పెదకొమిర (గంపలగూడెం), న్యూస్‌టుడే:** తెదేపా బలోపేతానికి పెదకొమిర మాజీ సర్పంచి ఇనుగంటి బలరాంబాబు అంకిత భావంతో కృషి చేశారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) పేర్కొన్నారు. ప్రథమ వర్ధంతి సందర్భంగా గ్రామ ఎస్సీ వాడ వద్ద ఏర్పాటు చేసిన బలరాంబాబు విగ్రహాన్ని ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. అంతకుముందు కట్లేరుపై వంతెన నిర్మించే ప్రదేశాన్ని పరిశీలించారు. పెదకొమిరలో ఎంపీ విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ, వచ్చే నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. త్వరలోనే నిరుద్యోగ భృతి అందిస్తామని చెప్పారు. వైకాపా అధినేత జగన్.. గంజాయి బ్యాచ్, రౌడీలతో తిరుగుతున్నారని ఆరోపించారు. ఆ పార్టీ నాయకులు ప్రజల్లో లేరన్నారు. జగన్ తాను ప్రయాణిస్తున్న కారుతో వ్యక్తిని తొక్కించి మానవత్వం లేకుండా పక్కకు నెట్టేశారని విమర్శించారు.

## రాజశేఖరరెడ్డికి నివాళి

**గంపలగూడెం, న్యూస్‌టుడే:** తిరువూరు నియోజకవర్గంలో వైకాపా నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. తిరువూరులో వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లగట్ల స్వామిదాసు, గంపలగూడెంలో వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో కేకులు కోసి, మిఠాయిలు పంచారు.

**కొండపల్లి, ఇబ్రహీంపట్నం, మైలవరం, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే:** సంక్షేమ పథకాలతో రాజశేఖరరెడ్డి పేరు రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ అన్నారు. కొండపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజశేఖరరెడ్డి జయంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. • ఇబ్రహీంపట్నం రింగుకూడలిలో వైకాపా నేత జోగి రమేష్ ఆధ్వర్యంలో కేక్ కోసి పంపిణీ చేశారు. • మైలవరం ఎల్ హెచ్ కాంప్లెక్స్ మూడు బొమ్మల కూడలిలో వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. కేక్ కోసి పంచారు. సీనియర్ నాయకులు అప్పిడి సత్యనారాయణరెడ్డి, పామర్తి శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్‌రెడ్డి, వెంకట్రావు, నారాయణరెడ్డి, ఎంపీపీ ప్రసన్న రాణి పాల్గొన్నారు. • మైలవరంలో కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, గిరికుమార్, సుధాకర్, దుర్గారావు తదితరులు వైఎస్‌కు నివాళులు అర్పించారు. • రెడ్డిగూడెం మండలంలోని ఆయా గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుదప గ్రామంలో జడ్పీటీసీ సభ్యుడు పి.విజయభాస్కరరెడ్డి కేక్ కోశారు. వైఎస్సార్ సేవలను కొనియాడారు. • కేతనకొండ గ్రామంలో వైఎస్సార్ జయంతిని నిర్వహించారు. ఉమ్మడి కృష్ణా జడ్పీ ఉపాధ్యక్షురాలు గరికపాటి శ్రీదేవి వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు.



తిరువూరులో నివాళులర్పించిన స్వామిదాసు, వైకాపా నాయకులు

## అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

**ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే:** దసరాకు ఇబ్బంది లేకుండా అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఈవో శీనానాయక్ సూచించారు. దేవస్థానం రూ.75 కోట్లతో చేపట్టిన ప్రసాదాల పోటు, అన్నదాన భవనం, ఎలివేటెడ్ క్యూలైన్ల నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ సెప్టెంబరు మొదటి వారానికల్లా పనులు పూర్తి చేయాలన్నారు. దసరా ఉత్సవాల్లో నిర్మాణంలో ఉన్న భవనాలను వినియోగించుకునేందుకు వీలుగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ కోటేశ్వరరావు, డీఈలు రవీంద్ర, అశోక్ పాల్గొన్నారు.

## అలరించిన కూచిపూడి నృత్యం

**ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే:** ఇంద్రకీలాద్రిపై ధర్మపథం కార్యక్రమంలో భాగంగా విజయవాడకు చెందిన శ్రీరాజేశ్వరి నృత్యాలయ విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను మంగళవారం అలరించింది. శాకంబరిదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను దర్శించుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. దేవస్థానం సిబ్బంది నృత్య కళాకారులకు ఆలయమర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు.

## విద్యార్థులకు దంత పరీక్షలు

**తిరువూరు, న్యూస్‌టుడే:** లయన్స్ సమత, లెజెండ్ క్లబ్బుల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు దంత వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ శ్రీరంగం లక్ష్మణరావు పాల్గొని పరీక్ష చేశారు. కళాశాల ప్రిన్సిపల్ జీవీ లక్ష్మీ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పి.వెంకటేశ్వరరావు, డీజే నరసింహారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



దంత పరీక్షలు చేయించుకుంటున్న బాలికలు


వాగులోకి దిగుతున్న పాఠశాల విద్యార్థులు


చిన్నారులను వాగు దాటిస్తున్న గ్రామస్థుడు


పొలాల గట్లపై నుంచి వెళుతూ..

# చదువుకునేందుకు.. కష్ట'బడి' వెళుతున్నారు!

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆ ఊరిలోని పాఠశాలను మూసివేయడంతో.. విద్యార్థులంతా ఇలా వాగు దాటుతూ, పొలం గట్లపై పడుతూ లేస్తూ.. రెండు కిలోమీటర్ల దూరంలోని బడికెళ్లి చదువులు సాగిస్తున్నారు. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం అల్లూరినగర్‌లోని పరిస్థితి ఇది. మరుగుదొడ్లు, మంచి నీటి సౌకర్యాలు లేకపోవడంతో ఆ గ్రామంలోని పాఠశాలను కొన్నేళ్ల కిందట మూసివేశారు. దీంతో గ్రామంలోని సుమారు 20 మంది విద్యార్థులు రెండు కిలోమీటర్ల దూరంలోని ఒంటిబండ పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. మార్గమధ్యంలో పొలాలు, వాగులు దాటుకుంటూ ఇబ్బంది పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద వాగు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. దీన్ని దాటేటప్పుడు విద్యార్థులు సాహసం చేయాల్సి వస్తోంది. సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. "బడికి వెళ్లిన చిన్నారులు తిరిగి గ్రామానికి చేరుకునే వరకు వారి కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. వర్షాకాలం నేపథ్యంలో వాగులు దాటించి బడికి పంపాలంటే భయమేస్తోంది. అధికారులు స్పందించి గ్రామంలోని పాఠశాలలోనే సౌకర్యాలు కల్పిస్తే బాగుంటుంది" అని అల్లూరినగర్ గ్రామస్థుడు ఇందూరి శ్రీనివాసు తెలిపారు. 'అల్లూరినగర్‌లోని పాఠశాలలో సౌకర్యాలు ఏర్పాటు చేసి.. పునఃప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం" అని డీవైఈవో కుమార్ తెలిపారు.

## డీపీహెచ్‌గా పద్మాశశిధర్ నియామక ఉత్తర్వుల రద్దు

### విమర్శల నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం

ఈనాడు, అమరావతి: డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీపీహెచ్)గా డాక్టర్ పద్మాశశిధర్ నియామక ఉత్తర్వులను ప్రభుత్వం రద్దు చేసింది. దాంతో ప్రస్తుతం డీపీహెచ్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ పద్మావతే ఆ పోస్టులో కొనసాగుతారు. రాజమహేంద్రవరంలో వైద్యారోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకులుగా పనిచేస్తున్న పద్మాశశిధర్‌ను డీపీహెచ్‌గా నియమిస్తూ గత నెలలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అయితే, ఆమె కాకినాడ వైకాపా మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి బంధువని, రాజకీయ పరపతితో కీలక స్థానంలోకి వస్తున్నారనే విమర్శలు సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తాయి. మరోవైపు ఆరోగ్యం బాగాలేక బాధ్యతల స్వీకరణకు పద్మాశశిధర్ కొంత గడువు కోరారన్న వాదనలూ వినిపించాయి. ఓ వైపు విమర్శలు, మరోవైపు ఉత్తర్వులు వెలువడి రెండు వారాలైనా పద్మాశశిధర్ బాధ్యతలు స్వీకరించకపోవడంతో గతంలో జారీచేసిన బదిలీ ఉత్తర్వులను ప్రభుత్వం పునఃపరిశీలించి తాజా నిర్ణయం తీసుకుంది.

## ఐఐటీ మద్రాస్ సహకారంతో క్వాంటమ్ కంప్యూటింగ్‌పై శిక్షణ

- తొలుత 500 మంది అధ్యాపకులకు
- ప్రణాళిక రూపొందించిన ఉన్నత విద్యామండలి

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వం వచ్చే జనవరిలో రాష్ట్రంలో 'క్వాంటమ్ వ్యాలీ'ని అందుబాటులోకి తీసుకురానున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఉన్నత విద్యామండలి సిద్ధమవుతోంది. ఐఐటీ మద్రాస్, ఐఐటీ తిరుపతి, కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిపార్టుమెంట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ(డీఎస్టీ) సహకారంతో ప్రత్యేక ల్యాబ్‌ల ఏర్పాటు, అధ్యాపకులకు శిక్షణ ఇప్పించేందుకు ప్రణాళిక రూపొందించింది. క్వాంటమ్ కంప్యూటింగ్ సాంకేతికతలో విద్యార్థులను నిపుణులుగా తయారు చేస్తే ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టింది. అందుకు డిసెంబరులోపు రాష్ట్ర వ్యాప్తంగా 500 మంది అధ్యాపకులకు శిక్షణ ఇప్పించనుంది. అనంతరం వీరు మిగతా అధ్యాపకులకు శిక్షణ ఇస్తారు. దీనికి ఐఐటీ మద్రాస్ సహకారం అందించనుంది.

◆ విశ్వవిద్యాలయాలు, స్వయంప్రతిపత్తి కలిగిన తొమ్మిది కళాశాలల్లో ప్రత్యేక ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తారు. ఒక్కో ల్యాబ్ ఏర్పాటుకు రూ.55 లక్షల వరకు నిధులు అందించేందుకు డీఎస్టీ అంగీకారం తెలిపింది. ఇప్పటికే ఆచార్య నాగార్జున, జేఎన్‌టీయూ-కాకినాడ, ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రతిపాదనలు సమర్పించాయి.

◆ అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఇప్పటికే క్వాంటమ్ కంప్యూటింగ్‌పై సిలబస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో పాటు ఐఐటీ మద్రాస్ అందించే సిలబస్‌నూ అందులో చేర్చనున్నారు.

◆ బీటెక్‌లో మైనర్ డిగ్రీగా క్వాంటమ్ కంప్యూటింగ్‌ను రెండో ఏడాదిలో ప్రవేశపెడతారు. డిగ్రీలోనూ మూడో సెమిస్టర్ నుంచి తీసుకొస్తారు.

◆ డిగ్రీ విద్యార్థులకు మూడో సెమిస్టర్‌లో ప్రాథమిక అవగాహన కల్పించేలా పాఠాలు రూపొందిస్తారు. ఆ తర్వాత నుంచి ఒక్కో స్థాయి పెంచుతూ పాఠాలు ఉండేలా సిలబస్ తీసుకొస్తారు.

◆ ఐబీఎం సంస్థ ఆధ్వర్యంలో అమరావతిలో క్వాంటమ్ సిస్టం-2ను అందుబాటులోకి తీసుకువచ్చేలోపు అధ్యాపకులకు శిక్షణ, వర్సిటీల్లో ప్రయోగశాలలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటారు.

## సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన క్వాంటమ్ వ్యాలీకి భూమి


క్వాంటమ్ వ్యాలీకి కేటాయించిన భూమి

ఈనాడు, అమరావతి: దేశానికే తలమానికమైన క్వాంటమ్ వ్యాలీ నిర్మాణానికి రాజధాని అమరావతిలో అడుగులు పడుతున్నాయి. రూ.4 వేల కోట్లతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు కోసం ఉద్దండరాయునిపాలెం, లింగాయపాలెం మధ్య సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన ప్రభుత్వం 50 ఎకరాలను కేటాయించింది. ఈ స్థలంలో మట్టి పరీక్షలు నిర్వహించారు. జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తయ్యాయి. ఈ-3 రోడ్డు.. ఎన్-10 రోడ్డు అనుసంధానమయ్యే ప్రాంతంలో ప్రాజెక్టు రానుంది. క్వాంటమ్ వ్యాలీలోని ఐకానిక్ భవనం కోసం డిజైన్లు తయారవుతున్నాయి. ఇప్పటికే సిద్ధమైన వాటిలో సీఎం చంద్రబాబు పలు మార్పులు సూచించారు. దీంతో నమూనాకు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఇది ఖరారైన తర్వాత టెండర్లు పిలిచి గుత్తేదారుడిని ఎంపిక చేయనున్నారు.

### పీపీపీ విధానంలో కొత్త కలెక్టరేట్ల నిర్మాణాలు?

ఈనాడు-అమరావతి: కొత్త జిల్లా కేంద్రాల్లో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనాల నిర్మాణాలను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో చేపట్టే విషయాన్ని కూటమి ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ విధానంలో ముందుకు వచ్చే సంస్థలు ప్రభుత్వ అవసరాలకు తగ్గట్లు నిర్మాణాలు చేపడతాయి. కలెక్టరేట్‌తోపాటు వాణిజ్య సముదాయాలు, విద్యా సంస్థలు కూడా నిర్మించే అవకాశం ఉంది. ఇదే జరిగితే ఈ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించాల్సిన అవసరం కూడా తగ్గుతుంది. ఒక్కో కలెక్టరేట్ నిర్మాణానికి రూ.100 కోట్ల వరకూ వ్యయమవుతుందని అంచనా. వైకాపా ప్రభుత్వం హడావుడిగా కొత్త జిల్లాలను ప్రకటించిందే తప్ప కలెక్టర్ కార్యాలయాల నిర్మాణాల విషయం పట్టించుకోలేదు. దీంతో కొత్త జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాలు అరకొర వసతులతో నడుస్తున్నాయి.

## పాఠశాల వ్యాన్‌ను ఢీకొట్టిన రైలు

### తమిళనాట ముగ్గురు విద్యార్థుల మృతి

చెన్నై(వేళచ్చేరి), న్యూస్‌టుడే: తమిళనాడులో పాఠశాల వాహనాన్ని రైలు ఢీకొనడంతో ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. ఇద్దరు గాయపడ్డారు. కడలూర్‌లోని ప్రైవేటు పాఠశాల వ్యాన్ మంగళవారం నలుగురు విద్యార్థులతో ఆలపాక్కం నుంచి బయల్దేరింది. ఉదయం 7.45 గంటలకు కడలూర్ సమీప చెమ్మగుప్పం ప్రాంతంలో రైల్వే గేటు దాటుతుండగా విళుపురం-మైలాడుదురై ప్యాసింజర్ రైలు ఢీకొని.. 50 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లింది. ప్రమాదంలో వ్యాన్ నుజ్జునుజ్జయింది. తొండమానత్తం ప్రాంతానికి చెందిన నిమిలేష్(12), చిన్న కాట్టుసాలై ప్రాంతానికి చెందిన చారుమతి(16) అక్కడికక్కడే మృతి చెందారు. చిన్నకాట్టుసాలైకు చెందిన చెళియన్(15), తొండమానగర్‌కు చెందిన విశ్వేష్(16), డ్రైవర్ శంకర్(47) గాయపడగా కడలూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇందులో చెళియన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. చారుమతి, చెళియన్ అక్కాతమ్ముడు కావడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. సమయానికి గేటు వేయకపోవడంతో ఘటన జరిగిందని దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. గేట్ కీపర్‌ను సస్పెండ్ చేశారు. మరోవైపు ప్రమాద స్థలానికి వెళ్లిన స్థానికుడు అన్నాదురై అక్కడ పడిఉన్న విద్యుత్తు తీగను తొక్కి ఆసుపత్రి పాలయ్యారు.


నుజ్జునుజ్జయిన వ్యాన్


కారును పరిశీలిస్తున్న సిబ్బంది

స్మోక్ మీటర్‌లో కనిపిస్తున్న రీడింగ్

## పొగవాహనంలో వస్తే శ్రీవారి దర్శనం లేనట్లే!

తిరుమలలో శ్రీవారి దర్శనానికి కనుమదారిలో వచ్చే ప్రైవేటు కార్లు 8 వేల వరకూ ఉంటున్నాయి. సప్తగిరుల్లో వాయు కాలుష్యం అంతకంతకూ పెరుగుతుండటంతో టీటీడీ పరిమితులకు మించి పొగ వెదజల్లే కార్లను గుర్తించి వెనక్కి పంపేయాలని తితిదే నిర్ణయించింది. అలిపిరిలో తనిఖీ కేంద్రం ఏర్పాటు చేసి, పొల్యూషన్ సర్టిఫికెట్ లేనివాటిని, పొగ ఎక్కువగా వదులుతున్న వాటిని ర్యాండమ్‌గా తనిఖీ చేయిస్తోంది. స్మోక్ మీటర్‌లో ఉద్గారాలు 4.0కు మించిఉంటే వెనక్కు పంపుతున్నట్లు ఇక్కడి సిబ్బంది వెల్లడించారు. – ఈనాడు, తిరుపతి

## సీసీ కెమెరాల ఏర్పాటు విషయంలో డీఎస్పీల నివేదికపై హైకోర్టు సందేహం

- వాస్తవికతను తేల్చేందుకు అడ్వొకేట్ కమిటీని వేస్తామని వెల్లడి
- ఇంకా ఎన్ని కెమెరాలు ఏర్పాటు చేయాలో చెప్పండి
- రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని పోలీసుస్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, రాజాలోపలి ప్రాంగణం మొత్తం కనిపిస్తుందని డ్రువీకరిస్తూ డీఎస్పీలు నివేదిక ఇవ్వడం, అవి అన్నీ ఒకే విధంగా ఉండటంపై హైకోర్టు సందేహం వ్యక్తంచేసింది. కొన్ని జిల్లాలకు సంబంధించిన నివేదికల్లో నోడల్ అధికారుల సంతకాలు లేవని, వారి తరఫున ఇతరులు సంతకం చేశారని ఆక్షేపించింది. డీఎస్పీలు సమర్పించిన నివేదికల వాస్తవికతను తేల్చేందుకు అడ్వొకేట్ కమిటీని ఏర్పాటు చేస్తామని, కొన్ని ఠాణాల్లో పరిశీలించి నిబంధనల మేరకు సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేశారా? లేదా అనే వ్యవహారంపై నివేదిక కోరతామని వ్యాఖ్యానించింది. ఓ హెబియస్ కార్పస్ పిటిషన్‌లో విజయవాడ మూడో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ నివేదిక పంపారని, దాని ప్రకారం విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్లో ఒక కెమెరా మాత్రమే ఉన్నట్లు పేర్కొన్నారని గుర్తుచేసింది. అందుకు భిన్నంగా విజయవాడ అసిస్టెంట్ పోలీసు కమిషనర్.. రాజా మొత్తం కనిపించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు హైకోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొన్నారని తెలిపింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఇంకా ఎన్ని పోలీసు స్టేషన్లలో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలో చెప్పాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ)కి స్పష్టం చేస్తూ విచారణను వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ జె.సుమతితో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

### లాకప్‌లున్న ఠాణాల్లో ఏర్పాటు చేశాం: ఎస్‌జీపీ

హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసు స్టేషన్లలో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయలేదని పేర్కొంటూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో కోర్టు ధిక్కరణ వ్యాజ్యం వేశారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం జరిగిన విచారణలో న్యాయవాది యోగేష్ వాదనలు వినిపిస్తూ.. రాష్ట్రంలో 1392 పోలీసుస్టేషన్లు ఉంటే 1001 ఠాణాల్లో మాత్రమే సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేశారన్నారు. ఎస్‌జీపీ విష్ణుతేజ వాదనలు వినిపిస్తూ.. సీసీ టీవీ పరికరాలు పాడైనప్పుడు ఏవిధంగా, ఎవరికి ఫిర్యాదు చేయాలనే విషయాన్ని డీజీపీ జారీచేసిన మెమోరాండంలో చేర్చామన్నారు. లాకప్‌లున్న అన్ని ఠాణాల్లో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అదనంగా ఉన్న కార్యాలయాలను వేరుచేసి ఏర్పాటు చేయలేదని, వాటిని పోలీసు స్టేషన్లుగా పరిగణించలేమన్నారు. ఈ వాదనపై ధర్మాసనం స్పందిస్తూ లాకప్‌లేని కార్యాలయాలు, పోలీసు శిక్షణ కేంద్రాలకు నిందితులను తరలించిన ఘటనలు తమ దృష్టికి వచ్చాయని పేర్కొంది. మిగిలిన 391 కార్యాలయాలు పోలీసుస్టేషన్ నిర్వచనం పరిధిలోకి వస్తాయా లేదా అన్నదానిపై వివరాలు సమర్పించాలని ఎస్‌జీపీకి సూచించింది. విచారణను వాయిదా వేసింది.

## మరో 9.51 లక్షలమంది విద్యార్థులకు 10న తల్లికి వందనం నిధుల జమ

ఈనాడు, అమరావతి: ఒకటో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంతోపాటు కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ, సీబీఎస్ఈ విద్యా సంస్థల్లో చదువుతున్న 9.51 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఈ నెల 10న ప్రభుత్వం తల్లికి వందనం నగదు జమ చేయనుంది. ఒకటో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి ఏడాది కలిపి 7,99,410 మంది విద్యార్థులకు సంబంధించి 7,84,874 మంది తల్లుల ఖాతాల్లో రూ.13 వేల చొప్పున నగదు జమ చేయనుంది. ఇటీవల వీరిని మినహాయించి మిగతా వారికి నగదు జమ చేసిన విషయం తెలిసిందే. కొంతమంది అర్హులైనప్పటికీ వివిధ కారణాలతో అనర్హులుగా తేలారు. దీంతో వారు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఫిర్యాదు చేశారు. గ్రీవెన్సులను పరిష్కరించగా అర్హులుగా తేలిన 1.34 లక్షల మందికి సైతం తల్లికి వందనం జమ చేయనున్నారు.



## తుడా వాహనాల్లో మద్యం ముడుపులు తరలించారు

- చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి అరెస్ట్ నుంచి రక్షణ కల్పించొద్దు
- హైకోర్టులో సిట్ వాదనలు
- ముందస్తు బెయిలుపై విచారణ వాయిదా

ఈనాడు, అమరావతి: తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ఛైర్మన్‌గా ఉన్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మద్యం కుంభకోణం ద్వారా వచ్చిన ముడుపులను తరలించేందుకు ఆ సంస్థ వాహనాలను వినియోగించారని సిట్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హైకోర్టులో వాదనలు వినిపించారు. విచారణ నిమిత్తం దర్యాప్తు అధికారి రెండు నోటీసులిస్తే గైర్హాజరయ్యారన్నారు. దీంతో లుకౌట్ సర్క్యులర్ జారీ చేశామన్నారు. అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వొద్దని, పూర్తి స్థాయిలో వాదనలు వినిపించేందుకు స్వల్ప సమయం కావాలని కోరారు. దీంతో విచారణను ఈ నెల 11కి వాయిదా వేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు మంగళవారం ఉత్తర్వులిచ్చారు. వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి కుమారుడు, తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి (ఏ39) మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిలు కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఆయన తరఫు న్యాయవాది దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. విచారణాధికారి ముందు హాజరయ్యేందుకు మోహిత్ సిద్ధంగా ఉన్నారన్నారు. ఓవైపు ఆయన్ను నిందితుడిగా చేర్చి.. మరోవైపు సాక్షిగా విచారణకు రావాలని నోటీసు ఇచ్చారన్నారు. అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని, బెయిల్ పిటిషన్‌పై సాధ్యమైనంత త్వరగా విచారణ జరపాలని కోరారు.

## ఇంజినీరింగ్, మెడిసిన్‌లో సీటు సాధించిన విద్యార్థులకు రూ.లక్ష చొప్పున ఆర్థిక ప్రోత్సాహకం

### సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పాలకమండలి సమావేశంలో నిర్ణయం

ఈనాడు, అమరావతి: ఐఐటీ, నీట్ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఇంజినీరింగ్, మెడిసిన్‌లో సీటు సాధించిన ఎస్సీ గురుకుల విద్యార్థులకు రూ.లక్ష చొప్పున ఆర్థిక ప్రోత్సాహకం అందించాలని అధికారులను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆదేశించారు. తాడేపల్లిలోని కార్యాలయంలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పాలకమండలి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గురుకుల విద్యార్థులకు 11 కాస్మొటిక్ వస్తువులను కిట్ రూపంలో అందించాలని నిర్ణయించారు. కొత్తగా ఏర్పాటు చేసిన 7 ఐఐటీ, నీట్ శిక్షణ కేంద్రాల్లో డిప్యుటేషన్‌పై అధ్యాపకులను నియమించుకోవాలనే నిర్ణయానికి పాలకమండలి ఆమోదం తెలిపింది. గురుకులాల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టాలని నిర్ణయించారు. ఐఐటీ, నీట్‌లో కొద్దిలో సీటు కోల్పోయిన 120 మంది విద్యార్థులకు లాంగ్ టర్మ్ కోచింగ్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రతి గురుకుల పాఠశాలలో వీడియో కాన్ఫరెన్స్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలనే నిర్ణయానికి ఆమోదం తెలిపారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వినుకొండకు చెందిన గురుకుల విద్యార్థిని సంకీర్తన కుటుంబానికి సాంత్వన పథకం కింద రూ.3 లక్షల చెక్కును ఈ సందర్భంగా మంత్రి అందించారు.

## గోవిందప్ప బాలాజీ బెయిల్ పిటిషన్‌పై తీర్పు 14న

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితుడైన భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ (ఏ-33) బెయిల్ పిటిషన్‌పై తీర్పును విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ఈ నెల 14న ప్రకటించనుంది. ఆయన బెయిల్ పిటిషన్‌పై ఇరుపక్షాల న్యాయవాదుల వాదనలు మంగళవారంతో ముగిశాయి. ఇదే కేసులో నిందితుడైన సజ్జల శ్రీధర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

## కొమ్మినేని బెయిల్ షరతుల్లో పాక్షిక సవరణ

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలకు సంబంధించిన కేసులో జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావుకు మంగళగిరి కోర్టు విధించిన షరతును హైకోర్టు పాక్షికంగా సవరించింది. తుళ్లూరు పోలీసుస్టేషన్‌కు బదులు తాడేపల్లి ఠాణాలో హాజరు అయ్యేందుకు ఆయనకు వెసులుబాటు ఇచ్చింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలపై తుళ్లూరు పోలీసులు నమోదు చేసిన కేసులో సాక్షి టీవీ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుకు సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేస్తూ.. షరతులను విధించే అధికారం ట్రయల్ కోర్టుకు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో మంగళగిరి కోర్టు.. ప్రతి నెలా రెండు, నాలుగో శనివారాలు తుళ్లూరు పోలీసు స్టేషన్లో హాజరుకావాలని కొమ్మినేని శ్రీనివాసరావుకు షరతులు విధించింది. తుళ్లూరు ఎస్‌హెచ్‌వో ముందు హాజరుకు వెళితే తనపై దాడి జరిగే ప్రమాదం ఉందని, తాడేపల్లి ఠాణాకు వెళ్లేందుకు వెసులుబాటు ఇవ్వాలని కొమ్మినేని కోరారు.

## బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి నాట్స్ రూ.85 లక్షల విరాళం


బాలకృష్ణకు చెక్కు అందిస్తున్న నాట్స్ ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి ఉత్తర అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్) రూ.85 లక్షల విరాళం అందించింది. ఈ నెల 6న అమెరికాలోని ఫ్లోరిడాలో నాట్స్ 8వ తెలుగు సంబరాల ముగింపు కార్యక్రమంలో నిర్వాహకులు బసవతారకం ఆసుపత్రి ఛైర్మన్, సినీనటుడు నందమూరి బాలకృష్ణ సమక్షంలో ఈ విరాళాన్ని అందజేశారు. ఎన్టీఆర్ గ్లోబల్ లివరేజ్ కమిటీ దాని ద్వారా 'శత పురుషుడు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సినీ నటులు, ఎమ్మెల్యేలు, నాట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బలభద్రపురానికి బసవతారకం ఆసుపత్రి భరోసా

ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ● ఎమ్మెల్యే నల్లమిల్లి


బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురంలో కేసులు వెలుగుచూస్తున్న నేపథ్యంలో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు, అమెరికన్ ఆసుపత్రి వైద్యులు గ్రామాన్ని సందర్శించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో పరిస్థితిని పరిశీలించారు. ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయిస్తామని, అవసరమైన వారికి బసవతారకం ఆసుపత్రిలో చికిత్స అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

## నేటి నుంచి డీఈఈసెట్ కౌన్సెలింగ్ వెబ్ ఐచ్ఛికాలు

ఈనాడు, అమరావతి: డీఈడీలో ప్రవేశాలకు నిర్వహించే డీఈఈసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా ఈ నెల 9 నుంచి 12 వరకు వెబ్ ఐచ్ఛికాల నమోదుకు అవకాశం కల్పించనున్నట్లు పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయరామరాజు తెలిపారు. 13 నుంచి 16 వరకు సీట్ల కేటాయింపు, 17 నుంచి 22 వరకు డైట్ కళాశాలల్లో సర్టిఫికెట్ల పరిశీలన, 25 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు.


అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

## ఇంద్రకీలాద్రిపై శాకంబరి ఉత్సవాలు


శాకంబరిగా దర్శనమిస్తున్న కనకదుర్గ

విజయవాడ (ఇంద్రకీలాద్రి), న్యూస్‌టుడే: విజయవాడ ఇంద్రకీలాద్రిపై మూడు రోజులపాటు నిర్వహించనున్న శాకంబరి ఉత్సవాలు మంగళవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఈవో శీనానాయక్‌తో స్థానాచార్య శివప్రసాదశర్మ గణపతి పూజ చేయించారు. కనకాభరణాలతో కొలువుదీరే కనకదుర్గను ఈ ఉత్సవాల్లో ప్రకృతి మాతను తలపించేలా కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, ఎండు ఫలాలతో అలంకరించారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, వ్యాపారులు అమ్మవారికి కూరగాయలు, ఆకుకూరలను అందజేస్తున్నారు. దాతలు ఇచ్చిన కూరగాయలను అలంకరణతోపాటు భక్తులకు కదంబ ప్రసాదంగా పంపిణీ చేశారు. తొలిరోజున దాతల నుంచి 15 టన్నుల కూరగాయలు వచ్చాయి. మంగళవారం అమ్మవారికి పెద్ద సంఖ్యలో భక్తులు ఆషాఢ సారె సమర్పించారు.


బారా షహీదుల సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న కడప పెద్దదర్గా పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేనీ తదితరులు

## ఘనంగా బారా షహీదుల గంధ మహోత్సవం

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: రొట్టెల పండగలో భాగంగా నెల్లూరు నగరంలోని బారా షహీదుల గంధ మహోత్సవాన్ని మంగళవారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో ఘనంగా నిర్వహించారు. కడప పెద్దదర్గా పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేనీ ఆధ్వర్యంలో ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి అమరవీరుల మహాజర్లకు లేపనం చేశారు. అనంతరం గంధాన్ని స్వర్ణాల చెరువులో కలపడంతో మూడో రోజు రొట్టెల పండగ ప్రారంభమైంది. వివాహం కావాలని యువతులు పెళ్లి రొట్టె, కొలువులు రావాలని యువత ఉద్యోగ రొట్టె, పదోన్నతి కావాలని ఉద్యోగులు, ఉన్నత విద్యనభ్యసించాలని విద్యార్థులు, సంతానం కలగాలని మహిళలు రొట్టెలు పట్టుకున్నారు. భక్తులు భారీగా రావడంతో దర్గా కిక్కిరిసిపోయింది.

## కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు బదిలీ

ఈనాడు, అమరావతి: కర్నూలు నగరపాలక సంస్థ (మున్సిపల్ కార్పొరేషన్) కమిషనర్ ఎస్.రవీంద్రబాబును ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన్ను అనంతపురం పురపాలక ప్రాంతీయ సంచాలకునిగా నియమించింది. అక్కడి ప్రాంతీయ సంచాలకులు పి.విశ్వనాథ్‌ను కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్‌గా నియమిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

● ప్రణతి కాలేజీలో చేరకముందు నుంచే తనకి కొత్త మోడల్ ఫోన్ కొనాలంటూ పేచీ మొదలుపెట్టింది. క్యాంపస్‌లో మొబైల్స్‌కి అనుమతి లేదంటున్నా... వినదే! ఈ అలవాటు ఎక్కడికి దారితీస్తుందోనని అమ్మానాన్నల భయం.

● మిథిల... నిన్న మొన్నటివరకూ సాదాసీదాగానే ఉండేది. కాలేజీలో చేరినప్పటి నుంచి ఇతరులతో పోల్చుకుంటుంది. రోజూ యూనిఫామ్ వేసుకోవాల్సి వచ్చినా, బీరువా నిండా దుస్తులున్నా... నచ్చిన కొత్త దుస్తులు కొనితీరాల్సిందేనని పట్టుబడుతుంది. కాదంటే, ఓసారి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దాంతో తనకి ఏ విషయం గట్టిగా చెప్పాలన్నా... ఆ తల్లిదండ్రులు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు.

వీళ్లే కాదు... కౌమారదశలో ఉన్న లక్షలమంది యువత రెక్కలు తొడుక్కున్న పక్షుల్లా, రంగు రంగుల సీతాకోక చిలుకల్లా స్వేచ్ఛగా తమ లోకంలో విహరించాలనుకుంటారు. దీంతో నిన్నటివరకూ తమ చాటున పెరిగిన వాళ్ల వ్యవహారశైలి అమ్మానాన్నలను కలవరపెడుతుంది. అలాగని తప్పంతా ఒకరిదే అనుకోవద్దు. మరి ఈ సమస్యకు పరిష్కారం తెలియాలంటే ఇరువర్గాలూ అర్థం చేసుకోవాల్సిన కొన్ని విషయాలు ఉన్నాయి.

# అమ్మ... అమ్మాయి... అర్థం చేసుకోండి!



## తల్లులూ గమనించండి...

**వాదించకండి:** పిల్లల్ని దారికి తెచ్చుకోవడానికి వాదనలకు దిగొద్దు. అలానే ముక్కుసూటిగా కుదరదంటే కుదరదని తేల్చేయకండి. వీలైతే కొన్నాళ్లు వాయిదా వేయండి. ప్రత్యేక పరిస్థితుల్లో కొన్ని షరతులతో ఒప్పుకోండి. అలా ఒప్పుకోవడానికి కేవలం తనపై మీకున్న ప్రేమే కారణమని చెప్పండి.

**బలవంతం వద్దు:** ఇష్టం లేని పనిని బలవంతంగా చేయించాలనుకునే కొద్దీ ప్రతిఘటిస్తారు. అలాగని వదిలేయమని కాదు, నచ్చజెప్పండి. ఎందుకు ఇష్టపడట్లేదో తెలుసుకోండి. సరైన కారణమే అయితే మీరు వెనక్కి తగ్గండి. లేదంటే ఆ పనిలో అలవాటు పడేవరకూ వారికి తోడుగా ఉండండి.

**ప్రత్యామ్నాయాలు ఇవ్వండి:** అభిప్రాయాలతో సంబంధం లేకుండా... ఇలా చేయి అలా చేయి అని చెబుతుంటే పిల్లలు అయిష్టత పెంచుకుంటారు. ఆ పనులు చేయకుండా తప్పించుకోవాలని అనుకుంటారు. అలాకాకుండా ఉండాలంటే... ప్రతి పనికీ కొన్ని ప్రత్యామ్నాయాలు ఇచ్చి ఎంచుకోమంటే సరి. వారికి ఆప్షన్ ఇచ్చినట్లూ ఉంటుంది. మీరు కోరుకున్నదీ జరుగుతుంది.

**అజమాయిషీ వద్దు:** ఎదిగే పిల్లలమీద అజమాయిషీ చేస్తే వారి ఆలోచనలకి, ఇష్టాయిష్టాలకు అడ్డుపడుతున్నారని భ్రమపడతారు. అలాకాకుండా ఓ స్నేహితురాలిగా వారితో గడపండి. అప్పుడే మనసు విప్పి మాట్లాడతారు. రోజులో కొంత సమయమైనా వాళ్లకు కేటాయిస్తే మీ అనుబంధమూ బలపడుతుంది.

## పిల్లలూ ఆలోచించండి...

**ఆ ఉద్దేశం తెలుసుకోండి..** తల్లిదండ్రులు అనుభవంతో చెబుతారు. ఆంక్షలు పెట్టడం, సలహాలు ఇవ్వడం వెనక ఉద్దేశం మీ సంక్షేమమే ఉంటుంది. అందుకే, వాళ్లేం చెబుతున్నారో ఓసారి వినండి. వారి ఆందోళన అర్థమవుతుంది. అప్పుడు వాళ్లకు ఏం చెప్పాలి? ఎలాంటి భరోసా ఇవ్వాలనేది మీకే తెలుస్తుంది.

**ఉద్రేకం వద్దు...** అనుకున్నది సాధించాలనే పంతం ఉండటం మంచిదే. కానీ, ఈ ఉక్రోషం కాస్తా కోపంగా మారితే... మాటలే తూటాలవుతాయి. ఆ ఒత్తిడిలో వాదించడం, ఎదిరించడం వల్ల సమస్య మరింత పెద్దది అవుతుంది. మీరు అడిగింది ఏదైనా ఇప్పుడే కావాలి. ఈ రోజే చేయాలి అనొద్దు. వారికి ఆలోచించుకునే అవకాశం ఇవ్వండి. మీరూ సమయం తీసుకోండి. వారి ప్రశ్నలకు సమాధానం చెప్పండి. కచ్చితంగా మిమ్మల్ని అర్థం చేసుకుంటారు.

**స్పష్టంగా చెప్పండి...** మీ మనసులో వంద కోరికలు, ఆలోచనలు ఉండొచ్చు. వాటిని లోపలే ఉంచుకుని బయటికి మాత్రం వేరే విషయాలపై గొడవపడటం వల్ల ఉపయోగం ఉండదు. మీరేం అనుకుంటున్నారో అదే చెప్పండి. అప్పుడే మీ బాధ వారికి అర్థమవుతుంది.

**రాజీ పడాల్సిందే...** తల్లిదండ్రులు, టీనేజర్లు ఇద్దరూ కొన్నిసార్లు రాజీ పడాలి. ఉదాహరణకు స్నేహితులతో ఎక్కువ సమయం గడపాలనుకుంటే... తల్లిదండ్రులు పెట్టిన సమయ పరిమితిని అంగీకరించాల్సిందే. ఏ బంధంలో అయినా సర్దుకుపోయినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయి.

**అన్నీ చెప్పుకోనివ్వండి...**

టీనేజీ పిల్లలు స్వతంత్రంగా ఉండాలనుకోవడం, స్నేహితులతో గడపాలనుకోవడం సహజమే. ఆ మార్పుని పెద్దలు గుర్తించడమే కాదు... అంగీకరించగలగాలి. పొరపాటు జరిగినా సరే, బిడ్డలు మీతో చెప్పుకోగలగాలి. అలాగే యువత కూడా... ఓ విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఈ వయసులో ఉద్రేకం, ఉత్సాహం అన్నీ మీలో ఎక్కువగానే ఉంటాయి. చేసే పని ఏదైనా మీ కల్చర్, విలువలు, కుటుంబ పరిస్థితులకి సరిపడుతుందా? అన్నది ఆలోచించుకోవాలి. పీర్ ప్రెజర్‌లో పడి ఇతరుల్లా మీరు ఉండాలనుకోవడం మంచిది కాదు. అమ్మానాన్నలు అర్థం చేసుకోవట్లేదనిపిస్తే మానసిక నిపుణుల సాయం తీసుకోండి.



– పింగళి శ్రీలక్ష్మి, సైకియాట్రిస్ట్

# వసుంధర

vasundhara@eenadu.in

## అనవసరంగా చేరానా?

ఈ మధ్యే నేను మా కుటుంబానికి తెలిసిన వాళ్ల కంపెనీలో ఉద్యోగంలో చేరాను. చేరిన కొద్ది రోజులకే ఇక్కడ కొత్తగా నేర్చుకోవటానికి ఏం లేదని అర్థమయ్యింది. అంతకు ముందు చేసిన జాబ్‌లోని క్లయింట్ల కోసమే నన్ను చేర్చుకున్నారనిపిస్తోంది. వేరే కంపెనీకి మారాలనుకుంటున్నా. కానీ ఇది సరైన సమయమో, కాదో అని ఆలోచిస్తున్నా. – ఓ సోదరి

మీ పరిస్థితి వింటే బాధగానే ఉంది. కుటుంబ సంబంధాలను దెబ్బతీయకుండా ఉండటానికి మీరు ఆలోచిస్తున్నారనీ అర్థమవుతోంది. కంపెనీ వీడాలని నిర్ణయించుకునే ముందు మీ జాబ్ రోల్ గురించి మీ బాస్‌తో నిజాయతీగా మాట్లాడటం అవసరం. నిజానికి ఉద్యోగం వదిలి వెళ్లడానికి సరైన 'టైమ్' అంటూ ఏమీ ఉండదు. 'టైమింగే' ఉంటుంది. కాబట్టి, మీరు ఉద్యోగం వెతుక్కోవాలనుకుంటే ముందు మీకు ఏం కావాలో స్పష్టంగా తెలుసుకుని, అందు కోసం ఓ ప్రణాళిక రూపొందించుకోండి. అప్పుడు మీ విలువైన సమయం వృథా కాదు. ప్రస్తుత పరిస్థితుల్లో కొత్త ఉద్యోగం సాధించటం అంత తేలిక కాదు. ఈ విషయాన్నీ దృష్టిలో ఉంచుకోండి. ఓపిగ్గా ప్రయత్నించండి. మీరు బయటకు వెళ్లినా, ఈ కంపెనీలోనే ఉన్నా మీ అనుభవం సాయపడుతుంది. రాజీనామా చేయాలని నిర్ణయించుకుంటే ముందుగా మీ మేనేజర్‌కు తెలియజేయండి. ఇతరుల ద్వారా ఈ విషయం తెలిసే కంటే మీరే ఆ కారణాన్ని వివరించడం మంచిది.

డియర్ వసుంధర



కవితా గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

పొదుపు సంఘం

## కోట్ల రుణాలు ఇప్పిస్తోంది!

**పేదరికం... చదువును ఆపించింది. తిండికీ ఇబ్బందిపడే మెట్టినింటికి చేర్చింది. ఈ పరిస్థితుల్ని దాటడానికి ఆమె చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. అలాంటి స్థితి నుంచి రూ.కోట్ల రుణాలు ఇతరులకు ఇప్పించే స్థాయికి చేరారు హరిణి. అది తన మాటల్లోనే...**

మాది సిద్దిపేట జిల్లాలోని రామచంద్రాపురం. అమ్మానాన్నలు కూలీలైనా నన్ను చదివించాలనుకున్నారు. బీఫార్మసీ రెండో సంవత్సరంలో రూ.5 వేలు ఫీజు కట్టాలి. మహిళా సంఘంలో రుణం తీసుకొని కడదామనుకుంటే వాళ్లు నిరాకరించారు. దాంతో చదువాగిపోయింది. తర్వాత ఉల్లంపల్లి గ్రామానికి చెందిన తిరుపతికిచ్చి పెళ్లిచేశారు. తను ఆటో డ్రైవరు. అత్తారింట్లో ఇలా అడుగుపెట్టానంతే! అప్పులవాళ్లు వచ్చారు. అధైర్యపడుతూ కూర్చుంటే కష్టం. ఏదైనా చేసి, ఈ పరిస్థితి మార్చాలనుకున్నా. అందుకని పొదుపు సంఘంలో చేరబోతే అప్పులు ఉన్నాయని చేర్చుకోలేదు. కొన్ని నెలలయ్యాక వీవోఏను బతిమిలాడితే అప్పుడు అనుమతించారు. అక్కడ రూ.50 వేలు రుణం తీసుకొని ఆవును కొన్నా. దాని పాలతో ఇల్లు గడిచింది. మావారి ఆటోనీ అమ్మి, మాకున్న ఎకరంన్నర పొలంతోపాటు పక్కనే నీళ్ల వసతి ఉన్న పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేశాం. మరికొన్ని ఆవులూ సమకూర్చుకున్నా.



హరిణి

క్రమం తప్పకుండా వాయిదాలు కడుతూ కుటుంబాన్ని అప్పుల బారినుంచి కాపాడుకున్నా. ప్రస్తుతం ఖర్చులు పోనూ నెలకు రూ.20 వేల ఆదాయం వస్తోంది. స్వయం సహకార సంఘం సాయంతో అభివృద్ధి చెందడమే కాదు... లక్షన్నర మందికిపైగా సభ్యులున్న జిల్లా సమాఖ్యకు అధ్యక్షురాలిగానూ ఎదిగా. అప్పు దొరకని పరిస్థితి నుంచి సంఘాల చేయూతతో ఇంకొకరి అవసరాలను తీర్చే స్థాయికి చేరడం, వందల మందికి రూ.కోట్ల లింకేజీ రుణాలు ఇప్పించడం గర్వంగా ఉంది. అమ్మానాన్నలు చనిపోయారు. చెల్లెల్ని పీజీ చదివిస్తున్నా. ఫీజు కట్టలేక ఆగిపోయిన నా చదువునీ పూర్తిచేయాలనుకుంటున్నా.

– తోటపల్లి మోహన్, కరీంనగర్

## అయిదు కొలువులు... అయిదో ర్యాంకు!



**ఉద్యోగం సాధించాలన్న ఆమె తపనకు పట్టుదల తోడైంది. ఆ సంసిద్ధతతో బీటెక్ పూర్తి చేసిన ఏడాదికే... అయిదు కొలువులు కొట్టేసింది. తాజాగా తెలంగాణ ఐసెట్‌లోనూ 5వ ర్యాంకును సొంతం చేసుకుంది 22 ఏళ్ల ఇట్టె వైష్ణవి.**

జగిత్యాల జిల్లా, మేడిపల్లి మండలం, కొండాపూర్‌కు చెందిన వైష్ణవి కొండగట్టు జేఎన్‌టీయూలో బీటెక్ పూర్తిచేసింది. బ్యాంకు కొలువు సాధించాలనేది ఆమె లక్ష్యం. శిక్షణ తీసుకుంటూ పట్టుదలతో చదివింది. రీజనల్ రూరల్ బ్యాంక్(ఆర్ఆర్‌బీ), ఐబీపీఎస్ సహా 'యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' నిర్వహించిన పరీక్షల్లో మంచి మార్కులు సాధించింది. ఏప్రిల్‌లో ఫలితాలు వెలువడ్డాయి. బ్యాంక్ ఆఫ్ బరోడాలో స్పెషల్ ఆఫీసర్, కెనరా బ్యాంక్‌లో క్లర్క్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో క్లర్క్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ప్రొబేషనరీ ఆఫీసర్, యూనియన్ బ్యాంక్‌లో లోకల్ బ్యాంక్ ఆఫీసర్... ఉద్యోగాలకు ఎంపికైంది. ప్రస్తుతం ఆర్మూరులో యూనియన్ బ్యాంక్‌లో లోకల్ ఆఫీసర్‌గా చేరింది. తెలంగాణ ఐసెట్ పరీక్షకు హాజరైన వైష్ణవి... తాజాగా విడుదలైన ఆ ఫలితాల్లో 5వ ర్యాంక్ సాధించింది. ఈమె తల్లి విజయలక్ష్మి గృహిణి, తండ్రి వీరేశం ప్రైవేటు ఉపాధ్యాయుడు. 'ఇష్టంతోనే కష్టపడి ఐసెట్ రాశాను, రాష్ట్రస్థాయి ర్యాంకు రావడం సంతోషంగా ఉంది. పీజీలో చేరడం గురించి కుటుంబ సభ్యులు, బ్యాంకు అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటా' అంటోంది వైష్ణవి.

– మెన్నేని చంద్ర ప్రకాశ్‌రావు, మేడిపల్లి

## ఏం తింటున్నారు?

మారుతున్న జీవనశైలితో ఇప్పుడు చాలామందిలో ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్(ఐబీఎస్) కనిపిస్తోంది. ఐబీఎస్ అంటే... కడుపునొప్పి, కడుపుబ్బరం, గ్యాస్, విరేచనాలు, మలబద్ధకం వంటివి తరచుగా వేధిస్తుంటాయి. దీనిపై తాజాగా మిచిగన్ విశ్వవిద్యాలయం నిర్వహించిన అధ్యయనం... సమతులాహార ప్రణాళిక, మెడిటరేనియన్ డైట్‌తో ఐబీఎస్ లక్షణాలు తగ్గించవచ్చని వెల్లడించింది. దీనికోసం ఐబీఎస్‌తో బాధపడుతున్న కొందరిని ఎంచుకున్నారు. వీరిని రెండు గ్రూపులుగా విభజించారు. సగం మంది అదీఇదీ అని లేకుండా అన్ని రకాల ఆహార పదార్థాలు తీసుకున్నారు. వీటిల్లోని ఆలిగో శాకరైడ్స్ వల్ల తిన్న తర్వాత ఆహారం పూర్తిగా జీర్ణం కాకుండా పేగుల్లో పాక్షికంగా మిగిలిపోయింది. దీంతో పొట్టలో గ్యాస్, అజీర్తి వంటివి ఏర్పడుతున్నట్లు గుర్తించారు. మిగతా సగం మంది సమతులాహారం లేదా మెడిటరేనియన్ నియమాలను పాటించారు. దాదాపు 4 వారాల తర్వాత 82శాతం మందికి ఐబీఎస్ నుంచి ఉపశమనం దొరికిందని వెల్లడైంది. అందుకే ఈ సమస్య ఉన్నవారు జీర్ణం కాని పిండి పదార్థాలకు దూరంగా ఉండాలంటారు నిపుణులు.



"మహిళలకు మార్గనిర్దేశం(మెంటార్‌షిప్)తోపాటు మద్దతు (స్పాన్సర్‌షిప్) కూడా ఎంతో ముఖ్యం. చాలామంది కెరియర్ గురించి సలహాలు ఇస్తారు. నేనూ మార్గనిర్దేశకుల నుంచి చాలా నేర్చుకున్నా. అదే సమయంలో మనలో ఇతరులు గుర్తించని ప్రతిభను గుర్తించి బయటకు చెప్పే మద్దతుదారులూ ఉండాలి. కీలక స్థానాల్లో అప్పటికే ఉన్నవాళ్లలా మనం కనిపించం, ఆలోచించం, పనిచేయం... కానీ మనలోని భిన్న కోణాన్ని ప్రోత్సహించే వ్యక్తులూ ఉండాలి.

- రేవతీ అద్వైతి, సీఈఓ, ఫ్లెక్స్



**మీకు తెలుసా**

శిశువులు పుట్టిన తర్వాత కళ్ల రంగు మారుతుందట. ఐరిస్‌లో మెలనిన్ ఉత్పత్తి పెరిగేకొద్దీ ఆ రంగులో మార్పు వస్తుంది. తుది రంగు ఏర్పడటానికి మూడేళ్లు పడుతుందట.

## బంగారం - వెండి



8న ముగింపు

| | బంగారం (24క్యా) | ఆర్నమెంట్ (22క్యా) | వెండి (కిలో) |
|---|---|---|---|
| హైదరాబాద్ | 99,440 | 91,000 | 1,10,271 |
| విజయవాడ | 97,220 | 90,600 | 1,11,100 |
| ప్రొద్దుటూరు | 97,100 | 89,330 | 1,08,800 |
| రాజమహేంద్రవరం | 98,840 | 90,600 | 1,20,000 |
| విశాఖపట్నం | 98,480 | 90,600 | 1,12,000 |
| తమిళనాడు | ----- | 90,600 | 1,20,000 |



**ఇన్‌బాక్స్ ఓపెన్ చేయగానే బోలెడన్ని జంక్ మెయిళ్లు. ప్రమోషన్లు, ప్రకటనల టపాలు. కొన్నిసార్లు సబ్‌స్క్రైబ్ చేసుకోనివీ ఇన్‌బాక్స్‌లో వచ్చి వాలుతుంటాయి. వీటి మూలంగా కొన్నిసార్లు అసలు మెయిళ్లను వెతుక్కోవటమూ కష్టమైపోతుంది. ఈ చిక్కులకు చెక్ పెడుతూనే, ఇన్‌బాక్స్ మీద తిరిగి పట్టు సాధించటమెలా? గోప్యతను కాపాడుకోవటమెలా? అని ఆలోచిస్తున్నారా? అయితే మారు మెయిళ్లు.. అదే అలియాస్, ఐడీని దాచే మాస్కింగ్ మెయిళ్ల గురించి తెలుసుకోవాల్సిందే.**

# మారు మెయిల్ మహోపకారం

ఆన్‌లైన్ సేవల ఉచిత ట్రయల్‌కు ఈమెయిల్‌తో సైనప్ అవుతాం. ఏదో వెబ్‌సైట్ నుంచి పీడీఎఫ్ డౌన్‌లోడ్ చేయటానికో, న్యూస్‌లెటర్ సబ్‌స్క్రిప్షన్‌కో లేదూ కూపన్ల ఆఫర్ అందితేనో మెయిల్ ఐడీ ఎంటర్ చేస్తాం. అంతటితో దాన్ని మరచిపోతాం. ప్రైమరీ ఈమెయిల్ ఐడీ ఇచ్చినంత మాత్రాన పోయేదేముందని భావిస్తుంటాం గానీ అక్కడి నుంచే కథ మొదలవుతుంది. ఇన్‌బాక్స్‌లో జంక్, ప్రమోషన్ మెయిళ్ల మోత మోగుతుంది. వాటిని వదిలించుకోవటం, సర్దుకోవటం తలనొప్పిగా మారుతుంది. అనుచిత మెయిళ్లు ఇన్‌బాక్స్‌లో కనిపిస్తుంటే ఎవరో ట్రాక్ చేస్తున్నారనే భావన మనసును నిరంతరం తొలుస్తూనే ఉంటుంది. ఆన్‌లైన్ స్వాతంత్ర్యం కోల్పోయినట్టూ అనిపిస్తుంది. ఎందుకంటే ఇప్పుడు మెయిల్ ఐడీ కేవలం సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునే సాధనం మాత్రమే కాదు. అది మన డిజిటల్ ఐడీ కూడా. సౌకర్యం కోసం ఎవరికి పడితే వారికి షేర్ చేస్తే గోప్యత, భద్రతకు భంగం వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. మన ఈమెయిల్ ఐడీ ఆయా సేవలకే పరిమితం కాకపోవచ్చు. థర్డ్ పార్టీల చేతుల్లోనూ పడొచ్చు. పాస్‌వర్డ్ బలంగా లేకపోతే మోసగాళ్లు ఛేదించొచ్చు. దీని సాయంతో ఇతర ఖాతాల్లోకీ ప్రవేశించొచ్చు. ఇప్పుడు ఈమెయిల్‌ను అదనపు ధ్రువీకరణకూ వాడుకుంటున్నాం మరి. ఇలాంటి ప్రమాదాల్లో పడకుండా చూసుకోవటానికి అలియాస్ మెయిళ్లు, మెయిల్ మాస్కింగ్ బాగా ఉపయోగపడతాయి. తాత్కాలిక, ఒకసారి వాడుకునే ఈమెయిళ్ల కోసం రూపొందించిన ఇవి ఎక్కువకాలం అవసరం లేదని భావించే కనెక్షన్ల కోసం అనువుగా ఉంటాయి. అంటే క్విక్ సైన్ అప్, ఉచిత ట్రయల్స్ యాక్సెస్, విశ్వసనీయం కాని సర్వీసుల కోసం వీటిని ప్రత్యామ్నాయ ఈమెయిల్ ఐడీగా వాడుకోవచ్చు.

## అదనపు, ప్రత్యామ్నాయ ఐడీగా..

ప్రైమరీ ఈమెయిల్ ఖాతాకు అలియాస్ ఈమెయిల్ ఐడీ అదనపు, ప్రత్యామ్నాయ ఐడీగా ఉపయోగపడుతుంది. యూజర్లు దీని ద్వారా మెయిళ్లను పంపుకోవచ్చు, అందుకోవచ్చు. ఒకే డొమెయిన్‌తో గానీ వేర్వేరు డొమైన్లతో గానీ చాలా అలియాస్ ఈమెయిల్ ఐడీలను కలిగుండొచ్చు. ఒకరకంగా వీటిని మారుపేరు ఈమెయిళ్లు అనుకోవచ్చు. దీనికి ఎవరైనా మెయిల్ పంపితే ఆటోమేటిగ్గా ప్రైమరీ ఇన్‌బాక్స్‌లోకి చేరుతుంది. కానీ పంపినవారికి అసలు ఈమెయిల్ ఐడీ కనిపించదు. ఇక ఈమెయిల్ మాస్కింగ్ అనేది కాస్త విస్తృతమైంది. అసలు ఈమెయిల్ ఐడీని దాచే పద్ధతులేవైనా దీని కిందికే వస్తుంది. ప్రైమరీ ఈమెయిల్ చిరునామాను కాపాడుకోవటానికి అలియాస్, మాస్క్‌డ్ ఈమెయిళ్లు రెండూ తోడ్పడినప్పటికీ ఇవి వేర్వేరు విధంగా పనిచేస్తాయి. ఇన్‌బాక్స్‌తో ముడిపడిన ప్రధాన మెయిల్‌కు అదనంగా అలియాస్ మెయిల్‌ను ఉపయోగించుకోవచ్చు. ఈమెయిల్ ప్రొవైడర్ సెటింగ్స్ ద్వారా ఎవరికివారే దీన్ని సృష్టించుకోవచ్చు. అదే మాస్క్‌డ్ ఈమెయిళ్లకైతే థర్డ్ పార్టీ సేవలు అవసరం. ఇవి తాత్కాలిక ఈమెయిళ్లను సృష్టించి, వాటిని ప్రైమరీ ఇన్‌బాక్స్‌కు ఫార్వర్డ్ చేస్తాయి.

## ఎలా వాడుకోవాలి?

అలియాస్ మెయిళ్లను వాడుకోవటం చాలా తేలిక. ఈమెయిల్ సంస్థలే వీటిని కల్పిస్తాయి. జీమెయిల్ యూజర్లకిది చాలా సులువు. అప్పటికే తాము వాడుతున్న జీమెయిల్ అడ్రస్‌లో @ గుర్తుకు ముందుండే పదం ముందు ప్లస్ గుర్తు యాడ్ చేస్తే చాలు. ఉదాహరణకు- మీ మెయిల్ ఐడీ yournamenewsletters@gmail.com అనుకోండి. అప్పుడు ప్లస్ గుర్తుతో yourname+newsletters@gmail.com అని సెట్ చేసుకుంటే సరి. ఈ చిన్న మార్పుతో కూడిన ఐడీకి అందే మెయిళ్లన్నీ ఇన్‌బాక్స్‌లో ప్రత్యక్షమవుతాయి. దీంతో మరో ప్రయోజనం ఏంటంటే ఇలాంటి ప్లస్ గుర్తు గల మెయిళ్లన్నింటినీ తేలికగా వెతికే అవకాశముండటం. అందువల్ల సులభంగా ఫిల్టర్ చేసుకోవచ్చు, క్రమబద్ధీకరించుకోవచ్చు. ఐక్లౌడ్+ లేదా యాపిల్ వన్ సర్వీసుల సబ్‌స్క్రిప్షన్ గలవారికి యాపిల్ సంస్థ అలియాస్ మెయిళ్లు సృష్టించుకోవటానికి వీలు కల్పించింది. దీనిలోని హైడ్ మై ఈమెయిల్ ఫీచర్ సాయం తీసుకోవచ్చు. ఇది ప్రత్యేకమైన, ర్యాండమ్ ఈమెయిల్ ఐడీలను సృష్టిస్తుంది. ఇవి ఆటోమేటిగ్గా వ్యక్తిగత ఇన్‌బాక్స్‌కు మెసేజ్‌లను ఫార్వర్డ్ చేస్తాయి. ఐఫోన్‌లో సఫారీ బ్రౌజర్‌ను వాడుతున్నప్పుడు తెర మీద కీబోర్డు పైన ఉండే బాక్సును తాకితే హైడ్ మై ఈమెయిల్ కనిపిస్తుంది. అలాగే మ్యాక్ కంప్యూటర్‌లో డెస్క్‌టాప్ సఫారీ బ్రౌజర్ లేదా మెయిల్ యాప్‌లోనూ దీన్ని ఉపయోగించుకోవచ్చు.

## మాస్కింగ్ కోసం

ఈమెయిల్ మాస్కింగ్ సేవలను అందించే థర్డ్ పార్టీ సర్వీసులు చాలానే అందుబాటులో ఉన్నాయి. ఉచిత ఫీచర్లతోనే చాలా సదుపాయాలు పొందొచ్చు. మరిన్ని ఆప్షన్లు కావాలంటే సబ్‌స్క్రిప్షన్ తీసుకోవచ్చు.

- **DuckDuckGo:** గోప్యతకు అధిక ప్రాధాన్యమిచ్చే డక్‌డక్‌గో బ్రౌజర్ ఉచిత ఈమెయిల్ ఫార్వర్డింగ్ సేవలనూ అందిస్తుంది. అదృశ్య ఈమెయిల్ ట్రాకర్లను తొలగిస్తుంది. ప్రత్యేకమైన ఈమెయిల్ ఐడీలను ఎన్నయినా సృష్టించుకోవచ్చు.
- **Firefox Relay:** దీని సాయంతో ఉచితంగా ఐదు వరకూ మాస్కింగ్ మెయిళ్లను వాడుకోవచ్చు. చందా తీసుకుంటే లెక్కలేనన్ని మారు మెయిళ్లు సృష్టించుకోవచ్చు.
- **SimpleLogin:** ఇది ఓపెన్ సోర్స్ సర్వీసు. మారు ఐడీ ద్వారా మెయిళ్లను అందుకోవటానికి, తమ ద్వారా జవాబులను పంపటానికి వీలు కల్పిస్తుంది.
- **Proton Mail:** ఇది తమ పాస్‌వర్డ్ మేనేజర్‌తో ఈమెయిల్ మాస్కింగ్‌కు తోడ్పడుతుంది.
- **Addy.io:** ఇది కస్టమ్ డొమెయిన్లను సపోర్టు చేస్తుంది. లెక్కలేనన్ని మారు మెయిల్ ఐడీలతో కూడిన బ్రౌజర్ ఎక్స్‌టెన్షన్లను అందిస్తుంది. అదీ ఉచిత ప్లాన్‌లోనే.
- **FastMail:** ఇది అన్‌లిమిటెడ్ అలియాస్ మెయిళ్ల సదుపాయాన్ని కల్పిస్తుంది. అదీ సమగ్రమైన మాస్కింగ్‌తో. యాడ్స్, ట్రాకింగ్ వంటివేవీ ఉండవు కూడా.

**అలియాస్, మాస్కింగ్ మెయిల్ లాభాలు, తెలుసుకోవాల్సిన చిట్కాలు ఈపేపర్‌లో..**

its@eenadu.in

# ఈ-నాడు

## హెచ్‌పీ కొత్త ఓమ్నిబుక్స్

విద్యార్థులు, ఉద్యోగులను దృష్టిలో పెట్టుకొని హెచ్‌పీ సంస్థ ఓమ్నిబుక్ 5, 3 శ్రేణుల్లో సరసమైన ధరల్లో ఏఐ ల్యాప్‌టాప్‌లను పరిచయం చేసింది. ప్రత్యేకమైన న్యూరల్ ప్రాసెసింగ్ యూనిట్‌తో కూడిన ఇవి సెకండుకు 45 నుంచి 50 ట్రిలియన్ల ఆపరేషన్లు (టాప్స్) చేయగలవు. ఓమ్నిబుక్ 5 పరికరం క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ ఎక్స్ ప్లస్ ఎక్స్1-21-100 ప్రాసెసర్‌తో పనిచేస్తుంది. 14 అంగుళాల 2కే ఓఎల్‌ఈడీ తెరతో కూడిన దీని బ్యాటరీ 34 గంటల వరకూ వస్తుంది. ఆటో ఫ్రేమింగ్ కోసం విండోస్ స్టుడియో ఎఫెక్ట్స్ ఫీచర్ ఉంటుంది. హెచ్‌పీ ఆడియో బూస్ట్ 2.0 అయితే ఏఐ సాయంతో మంద్ర స్థాయి శబ్దాలనూ ఉచ్ఛస్థితికి చేరుస్తుంది. ఇక ఓమ్నిబుక్ 3 పరికరమైతే 15.6 అంగుళాలు, 14 అంగుళాల రకాల్లో అందుబాటులో ఉంటుంది. 250 నిట్స్ గరిష్ఠ ప్రకాశంతో కూడిన ఇది ఏఎండీ రైజన్ ఏఐ300 ప్రాసెసర్‌తో పనిచేస్తుంది. 50 టాప్స్ ఎన్‌పీయూ వరకూ పనులు చేస్తుంది. విండోస్ స్టుడియో ఎఫెక్ట్స్, హెచ్‌పీ ట్రూ విజన్ కెమెరా, డ్యుయెల్ మైక్స్, ఏఐ నాయిస్ రిడక్షన్ ఫీచర్లూ ఉన్నాయి. గ్లేసియర్ సిల్వర్ రంగులో అందుబాటులో ఉండే ఓమ్నిబుక్ 5 ప్రారంభ ధర రూ.75,999. ఓమ్నిబుక్ 3 ప్రారంభ ధర రూ.69,999.



## ఏఐ+ ఫోన్లు వచ్చేశాయి

ఎన్ఎక్స్‌టీక్వాంటమ్ తమ తొలి స్మార్ట్‌ఫోన్లను లాంచ్ చేసింది. డేటా గోప్యతకు భంగం కలగని విధంగా, పూర్తిగా మనదేశంలోనే తయారైన వీటి పేర్లు ఏఐ+ పల్స్, నోవా 5జీ. ఇవి మనదేశపు మొట్టమొదటి సార్వభౌమ ఎన్ఎక్స్‌టీక్వాంటమ్ ఓఎస్‌తో పనిచేస్తాయి. యూనిసాక్ టీ615 ప్రాసెసర్‌తో కూడిన ఏఐ+ పల్స్ ఫోన్ 6.7 అంగుళాల హెచ్‌డీ+ డిస్‌ప్లే, 90హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 450 నిట్స్ గరిష్ఠ ప్రకాశం, 50ఎంపీ డ్యుయెల్ ఏఐ కెమెరా, 5,000ఎంఏహెచ్ బ్యాటరీ, పక్కన ఫింగర్‌ప్రింట్ సెన్సర్ వంటి ఫీచర్లు కలిగుంది. 4జీబీ/6జీబీ ర్యామ్, 64జీబీ/128జీబీ స్టోరేజీతో వచ్చింది. 8.5ఎంఎం మందం గల ఇది 193 గ్రాముల బరువుంటుంది. ఇక నోవా 5జీ ఫోన్ అయితే యూనిసాక్ టీ8200 చిప్‌తో పనిచేస్తుంది. 6.7 అంగుళాల హెచ్‌డీ+ తెర, 120 హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 50ఎంపీ డ్యుయెల్ ఏఐ కెమెరా, 5,000ఎంఏహెచ్ బ్యాటరీ, పక్కన ఫింగర్‌ప్రింట్ సెన్సర్ ఫీచర్లతో వచ్చింది. 6జీబీ/8జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజీలో అందుబాటులో ఉంటుంది. బ్లూ, బ్లాక్, గ్రీన్, పర్పుల్, పింక్ రంగుల్లో లభించే ఈ ఫోన్ల మెమరీని 1టీబీ వరకూ పెంచుకోవచ్చు. ఏఐ+ పల్స్ ప్రారంభ ధర రూ.4,499. నోవా 5జీ ప్రారంభ ధర రూ.7,499. జులై 12న ఏఐ+ పల్స్, 13న నోవా 5జీ అమ్మకాలు మొదలు కానున్నాయి.



- నక్షత్రాలు అంత్యదశలో రెండు సార్లు విస్ఫోటం చెందుతాయా? దీని గురించి ఈఎస్ఓ శాస్త్రవేత్తలు ఏం గుర్తించారు?
- గాలిలోని కార్బన్ డయాక్సైడ్‌ను తొలగించటానికి, వాతావరణ మార్పును తగ్గించటానికి మేడి చెట్లు ఎలా ఉపయోగపడతాయి?

ఈ కథనాల కోసం చూడండి. https://epaper.eenadu.net

డివైస్ సలహా

## యూట్యూబ్ మ్యూట్

యూట్యూబ్‌లో చాలా ఆసక్తిగా సినిమా చూస్తున్నారు. అంతలో ఎవరో వచ్చారు. ముఖ్యమైన విషయమేదో చెప్పాలనుకున్నారు. ఇలాంటప్పుడు యూట్యూబ్‌ను వెంటనే మ్యూట్ చేయాలంటే? కీబోర్డులో ఎం మీటను నొక్కితే సరి. సౌండ్ ఆగిపోతుంది. అన్‌మ్యూట్ చేయాలంటే తిరిగి ఎం మీట నొక్కండి. వీడియో మధ్యలో ఎవరైనా మాట్లాడుతున్నప్పుడు ఈ చిట్కా బాగా ఉపయోగపడుతుంది.





## డేటా పరిమితి మించుతోందా?

విండోస్ పరికరాన్ని వాడుతున్నప్పుడు డేటా పరిమితి దాటుతుందేమోనని ఆందోళన చెందుతున్నారా? అయితే హెచ్చరిక సంకేతం అందేలా సెట్ చేసుకోండి. సెటింగ్స్ ద్వారా నెట్‌వర్క్ అండ్ ఇంటర్నెట్‌లోకి వెళ్తే అడ్వాన్స్‌డ్ నెట్‌వర్క్ సెటింగ్స్ కనిపిస్తుంది. ఇందులో డేటా యూసేజ్ ఆప్షన్ ద్వారా వై-ఫై లేదా ఎథర్‌నెట్ కనెక్షన్ ఎంచుకోవాలి. తర్వాత ఎంటర్ లిమిట్ మీద తాకి లిమిట్ టైప్ (మంత్లీ వంటి) ఎంచుకోవాలి. పరిమితిని విధించుకొని, సేవ్ మీద క్లిక్ చేయాలి.



## పాడ్‌కాస్ట్ షేర్

ఐప్యాడ్‌లో మంచి పాడ్‌కాస్ట్ వింటున్నారనుకోండి. అప్పుడే దాన్ని ఇష్టమైనవారికో, స్నేహితుడికో షేర్ చేయాలంటే? ఆ పాడ్‌కాస్ట్ ప్లే అవుతున్నప్పుడు మూడు చుక్కల మెనూ మీద క్లిక్ చేసి, షేర్ ఎపిసోడ్‌ను ఎంచుకోవాలి. మొత్తం మొదటి నుంచీ షేర్ చేయాలనుకుంటే ఫ్రమ్ స్టార్ట్ ఆప్షన్ ఎంచుకోవచ్చు. లేదా కచ్చితమైన సమయం నుంచే పంపించాలంటే ఫ్రమ్, సమయాన్ని (ఉదా: ఫ్రమ్ 1:30) క్లిక్ చేయాలి. తర్వాత డన్ మీద నొక్కి ఇష్టమైనట్టుగా సెండ్ చేసుకోవాలి.



## ఇన్‌స్టా పోస్ట్ జూమ్

ఫోన్‌లో ఇన్‌స్టాగ్రామ్ వాడుతున్నారా? చిన్న చిన్న అక్షరాలు, వివరాలు సరిగా కనిపించటం లేదా? అయితే ఫొటోలు, వీడియోల మీద రెండు వేళ్లను ఆనించి దూరంగా జరిపి చూడండి. అప్పుడవి పెద్దగా అవుతాయి. చిన్న చిన్న అక్షరాల వంటివి పెద్దగా కనిపిస్తాయి.



ఈనాడు బిజినెస్

## ఆఖర్లో కొనుగోళ్ల జోరు

| సెన్సెక్స్ ▲270 | నిఫ్టీ ▲61 |
|---|---|
| 83713 | 25523 |

బ్యాంకింగ్, కొన్ని ఐటీ షేర్లకు ఆఖర్లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో, దేశీయ సూచీలు మంగళవారం లాభాల్లో ముగిశాయి. సానుకూల ఆసియా సంకేతాలు ఇందుకు తోడయ్యాయి. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి చేరువగా ఉన్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొనడం సెంటిమెంట్‌ను బలపరిచింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 21 పైసలు పెరిగి 85.73 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.59% నష్టంతో 69.17 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, ఐరోపా సూచీలు మిశ్రమంగా ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ మంగళవారం రూ.25,000 కోట్లు పెరిగి రూ.461.38 లక్షల కోట్లు (5.38 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

## యూఎస్ కంపెనీలతో విలీనం కానున్న కోవాసెంట్ టెక్నాలజీస్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాదుకు చెందిన ఏజెంటిక్ ఏఐ సేవల సంస్థ కోవాసెంట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, అమెరికాలోని రెండు కంపెనీలతో విలీనం కాబోతోంది. టెక్సాస్ కేంద్రంగా పనిచేస్తున్న కోనావి, కాలిఫోర్నియా సంస్థ డీక్యూబ్ డేటా సైన్సెస్ కార్పొరేషన్ అనే సంస్థలతో విలీన ఒప్పందాన్ని కోవాసెంట్ టెక్నాలజీస్ మంగళవారం ఇక్కడ వెల్లడించింది. దీనివల్ల సైబర్ భద్రత, రిస్క్ మేనేజ్‌మెంట్, డేటా ఇంజినీరింగ్ విభాగాల్లో అగ్రస్థానానికి చేరుకునే అవకాశం ఉంటుందని పేర్కొంది. 3 సంస్థలకు ఉన్న నైపుణ్యాలు, సామర్థ్యం కలగలిసి, వినియోగదారుకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించింది. ఆటోమేషన్, ఎంటర్‌ప్రైజ్ ఏఐ సేవల అధిక సామర్థ్యాలను ప్రదర్శించే విధంగా తమ క్లయింట్లకు తగిన పరిష్కారాలు అందించగలుగుతామని కోవాసెంట్ టెక్నాలజీస్ సీఈఓ సి.వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. మనదేశంలో ఏజెంటిక్ ఏఐ సేవల మార్కెట్ 2030 వరకు ఏటా 50 శాతానికి పైగా వృద్ధి చెందుతుందని ఐటీ పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## సాయి పేరెంటరల్స్‌కు రూ.50 కోట్ల పెట్టుబడి

ఈనాడు, హైదరాబాద్: ఔషధ రంగ సంస్థ సాయి పేరెంటరల్స్ లిమిటెడ్‌కు రూ.50 కోట్ల పెట్టుబడి లభించింది. ఇబ్లా లోటస్ కేపిటల్ సారథ్యంలో సమర్థ్ కేపిటల్, వ్యామ్ పార్ట్‌నర్స్, మరికొన్ని ఇతర సంస్థలు ఈ నిధులు సమకూర్చాయి. అగ్రశ్రేణి ఫార్మాస్యూటికల్ సేవల సంస్థను నిర్మించాలన్న తమ లక్ష్యానికి ఈ నిధులు దోహదపడతాయని కంపెనీ ఎండీ అనిల్ కుమార్ సాయి తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఫార్మా బ్రాండ్లు, మేధో సంపత్తి హక్కులు సొంతం చేసుకునే అవకాశం లభిస్తుందని, తమ ఉత్పత్తులు, సేవల శ్రేణి విస్తరిస్తుందని వెల్లడించారు. ఫార్ములేషన్లు, సీడీఎంఓ విభాగాల్లో వేగంగా విస్తరిస్తున్నందునే సాయి పేరెంటరల్స్‌లో పెట్టుబడి పెట్టామని సమర్థ్ కేపిటల్ ఎండీ సందీప్ షెనాయ్, వ్యామ్ పార్ట్‌నర్స్ ప్రతినిధి ప్రశాంత్ ఖాన్‌చందాని తెలిపారు.

మరిన్ని వాణిజ్య కథనాలు https://epaper.eenadu.net లో

# రక్షణ రథం.. రయ్ రయ్



- ప్రైవేట్ పెట్టుబడులతో పెరిగిన మన తయారీ సామర్థ్యం
- నాటో దేశాల నిర్ణయంతో ఎగుమతులూ పెరగొచ్చు

దేశ రక్షణ అవసరాల కోసం ఇటీవలి వరకు దిగుమతులపైనే ఆధారపడిన మనదేశం.. ఇప్పుడు ఇతర దేశాలకూ ఆధునిక యుద్ధ పరికరాలను ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతోంది. ప్రభుత్వ సంస్కరణల ఫలితంగా రక్షణ పరికరాల తయారీలోకి ప్రైవేటు పెట్టుబడులు రావడం, సామర్థ్యాలు పెరగడం ఇందుకు కారణం. 2029 నాటికి రూ.50,000 కోట్ల ఎగుమతులను సాధించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచంలో 100 కోట్ల మంది ప్రజలున్న 32 నాటో సభ్య దేశాలు, తమ రక్షణ బడ్జెట్‌ను 2035 కల్లా జీడీపీలో 5 శాతానికి పెంచుకోవాలని నిర్ణయించాయి.. భారత రక్షణ పరికరాల ఎగుమతులకు మరింత ఊతం ఇవ్వవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

### భారత్ వైపే ఎందుకు?

ప్రస్తుతమున్న సరఫరా వ్యవస్థల ద్వారా, తమకు అవసరమైన అత్యాధునిక రక్షణ రంగ ఉత్పత్తులను సమకూర్చుకోవడం నాటో దేశాలకు సవాలుతో కూడుకున్నదే. ఐరోపాలో వీటి తయారీ సామర్థ్యం పరిమితంగా ఉండటమే కారణం. నైపుణ్య కార్మికుల కొరత కూడా. రక్షణ పరికరాల కోసం అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, తయారీ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ఐరోపా దేశాలు ప్రాధాన్యమిస్తున్నాయి. అయితే ఇందుకు చాలా సమయం పడుతుంది కనుక.. అందుబాటు ధరలకే నాణ్యమైన రక్షణ ఉత్పత్తులను అందించే భారత్ వైపు ఐరోపా దేశాలు దృష్టి సారిస్తాయన్నది అంచనా. పాకిస్థాన్‌పై ఇటీవలి దాడుల్లో బ్రహ్మోస్, ఆకాశ్, నాగ్ వంటి అధునాతన సొంత మిస్సైళ్లను భారత్ సమర్థంగా ప్రయోగించడం ఆయా దేశాలను ఆకర్షించింది. భారత్-ఐరోపా దేశాల మధ్య దౌత్య సంబంధాలు బలపడుతుండటమూ ఇందుకు దోహదం చేయనుంది.

### 600కు పైగా అంకురాలు

మనదేశంలో ఇంతకుముందు రక్షణ పరికరాల తయారీ ప్రభుత్వ రంగ సంస్థలే చేపట్టేవి. ప్రైవేట్ కంపెనీలకూ అనుమతులివ్వడంతో, రక్షణ పరికరాల తయారీ సామర్థ్యం భారీగా పెరుగుతోంది. 2024-25లో దేశీయంగా రక్షణ పరికరాల తయారీలో ప్రైవేటు కంపెనీల వాటా దాదాపు 25 శాతానికి చేరింది. టాటా గ్రూప్, ఎల్అండ్‌టీ, భారత్ ఫోర్జ్, మహీంద్రా, అశోక్ లేలాండ్ లాంటి దిగ్గజాలకు తోడు 600కు పైగా అంకురాలు రక్షణ రంగంలోకి అడుగుపెట్టాయి. రక్షణ తయారీ సామర్థ్యంతో పాటు పరిశోధన-అభివృద్ధి రాణిస్తోంది. జర్మనీ సంస్థ రైన్ మెటల్ వాఫే మ్యూనిషన్ నుంచి రూ.600 కోట్ల ఆర్డరును దక్కించుకున్న రిలయన్స్ డిఫెన్స్, ఫ్రాన్స్‌కు చెందిన డసో ఏవియేషన్, థేల్స్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం.. మన కంపెనీలకు అంతర్జాతీయంగా పెరుగుతున్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. నాటో దేశాల నుంచి ఆర్డర్లు పెరిగితే, మన కంపెనీలు రాబోయే దశాబ్ద కాలంలో అంతర్జాతీయ విపణిలోనూ కీలకంగా మారతాయి.

### దిగుమతుల్లో నాలుగో స్థానానికి

రక్షణ పరికరాలను అధికంగా దిగుమతి చేసుకున్న దేశాల్లో గతేడాది మనదేశం నాలుగో స్థానంలో నిలిచింది. రష్యాతో యుద్ధం నేపథ్యంలో, ఆయుధ సామగ్రిని అమెరికా, ఐరోపా దేశాల నుంచి అధికంగా కొనుగోలు చేస్తున్న ఉక్రెయిన్ మొదటి స్థానంలో నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా రక్షణ దిగుమతుల్లో 18% వాటా ఉక్రెయిన్‌దే. పోలాండ్ 5%, యూఎస్ఏ 4% వాటాలతో తదుపరి స్థానాల్లో ఉన్నాయి. నాలుగో స్థానంలో మనదేశంతో పాటు ఖతార్, సౌదీ అరేబియా, దక్షిణ కొరియా, జపాన్ ఉన్నాయి. అదే 2010లో చూస్తే, రక్షణ దిగుమతుల్లో మనదేశానిదే అగ్రస్థానం. అప్పట్లో ప్రపంచ వ్యాప్త రక్షణ దిగుమతుల్లో మన వాటాయే 11%.

### ఎగుమతుల్లో వృద్ధి ఇలా

2017 నుంచి మన రక్షణ ఎగుమతుల్లో ఏటా 41% వృద్ధి నమోదవుతోంది. 2017లో మన రక్షణ ఎగుమతులు రూ.1500 కోట్లు కాగా, 2024లో రూ.23,600 కోట్లకు పెరిగాయి. బ్రహ్మోస్, ఆకాశ్, నాగ్.. తదితర క్షిపణుల సత్తాను గుర్తించి, వాటిని కొనుగోలు చేసేందుకు పలు దేశాలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న బీడీఎల్, మిధాని, ప్రైవేటు రంగంలోని ఎలక్ట్రానిక్స్, నావిగేషన్, ట్రైనింగ్ ఉత్పత్తులు/ సేవలు అందించే సంస్థలు అధిక ఆదాయాలు నమోదు చేసే సానుకూలతలు కనిపిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు వివరిస్తున్నాయి.

**ఆయా సంస్థల చేతిలో ఆర్డర్ల విలువ (రూ.కోట్లలో)**

| కంపెనీ | 2023–24 | వచ్చే అయిదేళ్లకు |
|---|---|---|
| హెచ్ఏఎల్ | 1,25,388 | 13,04,975 |
| బీఈఎల్ | 74,500 | 3,00,000 |
| బీఈఎంఎల్ | 15,296 | 1,20,000 |
| బీడీఎల్ | 18,574 | 95,000 |
| మిధాని | 2,015 | 11,000 |
| మజ్‌గావ్ డాక్ షిప్‌బిల్డర్స్ | 39,871 | 7,90,000 |
| గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ | 24,221 | 2,40,000 |
| గోవాషిప్‌యార్డ్ | 18,562 | 1,40,000 |
| హిందుస్థాన్ షిప్‌యార్డ్ | 19,000 | 79,000 |
| ఆర్మర్డ్ వెహికల్స్ నిగమ్ | 5,544 | 41,735 |
| ఇండియా ఆప్టెల్ | 7,682 | 49,575 |
| మ్యూనిషన్స్ ఇండియా | 23,120 | 67,250 |

**దేశీయంగా రక్షణ రంగ ఉత్పత్తుల తయారీ (రూ.కోట్లలో)**

| సంవత్సరం | తయారీ | ప్రైవేట్ రంగ వాటా (%లో) |
|---|---|---|
| 2020–21 | 84,643 | 20.4 |
| 2021–22 | 94,845 | 21.0 |
| 2022–23 | 1,08,684 | 19.4 |
| 2023–24 | 1,27,434 | 20.9 |
| 2024–25 | 89,702 (డిసెంబరు వరకు) | 23.5 |

**రక్షణ రంగంలో అంకురాల సంఖ్య**

| 2022–23 | 2023–24 | 2024–25 |
|---|---|---|
| 355 | 475 | 603 |

- ఈనాడు వాణిజ్య విభాగం

# ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్

### తొలి 10 మందిలో స్థానం కోల్పోయిన బిల్‌గేట్స్

అంతర్జాతీయ వ్యాపార దిగ్గజాలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమ వినూత్న వ్యూహాలతో సంపదను పెంచుకున్నారు. ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల సంఖ్య 2025లో 3028కి పెరగడం ఇందుకు నిదర్శనం. వీరి మొత్తం సంపద విలువ 16.1 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. 2025 జులైకు సంబంధించి ఫోర్బ్స్ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ఎలాన్‌మస్క్ ప్రపంచ అగ్రగామి కుబేరుడిగా కొనసాగుతున్నారు. అయితే ఈ ఏడాది జూన్‌తో పోలిస్తే ఆయన సంపద విలువ 16 బి. డాలర్లు తగ్గి 407 బి. డాలర్ల (రూ.34.6 లక్షల కోట్ల)కు పరిమితమైంది. 2024 మేలో 400 బి. డాలర్ల మైలురాయిని అధిగమించిన తొలి కుబేరుడిగా నిలిచినప్పటి నుంచీ, మస్క్ అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.




✦ అగ్రగామి 10 మంది కుబేరుల సంపద విలువ జూన్ 1తో పోలిస్తే 100 బిలియన్ డాలర్లు అధికమై 2 లక్షల కోట్ల డాలర్లకు చేరింది.

✦ తన సంపద విలువ 7 రోజుల్లోనే దాదాపు 30% (52 బిలియన్ డాలర్లు) తగ్గి, 124 బిలియన్ డాలర్లకు పరిమితం కావడం వల్ల, అగ్రగామి 10 మంది కుబేరుల జాబితాలో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు బిల్‌గేట్స్‌కు స్థానం దక్కలేదు.

### 15వ స్థానంలో ముకేశ్

దాదాపు 116 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచ కుబేరుల్లో 15వ స్థానంలో ముకేశ్ అంబానీ ఉన్నారు. 100 బిలియన్ డాలర్ల (సుమారు రూ.8.85 లక్షల కోట్ల) క్లబ్‌లో ఉన్న ఏకైక ఆసియావాసి ఈయనే.

| ర్యాంకు | పేరు | నికర విలువ (బి.డా.) | కంపెనీ |
|---|---|---|---|
| 1 | ఎలాన్ మస్క్ | 393.1 | టెస్లా, స్పేస్‌ఎక్స్ |
| 2 | లారీ ఎలిసన్ | 275.9 | ఒరాకిల్ |
| 3 | మార్క్ జుకర్‌బర్గ్ | 247.9 | ఫేస్‌బుక్ |
| 4 | జెఫ్ బెజోస్ | 236.8 | అమెజాన్ |
| 5 | బెర్నార్డ్ ఆర్నాల్ట్ | 147.7 | ఎల్‌వీఎమ్‌హెచ్ |
| 6 | లారీ పేజ్ | 146.2 | గూగుల్ |
| 7 | వారెన్ బఫెట్ | 143.1 | బెర్క్‌షైర్‌హత్‌వే |
| 8 | స్టీవ్ బామర్ | 141.3 | మైక్రోసాఫ్ట్ |
| 9 | సెర్గీ బ్రిన్ | 139.7 | గూగుల్ |
| 10 | జెన్సెన్ హువాంగ్ | 137.9 | ఎన్‌విడియా |

## మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ రెవ్‌ఎక్స్

**ప్రారంభ ధర రూ.8.94 లక్షలు**



దిల్లీ: మహీంద్రా అండ్ మహీంద్రా సంస్థ, బహుళ వినియోగ వాహనం ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ రెవ్‌ఎక్స్‌ను ఆవిష్కరించింది. దీని ప్రారంభ ధర రూ.8.94 లక్షలు. డిజైన్‌లో మార్పులు, అధిక ఫీచర్లతో వస్తున్న ఈ మోడల్‌లో ఎమ్, ఎమ్(ఓ), ఏ వేరియంట్లను తీసుకొచ్చింది. 1.2 లీటర్ ఎంస్టాలియన్ పెట్రోలు ఇంజిన్‌తో లభ్యమయ్యే ఈ మోడల్ అయిదు రంగుల్లో (గ్రే, టాంగో రెడ్, నెబ్యూలా బ్లూ, ఎవరెస్ట్ వైట్, స్టెల్త్ బ్లాక్) లభిస్తుంది. 10.24 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, స్టీరింగ్ ఆడియో కంట్రోల్, డ్రైవర్ సీట్ హైట్ అడ్జస్ట్ ఫీచర్ తదితరాలు దీని ప్రత్యేకతలు. ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, 4 డిస్క్ బ్రేకులు సహా పలు ప్రామాణిక ఫీచర్లతో భద్రతకు ప్రాధాన్యం ఇచ్చారు.

**కోడి గుడ్లు**

9న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

| | |
|---|---|
| హైదరాబాద్ | 540 |
| వరంగల్ | 542 |
| విజయవాడ | 550 |
| గోదావరి | 515 |
| విశాఖపట్నం | 540 |
| చిత్తూరు | 633 |

## నేడు దేశవ్యాప్త సమ్మె

దిల్లీ: నూతన కార్మిక చట్టాలు, ప్రైవేటీకరణ చర్యల్ని వ్యతిరేకిస్తూ వివిధ కార్మిక సంఘాలకు చెందిన దాదాపు 25 కోట్లమంది కార్మికులు బుధవారం దేశవ్యాప్త సమ్మె చేయనున్నారు. దీంతో బ్యాంకింగ్, తపాలా సహా పలు సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. కనీస వేతనంగా రూ.26,000 ఉండాలని, పాత పింఛన్ పథకాన్ని పునరుద్ధరించాలని, ఈపీఎఫ్‌వో చందాదారులకు నెలనెలా రూ.9,000 కనీస పింఛన్ చెల్లించాలని యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి. పారిశ్రామిక ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు చేపడతామని, సేవలకు అంతరాయం కలగడంతోపాటు ప్రభుత్వరంగ కంపెనీలూ ఒకరోజుపాటు మూతపడే అవకాశం ఉందని సీఐటీయూ జాతీయ కార్యదర్శి ఎ.ఆర్.సింధు తెలిపారు. రైతుల సమస్యలపై సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో బుధవారం మండల కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శనలు జరగనున్నాయి. సాధారణ సమ్మెలో పాల్గొనాలని ఉపాధి హామీ పథకం కూలీలకు 'నరేగా సంఘర్ష్ మోర్చా' పిలుపునిచ్చింది.

### అటవీ భూముల్లో బడుల నిర్మాణానికి గ్రామ సభ ఆమోదం చాలు

దిల్లీ: అటవీ భూముల్లో పాఠశాలలు, అంగన్‌వాడీలు, రహదారులు తదితర కనీస మౌలికవసతులు కల్పించడానికి వన్యప్రాణుల క్లియరెన్స్ అనుమతులు అవసరం లేదని కేంద్ర పర్యావరణ శాఖకు గిరిజన వ్యవహారాల శాఖ స్పష్టం చేసింది. అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఏ)-2006 ప్రకారం.. ఇలాంటి నిర్మాణాలకు గ్రామసభ ఆమోదం సరిపోతుందని లేఖలో పేర్కొంది. గిరిజనులకు ఉపయోగపడే కట్టడాలే అయినప్పటికీ అటవీ భూముల్లో నిర్మించాలంటే తమ అనుమతి అవసరమని 2020లో గిరిజన వ్యవహారాల శాఖకు పర్యావరణశాఖ లేఖ రాసింది. దీంతో ఎఫ్ఆర్ఏలోని సెక్షన్-3 (2) అమలుపై గందరగోళం నెలకొంది. కొన్ని సందర్భాల్లో కోర్టులు సైతం ఈ లేఖ ఆధారంగా ప్రాజెక్టులపై స్టేలు విధించేవి. తాజా వివరణతో గిరిజన వ్యవహారాలశాఖ ఈ గందరగోళానికి తెర దించింది.

## శ్రీరాముడు, శివుడు మా దేశంలోనే జన్మించారు

- నేపాల్ ప్రధాని ఓలి వ్యాఖ్య



కాఠ్‌మాండూ: శ్రీరాముడి జన్మస్థలంపై నేపాల్ ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలి మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కాఠ్‌మాండూలో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శ్రీరాముడు తమ దేశంలోనే జన్మించాడని పునరుద్ఘాటించారు. "రాముడు పుట్టిన స్థలం నేపాల్‌లోనే ఉంది. అది ఇప్పటికీ ఇక్కడే ఉంది. దీన్ని మేం అంతగా ప్రచారం చేయలేకపోతున్నాం. ఇది కొందరిని బాధిస్తుందని నేను భావిస్తున్నాను. శివుడు, విశ్వామిత్రుడు కూడా మా దేశంలోనే జన్మించారు. ఇది నేను సొంతంగా చెబుతున్నది కాదు. వాల్మీకి రాసిన అసలైన రామాయణం ఆధారంగానే చెబుతున్నాను" అని ఓలి వివరించారు. అయోధ్య తమ దేశంలోని చిత్వాన్‌లోని థోరిలో ఉందని గతంలోనూ ఓలి వివాదాస్పద ప్రకటన చేశారు.

## హిమాచల్‌ప్రదేశ్‌లో ఓ శునకం అరుపు 67 మందిని కాపాడింది



ఇంటర్నెట్‌డెస్క్: భారీ వర్షాలతో వరద ముంపునకు గురైన హిమాచల్‌ప్రదేశ్‌లో ఓ శునకం ఏకంగా 67 మందిని కాపాడింది. కొండచరియలు విరిగిపడే ప్రమాదాన్ని ముందే పసిగట్టిన శునకం పెద్దగా అరవసాగింది. దీంతో ఇంటి నుంచి బయటకు వచ్చిన ఓ వ్యక్తి పరిస్థితిని గమనించి చుట్టుపక్కల వాళ్లను అప్రమత్తం చేశారు. దాదాపు 67 మంది ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన మండీ జిల్లాలోని సియతి గ్రామంలో జూన్ 30వ తేదీ అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో చోటుచేసుకుంది. "మా ఇంటి రెండో అంతస్తులో ప్రతిరోజు ఓ శునకం నిద్రపోతుంది. ఆరోజు ఉన్నట్టుండి అది విపరీతంగా అరవడం మొదలుపెట్టింది. మరోవైపు కుంభవృష్టి కురుస్తోంది. ఆ అరుపుల శబ్దానికి నేను లేచి దాని దగ్గరకు వెళ్లాను. భవనం పై అంతస్తుకు వెళ్లగా ఇంటి గోడకు పగుళ్లు కనిపించాయి. ఇంట్లోకి నీరు రావడం మొదలైంది. దాంతో వెంటనే శునకాన్ని కూడా కిందికి తీసుకెళ్లి, అందరినీ నిద్ర లేపాను. చుట్టుపక్కల వాళ్ల ఇళ్లకు వెళ్లి వారిని కూడా లేపి, సురక్షిత ప్రాంతానికి వెళ్లాలని చెప్పాను. అలా దూరంగా వెళ్లామో, లేదో.. మా గ్రామంపై కొండచరియ విరిగిపడింది. దీంతో పదుల సంఖ్యలో ఇళ్లు నేలమట్టం అయ్యాయి" అని సియతి గ్రామస్థుడు నరేంద్ర తెలిపారు.

# భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి చేరువయ్యాం

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి
- పలు దేశాలకు సుంకాలపై లేఖలు
- బంగ్లాదేశ్‌పై 35శాతం విధింపు

న్యూయార్క్, వాషింగ్టన్: భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి చేరువయ్యామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. 'మేం బ్రిటన్‌తో ఒప్పందం చేసుకున్నాం. చైనాతో చేసుకున్నాం. భారత్‌తో ఒప్పందం కుదుర్చుకోవడానికి దగ్గరగా ఉన్నాం' అని పేర్కొన్నారు. ఇతర దేశాలతోనూ చర్చలు జరిపామని, అయితే వాటితో ఒప్పందాలు కుదిరే అవకాశం కనిపించడం లేదని వెల్లడించారు. అందుకే వారికి ప్రతీకార సుంకాల విధింపు లేఖలను పంపుతున్నామని వివరించారు. ఇందులో భాగంగా సోమవారం పలు దేశాలపై ప్రతీకార సుంకాల మోత మోగించారు. ఆయా దేశాలకు లేఖలను పంపారు. ఇందులో బంగ్లాదేశ్‌పై 35శాతం సుంకం విధించారు. సోమవారం సుంకాల అమలు గడువును ఆగస్టు 1 వరకూ పొడిగించడంతోపాటు దేశాలకు లేఖలను పంపించే కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం శ్వేతసౌధంలో ట్రంప్ మాట్లాడారు. 'వాణిజ్య ఒప్పందానికి రాని దేశాలకు సుంకాలకు సంబంధించిన లేఖలు పంపుతున్నాం. మీరు మాతో ఆటలాడాలనుకుంటే ఇలాంటి మూల్యం చెల్లించాల్సి వస్తుంది' అని స్పష్టం చేశారు.

**ఏయే దేశాలపై ఎంత సుంకాలంటే.. (శాతాల్లో)**

| దేశాలు | శాతం | దేశాలు | శాతం |
|---|---|---|---|
| మయన్మార్, లావోస్ | 40 | కాంబోడియా, థాయ్‌లాండ్ | 36 |
| సెర్బియా, బంగ్లాదేశ్ | 35 | దక్షిణాఫ్రికా, బోస్నియా అండ్ హెర్జ్‌గోవినా | 30 |
| కజకస్థాన్, మలేసియా, ట్యునీసియా | 25 | ఇండోనేసియా | 32 |

■ భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని మరోసారి ట్రంప్ వ్యాఖ్యానించారు. వాణిజ్య ఒప్పందం బెదిరింపులతోనే ఇద్దరూ దారికి వచ్చారని పేర్కొన్నారు. ఇంకా సెర్బియా, కొసావో, రువాండా, కాంగోల్లోనూ యుద్ధం జరగకుండా ఆపానని తెలిపారు.

### వ్యవసాయ ఉత్పత్తులపై పీటముడి

వ్యవసాయం, పాల ఉత్పత్తుల రంగాల్లో అమెరికాకు సుంకాల ఉపశమనం కల్పించడం భారత్‌కు పెద్ద సవాలు. ఇప్పటివరకూ ఏ దేశంతోనూ ఈ రంగాల్లో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని భారత్ కుదుర్చుకోలేదు.

■ అమెరికా.. సుంకాల లేఖలు పంపిన దేశాల్లో బంగ్లాదేశ్, బోస్నియా అండ్ హెర్జ్‌గోవినా, కాంబోడియా, ఇండోనేసియా, జపాన్, కజకస్థాన్, లావో పీపుల్స్ డెమొక్రటిక్ రిపబ్లిక్, మలేసియా, సెర్బియా, దక్షిణాఫ్రికా, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్, ట్యునీసియా, మయన్మార్ ఉన్నాయి. ఈ లేఖల్లో ఎవరెంత సుంకాలను చెల్లించాలనే వివరాలున్నాయని ట్రంప్ తెలిపారు. కొన్ని దేశాలు తమపై 200 సుంకాలను విధిస్తున్నాయని, వాటితో వ్యాపారం చేయడం అసాధ్యమని స్పష్టం చేశారు.

### గడువు పొడిగింపుతో ఒడంబడికకు అవకాశం

వాస్తవానికి ట్రంప్ ప్రకటించిన సుంకాలు.. బుధవారం నుంచి అమల్లోకి రావాల్సి ఉంది. అయితే వాటిని ఆగస్టు 1 వరకూ పొడిగిస్తూ సోమవారం ఆయన ప్రకటన చేశారు. దీంతో ఒప్పందం కుదుర్చుకోవడానికి భారత్‌కు కొంత సమయం లభించింది. ఆయన లేఖలు పంపిన దేశాల్లో భారత్ లేదు. వాణిజ్య ఒప్పందం డెడ్‌లైన్ల ఆధారంగా కుదుర్చుకోబోమని, పూర్తిగా కొలిక్కివచ్చాకే తుది నిర్ణయం తీసుకుంటామని గత వారం భారత వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. జాతీయ ప్రయోజనాలే తమకు ముఖ్యమని పేర్కొన్నారు.

# ఉత్తరాదిన దంచికొడుతున్న వానలు

- మరో నాలుగు రోజుల పాటు విస్తారంగా వర్షాలు!



ఉత్తరాఖండ్‌లోని చమోలీలో మంగళవారం భారీ ఎత్తున కురిసిన వర్షాలతో ఓ గ్రామంలో ముంచెత్తిన వరద

దిల్లీ: రుతుపవనాల ఆగమనంతో ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్, గుజరాత్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, మహారాష్ట్రల్లో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వానల కారణంగా జనజీవనం అస్తవ్యస్తమయింది. రోడ్లన్నీ నదులను తలపిస్తున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, వారణాసిలోని ఘాట్‌లు నీట మునిగిపోయాయి. అయోధ్యలో సరయూ నది నీటిమట్టం ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తోంది. పుణ్య స్నానాలు ఆచరించేందుకు భక్తులు నది లోపలికి వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. తాము సూచించిన నిర్దిష్ట ప్రాంతాల్లో మాత్రమే పుణ్యస్నానాలు ఆచరించాలని సూచించారు. ఉత్తరాఖండ్‌లోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గుజరాత్‌లో మంగళవారం సాయంత్రం వరకు 413.52 మి.మీ. వర్షపాతం నమోదైంది. జులై 11వ తేదీ వరకు మత్స్యకారులను సముద్రంలోకి వెళ్లొద్దని వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. మంగళవారం తెల్లవారుజాము నుంచే కోల్‌కతా సహా పశ్చిమబెంగాల్‌లోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దక్షిణ బెంగాల్‌లోని ఐదు జిల్లాలకు ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అస్సాం, మధ్యప్రదేశ్, జమ్మూకశ్మీర్‌లో కూడా భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరో నాలుగు రోజులు పాటు విస్తారంగా వానలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) చెబుతోంది.

# నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ పేరు

- నామినేట్ చేస్తున్నట్లు ప్రకటించిన నెతన్యాహు



నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేసిన లేఖను ట్రంప్‌నకు అందిస్తున్న నెతన్యాహు

వాషింగ్టన్: నోబెల్ శాంతి బహుమతికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరును ఇజ్రాయెల్ ప్రతిపాదించింది. ఆయన పేరును నామినేట్ చేస్తూ నోబెల్ బహుమతి కమిటీకి లేఖ పంపినట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తెలిపారు. సోమవారం రాత్రి శ్వేతసౌధంలో జరిగిన విందు కార్యక్రమంలో ట్రంప్‌నకు ఈ విషయాన్ని తెలియజేస్తూ లేఖ ప్రతిని అందజేశారు. ఇప్పటికే పాకిస్థాన్ ఇలాంటి ప్రతిపాదన చేయగా ఇప్పుడు ఇజ్రాయెల్ ఇలాగే స్పందించడం విశేషం. "ట్రంప్ ఇప్పటికే గొప్ప పనులు చేశారు. ఒక ప్రాంతం తర్వాత మరొక ప్రాంతంలో శాంతిని నెలకొల్పుతున్నారు. అందుకే నోబెల్ బహుమతికి పేరు ప్రతిపాదించాను. అన్ని అర్హతలున్న ఆయనకు తప్పనిసరిగా పురస్కారం దక్కుతుంది. పశ్చిమాసియాలో శాంతి కోసం ట్రంప్ ప్రయత్నాలను ప్రపంచవ్యాప్తంగా అనేకమంది అభినందిస్తున్నారు" అని నెతన్యాహు పేర్కొన్నారు. ఇరాన్ అణు కేంద్రాలపై సంయుక్త దాడితో అనూహ్య విజయం సాధించామని చెప్పారు. 60 రోజులు కాల్పులు విరమించాలనే ప్రతిపాదనను ముందుకు తీసుకువెళ్లడంపై నేతలిద్దరూ చర్చించుకున్నారు. వారంలోపే దీనిపై సమావేశం జరగనుందని ట్రంప్ ప్రతినిధి తెలిపారు. చర్చలు తిరిగి ప్రారంభించడంపై ఇరాన్ తన సమ్మతి తెలపాల్సి ఉంది.

ఇజ్రాయెల్ ప్రధాని ఇచ్చిన నామినేషన్ లేఖను చూసి ట్రంప్ సంతోషించారు. పేరును నామినేట్ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



**ఒక పనికి మీరు భయపడుతున్నారంటే..**

పని ప్రాముఖ్యత, భయం.. ఈ రెండూ పరస్పరం అనులోమానుపాతంలో ఉంటాయి. ఒక పని చేసేందుకు మీరు ఎంత ఎక్కువగా భయపడుతుంటే.. ఆ పని మీకు అంత ముఖ్యమైనదని అర్థం! కాబట్టి భయం కారణంగా ఎప్పుడూ పనిని పక్కన పెట్టేయకండి.

– మార్క్ మాన్సన్, రచయిత

## ప్రత్యేక సవరణ ఓటరు జాబితా తయారీలో భాగమే

- విపక్షాల విమర్శలకు ఈసీ స్పందన

దిల్లీ: బిహార్‌లో ఓటరు జాబితా ప్రక్షాళనను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలన్నీ ఏకమై చేస్తోన్న విమర్శలకు ఎన్నికల సంఘం (ఈసీ) స్పందించింది. ఈ కసరత్తు సరైన ఓటరు జాబితా తయారీలో భాగమేనని పేర్కొంది. నిష్పాక్షిక, న్యాయబద్ధమైన ఎన్నికల నిర్వహణకు అనర్హుల ఏరివేత అవసరమేనని, సమగ్రత కోసమే ఓటరు జాబితాను ప్రక్షాళన చేస్తున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. దిల్లీలో మంగళవారం బూత్ స్థాయి అధికారుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఒకే ఓటరు పేరు రెండు మూడు సార్లు నమోదై ఉంటే వాటిని సరిచేస్తామని, అనర్హులను జాబితాల నుంచి తొలగించడం జరుగుతుందని తెలిపారు.

### సెప్టెంబరు 1 వరకు అభ్యంతరాల స్వీకరణ

ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా బిహార్‌లో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల తనిఖీ చేపడుతున్నట్లు రాష్ట్ర ఎన్నికల అధికారులు తెలిపారు. 'పేరు, చిరునామా, పాత ఫొటోతో కూడిన వివరాలను ముందే ముద్రించిన గణన ఫారాలను ఇప్పటికే 97.42% మంది ఓటర్లకు అందజేశాం. గణన ఫారాలను ఈ నెల 25 వరకు సమర్పించిన వారి పేర్లతో ఆగస్టు ఒకటిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తాం. అభ్యంతరాలకు, అర్హత పత్రాల సమర్పణకు సెప్టెంబరు ఒకటి వరకు సమయం ఉంటుంది. ప్రతిపాదన తిరస్కరణకు గురైతే జిల్లా కలెక్టర్‌కు, ఆపై ఎన్నికల సంఘం సీఈవోకు విన్నవించుకోవచ్చు' అని ఈసీ స్పష్టం చేసింది.

### 'కాలం చెల్లిన ఔషధాలను టాయిలెట్లలో వేసి ఫ్లష్ చేయండి'

దిల్లీ: కాలం చెల్లిన, ఉపయోగించని కొన్ని ఔషధాలను చెత్తబుట్టల్లో, ఆరుబయట పడేయటం వల్ల అవి ప్రజలకు, జంతువులకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీవో) హెచ్చరించింది. అత్యంత ప్రమాదకరమైన ఈ మందులను పద్ధతి ప్రకారమే పారవేయాలని తెలిపింది. 17 రకాల ఔషధాలతో ఈ మేరకు ఓ జాబితాను విడుదల చేసింది. వీటిలో తీవ్ర నొప్పి, వ్యాకులత వంటి రుగ్మతల నియంత్రణకు వినియోగించే ట్రామాడోల్, టాపెంటాడోల్, డయాజెపామ్, ఆక్సికోడోన్, ఫెంటానిల్ వంటివి ఉన్నాయి. ఇళ్లలో మిగిలిపోయే ఈ ఔషధాలను కవర్లలో నుంచి చించి, టాయిలెట్లలో వేసి ఫ్లష్ చేయాలని సీడీఎస్‌సీవో సూచించింది.

# ఉత్పాతాలకు ఎర్త్ పెట్టేద్దాం!



➤ ఇంట్లో వైరింగ్ అంతా పక్కాగా ఉంది. కానీ, ఉన్నట్టుండి స్విచ్ బోర్డులో మంటలు వస్తున్నాయి. కారణమేంటి?

➤ అప్పటివరకు ఫ్రిజ్ బాగానే పనిచేసింది. ఒక్కసారిగా భగ్గుమని కాలిపోయింది. ఇలా ఎందుకు జరిగింది?

➤ ఎప్పుడూ వాడే వాషింగ్ మెషిన్.. పట్టుకుంటే షాక్ కొట్టింది... ఏమై ఉంటుంది?

ఇంటికి ఎర్తింగ్ లేకపోవడమే ఈ ప్రమాదాలన్నిటికీ కారణం. కొన్ని సందర్భాల్లో ఇది తీవ్ర నష్టాలకు దారితీస్తుంది. అదే కాస్త ఖర్చు చేసి ఎర్తింగ్ చేస్తే విద్యుత్తు ఉత్పాతాల నుంచి ఇంటిని సురక్షితంగా ఉంచొచ్చు. ముఖ్యంగా వానాకాలంలో ఉరుములు, పిడుగుల నుంచి రక్షణ ఉంటుంది.

**ఎర్తింగ్ లేకుంటే..!**

- ఇంట్లో ఉన్న విద్యుత్తు ఉపకరణాలు షాక్ కొట్టే అవకాశం ఉంది.
- జంక్షన్ బాక్సులు.. ఎంసీబీలు ఉన్న చోట మంటలు రావొచ్చు
- విద్యుత్ ఎక్కువగా డ్రా చేసిన సమయంలో ఉపకరణాలు దెబ్బతింటాయి.

**మీటరు చెప్పేస్తుంది...**

- ఎర్తింగ్ సరిగా ఉందా లేదా అనేది మీటర్ ద్వారా అప్పుడప్పుడు పరిశీలించాలి. 1 నుంచి 5 ఓమ్స్ మధ్య మీటర్ రీడింగ్ సంకేతంగా ఉన్నట్లే. 5 ఓమ్స్ దాటిందంటే మాత్రం ఎర్తింగ్ ఇబ్బంది ఉన్నట్లే
- ఎర్త్ పిట్‌లో బొగ్గు.. ఉప్పు కలిపి పోస్తే సమర్థంగా పనిచేస్తుంది. అది తడిగా ఉండేలా అప్పుడప్పుడు నీటిని పోయాలి
- వ్యవసాయ కనెక్షన్లకూ ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలి. దీనివల్ల మోటార్లకు భద్రత ఉంటుంది.

**ఇలా చేయాలి...**

- గృహ, వ్యవసాయ, వాణిజ్య కనెక్షన్లు ఇచ్చే సమయంలోనే విద్యుత్ అధికారులు ప్రాంగణాన్ని తనిఖీ చేసి.. ఇంటర్నల్ వైరింగ్ నిర్దేశిత ప్రమాణాల మేరకు చేశారా? ఎర్తింగ్ ఛాంబర్ ఉందా? అని పరిశీలించాలి.
- రిజిస్టర్ కాంట్రాక్టర్ల లిస్టును ప్రభుత్వం ప్రకటించాలి. వారి ద్వారానే ఇంట్లో వైరింగ్ చేయించేలా చూడాలి.
- ఇంటి ఇంటర్నల్ వైరింగ్ పటాన్ని రిజిస్టర్ కాంట్రాక్టర్ విద్యుత్తు శాఖకు ఇచ్చేలా ఉన్న ఆదేశాలను అమలుచేయాలి.
- ప్రస్తుతం ఇది పేపర్‌పై మాత్రమే ఉంటోంది. క్షేత్రస్థాయిలో ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారు. ఆవిషయంలో కఠినంగా ఉండాలి.
- ఇంట్లో ఏర్పాటు చేసే స్విచ్‌లు.. సాకెట్‌లలో న్యూట్రల్.. ఫేజ్.. ఎర్త్ కలిపి మూడు పిన్‌లు ఉండాలి. ఇలా చేస్తే సాకెట్‌లో విద్యుత్తు ఉపకరణానికి సంబంధించిన వైర్ పెట్టినప్పుడు.. లీకేజీ విద్యుత్ ఉంటే ఎర్త్ పిన్ ద్వారా వెళ్లిపోతుంది. విద్యుత్ ఉపకరణాలకు ప్రమాదం ఉండదు. రెండు పిన్‌లు ఉంటే స్విచ్‌లలో ఎర్తింగ్ ఉండదు

-ఈనాడు, అమరావతి

## ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన భాజపా అధ్యక్షుడు మాధవ్



ముఖ్యమంత్రి చంద్రబాబుకు దశావతారాల జ్ఞాపిక అందజేస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్. చిత్రంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎన్టీఆర్, విశాఖ జిల్లాల భాజపా అధ్యక్షులు శ్రీరామ్, పరశురామరాజు

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబును ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మాధవ్‌కు సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. తాజా పరిస్థితులపై ముచ్చటించారు. కూటమి కలయిక మరింత బలోపేతమై రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని మాధవ్ ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వినూత్న ఆలోచనలతో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తున్నారని.. పీ4 పథకం విజయవంతంలో భాజపా భాగస్వామ్యం అవుతుందని తెలిపారు. సీఎంను కలిసినవారిలో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎన్టీఆర్, విశాఖ జిల్లాల భాజపా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, పరశురామరాజు ఉన్నారు.

## మన మిత్రలోనూ.. అన్నదాతా సుఖీభవ వివరాలు

ఈనాడు, అమరావతి: అన్నదాత సుఖీభవ పోర్టల్‌లోకి వెళ్లి.. ఆ పథకానికి అర్హులో కాదో తెలుసుకునే విధానాన్ని వ్యవసాయ శాఖ ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది. తాజాగా వాట్సప్ మన మిత్ర ద్వారా కూడా ఈ వివరాలు తెలుసుకునేలా వీలు కల్పించింది. వాట్సప్‌లో మన మిత్ర (95523 00009) నంబరుకు హాయ్ అని సందేశం పంపిస్తే.. సేవను ఎంపికచేసుకుని.. అందులో మొదట వరుసలో ఉండే అన్నదాత సుఖీభవ పై క్లిక్ చేసి ఆధార్ నంబరు నమోదు చేసుకోవాలి. వెంటనే లబ్ధిదారుని పేరు, తండ్రి పేరు, జిల్లా, మండలం, గ్రామం తదితర వివరాలు వస్తాయి. అందులోనే అర్హులా, అనర్హులా అనే వివరాలు ఉంటాయి. అనర్హులైతే అందుకు కారణం కూడా ఉంటుంది. ఈ-కేవైసీ పూర్తయిందో లేదో కూడా తెలుస్తుంది.

**రైతు సేవా కేంద్రాల్లో లబ్ధిదారుల జాబితాలు**

అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల జాబితాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు. అర్హుల జాబితాలో పేరు లేకపోతే.. జులై 13 లోగా రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

## దస్త్రాల దహనం కేసులో పూర్వ ఆర్డీఓ అరెస్టు

### సుప్రీంకోర్టు ముందస్తు ఆదేశాలుండటంతో విడుదల



మురళి

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయ దస్త్రాల దహనం కేసులో మాజీ మదనపల్లె రెడ్డి రామచంద్రారెడ్డి సస్పెండైన, పూర్వ ఆర్డీఓ మురళిని సీఐడీ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. కొంతకాలంగా పరారీలో ఉన్న ఆయన తిరుపతి కేటీ నగరంలోని ఇంట్లో ఉన్నట్లు గుర్తించి, సీఐడీ అధికారులు తీసుకుని కార్యాలయానికి తరలించారు. దస్త్రాల దహనం కేసులో అరెస్టు చేస్తే బెయిల్‌పై విడుదల చేయాలన్న సుప్రీంకోర్టు ముందస్తు ఉత్తర్వుల మేరకు ఆయన్ను విడుదల చేసినట్లు సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ తెలిపారు. గతేడాది జులై 21న మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం ఘటన జరిగిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ ఇప్పటికే అరెస్టయి బెయిలుపై విడుదలయ్యారు.

## వై.ఎస్.భాస్కరరెడ్డికి 4 వారాలపాటు బెయిలు షరతుల సడలింపు

ఈనాడు, హైదరాబాద్: వై.ఎస్.భాస్కరరెడ్డి సీసీఎస్ పోలీసుల ముందు ప్రతి మంగళవారం హాజరుకావాలన్న షరతును తెలంగాణ హైకోర్టు 4 వారాలపాటు సడలించింది. ఆగస్టు 5న సీసీఎస్ పోలీసుల ఎదుట హాజరుకావాలని మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ ఎంపీ వై.ఎస్.వివేకానంద హత్య కేసులో ఏ7 నిందితుడైన భాస్కరరెడ్డికి గతేడాది షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది. పొత్తికడుపు నొప్పి కారణంగా అపోలో ఆసుపత్రిలో చేరి, శస్త్రచికిత్స చేయించుకోవడంతో బెయిలు షరతుల ప్రకారం ప్రతి మంగళవారం సీసీఎస్ పోలీసుల ఎదుట హాజరుకాలేనని, షరతును సడలించాలంటూ భాస్కరరెడ్డి అత్యవసరంగా పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది మెడికల్ నివేదికలు సమర్పించారు. వాదనలు విని, మెడికల్ రికార్డులు పరిశీలించిన న్యాయమూర్తి షరతును సడలించారు.



### మీ రక్తపోటు నియంత్రణలో ఉండాలంటే..

అధిక రక్తపోటు నివారణలో ఆహార నియమాల ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయకండి. రక్తపోటును నియంత్రణలో ఉంచుకునేందుకు- పోషకాలు పుష్కలంగా ఉండే ఆహార పదార్థాలను తరచూ తీసుకోండి. వాటిలో ముఖ్యమైనవి ఇవీ..

- **అరటిపండు:** ఇందులోని పొటాషియం చాలా మేలు చేస్తుంది.
- **బీట్‌రూట్:** ఇది నైట్రిక్ ఆక్సైడ్ బూస్టర్‌లా పనిచేస్తుంది.
- **డార్క్ చాక్లెట్:** ఇందులోని మెగ్నీషియంతో బోలెడు లాభాలుంటాయి.
- **దానిమ్మ:** ఎంజైమ్‌ల నియంత్రణకు దోహదపడుతుంది.
- **అల్లం:** గుండె కండరాలు, రక్తనాళాల గోడల్లోకి క్యాల్షియం చొరబడకుండా నివారిస్తుంది.

– జానీ బ్రౌన్, హెల్త్ కోచ్

# తోతాపురి మామిడి కొనుగోలు ఖర్చు భరించండి

- కేంద్ర వ్యవసాయ మంత్రికి రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడి వినతి

ఈనాడు, దిల్లీ: రాష్ట్రంలో తోతాపురి మామిడి కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చును పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించాలని ఏపీ వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన ఇక్కడ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో కలిసి కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌ను కలిసి దీనిపై వినతిపత్రం సమర్పించారు. 'ఈ ఏడాది పెరిగిన దిగుబడుల కారణంగా తోతాపురి మామిడి ధరలు తగ్గాయి. దీంతో రైతులు దెబ్బతినకుండా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీం కింద కిలో మామిడి కనీస మద్దతు ధరను రూ.12గా నిర్ణయించింది. అందులో వ్యాపారులు 8 రూపాయలు, మిగిలిన 4 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేలా నిర్ణయించింది. ఈ ఏడాది 6.50 లక్షల టన్నుల సరకు కొనుగోలు చేయాల్సి వస్తుందని అంచనా. కిలోకు రూ.4 చొప్పున చెల్లించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై రూ.260 కోట్ల భారం పడుతోంది. ప్రభుత్వ ఆర్థిక సమస్యల దృష్ట్యా ఈ మొత్తాన్ని కేంద్రమే అందించేలా చర్యలు తీసుకోండి' అని విజ్ఞప్తి చేశారు.

**100% రాయితీతో సూక్ష్మసేద్యం పరికరాలు అందించండి:** 'రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలను వెనుకబడిన ప్రాంతాలుగా గుర్తించి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. ఈ జిల్లాల్లో రైతులకు అందించే సూక్ష్మసేద్య పరికరాలను చిన్న, సన్నకారు రైతులకు 90%, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100% సబ్సిడీతో అందించాలి' అని అచ్చెన్నాయుడు కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరారు. సూక్ష్మసేద్య పరికరాల కొనుగోలుకు 45% వాటాను భరించడం వారికి కష్టంగా ఉందని చెప్పారు.

★ విజయనగరం జిల్లా గరివిడిలో ఏర్పాటు చేసిన పశువైద్య కళాశాలకు ప్రభుత్వపరమైన గుర్తింపు మంజూరు చేసినందుకు కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌కు అచ్చెన్నాయుడు ధన్యవాదాలు తెలిపారు.



మామిడి ధరపై శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు. చిత్రంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే శంకర్

### తోతాపురి మామిడి సేకరణకు అధికారులతో ప్రత్యేక బృందాలు

#### ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు

ఈనాడు, అమరావతి: రైతుల నుంచి తోతాపురి రకం మామిడి సేకరణకు అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సమీక్షిస్తున్నామని.. గతంతో పోలిస్తే ప్రాసెసింగ్ యూనిట్ల వద్ద వాహనాలు వేచి ఉండే కాలం తగ్గిందని ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. కిలోకు రూ.12 చొప్పున చెల్లిస్తూ.. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో మంగళవారం వరకు 3,47,170 టన్నుల మామిడి సేకరించామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల వద్ద ఇంకా 1.50 లక్షల టన్నుల మేర నిల్వ ఉంటుందని అంచనా వేస్తున్నామని మొత్తం సరకు కొనుగోలు చేస్తామని వివరించారు. రైతులకు చెల్లించే రూ.12 ధరలో.. రాష్ట్ర ప్రభుత్వం కిలోకు రూ.4 చొప్పున భరిస్తోందన్నారు. 20 ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా కొనుగోలు జరుగుతోందని తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఈ ఏడాది మామిడి ఉత్పత్తి పెరగడంతోపాటు.. పల్ప్ ఎగుమతులు నిలిచాయని వెల్లడించారు.

# ట్రాక్టర్లలో మామిడి తెద్దాం.. ప్రభుత్వాన్ని ఇరుకున పెడదాం

- జగన్ చిత్తూరు జిల్లా పర్యటనలో వైకాపా నేతల వ్యూహం

ఈనాడు– చిత్తూరు: చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పేందుకు వైకాపా నేతలు వ్యూహం రచించినట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత జగన్ పర్యటన సందర్భంగా ముందుగానే ట్రాక్టర్లలో మామిడి కాయలు తెచ్చి వ్యాపారులు కిలో 2, 3 రూపాయలకే అడుగుతున్నారని తమ కార్యకర్తలతో చెప్పించి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా ప్రణాళికలు రూపొందించారని సమాచారం. బుధవారం ఉదయం మాజీ ముఖ్యమంత్రి జగన్ మార్కెట్ యార్డుకు వచ్చిన తర్వాత ఈ మేరకు చెప్పించాలని చూస్తున్నారు. బంగారుపాళ్యం మండలంలోని 90 శాతం మంది రైతులు తోతాపురి మామిడిని గుజ్జు పరిశ్రమలు, ర్యాంపులకే తీసుకెళతారు. పది శాతం మాత్రమే మార్కెట్‌కు వస్తుంది. అయినా వైకాపా అధినేత మార్కెట్ యార్డుకే రావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రణాళికకు పోలీసులు అడ్డుపడితే వాహనాల్లో తెచ్చిన మామిడిని అక్కడే పడేసి నిరసన తెలిపే అవకాశం ఉంది. ఈ విషయం ఎస్పీ మణికంఠ దృష్టికి వెళ్లడంతో ఇలాంటి ఘటనలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఇప్పటికే హెచ్చరించారు. ఏమైనా సమస్యలుంటే ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లాలే తప్ప ఇష్టారాజ్యంగా వ్యవహరించకూడదని స్పష్టం చేశారు. మామిడి రైతులతో మాట్లాడేందుకు వస్తున్న జగన్ కార్యక్రమానికి.. వైకాపా నేతలు బహిరంగ సభలా జనసమీకరణ చేస్తున్నారు. మార్కెట్ యార్డులో 400- 500 మందే పడతారని.. అంతకు మించి తీసుకొస్తే అవాంఛనీయ ఘటనలు జరుగుతాయంటూ 370 మంది నాయకులు, కార్యకర్తలకు పోలీసులు నోటీసులిచ్చారు. ఆటో డ్రైవర్లు ప్రజలను అక్కడికి తీసుకెళ్లకూడదని సూచించారు.

## జగన్ పర్యటనలో అనుమతులు అతిక్రమిస్తే చర్యలు

- రోడ్‌షోలు, ర్యాలీలకు అనుమతి లేదు: చిత్తూరు ఎస్పీ మణికంఠ



బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం పర్యటనలో అనుమతులు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మణికంఠ పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. 'మామిడి రైతుల కష్టనష్టాలు తెలుసుకునేందుకు మాజీ సీఎం జగన్ బుధవారం బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు రానున్నారు. ఆయన బెంగళూరు నుంచి అరగొండ ఫ్లైఓవర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి చిత్తూరు వైపు మార్గంలోని నల్లగాంపల్లె ఫ్లైఓవర్ నుంచి జాతీయ రహదారిలోని మాధవనగర్ మీదుగా బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు వస్తారు. హెలిపాడ్ వద్ద 30 మంది, బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో జగన్‌తో మాట్లాడేందుకు 500 మందికి అనుమతి ఇచ్చాం. రోడ్‌షోలు, ర్యాలీల నిర్వహణకు అనుమతి లేదు. భారీగా జన సమీకరణకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం ఉంది. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రజలను తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు అందిన సమాచారంతో వైకాపా నాయకులు, కార్యకర్తలు 370 మందికి నోటీసులిచ్చాం. నిబంధనలు అతిక్రమిస్తే రౌడీ షీట్ తెరుస్తాం. సత్యసాయి, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో జగన్ పర్యటనల్లో జరిగిన సంఘటనల నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటాం' అని ఎస్పీ వివరించారు.

## సీజన్ ముగిశాక.. జగన్ పరామర్శలు హాస్యాస్పదం

### సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ




తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి సీజన్ అంతా ముగిసిన తరువాత రైతులకు గిట్టుబాటు ధర లభించలేదంటూ పరామర్శకు వెళ్లడం హాస్యాస్పదంగా ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఎద్దేవా చేశారు. మామిడి రైతుల సమస్యలను రాజకీయం చేయడం తగదని హితవు పలికారు. మంగళవారం తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జగన్ తీరు చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ఉందని, రైతుల పరామర్శకు వేల మంది మందీమార్బలంతో రావడం అవసరమా అంటూ ప్రశ్నించారు. ఆయన తీరు చావుకు, పెళ్లికి ఒకే మంత్రంలా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దతు ధర అమలు చేయని గుజ్జు పరిశ్రమలపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించాలని డిమాండ్ చేశారు. తెదేపా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైకాపా నేత నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయని.. దీన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇలాంటి నీచ సంస్కృతి సరికాదని హితవు పలికారు.


## మద్దతు ధరపై జగన్ కేంద్రానికి లేఖయినా రాశారా?

### నీలాయపాలెం విజయకుమార్

తిరుపతి (జీవకోన), న్యూస్‌టుడే: జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ మామిడి రైతులను పట్టించుకోలేదని, పదవి పోయాక రైతులు, మద్దతు ధర గుర్తుకొచ్చాయని తెదేపా నేత, రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ విమర్శించారు. తిరుపతిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బంగారుపాళ్యం కాకుండా మాజీ మంత్రికి చెందిన పీఎల్ఆర్ ఫుడ్స్ పరిశ్రమ వద్దకు చేరుకుని రైతులతో కలిసి ధర్నా చేయాలని సలహా ఇచ్చారు. మామిడి దిగుబడులు అనూహ్యంగా పెరగడంతో పరిశ్రమలు కొనుగోళ్లకు నిరాకరిస్తున్నాయన్నారు. దీనిపై జగన్ బాధ్యతగల ప్రతిపక్ష పార్టీ నాయకుడిగా మద్దతు ధర కోసం కేంద్రానికి లేఖయినా రాయలేదని దుయ్యబట్టారు. ఆయన రైతులకు అండగా వచ్చినట్లు లేదని.. మందీమార్బలంతో, వాహనాలతో పక్క జిల్లాల నుంచి సమీకరిస్తున్న మద్దతుదారులతో దండయాత్రకు వస్తున్నట్లు ఉందని ఎద్దేవా చేశారు.

# వైఎస్సార్‌కు జగన్, షర్మిల వేర్వేరుగా నివాళులు





ఇడుపులపాయలో వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధిపై పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ సీఎం జగన్, విజయమ్మ, తదితరులు ★ సమాధి వద్ద షర్మిలను ముద్దాడుతున్న విజయమ్మ

- ఇడుపులపాయలో వైఎస్సార్ జయంతి

వేంపల్లె, న్యూస్‌టుడే: వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌ను మాజీ సీఎం జగన్, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మంగళవారం వేర్వేరుగా సందర్శించారు. తండ్రి రాజశేఖరరెడ్డి సమాధి వద్ద నివాళులర్పించారు. ముందుగా జగన్, ఆయన సతీమణి భారతి, తల్లి విజయమ్మ, వైఎస్సార్ సోదరుడు సుధీకర్‌రెడ్డి తదితరులు వచ్చారు. అరగంటపాటు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. విజయమ్మ, జగన్ గత స్మృతులను గుర్తుకు తెచ్చుకొని భావోద్వేగానికి గురయ్యారు. విజయమ్మ.. జగన్‌ను దగ్గరకు తీసుకొని ముద్దాడారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. జగన్ వెంట ఎంపీ అవినాష్‌రెడ్డి, బద్వేలు, రాజంపేట, యర్రగొండపాలెం ఎమ్మెల్యేలు సుధ, అమర్‌నాథరెడ్డి, చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు డీ.సీ.గోవిందరెడ్డి, రమేష్ యాదవ్, రామచంద్రారెడ్డి ఉన్నారు.

**హైదరాబాద్‌లో వైఎస్సార్ స్మారక మందిరాన్ని ఏర్పాటు చేయాలి: షర్మిల**

జగన్ వైఎస్సార్ ఘాట్ నుంచి వెళ్లిన తర్వాత షర్మిల వచ్చి అక్కడే ఉన్న తల్లి విజయమ్మ, పినతండ్రి సుధీకర్‌రెడ్డితో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్సార్ అందించిన సేవలకు గుర్తుగా హైదరాబాద్‌లో రాజశేఖరరెడ్డి స్మారక మందిరాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయమై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కోరామని, కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీకి లేఖ రాశామన్నారు. మాజీ ఎంపీ తులసిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు విజయజ్యోతి ఆమె వెంట ఉన్నారు.

## మామిడి రైతులను చంద్రబాబు ఆదుకున్నారు

- రాజకీయ లబ్ధి కోసమే జగన్ వస్తున్నారు
- బంగారుపాళ్యం మండీ, ర్యాంపు వ్యాపారులు



మార్కెట్‌యార్డు కార్యాలయం ఎదుట విలేకరులతో మాట్లాడుతున్న మండీ, ర్యాంపు వ్యాపారులు

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతులను సీఎం చంద్రబాబు ఆదుకున్నారని స్థానిక మండీ, ర్యాంపు వ్యాపారులు తెలిపారు. బంగారుపాళ్యం మార్కెట్ యార్డు కార్యాలయం ఎదుట మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. 'ఈ ఏడాది మామిడి దిగుమతి పెరిగింది. బహిరంగ మార్కెట్లో డిమాండ్ లేక ధర తగ్గింది. ఈ పరిస్థితుల్లో బహిరంగ మార్కెట్ ధర టన్నుకు రూ.8 వేలు, ప్రభుత్వం నుంచి రూ.4 వేలు చేయూతనిచ్చి చంద్రబాబు రైతులను ఆదుకున్నారు. అధికారంలో ఉన్నప్పుడు.. మామిడి రైతులను జగన్ ఏనాడూ పట్టించుకోలేదు. రాజకీయ లబ్ధి పొందేందుకే ఆయన ఇప్పుడు బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు వస్తున్నారు. ఆయన రాకతో రెండురోజుల పాటు వ్యాపార లావాదేవీలు స్తంభిస్తాయి. రైతులు నష్టపోతారు' అని ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్, తెదేపా చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మామిడి కాయల మండీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చర్చిలో ప్రార్థనల్లో తితిదే ఏఈవో రాజశేఖర్‌బాబు

### సస్పెన్షన్ వేటు వేసిన ఉన్నతాధికారులు

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తితిదేలో సహాయ కార్యనిర్వహణ అధికారి(ఏఈఓ)గా పనిచేస్తున్న ఎ.రాజశేఖర్ బాబును సస్పెండ్ చేసినట్లు తితిదే మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. తిరుపతి జిల్లా పుత్తూరులోని చర్చిల్లో జరిగే ప్రార్థనల్లో ప్రతి ఆదివారం ఆయన పాల్గొంటున్నట్లు సమాచారం. దీనిపై ఫిర్యాదులు అందడం, సామాజిక మాధ్యమాల్లో వీడియోలు రావడంతో తితిదే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు. తితిదేలో పనిచేస్తూ అన్యమత ప్రార్థనల్లో పాల్గొన్న ఏఈవో స్థాయి అధికారిపై చర్యలు తీసుకోవడం ఇదే తొలిసారి. తితిదేలో ఇప్పటికే అన్యమతస్థులు 47 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరుకాక అనధికారికంగా మరో 375 మంది ఉన్నట్లు విజిలెన్స్ నివేదికలు చెబుతున్నాయి.

## 'శబరి' ఇక సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: తిరువనంతపురం-సికింద్రాబాద్-తిరువనంతపురం మధ్య గుంటూరు మీదుగా నడుస్తున్న శబరి ఎక్స్‌ప్రెస్ (17229/17230)ను సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా మారుస్తూ రైల్వే బోర్డు సంచాలకుడు (కోచింగ్) సంజయ్ ఆర్.నీలం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రైలుకు కొత్త నంబర్లు(20630/20629) కేటాయించారు. తిరువనంతపురంలో 06.45 గంటలకు బయలుదేరే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్‌కు మరుసటిరోజు 11 గంటలకే రానుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు సికింద్రాబాద్‌లో 14.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 18.20 గంటలకు తిరువనంతపురం చేరుకుంటుంది. తాజా ఉత్తర్వులు ఎప్పటి నుంచి అమల్లోకి రానున్నాయో సంబంధిత జోనల్ రైల్వే అధికారులు త్వరలోనే వెల్లడించనున్నారు. ప్రస్తుతం ఈ రైలు సికింద్రాబాద్‌లో 12.20 గంటలకు ప్రారంభమై మరుసటిరోజు 18.05 గంటలకు తిరువనంతపురం చేరుకుంటోంది.

## జప్తు చేసిన 58 కిలోల బంగారం ఇప్పించండి

### హైకోర్టులో గాలి జనార్దనరెడ్డి పిటిషన్

ఈనాడు, హైదరాబాద్: ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ స్వాధీనం చేసుకున్న 57.89 కిలోల బంగారాన్ని జప్తు నుంచి విడిపించేలా ఆదేశాలు జారీ చెయ్యాలని నిందితుడైన గాలి జనార్దనరెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఓబుళాపురం కంపెనీకి మైనింగ్ లీజు మంజూరు కాకముందే పిటిషనర్, ఆయన భార్య బంగారాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. సీబీఐ కోర్టు ఎందుకు జప్తు చేస్తున్నదీ కారణాలు పేర్కొనలేదన్నారు. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయకపోతే నష్టం వాటిల్లుతుందన్నారు. సీబీఐ తరఫు న్యాయవాది శ్రీనివాస్ కపాటియా కౌంటరు దాఖలు చేస్తామనగా న్యాయమూర్తి అనుమతిస్తూ ఈనెల 23కు వాయిదా వేశారు.

## బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న కాకినాడ కలెక్టర్



కాట్రావులపల్లిలో దత్తత కుటుంబం వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్

పెద్దాపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమంలో భాగంగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ మంగళవారం మూడు బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. జిల్లాలోని పెద్దాపురం మండలం వడ్లమూరుకు చెందిన దొండపాటి ఛార్లెస్, జగ్గంపేట మండలంలోని కాట్రావులపల్లిలో ఇంటి యజమానిని కోల్పోయిన శాంత నాగదుర్గ, ప్రత్తిపాడులో ఇందిరా కాలనీకి చెందిన మాదే రమణ కుటుంబాలను దత్తత తీసుకున్నారు. ఆయా కుటుంబాలను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ తాను అయిదు కుటుంబాలను దత్తత తీసుకుంటానని చెప్పారు.

# ఛాంపియన్


బుమ్రా

## బుమ్రా.. నెట్స్‌లో

లండన్: పని భారాన్ని తగ్గించుకునేందుకు రెండో టెస్టుకు దూరమైన భారత స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా.. లార్డ్స్‌లో జరిగే మూడో టెస్టుకు సిద్ధమవుతున్నాడు. మంగళవారం లార్డ్స్ మైదానం నెట్స్‌లో దాదాపు 45 నిమిషాల పాటు శ్రమించాడు. ఈ సెషన్లో వేయగలిగినన్ని ఎక్కువ బంతులు వేశాడు. అతను బ్యాటింగ్ సాధన కూడా చేశాడు. మరోవైపు టెస్టు అరంగేట్రం కోసం ఎదురు చూస్తున్న లెఫ్ట్ ఆర్మ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ కూడా నెట్స్‌లో ఎక్కువసేపు కష్టపడ్డాడు. అతడు సుమారు గంట సేపు బౌలింగ్ సాధన చేశాడు. కరుణ్ నాయర్, సుదర్శన్ కూడా ప్రాక్టీస్ చేశారు. కెప్టెన్ శుభ్‌మన్‌తో పాటు సిరాజ్, రాహుల్, జైస్వాల్, పంత్, ఆకాశ్‌దీప్ ఈ సెషన్‌కు దూరంగా ఉన్నారు. "పని భార నిర్వహణ బుమ్రాకు మాత్రమే కాదు. మిగిలిన బౌలర్లకు కూడా వర్తిస్తుంది. రెండో టెస్టులో సిరాజ్ భారత బౌలర్లందరికంటే ఎక్కువ ఓవర్లు వేశాడు. అతడి ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం" అని భారత బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ అన్నాడు.

## లార్డ్స్‌లో ఏం మారుతుంది?


అర్ష్‌దీప్


ఈనాడు క్రీడావిభాగం

లీడ్స్‌లో జరిగిన తొలి టెస్టులో ఓడిపోయారు. బర్మింగ్‌హామ్ రెండో టెస్టుకు బుమ్రా కూడా లేడు. అయినా కూడా భారత జట్టు 336 పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌ను మట్టికరిపించింది. అక్కడితో అయిపోలేదు. సిరీస్‌లో అసలు కథ ముందుంది. మూడో టెస్టు జరిగేది లార్డ్స్‌లో! పేసర్లకు స్వర్గధామంగా పేర్కొనే ఈ పిచ్‌పై భారత్‌కు సవాల్ తప్పదు. సాధారణంగా విజయం సాధించిన జట్టులో మార్పులు ఉండవు. కానీ గురువారం మొదలయ్యే మూడో టెస్టుకు మార్పులు అనివార్యంగా కనిపిస్తున్నాయి.

పని భార నిర్వహణలో భాగంగా స్టార్ పేసర్ బుమ్రాకు మేనేజ్‌మెంట్ రెండో టెస్టులో విశ్రాంతి ఇచ్చింది. లార్డ్స్‌లో జరిగే మూడో టెస్టులో అతను ఆడడం పక్కా. ఈ విషయాన్ని కెప్టెన్ శుభ్‌మన్ కూడా ధ్రువీకరించాడు. రెండో టెస్టులో బుమ్రా లేకపోవడంతో అతడి స్థానంలో ఆడిన ఆకాశ్ దీప్ అదరగొట్టాడు. పది వికెట్లు తీసి జట్టు విజయంలో ప్రధానపాత్ర పోషించాడు. దీంతో లార్డ్స్‌లోనూ అతడు కొనసాగుతాడు. మరో పేసర్‌గా మహ్మద్ సిరాజ్ ఎలాగో ఉన్నాడు. ఇక మిగిలింది ప్రసిద్ధ్ కృష్ణ. ఈ యువ పేసర్ తొలి రెండు టెస్టుల్లో విఫలమయ్యాడు. దీంతో లార్డ్స్ టెస్టులో అతడు రిజర్వ్ బెంచ్‌కే పరిమితమయ్యే సంకేతాలు కనిపిస్తున్నాయి.

స్వింగ్, సీమ్‌తో బ్యాటర్లకు పరీక్ష పెట్టే లార్డ్స్ పిచ్‌పై టెక్నిక్‌లో బలంగా ఉన్న బ్యాటర్లు కావాలి. ఆ సత్తా ఉన్న సాయి సుదర్శన్ లార్డ్స్‌లో బరిలో దిగే అవకాశాలున్నాయి. ఎనిమిదేళ్ల విరామం తర్వాత పునరాగమనం చేసిన కరుణ్ నాయర్ తొలి రెండు టెస్టుల్లో ప్రభావం చూపలేకపోయాడు. 4 ఇన్నింగ్స్‌ల్లో 77 పరుగులే చేశాడు. అతడి స్థానాన్ని సుదర్శన్‌తో భర్తీ చేసే అవకాశం ఉంది. ఒకవేళ సుదర్శన్, కరుణ్ ఇద్దరిని ఆడిస్తే.. ఆల్‌రౌండర్ కోటాలో రెండో టెస్టులో బరిలో దిగిన నితీశ్ కుమార్ రెడ్డిపై వేటు పడొచ్చు. ఆ మ్యాచ్‌లో బ్యాటుతో, బంతితో నితీశ్ నిరాశపరిచాడు. బర్మింగ్‌హామ్‌లో ఇద్దరు స్పిన్నర్లను (జడేజా, వాషింగ్టన్ సుందర్) ఆడించిన భారత్.. లార్డ్స్ పిచ్ స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఒకరికే పరిమితం కావొచ్చు. అప్పుడు జడేజా మాత్రమే జట్టులో కొనసాగే ఛాన్స్ ఉంది. బుమ్రా, సిరాజ్, ఆకాశ్‌లకు తోడు అర్ష్‌దీప్‌ను నాలుగో పేసర్‌గా ఆడించొచ్చు. స్పెషలిస్టు పేసర్ కంటే పేస్ ఆల్‌రౌండర్ ఉంటే బాగుంటుందని భావిస్తే.. శార్దూల్, నితీశ్‌లలో ఒకరికి అవకాశం దక్కుతుంది. స్పిన్నర్ కుల్‌దీప్‌కు అవకాశం కష్టమే.

# సెమీస్‌లో సబలెంకా


సబలెంకా

## అల్కరాస్ ముందుకు

లండన్

ప్రపంచ నంబర్‌వన్ అరినా సబలెంకా (బెలారస్) వింబుల్డన్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళవారం గట్టి ప్రతిఘటన ఎదురైన మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో ఆమె 4-6, 6-2, 6-4తో జర్మనీకి చెందిన లారా సీగ్మండ్‌పై విజయం సాధించింది. దాదాపు మూడు గంటల పాటు సాగిన పోరులో 14 సార్లు సర్వీసులు బ్రేక్ కావడం గమనార్హం. క్వార్టర్స్ చేరే క్రమంలో ఒక్క సెట్ కూడా కోల్పోని 37 ఏళ్ల సీగ్మండ్.. సబలెంకాతో పోరును కూడా ధాటిగా ఆరంభించింది. తొలి, మూడో గేముల్లో బ్రేకులతో తొలి సెట్లో 3-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే అంత తేలిగ్గా సెట్ సీగ్మండ్ సొంతం కాలేదు. నాలుగో గేమ్‌లో సబలెంకా బ్రేక్ సాధించింది. ఏడో గేమ్‌లో సీగ్మండ్ బ్రేక్ సాధించినా.. ఆ వెంటనే సర్వీసు కోల్పోయి 5-3తో నిలిచింది. కానీ తన తర్వాతి సర్వీసును నిలబెట్టుకుని సెట్‌ను గెలుచుకుంది. ఆ తర్వాత సబలెంకా పుంజుకుంది. రెండో సెట్ రెండో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేసింది. సబలెంకా మూడో గేమ్‌లో సర్వీసు చేజార్చుకున్నా.. ఆరో గేమ్‌లో బ్రేక్ సాధించింది. 4-2తో ఆధిక్యం సంపాదించింది. తర్వాత సర్వీసు నిలబెట్టుకున్న ఆమె, ఎనిమిదో గేమ్‌లో మరోసారి సీగ్మండ్ సర్వీసును బ్రేక్ చేసి సెట్‌ను నెగ్గింది. మూడో సెట్‌లో ఇద్దరూ 4-4తో సమంగా నిలిచారు. 9వ గేమ్‌లో విజయవంతంగా సర్వీసు చేసిన సబలెంకా 5-4 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాతి గేమ్‌లో బ్రేక్‌తో సెట్‌ను, మ్యాచ్‌ను గెలుచుకుంది. మ్యాచ్‌లో 29 విన్నర్లు కొట్టిన సబలెంకా 36 అనవసర తప్పిదాలు చేసింది. సీగ్మండ్ 28 విన్నర్లు కొట్టింది. 35 అనవసర తప్పిదాలు చేసింది. వింబుల్డన్ సెమీఫైనల్ చేరడం సబలెంకాకు ఇది మూడోసారి. ఫైనల్లో చోటు కోసం ఆమె 13వ సీడ్ అనిసిమోవాను ఢీకొంటుంది. క్వార్టర్స్‌లో అనిసిమోవా (అమెరికా) 6-1, 7-6 (11-9)తో పవ్లిచెంకోవా (రష్యా)పై నెగ్గింది.


అల్కరాస్

ఎనిమిదో సీడ్ స్వైటెక్ (పోలెండ్), ఏడో సీడ్ ఆండ్రీవా (రష్యా) క్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. నాలుగో రౌండ్లో స్వైటెక్ 6-4, 6-1తో టౌసన్ (డెన్మార్క్)పై, ఆండ్రీవా 6-2, 6-3తో నవారో (అమెరికా)పై నెగ్గారు.

**అల్కరాస్ అలవోకగా..:** పురుషుల సింగిల్స్‌లో రెండుసార్లు డిఫెండింగ్ ఛాంపియన్ కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్) అలవోకగా సెమీఫైనల్లో అడుగుపెట్టాడు. ఏకపక్షంగా సాగిన క్వార్టర్‌ఫైనల్లో అతడు 6-2, 6-3, 6-3తో నోరీ (బ్రిటన్)ని చిత్తుగా ఓడించాడు. అయిదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) కూడా సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. క్వార్టర్‌ఫైనల్లో అతడు 6-3, 6-3, 1-6, 7-6 (7-4)తో కచనోవ్ (రష్యా)పై నెగ్గాడు. టాప్ సీడ్ సినర్ (ఇటలీ)కి అదృష్టం కలిసొచ్చింది. అతడితో నాలుగో రౌండ్లో 6-3, 7-5, 2-2తో ఆధిక్యంలో ఉన్న దశలో దిమిత్రోవ్ (బల్గేరియా) గాయం కారణంగా రిటైరయ్యాడు.


వింబుల్డన్ స్టాండ్స్‌లో కోహ్లి, అనుష్క

## భారత్-పాక్ మ్యాచ్‌ల స్థాయిలో..

### టెన్నిస్ మ్యాచ్‌ల్లో ఒత్తిడిపై కోహ్లి

లండన్: టెన్నిస్ క్రీడాకారులు ఎదుర్కొనే ఒత్తిడి ప్రపంచకప్‌లో భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్‌తో సమానమని టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి అభిప్రాయపడ్డాడు. తన భార్య అనుష్క శర్మతో కలిసి లండన్‌లో వింబుల్డన్ మ్యాచ్‌లు వీక్షించిన సందర్భంగా విరాట్ ఈ వ్యాఖ్యలు చేశాడు. "ఒత్తిడి అనుభవం ఒకేలా ఉండొచ్చు. అయితే ప్రపంచకప్‌లో మాత్రమే భయం, ఒత్తిడి క్రికెటర్లలో కనిపిస్తుంది. ప్రపంచకప్‌లో భారత్, పాక్ మ్యాచ్ లేదా సెమీస్, ఫైనల్లో తీవ్ర ఒత్తిడి కారణంగా కాళ్లు వణుకుతాయి. కానీ టెన్నిస్ క్రీడాకారులు క్వార్టర్‌ఫైనల్ నుంచి ఫైనల్ వరకు అలాంటి ఒత్తిడిని ఎదుర్కొంటూ ఉండొచ్చు. ఆ ఒత్తిడిని ఎదుర్కోవడం చాలా కష్టం. అంత ప్రశాంతత, ఆ స్థాయి ఫిట్‌నెస్, మానసిక దృఢత్వంతో ఆడుతున్న టెన్నిస్ క్రీడాకారుల పట్ల నాకెంతో గౌరవం ఉంది" అని కోహ్లి పేర్కొన్నాడు.

## రెండో రౌండ్లో ప్రియాంక

బటుమి (జార్జియా): ఫిడే మహిళల ప్రపంచకప్‌లో కె.ప్రియాంక రెండో రౌండు చేరింది. తొలి రౌండ్లో ఆమె జోస్కా (హంగేరి)ను 5-3తో ఓడించింది. క్లాసికల్ గేమ్‌లో ప్రియాంక-జోస్కా 1-1తో నిలవడంతో టైబ్రేక్ అనివార్యమైంది. టైబ్రేక్‌లో ర్యాపిడ్ గేమ్‌లు కూడా డ్రాగానే ముగిశాయి. బ్లిట్జ్‌లో రెండు గేమ్‌లను గెలుచుకున్న ప్రియాంక ముందంజ వేసింది. పద్మిని, వంతిక, నందిత ఇప్పటికే రెండో రౌండు చేరారు.

## లంకదే వన్డే సిరీస్


కుశాల్

పల్లెకెలె: బంగ్లాదేశ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను శ్రీలంక 2-1తో సొంతం చేసుకుంది. మంగళవారం నిర్ణయాత్మక మూడో వన్డేలో ఆ జట్టు 99 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' కుశాల్ మెండిస్ (124; 114 బంతుల్లో 18×4), కెప్టెన్ అసలంక (58; 68 బంతుల్లో 9×4) రాణించడంతో లంక 7 వికెట్లకు 285 పరుగులు చేసింది. బంగ్లా బౌలర్లలో మెహిదీ మిరాజ్ (2/48), తస్కిన్ అహ్మద్ (2/51) ఆకట్టుకున్నారు. అనంతరం అసిత ఫెర్నాండో (3/33), దుష్మంత చమీర (3/51), వెల్లలాగె (33), హసరంగ (2/35)ల ధాటికి బంగ్లా 39.4 ఓవర్లలో 186 పరుగులకే కుప్పకూలింది. తౌహిద్ హృదోయ్ (51) టాప్‌స్కోరర్.

రాత్రి 11 నుంచి

## సిరీస్ పట్టేస్తారా!

### నేడే భారత్-ఇంగ్లాండ్ నాలుగో టీ20

మాంచెస్టర్: తొలి రెండు టీ20ల్లో అదిరే ఆటతో ఆతిథ్య జట్టు ఇంగ్లాండ్‌కు షాక్ ఇచ్చింది భారత మహిళల జట్టు. కానీ మూడో మ్యాచ్‌లో ఎదురుదెబ్బ తగిలింది. ఈ నేపథ్యంలో తప్పులు దిద్దుకుని సిరీస్ పట్టేయాలనే లక్ష్యంతో బుధవారం నాలుగో టీ20లో బరిలోకి దిగుతున్నారు భారత అమ్మాయిలు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ పెద్ద స్కోర్లు చేయకపోవడం జట్టును కలవరపెడుతోంది. తొలి మూడు టీ20ల్లో బ్యాటింగ్‌లో స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, అమన్‌జ్యోత్ కౌర్ నిలకడగా రాణించారు. బౌలింగ్‌లో జట్టు బలంగా ఉంది. తెలుగమ్మాయిలు శ్రీచరణి (8 వికెట్లు), అరుంధతి రెడ్డి (4) విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఆల్‌రౌండర్ దీప్తిశర్మ (6) కూడా రాణిస్తోంది. ఇంగ్లాండ్ జట్టులో డంక్లీ, డాని వ్యాట్, బెల్ ఫామ్‌లో ఉన్నారు.

## అత్యంత విలువైన ఫ్రాంఛైజీగా ఆర్సీబీ

ముంబయి: 17 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ తొలిసారిగా ఐపీఎల్ ఛాంపియన్స్‌గా నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.. మరో ఘనత సాధించింది. ఐపీఎల్‌లో అత్యంత విలువైన ఫ్రాంఛైజీగా అవతరించింది. ఇప్పటివరకు అగ్రస్థానంలో ఉన్న చెన్నై సూపర్ కింగ్స్‌ను వెనక్కి నెట్టి ఆర్సీబీ నంబర్‌వన్‌గా నిలిచింది. హౌలిహన్ లోకీ పెట్టుబడి బ్యాంకు నివేదిక ప్రకారం బెంగళూరు ఫ్రాంఛైజీ విలువ 269 మిలియన్ అమెరికన్ డాలర్లు (సుమారు రూ.2,293 కోట్లు)గా పేర్కొంది. చెన్నై రూ.2,003 కోట్లతో మూడో స్థానానికి పడిపోగా.. ముంబయి ఇండియన్స్ రూ.2,063 కోట్లతో రెండో స్థానంలో కొనసాగుతోంది. కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.1,935 కోట్లు, సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.1,313 కోట్లు, పంజాబ్ కింగ్స్ రూ.1,203 కోట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఐపీఎల్ విలువ 13.8 శాతం పెరిగి రూ.33,249 కోట్లకు చేరింది. ఐపీఎల్ వాణిజ్యం 12.9 శాతం పెరిగి రూ.1,57,716 కోట్లకు ఎగబాకినట్లు నివేదికలో పేర్కొన్నారు.

## జింబాబ్వే వైట్‌వాష్

రెండో టెస్టులో దక్షిణాఫ్రికా ఘనవిజయం


బాష్

బులవాయో: రెండు టెస్టుల సిరీస్‌లో దక్షిణాఫ్రికా 2-0తో ఆతిథ్య జింబాబ్వేను వైట్‌వాష్ చేసింది. ఆఖరి టెస్టులో సఫారీ జట్టు ఇన్నింగ్స్ 236 పరుగుల భారీ తేడాతో గెలిచింది. ఫాలో ఆన్ ఆడుతూ మూడో రోజు, మంగళవారం 51/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే.. 220 పరుగులకే ఆలౌటైంది. నిక్ వెల్ (55) టాప్‌స్కోరర్. కార్బిన్ బాష్ (4/38), సెనురన్ ముత్తుస్వామి (3/77), కొడి యూసుఫ్ (2/38) ప్రత్యర్థి పతనాన్ని శాసించారు. తొలి ఇన్నింగ్స్‌ను దక్షిణాఫ్రికా 626/5 వద్ద డిక్లేర్ చేసింది. జింబాబ్వే 170 పరుగులకే ఆలౌటైంది.


ప్రభాస్

## రామోజీ ఫిల్మ్ సిటీలో చిరు - ప్రభాస్ హంగామా

సంక్రాంతి బరిలో సందడి చేసేందుకు తన కొత్త చిత్రాన్ని చకచకా పరుగులు పెట్టిస్తున్నారు చిరంజీవి. మరోవైపు 'ది రాజాసాబ్'ను పూర్తి చేయడమే లక్ష్యంగా రంగంలోకి దిగిపోయారు ప్రభాస్. ఇప్పుడీ ఇద్దరి సినిమాల చిత్రీకరణలకు రామోజీ ఫిల్మ్ సిటీ వేదికైంది. ప్రస్తుతం ఇక్కడే ఈ అగ్రతారలిద్దరూ హంగామా చేస్తున్నారు.

### రాజాసాబ్.. ఫన్నీ సీన్స్

ఈ డిసెంబరులో 'ది రాజాసాబ్'గా సినీప్రియుల్ని పలకరించనున్నారు కథానాయకుడు ప్రభాస్. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలు. సంజయ్ దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా ప్రస్తుతం ఆర్ఎఫ్‌సీలో చకచకా చిత్రీకరణ చేసుకుంటోంది. ఈ షెడ్యూల్‌లో భాగంగా ప్రభాస్‌తో పాటు వీటీవీ గణేశ్, ప్రభాస్ శ్రీను తదితర కీలక తారాగణంపై ఫన్నీ సీన్స్ తెరకెక్కిస్తున్నారు. ఈ వారాంతం వరకు ఇక్కడే చిత్రీకరణ కొనసాగనుంది. హారర్ కామెడీ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో ప్రభాస్ రెండు కోణాల్లో సాగే పాత్రలో కనువిందు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని పాటలతో సహా సెప్టెంబరు నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళిక రచించారు. ఇది డిసెంబరు 5న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనికి తమన్ సంగీత దర్శకుడిగా, కార్తీక్ పళని ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.


చిరంజీవి

### రయ్ రయ్.. చిరు

'సంక్రాంతికి వస్తున్నాం' విజయం తర్వాత అగ్రకథానాయకుడు చిరంజీవితో చేతులు కలిపారు దర్శకుడు అనిల్ రావిపూడి. వీళ్లిద్దరి కలయికలో రూపొందుతున్న ఈ 'మెగా 157' (వర్కింగ్ టైటిల్) సినిమా ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. కాగా, ఇప్పుడీ చిత్ర కొత్త షెడ్యూల్ ఆర్ఎఫ్‌సీలో కొనసాగుతోంది. ప్రస్తుతం దీనిలో భాగంగా చిరంజీవితో పాటు ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారు. ఇందులో హీరో వెంకటేశ్ ప్రత్యేక పాత్రలో సందడి చేయనున్న సంగతి తెలిసిందే. త్వరలోనే ఆయన కూడా ఈ చిత్ర సెట్స్‌లోకి అడుగు పెట్టనున్నారు. ఇది వినోదం, యాక్షన్ అంశాలతో నిండిన కుటుంబ కథా చిత్రంగా ముస్తాబవుతోంది. చిరు దీంట్లో శంకర్ వరప్రసాద్ అనే పాత్రలో అలరించనున్నారు. నయనతార కథానాయిక. కేథరిన్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిసింది. ఇది వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాకి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తుండగా.. సమీర్ రెడ్డి ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# ఈనాడు సినిమా

## సనాతన ధర్మాన్ని పరిరక్షించే ఓ వీరుడి కల్పిత కథతో..

'హరి హర వీరమల్లు'గా సినీప్రియుల్ని పలకరించనున్నారు కథానాయకుడు పవన్ కల్యాణ్. ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించారు. ఏఎం రత్నం సమర్పణలో ఎ.దయాకర్ రావు నిర్మించారు. నిధి అగర్వాల్ కథానాయిక. బాబీ దేవోల్, అనుపమ్ ఖేర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈనెల 24న థియేటర్లలోకి రానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రచార పర్వాన్ని వేగవంతం చేసింది చిత్ర బృందం. అయితే ఈ చిత్రం తెలంగాణకు చెందిన ఓ వీరుడి కథ ఆధారంగా రూపొందినట్లు వార్తలొస్తున్న నేపథ్యంలో చిత్ర బృందం స్పందించింది. ఆ ప్రచారంలో వాస్తవం లేదని తెలిపింది. "ఇది నిజ జీవితంలోని ఏ ఒక్క నాయకుడి కథ ఆధారంగానూ తెరకెక్కలేదు. సనాతన ధర్మాన్ని పరిరక్షించే ఓ వీరుడి ప్రయాణాన్ని తెలిపే కల్పిత కథగా దీన్ని రూపొందించాం. ఈ సినిమాలో పవన్ పాత్ర శివుడు, విష్ణువుల అవతారంలా ఉంటుంది. అందుకే ఆ లక్షణాల్ని ప్రతిబింబించేలాగే 'హరి (విష్ణువు) హర (శివుడు) వీరమల్లు' అనే టైటిల్‌ను ఖరారు చేశాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి.


పవన్ కల్యాణ్



## సవాళ్లు ఎదురైనా రహస్యాలను ఛేదించే డిటెక్టివ్


రెడీ ఇన్ ఓటీటీ

నిజాయతీగా ఉండే డిటెక్టివ్‌లు పరిష్కారం కాని పాత క్రిమినల్ కేసులను తీసుకుని దర్యాప్తు చేసి ఎంతోమందికి న్యాయం చేస్తుంటారు. అందుకే ఎల్ఏపీడీ అనే కోల్డ్ కేస్ విభాగాన్ని పర్యవేక్షించే బాధ్యతను డిటెక్టివ్ రెనీ బల్లార్డ్ (మాగీ క్యూ)కు అప్పగిస్తారు. ఈ నేపథ్యంలోనే ఆమె పెండింగ్‌లో ఉన్న కేసులను దర్యాప్తు చేయడం ప్రారంభిస్తుంది. ఈ కేసుల దర్యాప్తులోనే తన డిపార్ట్‌మెంట్‌కి సంబంధించిన కొన్ని రహస్యాలు బయటపడతాయి. పోలీసు శాఖలోని కొందరి ప్రమేయం ఇందులో ఉందని తెలుస్తుంది. అయినా వెనుకడుగు వేయకుండా రిటైర్డ్ డిటెక్టివ్ హ్యారీ బాష్(టైటస్ వెల్లివర్) సహాయంతో నిజానిజాలను బయటపెట్టడానికి ప్రయత్నిస్తుంది. ఇలా వృత్తి పరంగా ఎన్నో సవాళ్లున్నా హత్యల వెనుక రహస్యాలను ఛేదిస్తున్న ఆఫీసర్ కథేంటో మీరూ చూసేయండి. క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన 'బల్లార్డ్' సిరీస్‌కి మైఖేల్ కాన్నేల్లీ, మైఖేల్ అలైమో దర్శకత్వం వహించారు.

**నటీనటులు:** మాగీ క్యూ, మైఖేల్ మోస్లి, టైటస్ వెల్లివర్

**విడుదల:** బుధవారం

**ప్లాట్‌ఫామ్:** అమెజాన్ ప్రైమ్ వీడియో



## ప్రముఖ రచయిత శివశక్తి దత్తా కన్నుమూత

ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి ఇంట విషాదం నెలకొంది. ఆయన తండ్రి, ప్రముఖ రచయిత, చిత్రకారుడు, దర్శకుడు శివశక్తి దత్తా (92) కన్నుమూశారు. వయోభారంతో బాధపడుతున్న ఆయన సోమవారం రాత్రి హైదరాబాద్ మణికొండలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. శివశక్తి దత్తా అసలు పేరు కోడూరి సుబ్బారావు. ఆంధ్రప్రదేశ్‌లోని కొవ్వూరులో రైతు కుటుంబంలో జన్మించారు. కళలపై ఆసక్తితో పదిహేనేళ్ల వయసులోనే ముంబయి వెళ్లి అక్కడి జె.జె స్కూల్ ఆఫ్ ఆర్ట్‌లో డిప్లొమా చేశారు. ఆ తర్వాత తిరిగొచ్చి కమలేష్ పేరుతో చిత్రలేఖనం చేశారు. 'కళ లేనిదే నా జీవితం లేదు' అని పలు సందర్భాల్లో చెప్పుకున్న ఆయన చివరివరకూ చిత్రలేఖనం, సినిమాతోపాటే ప్రయాణం చేశారు. సంగీతం నేర్చుకున్న ఆయన, సాహిత్యంపైనా తనదైన ముద్ర వేశారు. శివశక్తి దత్తా భార్య భానుమతి 2022లో కన్నుమూశారు. ఈ దంపతులకి సంగీత దర్శకులు కీరవాణి, కల్యాణ్ కోడూరి, రచయిత ఎస్.ఎస్.కాంచితోపాటు శ్వేతనాగ, మల్లేశ్వరి, సప్తమి సంతానం. ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్ ఆయనకు సోదరుడు. ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళికి శివశక్తి దత్తా పెద్దనాన్న.

### అరుదైన రచయిత...

శివశక్తి దత్తా తన సోదరుడు విజయేంద్రప్రసాద్‌తో కలిసి పలు చిత్రాలకు రచయితగా పనిచేశారు. 'జానకిరాముడు' సినిమాతో రచయితలుగా ఈ ఇద్దరికీ మంచి పేరొచ్చింది. స్క్రీన్ రైటర్‌గానే కాకుండా, గీత రచనపైనా శివశక్తి దత్తా దృష్టిపెట్టారు. సంస్కృతంతో పాటు, ఐదు భాషల్లో పాటలు రాయగల ప్రావీణ్యం సంపాదించిన అరుదైన రచయిత ఆయన. పలు తెలుగు సినిమాల్లో ఆయన రాసిన సంస్కృత గీతాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. 'ఛత్రపతి'లోని అగ్నిస్ఖలన..., 'బాహుబలి: ది బిగినింగ్'లో మమతల తల్లి.., 'ఎన్టీఆర్ - కథానాయకుడు'లో కథానాయక..., 'బాహుబలి: ది కన్‌క్లూజన్'లో సాహోరే బాహుబలి.., 'జాంబిరెడ్డి'లో మృత్యుంజయ, 'ఆర్ఆర్ఆర్'లో రామం రాఘవం... తదితర పాటలు ఎంతగానో ప్రాచుర్యం పొందాయి. నల్లా నల్లని కళ్ల పిల్ల..(సై), మన్నేలా తింటివిరా కృష్ణా...(ఛత్రపతి) లాంటి మాస్ గీతాలు కూడా ఆయన రాసినవే. రాజమౌళి - కీరవాణి కలయికలో వచ్చిన సినిమాల్లో ఎక్కువగా పాటలు రాశారు శివశక్తి దత్తా. 'చంద్రహాస్' అనే సినిమాకి దర్శకత్వం వహించారు. తన కుమారుడు కీరవాణి ఆస్కార్ పురస్కారం సొంతం చేసుకున్నప్పుడు ఎంతో భావోద్వేగానికి గురయ్యారు. ఆయన సంగీతంలో రాణించి, ఉన్నతస్థాయికి చేరడంపై ఎంతో గర్వపడేవారు.

### బహుముఖ ప్రజ్ఞాశాలి

శివశక్తి దత్తా ఇక లేరన్న విషయం తెలుసుకుని మహేశ్‌బాబుతో పాటు పలువురు సినీ ప్రముఖులు మణికొండలోని ఆయన నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, ప్రముఖ కథానాయకుడు పవన్‌కల్యాణ్ సంతాపం ప్రకటించారు. "కళలు, సాహిత్యంపై ఎంతో అభిమానం కలిగినవారు శివశక్తి దత్తా. కీరవాణి, ఆయన సోదరులకి నా సానుభూతి" అంటూ సంతాపం తెలిపారు. ప్రముఖ కథానాయకుడు చిరంజీవి సామాజిక మాధ్యమాల వేదికగా స్పందిస్తూ... "చిత్రకారుడు, రచయిత, కథకుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన శివశక్తి దత్తా మృతి చెందడం దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన ఆత్మకు శాంతి కలగాలి" అంటూ సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో శివశక్తిదత్తా అంత్యక్రియలు ముగిశాయి.

## ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే కథ ఇది


దేవయాని, సిద్ధార్థ్, చైత్ర

'3 బీహెచ్‌కే' సినిమాతో ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చారు సిద్ధార్థ్. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని శ్రీ గణేశ్ తెరకెక్కించారు. అరుణ్ విశ్వ నిర్మించారు. శరత్ కుమార్, దేవయాని, మీథా రఘునాథ్, చైత్ర కీలక పాత్రలు పోషించారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సిద్ధార్థ్ మాట్లాడుతూ.. "ఒక క్లాసిక్ సినిమాకి ఉండాల్సిన లక్షణాలన్నీ ఈ చిత్రానికి ఉన్నాయి. ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే కథ ఇది. మాకింత మంచి విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు" అన్నారు. "ఈ చిత్రం అందరికీ గొప్పగా కనెక్ట్ అయింది" అన్నారు దర్శకుడు శ్రీగణేశ్. ఈ కార్యక్రమంలో దేవయాని, చైత్ర, అరుణ్ విశ్వ తదితరులు పాల్గొన్నారు.

### ట్రయథ్లాన్‌లో సత్తా చాటిన సయామీ



మరిన్ని విశేషాలు https://epaper.eenadu.netలో

## ఆసక్తి రేకెత్తించే యాక్షన్ థ్రిల్లర్


ఇంద్రజ, సన్నీ, బాబీ

సన్నీ అఖిల్, అజయ్ ఘోష్, రవి కాలే ప్రధాన పాత్రల్లో బాబీ తెరకెక్కించిన చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'. బెల్లి జనార్దన్ నిర్మాత. సాయాజీ షిండే, శుభలేఖ సుధాకర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. ఇంద్రజ, సముద్ర, కేఎల్ దామోదర్ ప్రసాద్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. దర్శకుడు బాబీ మాట్లాడుతూ.. "ఇదొక యాక్షన్ థ్రిల్లర్. ఆద్యంతం ఆసక్తిని రేకెత్తించేలా సాగుతుంది" అన్నారు. 18న వస్తున్న ఈ చిత్రాన్ని అందరూ ఆదరించాలని కోరారు చిత్ర నిర్మాత జనార్దన్.

## కఠిన చర్యలు తప్పవు

- ప్రశాంతిరెడ్డిపై వైకాపా నేత వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరం
- ముఖ్యమంత్రి చంద్రబాబు

**ఈనాడు, అమరావతి:** మహిళలపై ఇష్టానుసారం వ్యాఖ్యలు చేస్తూ... వారి పట్ల అనుచితంగా ప్రవర్తించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై వైకాపా మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరమని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మంగళవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 'వైకాపా నేతల తీరులో మార్పు రావడం లేదు. మహిళలను బూతులు తిట్టడం, కించపరచడం అనేది ఆ పార్టీ రాజకీయ సిద్ధాంతం. మహిళలను అవమాన పరచడం, వ్యక్తిత్వ హననానికి పాల్పడటం ఆ పార్టీ డీఎన్ఏలోనే ఉంది. వారి ఘోర ఓటమికి ఇలాంటి పోకడలు ఓ కారణమని తెలిసినా... వారి సహజ గుణంలో మార్పు రావడం లేదు. నీచ సంస్కృతిని చాటుకుంటున్న వీరు మనుషులేనా? ఇది రాజకీయమా? మహిళల, మహిళా నాయకుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రణాళికాబద్ధంగా వైకాపా చేస్తున్న కుట్రలను ప్రతి పౌరుడూ గమనించాలి' అని ముఖ్యమంత్రి విజ్ఞప్తిచేశారు.

## సభ్య సమాజం సిగ్గుపడుతోంది

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేయడం వైకాపా నాయకులకు అలవాటుగా మారింది. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ఆ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరం. ఆ మాటలకు సభ్య సమాజం సిగ్గుపడుతోంది. ఆ వ్యాఖ్యలను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలి' అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 'మహిళల గౌరవానికి భంగం కలిగించినా, అసభ్య వ్యాఖ్యలు చేసినా చట్టపరంగా చర్యలుంటాయి. అధికారంలో ఉన్నప్పుడూ వైకాపా నాయకులు అసభ్య వ్యాఖ్యలు చేశారు. నిండు శాసనసభలోనూ అలాగే మాట్లాడటంతో ప్రజలు తగు రీతిలో తీర్పు చెప్పారు. ఇప్పటికీ ఆ అలవాటును ఆ పార్టీ వారు వదల్లేకపోతున్నారు. మహిళా సమాజం మరోసారి వారికి తగిన విధంగా సమాధానం చెబుతుంది' అని పవన్‌కల్యాణ్ అన్నారు.

## చట్టపరంగా చర్యలు తీసుకుంటాం

– మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై వైకాపా నేత ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన మురికి వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ చెప్పారు. మహిళా లోకాన్ని అవమానించేలా, సభ్య సమాజం సిగ్గుపడేలా ఉన్న ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు. 'దీనిని మహిళల గౌరవాన్ని దెబ్బతీసే కుట్రగా పరిగణించాలి. మురికి వ్యాఖ్యలు చేసిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదు' అని స్పష్టంచేశారు.

## బహిరంగ క్షమాపణ చెప్పాలి

– కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే, నెల్లూరు రూరల్

రాజకీయంగా విమర్శించాలి కానీ.. ప్రశాంతిరెడ్డిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం సరికాదు. ప్రసన్నకుమార్‌రెడ్డి మాటలకు ఆగ్రహించి... ఆయన ఇంటిపై వేమిరెడ్డి అభిమానులు ఎవరైనా దాడి చేసి ఉండొచ్చు. దాడులను ఎవరూ ప్రోత్సహించరు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను వేమిరెడ్డి దంపతులు ఇప్పటికే కోరారు. ఎన్నికలకు 15 రోజుల ముందు వేమిరెడ్డి దంపతులను శివపార్వతులంటూ కొనియాడిన ప్రసన్న.. ఇప్పుడు జుగుప్సాకర వ్యాఖ్యలు చేయడం దారుణం.



### ధైర్యం లేకపోతే ఏమీ సాధించలేం

ప్రతిఒక్కరిలోనూ తప్పనిసరిగా ఉండాల్సిన ఒక గొప్ప లక్షణం ఏంటో తెలుసా..? ధైర్యం! ఈ ప్రపంచంలో దాదాపుగా అందరికీ కలలు, ఆకాంక్షలు ఉంటాయి. ధైర్యం లేకపోతే వాటిని సాకారం చేసుకోవడం అసాధ్యం. చాలామంది తమ సామర్థ్యాలను తక్కువగా అంచనా వేసుకుంటూ సాదాసీదా పనులకు పరిమితమవుతుంటారు.

– సెజల్ సూద్, కంటెంట్ క్రియేటర్

# వైకాపాది నీచ సంస్కృతి

- ప్రసన్నకుమార్‌రెడ్డి మురికి వ్యాఖ్యలపై పెల్లుబికిన ఆగ్రహం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి





కోవూరులో భారీ ప్రదర్శనగా వెళ్లి ప్రసన్నకుమార్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు ● నెల్లూరు ఎస్పీ సౌజన్యకు ఫిర్యాదు చేస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

**ఈనాడు, నెల్లూరు:** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైకాపా నేత నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన మురికి వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహిళలు మంగళవారం పెద్ద సంఖ్యలో రోడ్డెక్కి ప్రసన్నకుమార్‌రెడ్డికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి మహిళలతో పాటు తెదేపా కార్యకర్తలు భారీగా కోవూరు పట్టణంలోని మండబయలు కూడలికి చేరుకున్నారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా పని చేసిన వ్యక్తి.. బాధ్యత లేకుండా మహిళ పట్ల అసభ్యకరంగా మాట్లాడటం దారుణమని మండిపడ్డారు. అక్కడి నుంచి ప్రదర్శనగా పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ప్రశాంతిరెడ్డికి బహిరంగ క్షమాపణ చెప్పిన తర్వాతే.. ప్రసన్నకుమార్‌రెడ్డి నియోజకవర్గానికి రావాలని, అప్పటి వరకూ ఆయనను అడుగు పెట్టనీయబోమని హెచ్చరించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోనూ ఆందోళనలకు దిగారు.

### ప్రజా జీవితం నుంచి బహిష్కరించాలి

'జిల్లాలో ఎప్పుడూ లేని విధంగా నీచ సంస్కృతికి వైకాపా తెర తీసింది. నన్ను రాజకీయంగా ఎదుర్కోలేక.. ప్రసన్నకుమార్‌రెడ్డి తప్పుడు మార్గం ఎంచుకున్నారు. నా భర్త చనిపోయాక... అత్తవారింటిలోని అందరి అనుమతితోనే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని వివాహం చేసుకున్నా. నా మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా... ఎన్నికల సమయం నుంచీ ప్రసన్నకుమార్‌రెడ్డి నీచ వ్యాఖ్యలు చేస్తున్నారు. కోవూరు మహిళలంతా నాకు అండగా నిలవడంతో ఎన్నికల్లో గెలిచా. వైకాపా అధినేత జగన్‌కు, ఆ పార్టీ నేతలకు... చెల్లెళ్లను గౌరవించే సంస్కారం లేదు. ఇలా అనుచిత వ్యాఖ్యలు చేయడం వారికి అలవాటే' అని ప్రశాంతిరెడ్డి మండిపడ్డారు. మహిళలపై తన పార్టీ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నా జగన్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రసన్నకుమార్‌రెడ్డిపై మంగళవారం ఆమె జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చి ఎస్పీ సౌజన్యకు ఫిర్యాదు చేశారు. తనను వ్యక్తిగతంగా, అసభ్య పదజాలంతో దూషించిన ప్రసన్నను అరెస్టు చేయాలన్నారు. తనలా మరో మహిళ బాధపడకుండా చూడాలని పోలీసులను ఆమె కోరారు. సభ్య సమాజం తలదించుకునేలా నోరుపారేసుకున్న అతడిని మహిళలు క్షమించరని, సంస్కారంలేని ఆ వ్యక్తిని ప్రజా జీవితం నుంచి బహిష్కరించాలన్నారు.

## ప్రసన్నకుమార్‌రెడ్డిని వైకాపా నుంచి బహిష్కరించాలి

- మహిళా ఎమ్మెల్యేపై వ్యాఖ్యలు దారుణం
- హోం మంత్రి అనిత



విలేకరులతో మాట్లాడుతున్న అనిత. చిత్రంలో బేబినాయన, కిమిడి నాగార్జున

**బొబ్బిలి, న్యూస్‌టుడే:** మహిళా ఎమ్మెల్యేపై మురికి వ్యాఖ్యలు చేసిన వైకాపా నేత ప్రసన్నకుమార్‌రెడ్డిని ఆ పార్టీ నుంచి బహిష్కరించాలని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత డిమాండు చేశారు. విజయనగరం జిల్లా బొబ్బిలి కోటలో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. 'మహిళా ఎమ్మెల్యే వ్యక్తిత్వ హననం చేయడం ప్రసన్నకుమార్‌రెడ్డికి సరికాదు. ఆ మాటల వీడియోను మీ తల్లి, భార్య, బిడ్డలకు చూపించండి. వారు దానిని సమర్థిస్తే మీ గురించి ఇంకేమీ మాట్లాడం. గతంలో నాపైనా ప్రసన్నకుమార్‌రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. వైకాపా నాయకులు.. మహిళలను అగౌరవ పరుస్తున్నారు. వారందరి డీఎన్ఏ ఒకటే. అప్పట్లో సకల శాఖల మంత్రిగా వెలిగిన సజ్జల రామకృష్ణారెడ్డి మహిళలను కించపరిచేలా మాట్లాడారు. బోరుగడ్డ అనిల్, శ్రీరెడ్డి, అంబటి రాంబాబు ఇష్టారాజ్యంగా వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని అడుక్కునే పరిస్థితికి వచ్చారు. జగన్‌కు రాజకీయం ముఖ్యమా? విలువలు ముఖ్యమా? తెలియడం లేదు. దీనికి ఆయన సమాధానం చెప్పాలి. ప్రసన్నకుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని చాలామంది మహిళలు ఫిర్యాదులు ఇచ్చారు. చట్టపరంగా ముందుకెళ్తాం' అని అనిత చెప్పారు.

- నేరాలకు మూలమైన గంజాయిపై ఉక్కుపాదం మోపామని, 10 వేల ఎకరాల్లో సాగును నిర్మూలించామని అనిత చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యే బేబినాయన, డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున పాల్గొన్నారు.

## మురికి వ్యాఖ్యలపై తెదేపా నేతల మండిపాటు

- జగన్ ఆడుతున్న నాటకంలో భాగమంటూ ధ్వజం

**ఈనాడు, అమరావతి:** ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన మురికి వ్యాఖ్యలను తెదేపా నేతలు ఖండించారు. పోలీసులు తక్షణమే ఆయనను అరెస్టు చేయాలని కోరారు. మహిళా లోకానికి వైకాపా అధ్యక్షుడు జగన్‌రెడ్డి క్షమాపణలు చెప్పి... ప్రసన్నకుమార్‌రెడ్డిని పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకోడానికి, రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలు సృష్టించడానికి జగన్ ఆడుతున్న నాటకంలో ఇదో భాగమని విమర్శించారు.

### జగన్ క్షమాపణలు చెప్పాలి

– పల్లా శ్రీనివాసరావు, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు

వైకాపా అధ్యక్షుడు జగన్ డైరెక్షన్‌లో ఆ పార్టీ నేతలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, విద్వేషం సృష్టించేలా, రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారు. రోజురోజుకూ దిగజారి మాట్లాడుతున్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలపై జగన్‌రెడ్డి ఇంతవరకు స్పందించకపోవడం దారుణం. సంస్కార హీనంగా మాట్లాడటం వైకాపా నేతలకే చెల్లింది. తక్షణమే మహిళా లోకానికి జగన్ క్షమాపణలు చెప్పాలి.

### ఆ మాటలు అత్యంత నీచం

– నారాయణ, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి

వైకాపా అధ్యక్షుడు జగన్ బాటలోనే ఆ పార్టీ నాయకులు నడుస్తున్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలు అత్యంత నీచమైనవి. సొంత చెల్లెలిపైనే జగన్ నోరుపారేసుకున్నారు. పసుపు చీర కట్టుకుని చంద్రబాబును కలిసేందుకు వెళ్లారంటూ షర్మిలపై అసభ్యకరంగా మాట్లాడారు. మహిళల పట్ల వైకాపా నాయకులకు ఎలాంటి అభిప్రాయం ఉందో ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యల ద్వారా మరోసారి తేటతెల్లమైంది.

### మహిళల ఆత్మగౌరవానికి తూట్లు

– ఆనం రామనారాయణరెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి

సభ్య సమాజం తలదించుకునేలా మహిళా ఎమ్మెల్యేపై ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నా. ఆ మాటలు మహిళల ఆత్మగౌరవానికి తూట్లు పొడుస్తున్నాయి. ఇష్టానుసారం మాట్లాడే వైకాపా నేతల తీరు దారుణం. ఎన్నికల్లో ప్రజలు 11 సీట్లతో బుద్ధి చెప్పినా.. వారి వైఖరిలో, భాషలో మార్పు రాలేదు. వైకాపా నాయకత్వం వెంటనే స్పందించి ప్రసన్నపై చర్యలు తీసుకోవాలి.

### ప్రసన్న వ్యక్తిత్వం లేని నాయకుడు

– సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, సర్వేపల్లి

తిట్టడం.. తర్వాత తప్పయిందంటూ కాళ్లు పట్టుకోవడం ప్రసన్నకుమార్‌రెడ్డికి అలవాటే. ప్రసన్న అప్పట్లో లక్ష్మీపార్వతి పార్టీలో ఉన్నారు. ఓ సందర్భంలో చంద్రబాబును ఇంటికి వెళ్లి మరీ కొడతానని నోరుపారేసుకున్నారు. నెల తర్వాత తప్పుగా మాట్లాడానంటూ కాళ్లు పట్టుకున్నారు. ఆ సంఘటనను నేను కళ్లారా చూశా. ప్రసన్న... క్యారెక్టర్ లేని నాయకుడు.

### వారి నుంచి గౌరవాన్ని ఆశించడం అత్యాశే

– బాల వీరాంజనేయస్వామి, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి

ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయి. సొంత తల్లి, చెల్లిపై గౌరవం లేని నేత దగ్గర పనిచేసే వారి నుంచి మహిళల పట్ల గౌరవాన్ని ఆశించడం అత్యాశే అవుతుంది.

### మహిళలను కించపరిస్తే ఊరుకోం

– పంచుమర్తి అనురాధ, శాసనమండలిలో చీఫ్ విప్

మహిళలను కించపరిచేలా వైకాపా నేతలు మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదు. ప్రశాంతిరెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక... ప్రసన్నకుమార్‌రెడ్డి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. తల్లికి, చెల్లికి విలువ ఇవ్వని జగన్‌రెడ్డే... నేర చరిత్ర కలిగిన వారిని జనం మీదకు వదిలి... ఇలా మాట్లాడిస్తున్నారు.

## నాగార్జునసాగర్‌ను సందర్శించిన 24 దేశాల ప్రతినిధులు

**విజయపురిసౌత్, న్యూస్‌టుడే:** విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై శిక్షణ పొందుతున్న 24 దేశాలకు చెందిన 27 మంది ప్రతినిధుల బృందం మంగళవారం నాగార్జునసాగర్‌ను సందర్శించింది. జలాశయం, జలవిద్యుత్తు కేంద్రం తదితర ప్రాంతాలను వారు పరిశీలించారు. సాగర్ ప్రాజెక్టు చరిత్రను ఇరిగేషన్ అధికారులు వారికి వివరించారు.



నాగార్జునసాగర్ డ్యాంపై విదేశీ ప్రతినిధులు



### గోదావరిలో పెరుగుతున్న ప్రవాహం

**మామిడికుదురు, న్యూస్‌టుడే:** గోదావరిలో వరదనీరు క్రమేణా ఉరకలు వేస్తుండడంతో సమీపంలోని లోతట్టు ప్రాంతాల్లోకి జలాలు చేరుతున్నాయి. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడి బాడవలోని రైల్వే వారధి వద్ద వరదనీరు పోటునీటితో కలిసి ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అధికారులు అప్రమత్తం అయ్యారు.



ప్రవేశద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లాప్ బారియర్ పనితీరును భద్రతాధికారులకు వివరిస్తున్న సంస్థ ప్రతినిధులు



స్మార్ట్‌కార్డు స్కానింగ్ ఇలా..



ప్రధానద్వారం వద్ద ఏర్పాటు చేసిన బూమ్ బారియర్

## ఇక.. స్మార్ట్‌గా రాష్ట్ర సచివాలయ ప్రవేశం

- స్మార్ట్‌కార్డులు, క్యూఆర్ స్కాన్‌లతోనే లోపలికి అనుమతి
- భద్రతాపరమైన లోపాలకు చెక్‌పెట్టేందుకు ప్రభుత్వం నిర్ణయం

రాష్ట్ర సచివాలయంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ప్రవేశద్వారాల వద్ద అధునాతన వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయిస్తోంది. ఇప్పటికే దీనికి సంబంధించిన అన్ని పరికరాలూ వచ్చాయి. ప్రవేశద్వారాల వద్ద వాటిని అమరుస్తున్నారు. ఇది పూర్తికాగానే సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, పాత్రికేయులకు స్మార్ట్‌కార్డులు ఇవ్వనున్నారు. గుర్తింపు కార్డునకు అదనంగా ఇది ఉంటుంది. ఫ్లైయిన్‌గా ఉండే ఈ కార్డులోని చిప్‌లో మనకు సంబంధించిన అన్ని వివరాలు నిక్షిప్తమై ఉంటాయి. దీన్ని స్కాన్ చేయగానే.. డేటాబేస్‌లో ఉన్న వివరాలతో సరిపోల్చుకుని ఆటోమేటిక్‌గా తలుపులు తెరుచుకుంటాయి. బెంగళూరుకు చెందిన 'సత్యాలజీ' అనే సంస్థకు ప్రభుత్వం ఈ బాధ్యతలు అప్పగించింది. వారం రోజుల్లో ఈ పనులు పూర్తిచేస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

### సందర్శకులకు క్యూఆర్ కోడ్ ఐడీ..



వాహనాల్లో వచ్చే ఉద్యోగులు, సిబ్బందికి రేడియో ఫ్రీక్వెన్సీ గుర్తింపు(ఆర్ఎఫ్ఐడీ)ను ఇస్తారు. ఈ ఆర్ఎఫ్ఐడీ స్టిక్కర్‌ను వాహనం ముందు అతికిస్తారు. దాన్ని 'బూమ్ బారియర్' స్కాన్ చేస్తుంది. అనంతరమే గేట్లు తెరుచుకుంటాయి. ఫాస్ట్‌ట్యాగ్ తరహాలో ఇది పనిచేస్తుంది. ఇందుకు ఉద్యోగుల వాహనాల నంబర్‌లను ఓ డేటాబేస్‌లో నిక్షిప్తం చేయనున్నారు. అలాగే సందర్శకులకు ఇప్పుడున్న మాన్యువల్ స్లిప్పుల విధానం స్థానంలో వారి ఫోన్ నంబర్లకు క్యూఆర్ కోడ్ పంపిస్తారు. అందులో ప్రతి సందర్శకుడికి ఓ విజిటింగ్ ఐడీ వస్తుంది. పేరు, వయసు, తేదీ, సమయం, ఎందుకువచ్చారు? అనే వివరాలు నిక్షిప్తం అవుతాయి. భద్రతాపరమైన తనిఖీల అనంతరం ప్రవేశద్వారం వద్ద ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఫ్లాప్ బారియర్ తెరుచుకుంటుంది. వాహనాల్లో వస్తే బండి నంబరును నమోదు చేస్తారు. అనంతరమే లోపలికి వెళ్లేందుకు వీలవుతుంది. ఈ కొత్త వ్యవస్థ భద్రత లోపాలు తలెత్తకుండా ఉండేందుకు బాగా ఉపయోగపడనుందని అధికారులు భావిస్తున్నారు.

– ఈనాడు, అమరావతి



సమీక్ష సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ, ఆయా సంస్థల అధినేతలు, ప్రతినిధులు, అధికారులు

## గడువు దాటనివ్వొద్దు

- ఒక్క రోజైనా ఆలస్యం కాకూడదు
- సమయానికి నిర్మాణాలు పూర్తి చేసి, ఉపాధి కల్పించాలి
- రాజధానిలో స్థలాలు తీసుకున్న సంస్థలకు సీఎం స్పష్టీకరణ

**ఈనాడు, అమరావతి:** రాజధాని అమరావతిలో భూములు తీసుకున్న ప్రభుత్వ ప్రైవేటు సంస్థలు ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్దేశించిన సమయానికి నిర్మాణాలు పూర్తి చేసి, కార్యకలాపాలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 'భూములు తీసుకున్న సంస్థలు రెండున్నరేళ్లు, మూడేళ్లలో నిర్మాణాలు పూర్తి చేయాలి. గడువుకు మించి ఒక్క రోజు కూడా ఆలస్యం కాకూడదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి జాప్యం లేకుండా మీకు సింగిల్‌విండో విధానంలో అన్ని అనుమతులు జారీ చేస్తాం. అధికారుల వైపు నుంచి ఏదైనా ఆలస్యం జరిగినా, ఇబ్బందులున్నా నేరుగా నన్ను కలవచ్చు' అని చెప్పారు. రాజధానిలో భూములు కేటాయించిన సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి మంగళవారం సచివాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 61 సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. కొందరు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. భూములు తీసుకున్నవారు ఎప్పటిలోగా నిర్మాణాలు పూర్తి చేస్తారు, వారి ప్రణాళికలేంటి అన్న విషయాల్ని సీఎం ఆరా తీసి, వారికి కొన్ని సూచనలు చేశారు.

### అమరావతి శోభ మరింత పెరిగేలా..

'మీరు చేపట్టే నిర్మాణాలు రొటీన్‌గా కాకుండా, ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఉండేలా ప్రణాళికలు రూపొందించుకోవాలి. మీ నిర్మాణాలతో అమరావతి శోభ మరింత పెరగాలి. ప్రతి నిర్మాణం కార్పొరేట్ లుక్‌తో ఉండాలి. వీలైనంత త్వరగా ఇక్కడి నుంచి కార్యకలాపాలు ప్రారంభించడంతోపాటు ఎక్కువ మందికి ఉపాధి కల్పించాలి. ఇప్పటికే భూములు తీసుకున్న సంస్థల్లో ఆర్బీఐ, హడ్కోతో పాటు వివిధ బ్యాంకులు ఉన్నాయి. అమరావతిని ఫిన్‌టెక్ సంస్థలకు, ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా తీర్చిదిద్దడంలో మీ సలహాలు అవసరం' అని చంద్రబాబు పేర్కొన్నారు. 'అమరావతి సాదాసీదా నగరం కాదు. హైఎండ్ టెక్నాలజీ అందుబాటులో ఉంటుంది. ఏఐ, క్వాంటమ్ వ్యాలీ వంటి వాటితో భవిష్యత్ నగరంగా మారేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఇక్కడ భూములు తీసుకున్న సంస్థలు కూడా దీనిలో భాగస్వాములే. అమరావతిని కాలుష్య, కర్బన ఉద్గారాలు లేని నగరంగా తీర్చిదిద్దుతాం. విద్యుత్ వాహనాలకు పెద్దపీట వేస్తాం' అని సీఎం చెప్పారు.

### అదనంగా భూములు కావాలని విజ్ఞప్తి

సమావేశంలో పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులు అదనంగా భూములు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరారు. ముఖ్యంగా హోటళ్ల ప్రతినిధులు కన్వెన్షన్ సెంటర్ల కోసం అదనంగా రెండు నుంచి రెండున్నర ఎకరాలు కేటాయించాలని విన్నవించారు. పార్కింగ్‌కు ఇంకొంత భూమి కావాలని కొన్ని సంస్థలు కోరాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని తమ సిబ్బందికి శిక్షణ కేంద్రం ఏర్పాటుకు అదనంగా స్థలం ఇవ్వాలని తపాలా శాఖ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఆయా సంస్థల కార్యకలాపాలు ప్రారంభించాక ఎంత మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్న అంశాన్ని వాటి ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. తమ క్యాంపస్ నిర్మాణం ఎలా ఉండబోతుందో బిట్స్ ప్రతినిధులు చెప్పగా.. దానిపై మరో సమావేశం నిర్వహిద్దామని సీఎం తెలిపారు.

### 72 సంస్థలు... 948 ఎకరాలు

రాజధానిలో ఇప్పటి వరకు మొత్తం 72 సంస్థలకు 948 ఎకరాల్ని సీఆర్డీఏ కేటాయించింది. వాటిలో పాఠశాలలు, బ్యాంకులు, యూనివర్సిటీలు, హోటళ్లు, హెల్త్ కేర్ సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ధార్మిక సంస్థలు, ఐటీ, టెక్ పార్కులు ఉన్నాయి. ఇప్పటికే 10 సంస్థలు పనులు ప్రారంభించాయి. మూడు సంస్థలు నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. నెలలో నిర్మాణాలు ప్రారంభిస్తామని మూడు సంస్థలు, రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామని 15 సంస్థలు, 5 నెలల్లో నిర్మాణాలు ప్రారంభిస్తామని 13 సంస్థలు, 6 నెలల్లో ప్రారంభిస్తామని 17 సంస్థలు చెప్పాయి. ఈ సమావేశంలో పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర వంతెన నిర్మాణానికి సహకరించండి

సీఎం చంద్రబాబుకు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ వినతి



చంద్రబాబుతో మాట్లాడుతున్న వంశీకృష్ణ

**శ్రీశైలం ప్రాజెక్టు(అమ్రాబాద్), న్యూస్‌టుడే:** రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ప్రవహిస్తున్న కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి సహకరించాలని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ఏపీ సీఎం చంద్రబాబును కోరారు. మంగళవారం శ్రీశైలం జలాశయం నుంచి నీటిని విడుదల చేసేందుకు చంద్రబాబు రాగా, అదే కార్యక్రమానికి తెలంగాణ తరఫున హాజరైన వంశీకృష్ణ ఆయనతో మాట్లాడారు. మద్దిమడుగు సమీపంలో కృష్ణానదిపై వంతెన నిర్మాణం ఆవశ్యకతను వివరించారు. నల్లమలలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మద్దిమడుగుకు ఏపీ నుంచి భక్తులు ఎక్కువ మంది వస్తారని తెలిపారు. ఈ వంతెన నిర్మాణం ద్వారా ఏపీ నుంచి రాయచూరు, కర్ణాటక ప్రాంతాలకు సుమారు వంద కిలో మీటర్ల దూరం తగ్గుతుందన్నారు. ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేయగా, చంద్రబాబు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు.

## ధర్మవరం చేనేత డిజైనర్ నాగరాజుకు జాతీయ పురస్కారం

- 2024కు ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వం



తాను రూపొందించిన లేపాక్షి నంది డిజైన్ వద్ద నాగరాజు

**ధర్మవరం, న్యూస్‌టుడే:** శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన చేనేత డిజైనర్ జుజూరు నాగరాజును కేంద్ర చేనేత, జౌళి మంత్రిత్వశాఖ.. జాతీయ చేనేత పురస్కారం-2024కు ఎంపిక చేసింది. చేనేత డిజైన్ డెవలప్‌మెంట్ విభాగంలో పురస్కారం దక్కింది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆగస్టు 7న దిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము చేతుల మీదుగా నాగరాజు పురస్కారం అందుకోనున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు తొలిసారి జాతీయ పురస్కారం రాగా.. డిజైన్ డెవలప్‌మెంట్ విభాగంలో రాష్ట్రానికి మొదటిసారి అవార్డు దక్కినట్లయింది. కార్మికుడిగా, డిజైనర్‌గా రెండు దశాబ్దాల నుంచి నాగరాజు సేవలందిస్తున్నారు. ధర్మవరం పట్టువస్త్రాలపై వివిధ రకాల చిత్రాలు, డిజైన్లు రూపొందించి ప్రత్యేక గుర్తింపు పొందారు. 2006లో డిజైనర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నుంచి పురస్కారం అందుకున్నారు. పట్టువస్త్రాలపై ఉప్పు సత్యాగ్రహం, రామాయణం ఘట్టాలను సుందరంగా రూపొందించారు. 'జైశ్రీరామ్'ను 13 భాషల్లో 32,200 సార్లు 60 మీటర్ల పట్టువస్త్రంపై తీర్చిదిద్దారు. జాతీయ పురస్కారానికి ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందని.. ఇది ధర్మవరం చేనేతకు దక్కిన గౌరవమని నాగరాజు పేర్కొన్నారు.







విద్యార్థినులు తయారుచేసిన ఆహ్వాన పత్రికలు, ఆహ్వాన పత్రికలను చూపుతున్న విద్యార్థినులు

## అమ్మానాన్నా రండి.. ఇదే మా ఆహ్వానమండి!

ఈ నెల 10న జరగనున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశాలకు ఏర్పాట్లు జోరుగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులను ఆకట్టుకునేలా పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం కేజీబీవీలో విద్యార్థినులే ఆహ్వాన పత్రికలు డిజైన్ చేస్తున్నారు. వృత్తి విద్య, క్రాఫ్ట్ బోధకులు ఇచ్చిన తర్ఫీదుతో వీటిని రూపొందిస్తున్నామని విద్యార్థినులు తెలిపారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, సీతానగరం





కొత్తగా పొందుపరిచిన తల్లిదండ్రుల అభిప్రాయాల పట్టిక, తల్లికి వందనం వివరాలు ● తమ ప్రోగ్రెస్ కార్డులు చూపుతున్న విజయవాడ సత్యనారాయణపురం ఏకేటీపీఎంసీ హైస్కూల్ విద్యార్థినులు ● పాఠశాలలో సిద్ధం చేస్తున్న ప్రోగ్రెస్ కార్డులు

## సమగ్ర ప్రగతి పత్రం.. విద్యార్థుల చదువుల భవితవ్యం

**ఈనాడు, అమరావతి:** రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 10న నిర్వహించనున్న తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల మెగా సమావేశంలో ప్రతి విద్యార్థికి సమగ్ర ప్రగతి పత్రం (హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు) అందించనున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ వీటిని అందించనుంది. ఇందులో విద్యార్థి పూర్తి వివరాలు, హాజరు, మార్కులు, నైపుణ్య వివరాలతో పాటు ఈ ఏడాది కొత్తగా తల్లిదండ్రుల అభిప్రాయానికి అవకాశం కల్పించారు. అలాగే విద్యార్థి కుటుంబంలో తల్లికి వందనం ఎంత మందికి అందిందో కూడా పేర్కొననున్నారు. గతేడాది ప్రోగ్రెస్ కార్డులో చాలా మార్పులు చేసి ఈ ఏడాది కార్డులను కొత్తగా తయారు చేశారు.

పోలవరం నిర్వాసితుల పునరావాస కల్పన ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ శంకరరావు ఆదేశించారు.



## భద్రాచలం రామాలయ ఈవోపై దాడి

### పురుషోత్తపట్నంలోని దేవుడి మాన్యంలో అక్రమ నిర్మాణాలు అడ్డుకునేందుకు వెళ్లినపుడు ఘటన



నెట్టివేయడంతో సొమ్మసిల్లి పడిపోయిన ఈవో రమాదేవి

**భద్రాచలం, న్యూస్‌టుడే:** దేవుడి మాన్యంలో అక్రమ నిర్మాణాలు అడ్డుకునేందుకు వెళ్లిన భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి(ఈవో) రమాదేవిపై మంగళవారం దాడి జరిగింది. మహిళా అధికారిని నెట్టివేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీనికి సంబంధించిన వివరాలు.. భద్రాచలం రాములవారి ఆలయానికి మూడు కి.మీ దూరంలో గల ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలో 889.5 ఎకరాల దేవుడి మాన్యం ఉంది. ఇందులో ఎక్కువ భాగం ఆక్రమణకు గురైంది. ఇదే క్రమంలో పురుషోత్తపట్నం గ్రామంలో ఒకరు శాశ్వత నిర్మాణం చేపట్టారు. సోమవారం సిబ్బంది వెళ్లి పనులు ఆపేందుకు ప్రయత్నించారు. అయినా నిర్మాణం ఆగలేదని తెలుసుకున్న ఈవో రమాదేవి సిబ్బందితో కలిసి మంగళవారం అక్కడికి చేరుకుని దేవస్థానం జాగాలో కట్టడాలు ఆపాలని సూచించారు. ఈ భూమిపై తమకే హక్కులు ఉన్నాయని అక్కడివారు చెప్పడంతో దస్త్రాలు ఉంటే చూపాలని ఈవో తరఫున ఉద్యోగులు అడిగారు. తమ వద్ద ఉన్న హక్కు పత్రాలు ఎందుకు చూపెట్టాలని, తాము ఖాళీ చేసేది లేదని అక్కడివారు తిరగబడ్డారు. దేవస్థానం భూమిని కబ్జా చేయడం సరైంది కాదని కొత్తగా ఎలాంటి పనులు చేయొద్దని చెబుతుండగా కొందరు ఈవో మీదకు దూసుకొచ్చారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. ఈవోను బలంగా నెట్టివేయడంతో అపస్మారక స్థితికి చేరారు. ఆమెను భద్రాచలంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆమె పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ముగ్గురు సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. పురుషోత్తపట్నానికి చెందిన పున్నమ్మ అస్వస్థతకు గురి కావడంతో భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. స్థానిక ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు ఈవోను పరామర్శించారు. దాడిని ఖండించారు. ఆక్రమణల అంశం రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఆలయ ఏఈవో భవాని రామకృష్ణ ఫిర్యాదుతో ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎటపాక సీఐ కన్నప్పరాజు తెలిపారు.





EENADU Vol: 51, Issue: 330 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

# ఈనాడు సినిమా

## రామోజీ ఫిల్మ్ సిటీలో చిరు - ప్రభాస్ హంగామా

సంక్రాంతి బరిలో సందడి చేసేందుకు తన కొత్త చిత్రాన్ని చకచకా పరుగులు పెట్టిస్తున్నారు చిరంజీవి. మరోవైపు 'ది రాజాసాబ్'ను పూర్తి చేయడమే లక్ష్యంగా రంగంలోకి దిగిపోయారు ప్రభాస్. ఇప్పుడీ ఇద్దరి సినిమాల చిత్రీకరణలకు రామోజీ ఫిల్మ్ సిటీ వేదికైంది. ప్రస్తుతం ఇక్కడే ఈ అగ్రతారలిద్దరూ హంగామా చేస్తున్నారు.



చిరంజీవి

### రయ్ రయ్.. చిరు

'సంక్రాంతికి వస్తున్నాం' విజయం తర్వాత అగ్ర కథానాయకుడు చిరంజీవితో చేతులు కలిపారు దర్శకుడు అనిల్ రావిపూడి. వీళ్లిద్దరి కలయికలో రూపొందుతున్న ఈ 'మెగా 157' (వర్కింగ్ టైటిల్) సినిమా ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. కాగా, ఇప్పుడీ చిత్ర కొత్త షెడ్యూల్ ఆర్ఎఫ్‌సీలో కొనసాగుతోంది. ప్రస్తుతం దీనిలో భాగంగా చిరంజీవితో పాటు ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారు. ఇందులో హీరో వెంకటేశ్ ప్రత్యేక పాత్రలో సందడి చేయనున్న సంగతి తెలిసిందే. త్వరలోనే ఆయన కూడా ఈ చిత్ర సెట్స్‌లోకి అడుగు పెట్టనున్నారు. ఇది వినోదం, యాక్షన్ అంశాలతో నిండిన కుటుంబ కథా చిత్రంగా ముస్తాబవుతోంది. చిరు దీంట్లో శంకర్ వరప్రసాద్ అనే పాత్రలో అలరించనున్నారు. నయనతార కథానాయిక. కేథరిన్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిసింది. ఇది వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాకి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తుండగా.. సమీర్ రెడ్డి ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



ప్రభాస్

### రాజాసాబ్.. ఫన్నీ సీన్స్

ఈ డిసెంబరులో 'ది రాజాసాబ్'గా సినీప్రియుల్ని పలకరించనున్నారు కథానాయకుడు ప్రభాస్. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలు. సంజయ్ దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా ప్రస్తుతం ఆర్ఎఫ్‌సీలో చకచకా చిత్రీకరణ చేసుకుంటోంది. ఈ షెడ్యూల్‌లో భాగంగా ప్రభాస్‌తో పాటు వీటీవీ గణేశ్, ప్రభాస్ శ్రీను తదితర కీలక తారాగణంపై ఫన్నీ సీన్స్ తెరకెక్కిస్తున్నారు. ఈ వారాంతం వరకు ఇక్కడే చిత్రీకరణ కొనసాగనుంది. హారర్ కామెడీ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో ప్రభాస్ రెండు కోణాల్లో సాగే పాత్రలో కనువిందు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని పాటలతో సహా సెప్టెంబరు నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళిక రచించారు. ఇది డిసెంబరు 5న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనికి తమన్ సంగీత దర్శకుడిగా, కార్తీక్ పళని ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

## సనాతన ధర్మాన్ని పరిరక్షించే ఓ వీరుడి కల్పిత కథతో..



పవన్ కల్యాణ్

'హరి హర వీరమల్లు'గా సినీప్రియుల్ని పలకరించనున్నారు కథానాయకుడు పవన్ కల్యాణ్. ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించారు. ఏఎం రత్నం సమర్పణలో ఎ.దయాకర్ రావు నిర్మించారు. నిధి అగర్వాల్ కథానాయిక. బాబీ డియోల్, అనుపమ్ ఖేర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈనెల 24న థియేటర్లలోకి రానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రచార పర్వాన్ని వేగవంతం చేసింది చిత్ర బృందం. అయితే ఈ చిత్రం తెలంగాణకు చెందిన ఓ వీరుడి కథ ఆధారంగా రూపొందినట్లు వార్తలొస్తున్న నేపథ్యంలో చిత్ర బృందం స్పందించింది. ఆ ప్రచారంలో వాస్తవం లేదని తెలిపింది. "ఇది నిజ జీవితంలోని ఏ ఒక్క నాయకుడి కథ ఆధారంగానూ తెరకెక్కలేదు. సనాతన ధర్మాన్ని పరిరక్షించే ఓ వీరుడి ప్రయాణాన్ని తెలిపే కల్పిత కథగా దీన్ని రూపొందించాం. ఈ సినిమాలో పవన్ పాత్ర శివుడు, విష్ణువుల అవతారంలా ఉంటుంది. అందుకే ఆ లక్షణాల్ని ప్రతిబింబించేలాగే 'హరి (విష్ణువు) హర (శివుడు) వీరమల్లు' అనే టైటిల్‌ను ఖరారు చేశాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

## సవాళ్లు ఎదురైనా రహస్యాలను ఛేదించే డిటెక్టివ్

**నటీనటులు:** మాగీ క్యూ, మైఖేల్ మోస్లి, టైటస్ వెల్లివర్
**విడుదల:** బుధవారం
**ప్లాట్‌ఫామ్:** అమెజాన్ ప్రైమ్ వీడియో



రెడీ ఇన్ ఓటీటీ

నిజాయతీగా ఉండే డిటెక్టివ్‌లు పరిష్కారం కాని పాత క్రిమినల్ కేసులను తీసుకుని దర్యాప్తు చేసి ఎంతోమందికి న్యాయం చేస్తుంటారు. అందుకే ఎల్ఏపీడీ అనే కోల్డ్ కేస్ విభాగాన్ని పర్యవేక్షించే బాధ్యతను డిటెక్టివ్ రెనీ బల్లార్డ్(మాగీ క్యూ)కు అప్పగిస్తారు. ఈ యూనిట్‌ని పూర్తిగా వాలంటీర్స్‌తోటే నిర్వహిస్తారు. నగరంలో అత్యధిక కేసులుండడం వల్ల అవి పరిష్కారంగాక ఈ విభాగానికి తగిన నిధులు ఉండవు. అయినా సరే బాధితులకు న్యాయం చేయాలనుకుంటుంది రెనీ. ఈ నేపథ్యంలోనే పెండింగ్‌లో ఉన్న కేసులను దర్యాప్తు చేయడం ప్రారంభిస్తుంది. వరుస హత్యలు చేస్తూ తప్పించుకుని తిరుగుతున్న సీరియల్ కిల్లర్, అలానే ఇతర హత్యలకు సంబంధించిన కోల్డ్ కేసులను ఈమె పర్యవేక్షిస్తుంది. ఈ కేసుల దర్యాప్తులోనే తన డిపార్ట్‌మెంట్‌కి సంబంధించిన కొన్ని రహస్యాలు బయటపడతాయి. పోలీసు శాఖలోని కొందరి ప్రమేయం ఇందులో ఉందని తెలుస్తుంది. అయినా వెనుకడుగు వేయకుండా రిటైర్డ్ డిటెక్టివ్ హ్యారీ బాష్(టైటస్ వెల్లివర్) సహాయంతో నిజానిజాలను బయటపెట్టడానికి ప్రయత్నిస్తుంది. ఇలా వృత్తి పరంగా ఎన్నో సవాళ్లున్నా హత్యల వెనుక రహస్యాలను ఛేదిస్తున్న ఆఫీసర్ కథేంటో మీరూ చూసేయండి. క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన 'బల్లార్డ్' సిరీస్‌కి మైఖేల్ కాన్నెల్లీ, మైఖేల్ అల్లెమో దర్శకత్వం వహించారు.

## టాక్సిక్‌కి అనిరుధ్ స్వరాలు?



యశ్

ప్రేక్షకులు ఆత్రుతగా ఎదురు చూస్తున్న పాన్ ఇండియా సినిమాల్లో 'టాక్సిక్' ఒకటి. 'కె.జి.ఎఫ్' సినిమాల తర్వాత యశ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమిది. గీతు మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాకి సంగీత దర్శకుడిగా అనిరుధ్ రవిచందర్ ఎంపికైనట్టు సమాచారం. ప్రత్యేకమైన తన సంగీతంతో సినిమాల్ని మరోస్థాయికి తీసుకెళుతున్న స్వర సంచలనం అనిరుధ్. 'టాక్సిక్' సినిమాతో ఆయన కన్నడలోకి అడుగు పెట్టినట్టైంది. ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ప్రముఖ రచయిత శివశక్తి దత్తా కన్నుమూత



ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి ఇంట విషాదం నెలకొంది. ఆయన తండ్రి, ప్రముఖ రచయిత, చిత్రకారుడు, దర్శకుడు శివశక్తి దత్తా (92) కన్నుమూశారు. వయోభారంతో బాధపడుతున్న ఆయన సోమవారం రాత్రి హైదరాబాద్ మణికొండలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. శివశక్తి దత్తా అసలు పేరు కోడూరి సుబ్బారావు. 1932 అక్టోబరు 8న ఆంధ్రప్రదేశ్‌లోని కొవ్వూరులో రైతు కుటుంబంలో జన్మించారు. కళలపై ఆసక్తితో పదిహేనేళ్ల వయసులోనే ముంబయి వెళ్లి అక్కడి జెజె స్కూల్ ఆఫ్ ఆర్ట్‌లో డిప్లొమా చేశారు. ఆ తర్వాత తిరిగొచ్చి కమలేష్ పేరుతో చిత్రలేఖనం చేశారు. 'కళ లేనిదే నా జీవితం లేదు' అని పలు సందర్భాల్లో చెప్పుకున్న ఆయన చివరివరకూ చిత్రలేఖనం, సినిమాతోపాటే ప్రయాణం చేశారు. సంగీతం నేర్చుకున్న ఆయన, సాహిత్యంపైనా తనదైన ముద్ర వేశారు. శివశక్తి దత్తా భార్య భానుమతి 2022లో కన్నుమూశారు. ఈ దంపతులకి సంగీత దర్శకులు కీరవాణి, కల్యాణ్ కోడూరి, రచయిత ఎస్.ఎస్.కాంచితోపాటు శ్వేత నాగ, మల్లేశ్వరి, సప్తమి సంతానం. ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్ ఆయనకు సోదరుడు. ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళికి శివశక్తి దత్తా పెద్దనాన్న.

### అరుదైన రచయిత...

సినిమా రంగంపై మక్కువతో శివశక్తి దత్తా ప్రముఖ దర్శకనిర్మాత ఎల్వీ ప్రసాద్ దగ్గర సహాయకుడిగా చేరారు. ఆ తర్వాత తన సోదరుడు విజయేంద్రప్రసాద్‌తో కలిసి పలు చిత్రాలకు రచయితగా పనిచేశారు. 'జానకిరాముడు' సినిమాతో రచయితలుగా ఈ ఇద్దరికీ మంచి పేరొచ్చింది. స్క్రీన్ రైటర్‌గానే కాకుండా, గీత రచనపైనా శివశక్తి దత్తా దృష్టి పెట్టారు. సంస్కృతంతోపాటు, ఐదు భాషల్లో పాటలు రాయగల ప్రావీణ్యం సంపాదించిన అరుదైన రచయిత ఆయన. పలు తెలుగు సినిమాల్లో ఆయన రాసిన సంస్కృత గీతాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. 'ఛత్రపతి'లోని అగ్నిస్ఖలన..., 'బాహుబలి: ది బిగినింగ్'లో మమతల తల్లి..., 'ఎన్టీఆర్ - కథానాయకుడు'లో కథానాయక..., 'బాహుబలి: ది కన్‌క్లూజన్'లో సాహోరే బాహుబలి..., 'జాంబిరెడ్డి'లో మృత్యుంజయ, 'ఆర్ఆర్ఆర్'లో రామం రాఘవం... తదితర పాటలు ఎంతగానో ప్రాచుర్యం పొందాయి. నల్లా నల్లాని కళ్ల పిల్ల.. (సై), మన్నేలా తింటివిరా కృష్ణా...(ఛత్రపతి) లాంటి మాస్ గీతాలు కూడా ఆయన రాసినవే. రాజమౌళి - కీరవాణి కలయికలో వచ్చిన సినిమాల్లో ఎక్కువగా పాటలు రాశారు శివశక్తి దత్తా. 'చంద్రహాస్' అనే సినిమాకి దర్శకత్వం వహించారు. 'తిరుమల నాయక' అనే సినిమాని తెరకెక్కించేందుకు స్క్రిప్ట్‌ని కూడా సిద్ధం చేసుకున్నట్టు ఓ సందర్భంలో చెప్పారాయన. తన కుమారుడు కీరవాణి ఆస్కార్ సొంతం చేసుకున్నప్పుడు ఎంతో భావోద్వేగానికి గురయ్యారు. తన కుమారుడికి కీరవాణి అని ఓ రాగం పేరు పెట్టిన ఆయన, తన కుటుంబ ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా పట్టుపట్టి కీరవాణికి సంగీతం నేర్పించారు. ఆయన సంగీతంలో రాణించి, ఉన్నతస్థాయికి చేరడంపై ఎంతో గర్వపడేవారు. కుమారులు కల్యాణ్ కోడూరి సంగీత దర్శకుడిగా, ఎస్.ఎస్.కాంచి రచయిత, నటుడిగా గుర్తింపు సాధించారు.

### బహుముఖ ప్రజ్ఞాశాలి

శివశక్తి దత్తా ఇక లేరన్న విషయం తెలుసుకుని మహేశ్‌బాబుతో పాటు పలువురు సినీ ప్రముఖులు మణికొండలోని ఆయన నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, ప్రముఖ కథానాయకుడు పవన్‌కల్యాణ్ సంతాపం ప్రకటించారు. "కళలు, సాహిత్యంపై ఎంతో అభిమానం కలిగినవారు శివశక్తి దత్తా. కీరవాణి, ఆయన సోదరులకి నా సానుభూతి" అంటూ సంతాపం తెలిపారు. ప్రముఖ కథానాయకుడు చిరంజీవి సామాజిక మాధ్యమాల వేదికగా స్పందిస్తూ... "చిత్రకారుడు, రచయిత, కథకుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన శివశక్తి దత్తా మృతి చెందడం దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన ఆత్మకు శాంతి కలగాలి" అంటూ సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో శివశక్తిదత్తా అంత్యక్రియలు ముగిశాయి.

## ఆసక్తి రేకెత్తించే యాక్షన్ థ్రిల్లర్



ఇంద్రజ, సన్నీ, బాబ్జీ

సన్నీ అఖిల్, అజయ్ ఘోష్, రవి కాలే ప్రధాన పాత్రల్లో బాబ్జీ తెరకెక్కించిన చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'. బెల్లి జనార్దన్ నిర్మాత. సాయాజీ షిండే, శుభలేఖ సుధాకర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. ఇంద్రజ, సముద్ర, కేవెల్ దామోదర్ ప్రసాద్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శకుడు బాబ్జీ మాట్లాడుతూ.. "ఇదొక మంచి యాక్షన్ థ్రిల్లర్. ఆద్యంతం ఆసక్తిని రేకెత్తించేలా సాగుతుంది. ఈ నెల 18న వస్తున్న ఈ చిత్రాన్ని అందరూ ఆదరించాలని కోరుకుంటున్నా" అన్నారు. "ఈ సినిమాలో యాక్షన్, థ్రిల్‌తో పాటు చాలా అంశాలు మిళితమై ఉన్నాయి. ఈ చిత్రం నన్ను మళ్లీ నిలబెడుతుందని నమ్ముతున్నా" అన్నారు నిర్మాత బెల్లి జనార్దన్. ఈ చిత్రానికి సంగీతం: గజ్వేల్ వేణు, ఛాయాగ్రహణం: కిషన్ సాగర్, నళినీకాంత్.

## రాజస్థాన్ ప్యాలెస్‌లో టూరిస్ట్ అదృశ్యం



రోషన్ సహదేవ్, కనిక్క కపూర్

రాజస్థాన్ ప్యాలెస్ నుంచి ఓ టూరిస్ట్ అనుకోకుండా అదృశ్యం అవుతాడు. కారణం ఏంటో తెలుసుకోవడానికి వేట మొదలవుతుంది. మరి చివరకు ఏమైందో తెలుసుకోవాలంటే 'మర్డర్‌బాద్' సినిమా చూడాల్సిందే. 'అతిథి ఎక్కడ?" అని ఆసక్తిగా సాగిన ఈ సినిమా ట్రైలర్ తాజాగా విడుదలైంది. రొమాంటిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రానికి అర్నాబ్ ఛటర్జీ దర్శకత్వం వహించారు. అర్నాబ్ మాట్లాడుతూ.. "మర్డర్‌బాద్ ప్రయాణం 5 సంవత్సరాల క్రితం ప్రారంభమైంది. ఇది నేను చూస్తూ పెరిగిన ప్రేమ కథల నుంచి ప్రేరణ పొందింది" అన్నారు. "25 ఏళ్ల అర్నాబ్ పరిశ్రమలోని అనుభవజ్ఞులను తీసుకొని, మొత్తం సినిమాను తన భుజాలపై వేసుకున్నాడు. అతను ఇదంతా చేసిన తీరు నన్ను ఆశ్చర్యపరిచింది" అన్నారు ఈ చిత్రంలో కీలక పాత్రధారి అమోల్ గుప్తే. ఇందులో రోషన్ సహదేవ్, కనిక్క కపూర్, మనీష్ చౌదరి, షరీబ్ హష్మి, విభా చిబ్బర్, మసూద్ అక్తర్ కీలకపాత్రలు పోషించారు. ఈ రొమాంటిక్ థ్రిల్లర్ ఈ నెల 18న విడుదల కానుంది.

## ఒకే చిత్రం.. రెండు ప్రత్యేక గీతాలు



దిశా పటానీ

నటనతో ఆకట్టుకుంటూనే.. సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటూ కుర్రకారుని అలరిస్తుంటుంది బాలీవుడ్ కథానాయిక దిశా పటానీ. ప్రస్తుతం ఓ హాలీవుడ్ సినిమాతో బిజీగా ఉన్న ఈ భామ.. షాహిద్ కపూర్‌తో కలిసి చిందులేయడానికి ముస్తాబవుతోంది. షాహిద్, త్రిప్తి డిమ్రీ జంటగా ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇంకా పేరు ఖరారు కానీ ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు విశాల్ భరద్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలోని రెండు ప్రత్యేక గీతాల్లో దిశా ఆడిపాడనున్నట్లు తెలుస్తోంది. "సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఇందులో భాగంగా ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు రెండు మాస్ పాటల్ని జత చేయనున్నారు. ఇప్పటికే వీటి కోసం భారీ సెట్లను ఏర్పాటు చేశారు. ఇందులో షాహిద్‌తో దిశా వేసే స్టెప్పులు సినిమాకు ఆకర్షణీయంగా ఉంటాయ"ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. డిసెంబరు 5న రానుందీ చిత్రం.



సయామీ ఖేర్

## ట్రయథ్లాన్‌లో సత్తా చాటిన సయామీ

హీరోయిన్లు తమ నటనతో ప్రేక్షకులను అలరించడమే కాకుండా అప్పుడప్పుడూ వ్యక్తిగత అభిరుచులను కూడా పంచుకుంటూ అభిమానులను ఆశ్చర్యపరుస్తుంటారు. అలానే కొందరు నాయికలు ఇతర రంగాల్లోనూ ప్రతిభని కనబరుస్తుంటారు. వీరిలో నటి సయామీ ఖేర్ ఒకరు. 'రేయ్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఈమె ఫిట్‌నెస్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తుంటారు. ఆమె విదేశాల్లో నిర్వహించే ట్రయథ్లాన్ పోటీలలో పాల్గొంటుంటారు. ఏడాది వ్యవధిలో రెండు సార్లు 'ఐరన్‌మ్యాన్ 70.3' పూర్తి చేసిన తొలి భారతీయ నటిగా ఆమె రికార్డు సృష్టించారు. గతేడాది సెప్టెంబరులో తొలి మెడల్‌ని అందుకున్న ఆమె..ఇప్పుడు స్వీడన్‌లో నిర్వహించిన రేస్‌లో గెలిచి మరో పతకం అందుకున్నారు. 1.9 కి.మీ ఈత, 90 కి.మీ. సైక్లింగ్, 21.1 కి.మీ. పరుగు అనేవి ట్రయథ్లాన్‌లో భాగం. అత్యంత కష్టమైన పోటీల్లో ఇదొకటి. ఈ విజయాన్ని ఇన్‌స్టా వేదికగా పంచుకుంది సయామీ ఖేర్. "ఎంతో ఆనందంగా ఉంది. క్రమశిక్షణతో ఏదైనా సాధ్యమే. అది సాకులను అధిగమిస్తుంది. ప్రపంచానికి నేనేంటో నిరూపించుకోవాలన్న ఉద్దేశంతో ఇదంతా చేయలేదు. నా మనసుకి నచ్చింది చేస్తున్నాను. నా ఏకైక లక్ష్యం గత సంవత్సరం కంటే మెరుగ్గా ఉండటమే. గతేడాది రేస్ కంటే ఈ ఏడాది రేసను 32 నిమిషాల కంటే ముందే పూర్తి చేశాను. ఒకప్పుడు సాధ్యం కాదనిపించిన పనిని పూర్తి చేయడం వర్ణించలేనంత సంతృప్తినిస్తుంద"ని ఓ పోస్ట్‌లో రాసింది. పలు బాలీవుడ్ చిత్రాలతో అలరించిన ఆమె 'స్పెషల్ ఓపీఎస్2' సిరీస్‌తో త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యింది



దేవయాని, సిద్ధార్థ్, చైత్ర

'3 బీహెచ్‌కే' సినిమాతో ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చారు సిద్ధార్థ్. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని శ్రీ గణేశ్ తెరకెక్కించారు. అరుణ్ విశ్వ నిర్మించారు. శరత్ కుమార్, దేవయాని, మీథా రఘునాథ్, చైత్ర కీలక పాత్రలు పోషించారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సిద్ధార్థ్ మాట్లాడుతూ.. "ఒక క్లాసిక్ సినిమాకి ఉండాల్సిన లక్షణాలన్నీ ఈ చిత్రానికి ఉన్నాయి. ఇందులో భాగమవ్వడం గర్వంగా ఉంది. ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే కథ ఇది. ప్రతి కొడుకు ఈ సినిమాలో తమ తండ్రిని చూసుకుంటున్నారు. అలాగే ప్రతి తండ్రి తమ కొడుకుని చూడగలుగుతున్నారు. మాకింత మంచి విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు" అన్నారు. "ఈ చిత్రం అందరికీ గొప్పగా కనెక్ట్ అయింది. రాకేందు మౌళి తెలుగులో చక్కటి సంభాషణలు రాశారు. చంద్రబోస్ అద్భుతమైన పాటలిచ్చారు" అన్నారు దర్శకుడు శ్రీగణేశ్. ఈ కార్యక్రమంలో దేవయాని, చైత్ర, అరుణ్ విశ్వ తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌బాక్స్ ఓపెన్ చేయగానే బోలెడన్ని జంక్ మెయిళ్లు. ప్రమోషన్లు, ప్రకటనల టపాలు. కొన్నిసార్లు సబ్‌స్క్రైబ్ చేసుకోనివీ ఇన్‌బాక్స్‌లో వచ్చి వాలుతుంటాయి. వీటి మూలంగా కొన్నిసార్లు అసలు మెయిళ్లను వెతుక్కోవటమూ కష్టమైపోతుంది. ఈ చిక్కులకు చెక్ పెడుతూనే, ఇన్‌బాక్స్ మీద తిరిగి పట్టు సాధించటమెలా? గోప్యతను కాపాడుకోవటమెలా? అని ఆలోచిస్తున్నారా? అయితే మారు మెయిళ్లు.. అదే అలియాస్, ఐడీని దాచే మాస్కింగ్ మెయిళ్ల గురించి తెలుసుకోవాల్సిందే.

### అదనపు, ప్రత్యామ్నాయ ఐడీగా..

ప్రైమరీ ఈమెయిల్ ఖాతాకు అలియాస్ ఈమెయిల్ ఐడీ అదనపు, ప్రత్యామ్నాయ ఐడీగా ఉపయోగపడుతుంది. యూజర్లు దీని ద్వారా మెయిళ్లను పంపుకోవచ్చు, అందుకోవచ్చు. ఒకే డొమెయిన్‌తో గానీ వేర్వేరు డొమైన్లతో గానీ చాలా అలియాస్ ఈమెయిల్ ఐడీలను కలిగుండొచ్చు. ఒకరకంగా వీటిని మారుపేరు ఈమెయిళ్లు అనుకోవచ్చు. దీనికి ఎవరైనా మెయిల్ పంపితే ఆటోమేటిగ్గా ప్రైమరీ ఇన్‌బాక్స్‌లోకి చేరుతుంది. కానీ పంపినవారికి అసలు ఈమెయిల్ ఐడీ కనిపించదు. ఇక ఈమెయిల్ మాస్కింగ్ అనేది కాస్త విస్తృతమైంది. అసలు ఈమెయిల్ ఐడీని దాచే పద్ధతులేవైనా దీని కిందికే వస్తుంది. ప్రైమరీ ఈమెయిల్ చిరునామాను కాపాడుకోవటానికి అలియాస్, మాస్క్‌డ్ ఈమెయిళ్లు రెండూ తోడ్పడినప్పటికీ ఇవి వేర్వేరు విధంగా పనిచేస్తాయి. ఇన్‌బాక్స్‌తో ముడిపడిన ప్రధాన మెయిల్‌కు అదనంగా అలియాస్ మెయిల్‌ను ఉపయోగించుకోవచ్చు. ఈమెయిల్ ప్రొవైడర్ సెటింగ్స్ ద్వారా ఎవరికివారే దీన్ని సృష్టించుకోవచ్చు. అదే మాస్క్‌డ్ ఈమెయిళ్లకైతే థర్డ్ పార్టీ సేవలు అవసరం. ఇవి తాత్కాలిక ఈమెయిళ్లను సృష్టించి, వాటిని ప్రైమరీ ఇన్‌బాక్స్‌కు ఫార్వర్డ్ చేస్తాయి.


# మారు మెయిల్ మహోపకారం

ఆన్‌లైన్ సేవల ఉచిత ట్రయల్‌కు ఈమెయిల్‌తో సైనప్ అవుతాం. ఏదో వెబ్‌సైట్ నుంచి పీడీఎఫ్ డౌన్‌లోడ్ చేయటానికో, న్యూస్‌లెటర్ సబ్‌స్క్రిప్షన్‌కో లేదా కూపన్ల ఆఫర్ అందితేనో మెయిల్ ఐడీ ఎంటర్ చేస్తాం. అంతటితో దాన్ని మరచిపోతాం. ప్రైమరీ ఈమెయిల్ ఐడీ ఇచ్చినంత మాత్రాన పోయేదేముందని భావిస్తుంటాం గానీ అక్కడి నుంచే కథ మొదలవుతుంది. ఇన్‌బాక్స్‌లో జంక్, ప్రమోషన్ మెయిళ్ల మోత మోగుతుంది. వాటిని వదిలించుకోవటం, సర్దుకోవటం తలనొప్పిగా మారుతుంది. అనుచిత మెయిళ్లు ఇన్‌బాక్స్‌లో కనిపిస్తుంటే ఎవరో ట్రాక్ చేస్తున్నారనే భావన మనసును నిరంతరం తొలుస్తూనే ఉంటుంది. ఆన్‌లైన్ స్వాతంత్ర్యం కోల్పోయినట్టూ అనిపిస్తుంది. ఎందుకంటే ఇప్పుడు మెయిల్ ఐడీ కేవలం సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునే సాధనం మాత్రమే కాదు. అది మన డిజిటల్ ఐడీ కూడా.

సౌకర్యం కోసం ఎవరికి పడితే వారికి షేర్ చేస్తే గోప్యత, భద్రతకు భంగం వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. మన ఈమెయిల్ ఐడీ ఆయా సేవలకే పరిమితం కాకపోవచ్చు. థర్డ్ పార్టీల చేతుల్లోనూ పడొచ్చు. పాస్‌వర్డ్ బలంగా లేకపోతే మోసగాళ్లు ఛేదించొచ్చు. దీని సాయంతో ఇతర ఖాతాల్లోకీ ప్రవేశించొచ్చు. ఇప్పుడు ఈమెయిల్‌ను అదనపు ధ్రువీకరణకూ వాడుకుంటున్నాం మరి. ఇలాంటి ప్రమాదాల్లో పడకుండా చూసుకోవటానికి అలియాస్ మెయిళ్లు, మెయిల్ మాస్కింగ్ బాగా ఉపయోగపడతాయి. తాత్కాలిక, ఒకసారి వాడుకునే ఈమెయిళ్ల కోసం రూపొందించిన ఇవి ఎక్కువకాలం అవసరం లేదని భావించే కనెక్షన్ల కోసం అనువుగా ఉంటాయి. అంటే క్విక్ సైన్ అప్, ఉచిత ట్రయల్స్ యాక్సెస్, విశ్వసనీయం కాని సర్వీసుల కోసం వీటిని ప్రత్యామ్నాయ ఈమెయిల్ ఐడీగా వాడుకోవచ్చు.

### కొన్ని చిట్కాలు

- ప్రతీ ఆన్‌లైన్ సర్వీసు లేదా వేదికకు కొత్త, ప్రత్యేక అలియాస్ మెయిళ్లను సృష్టించుకోవటం మంచిది. దీంతో వాటిని తేలికగా ఫిల్టర్ చేసుకోవచ్చు. ఏదైనా ఒకటి డేటా ఉల్లంఘనకు గురైతే మిగతావి సురక్షితంగా ఉంటాయి.
- అలియాస్ ఐడీలను సృష్టించుకునేటప్పుడు పేరు, పుట్టిన తేదీ, నివాస ప్రాంతం వంటి వ్యక్తిగత వివరాలేవీ వాటిల్లో లేకుండా చూసుకోవాలి. సాధారణ లేదా యాదృచ్ఛిక యూజర్‌నేమ్స్ వాడుకోవాలి.
- మారు మెయిల్ ఐడీలకు అవాంఛిత, స్పామ్ మెయిళ్లు వస్తున్నాయేమో గమనిస్తుండాలి. విశ్వసనీయం కాని మెయిళ్లు పెద్దమొత్తంలో వస్తున్నట్టయితే అలియాస్ మెయిల్ ఐడీ సర్వీసు ప్రొవైడర్ గోప్యతను ఉల్లంఘించి ఉండొచ్చు. ఇలాంటిది గమనిస్తే వెంటనే ఆ ఐడీని డిలీట్ చేసి, కొత్తది సృష్టించుకోవాలి.



### ఎలా వాడుకోవాలి?

అలియాస్ మెయిళ్లను వాడుకోవటం చాలా తేలిక. ఈమెయిల్ సంస్థలే వీటిని కల్పిస్తాయి. జీమెయిల్ యూజర్లకిది చాలా సులువు. అప్పటికే తాము వాడుతున్న జీమెయిల్ అడ్రస్‌లో @ గుర్తుకు ముందుండే పదం ముందు ప్లస్ గుర్తు యాడ్ చేస్తే చాలు. ఉదాహరణకు- మీ మెయిల్ ఐడీ yournamenewsletters@gmail.com అనుకోండి. అప్పుడు ప్లస్ గుర్తుతో yourname+newsletters@gmail.com అని సెట్ చేసుకుంటే సరి. ఈ చిన్న మార్పుతో కూడిన ఐడీకి అందే మెయిళ్లన్నీ ఇన్‌బాక్స్‌లో ప్రత్యక్షమవుతాయి. దీంతో మరో ప్రయోజనం ఏంటంటే ఇలాంటి ప్లస్ గుర్తు గల మెయిళ్లన్నింటినీ తేలికగా వెతికే అవకాశముండటం. అందువల్ల సులభంగా ఫిల్టర్ చేసుకోవచ్చు, క్రమబద్ధీకరించుకోవచ్చు. ఐక్లౌడ్+ లేదా యాపిల్ వన్ సర్వీసుల సబ్‌స్క్రిప్షన్ గలవారికి యాపిల్ సంస్థ అలియాస్ మెయిళ్లు సృష్టించుకోవటానికి వీలు కల్పించింది. దీనిలోని **హైడ్ మై ఈమెయిల్** ఫీచర్ సాయం తీసుకోవచ్చు. ఇది ప్రత్యేకమైన, ర్యాండమ్ ఈమెయిల్ ఐడీలను సృష్టిస్తుంది. ఇవి ఆటోమేటిగ్గా వ్యక్తిగత ఇన్‌బాక్స్‌కు మెసేజ్‌లను ఫార్వర్డ్ చేస్తాయి. ఐఫోన్‌లో సఫారీ బ్రౌజర్‌ను వాడుతున్నప్పుడు తెర మీద కీబోర్డు పైన ఉండే బాక్సును తాకితే హైడ్ మై ఈమెయిల్ కనిపిస్తుంది. అలాగే మ్యాక్ కంప్యూటర్‌లో డెస్క్‌టాప్ సఫారీ బ్రౌజర్ లేదా మెయిల్ యాప్‌లోనూ దీన్ని ఉపయోగించుకోవచ్చు. ఒకవేళ మారు ఈమెయిల్ ఐడీని ఎవరైనా ఉల్లంఘించినా తేలికగా డిసేబుల్ చేయొచ్చు. మెయిన్ ఇన్‌బాక్స్‌కు విఘాతం కలగకుండా వెంటనే డిలీట్ చేయొచ్చు కూడా.

### మాస్కింగ్ కోసం

ఈమెయిల్ మాస్కింగ్ సేవలను అందించే థర్డ్ పార్టీ సర్వీసులు చాలానే అందుబాటులో ఉన్నాయి. ఉచిత ఫీచర్లతోనే చాలా సదుపాయాలు పొందొచ్చు. మరిన్ని ఆప్షన్లు కావాలంటే సబ్‌స్క్రిప్షన్ తీసుకోవచ్చు.

- DuckDuckGo: గోప్యతకు అధిక ప్రాధాన్యమిచ్చే డక్‌డక్‌గో బ్రౌజర్ ఉచిత ఈమెయిల్ ఫార్వర్డింగ్ సేవలనూ అందిస్తుంది. అదృశ్య ఈమెయిల్ ట్రాకర్లను తొలగిస్తుంది. ప్రత్యేకమైన ఈమెయిల్ ఐడీలను ఎన్నయినా సృష్టించుకోవచ్చు.
- Addy.io: ఇది కస్టమ్ డొమెయిన్లను సపోర్టు చేస్తుంది. లెక్కలేనన్ని మారు మెయిల్ ఐడీలతో కూడిన బ్రౌజర్ ఎక్స్‌టెన్షన్లను అందిస్తుంది. అదీ ఉచిత ప్లాన్‌లోనే.
- Firefox Relay: దీని సాయంతో ఉచితంగా ఐదు వరకూ మాస్కింగ్ మెయిళ్లను వాడుకోవచ్చు. చందా తీసుకుంటే లెక్కలేనన్ని మారు మెయిళ్లు సృష్టించుకోవచ్చు.
- FastMail: ఇది అన్‌లిమిటెడ్ అలియాస్ మెయిళ్ల సదుపాయాన్ని కల్పిస్తుంది. అదీ సమగ్రమైన మాస్కింగ్‌తో. యాడ్స్, ట్రాకింగ్ వంటివేవీ ఉండవు కూడా.
- Proton Mail: ఇది తమ పాస్‌వర్డ్ మేనేజర్‌తో ఈమెయిల్ మాస్కింగ్‌కు తోడ్పడుతుంది.
- SimpleLogin: ఇది ఓపెన్ సోర్స్ సర్వీసు. మారు ఐడీ ద్వారా మెయిళ్లను అందుకోవటానికి, తమ ద్వారా జవాబులను పంపటానికి వీలు కల్పిస్తుంది.

### లాభాలు ఎన్నెన్నో

- గందరగోళ ఇన్‌బాక్స్‌ను క్రమబద్ధీకరించుకోవటానికి అలియాస్ ఈమెయిళ్లు బాగా ఉపయోగపడతాయి. వీటితో త్వరగా స్పేస్ నిండకుండా చూసుకోవచ్చు. ఆయా అవసరాలకు అనుగుణంగా వేర్వేరు మారు మెయిళ్లు సృష్టించుకోవచ్చు. ఉదాహరణకు- ఆన్‌లైన్ షాపింగ్‌కు ఒకటి వాడుకుంటే, న్యూస్‌లెటర్లకు మరోటి వాడుకోవచ్చు. వ్యక్తిగత, ఉద్యోగ అవసరాలకు విడివిడిగా సృష్టించుకోవచ్చు. దీంతో ఈమెయిళ్లను ఆయా అంశాల వారీగా విభజించుకోవటం, అనవసరమైనవి డిలీట్ చేయటం తేలికవుతుంది.
- మారు ఈమెయిళ్లు రక్షణ కవచంగానూ నిలుస్తాయి. మోసగాళ్లకు అసలు ఈమెయిల్ ఐడీని తెలియనివ్వకుండా చేయటం వల్ల ఫిషింగ్ ముప్పు కూడా తగ్గుతుంది. డేటా ఉల్లంఘన ప్రమాదమూ తప్పుతుంది.
- థర్డ్ పార్టీ ఈమెయిల్ మాస్కింగ్ సేవలను అందించేవి చాలావరకూ రెండు వైపుల ఐడీలు కనిపించకుండా చేస్తాయి. అంటే మనం పంపించే మెయిళ్లు మారు ఐడీతోనే అవతలివారికి చేరతాయి. మనం జవాబు ఇచ్చేటప్పుడూ అదే మారు మెయిల్‌తో వెళ్తాయి.
- ఫార్వర్డ్ అయిన మెయిళ్లలో దాగిన ఈమెయిల్ ట్రాకర్లను తొలగించే సామర్థ్యాలనూ కొన్ని ఆధునిక సర్వీసులు కల్పిస్తున్నాయి.

## హెచ్‌పీ కొత్త ఓమ్నిబుక్స్



విద్యార్థులు, ఉద్యోగులను దృష్టిలో పెట్టుకొని హెచ్‌పీ సంస్థ ఓమ్నిబుక్ 5, 3 శ్రేణుల్లో సరసమైన ధరల్లో ఏఐ ల్యాప్‌టాప్‌లను పరిచయం చేసింది. ప్రత్యేకమైన న్యూరల్ ప్రాసెసింగ్ యూనిట్‌తో కూడిన ఇవి సెకండుకు 45 నుంచి 50 ట్రిలియన్ల ఆపరేషన్లు (టాప్స్) చేయగలవు. ఓమ్నిబుక్ 5 పరికరం క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ ఎక్స్ ప్లస్ ఎక్స్1-21-100 ప్రాసెసర్‌తో పనిచేస్తుంది. 14 అంగుళాల 2కే ఓఎల్‌ఈడీ తెరతో కూడిన దీని బ్యాటరీ 34 గంటల వరకూ వస్తుంది. ఆటో ఫ్రేమింగ్ కోసం విండోస్ స్టుడియో ఎఫెక్ట్స్ ఫీచర్ ఉంటుంది. హెచ్‌పీ ఆడియో బూస్ట్ 2.0 అయితే ఏఐ సాయంతో మంద్ర స్థాయి శబ్దాలనూ ఉచ్ఛస్థితికి చేరుస్తుంది. ఇక ఓమ్నిబుక్ 3 పరికరమైతే 15.6 అంగుళాలు, 14 అంగుళాల రకాల్లో అందుబాటులో ఉంటుంది. 250 నిట్స్ గరిష్ఠ ప్రకాశంతో కూడిన ఇది ఏఎండీ రైజన్ ఏఐ300 ప్రాసెసర్‌తో పనిచేస్తుంది. 50 టాప్స్ ఎన్‌పీయూ వరకూ పనులు చేస్తుంది. విండోస్ స్టుడియో ఎఫెక్ట్స్, హెచ్‌పీ ట్రూ విజన్ కెమెరా, డ్యుయెల్ మైక్స్, ఏఐ నాయిస్ రిడక్షన్ ఫీచర్లూ ఉన్నాయి. గ్లేసియర్ సిల్వర్ రంగులో అందుబాటులో ఉండే ఓమ్నిబుక్ 5 ప్రారంభ ధర రూ.75,999. ఓమ్నిబుక్ 3 ప్రారంభ ధర రూ.69,999.

## ఏఐ+ ఫోన్లు వచ్చేశాయి

ఎన్‌ఎక్స్‌టీక్వాంటమ్ తమ తొలి స్మార్ట్‌ఫోన్లను లాంచ్ చేసింది. డేటా గోప్యతకు భంగం కలగని విధంగా, పూర్తిగా మనదేశంలోనే తయారైన వీటి పేర్లు ఏఐ+ పల్స్, నోవా 5జీ. ఇవి మనదేశపు మొట్టమొదటి సార్వభౌమ ఎన్‌ఎక్స్‌టీక్వాంటమ్ ఓఎస్‌తో పనిచేస్తాయి. యూనిసాక్ టీ615 ప్రాసెసర్‌తో కూడిన ఏఐ+ పల్స్ ఫోన్ 6.7 అంగుళాల హెచ్‌డీ+ డిస్‌ప్లే, 90హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 450 నిట్స్ గరిష్ఠ ప్రకాశం, 50ఎంపీ డ్యుయెల్ ఏఐ కెమెరా, 5,000ఎంఏహెచ్ బ్యాటరీ, పక్కన ఫింగర్‌ప్రింట్ సెన్సర్ వంటి ఫీచర్లు కలిగుంది. 4జీబీ/6జీబీ ర్యామ్, 64జీబీ/128జీబీ స్టోరేజీతో వచ్చింది. 8.5ఎంఎం మందం గల ఇది 193 గ్రాముల బరువుంటుంది. ఇక నోవా 5జీ ఫోన్ అయితే యూనిసాక్ టీ8200 చిప్‌తో పనిచేస్తుంది. 6.7 అంగుళాల హెచ్‌డీ+ తెర, 120 హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 50ఎంపీ డ్యుయెల్ ఏఐ కెమెరా, 5,000ఎంఏహెచ్ బ్యాటరీ, పక్కన ఫింగర్‌ప్రింట్ సెన్సర్ ఫీచర్లతో వచ్చింది. 6జీబీ/8జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజీలో అందుబాటులో ఉంటుంది. బ్లూ, బ్లాక్, గ్రీన్, పర్పుల్, పింక్ రంగుల్లో లభించే ఈ ఫోన్ల మెమరీని 1టీబీ వరకూ పెంచుకోవచ్చు. ఏఐ+ పల్స్ ప్రారంభ ధర రూ.4,499. నోవా 5జీ ప్రారంభ ధర రూ.7,499. జులై 12న ఏఐ+ పల్స్, 13న నోవా 5జీ అమ్మకాలు మొదలు కానున్నాయి.



## ఇంటివద్దకే వన్‌ప్లస్ సేవలు



వన్‌ప్లస్ ఫోన్లు వాడేవారికి శుభవార్త. మరమ్మతు అవసరమైన పరికరాలను ఇంటి వద్దకే వచ్చి తీసుకోవటం, తిరిగిచ్చే సేవలను దేశవ్యాప్తంగా 19వేల పిన్‌కోడ్లకు విస్తరించింది. ఫోన్లను అమ్మిన తర్వాత ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో నెట్‌వర్క్‌ను విస్తృతం చేయటం దీని ఉద్దేశం. వచ్చే ఐదేళ్లలో 28 రాష్ట్రాల్లో, 400 పట్టణాలకు దీన్ని విస్తరించాలని సంస్థ భావిస్తోంది. గత ఏడాదిలోనే వన్‌ప్లస్ సర్వీస్ సెంటర్ల సంఖ్య 50% కన్నా పెరిగిందని సంస్థ చెబుతోంది. ప్రత్యేకమైన కాల్ సెంటర్లు, ప్రత్యక్ష లైవ్ చాట్, ధ్రువీకృత వాట్సప్ సపోర్టు, ఈమెయిల్ ఆధారిత సర్వీసు సదుపాయాలూ కల్పిస్తోంది.

# గాలి శుద్ధికి మేడి చెట్టు!

కాలుష్యాన్ని తగ్గించటానికి, పర్యావరణ పరిరక్షణకు చెట్లు చేస్తున్న మేలు అంతా ఇంతా కాదు. గాలిలోని కార్బన్ డయాక్సైడ్‌ను సంగ్రహించి వాతావరణ మార్పు తగ్గటానికి గణనీయంగా తోడ్పడుతున్నాయి. అంతేనా? కొన్ని చెట్లు మరింత 'తెలివి'నీ చూపుతున్నాయి. ఆశ్చర్యకరంగా కార్బన్ డయాక్సైడ్‌ను 'రాళ్ల'గా మార్చే విద్యనూ ప్రదర్శిస్తున్నాయి.



కెన్యాలో కనిపించే కొన్నిరకాల మేడి చెట్లు వాతావరణంలోంచి పెద్దఎత్తున కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి, దాన్ని తమ కాండంలో, అలాగే రాళ్ల రూపంలో చుట్టుపక్కల నేలలో దాస్తున్నట్టు కనుగొన్నారు. చెట్టు చనిపోయినా కూడా అది సంగ్రహించిన కార్బన్ మట్టిలో అలాగే ఉంటుంది. అంటే గాలిల్లోంచి కార్బన్ డయాక్సైడ్‌ను చాలా కాలం వేరు అవుతుందన్న మాట.

వాతావరణ మార్పులో చెట్ల పాత్ర అనగానే గాల్లోంచి కార్బన్‌ను తొలగించటమే ముందుగా గుర్తుకొస్తుంది. కిరణజన్య సంయోగక్రియలో భాగంగా దీన్ని వాడుకొని ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. చెట్లన్నీ కార్బన్ డయాక్సైడ్‌ను తీసుకుంటాయి. దీనిలోని కార్బన్ చాలావరకూ అణువులుగా మారి వృక్ష నిర్మాణానికి తోడ్పడుతుంది. సెల్యులోజ్ ఇలాంటిదే. అంతేకాదు.. కొన్ని చెట్లు కార్బన్‌ను తమ చుట్టుపక్కల నేలలోనూ స్థిరపడేలా చేస్తాయి కూడా. ఇవి ముందుగా కార్బన్ డయాక్సైడ్‌ను క్యాల్షియం ఆగ్జలేట్ స్ఫటికాలుగా మారుస్తాయి. వీటిని చెట్టు, మట్టిలోని సూక్ష్మక్రిములు క్యాల్షియం కార్బొనేట్‌గా మారుస్తాయి. సున్నపురాయి వంటి వాటిల్లో ఉండేది క్యాల్షియం కార్బొనేటే. చెట్టులోని సేంద్రియ పదార్థంలో ఉండే కార్బన్‌తో పోలిస్తే ఖనిజ రూపంలోని కార్బన్ నేలలో చాలాకాలం నిక్షిప్తమవుతుంది. ఆఫ్రికా అడవుల్లో ఉండే ఇరొకో చెట్టు వంటివి ఇలాగే కార్బన్‌ను రాళ్లుగా మారుస్తుంటాయి. కెన్యాలోని కొన్ని రకాల మేడి/అత్తి (ఫిగ్) చెట్లూ ఇలాగే చేస్తున్నాయని స్విట్జర్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ జ్యూరిచ్ పరిశోధకులు గుర్తించారు. అదీ పెద్దమొత్తంలో కార్బన్‌ను రాళ్ల రూపంలో దాస్తుండటం గమనార్హం. ఒక పళ్ల చెట్టు ఇలాంటి పనిని చేస్తున్నట్టు గుర్తించటం ఇదే తొలిసారి. ఇవి తమ కాండం వెలుపల, కలప లోపల కూడా క్యాల్షియం కార్బొనేట్లను ఏర్పరుస్తున్నట్టు తేలింది. సాధారణంగా క్యాల్షియం కార్బొనేట్ నుంచి కార్బన్ డయాక్సైడ్ వెలువడుతుంటుంది. అందుకే దాని ఆనవాళ్లను గుర్తించటానికి చెట్ల మీద పలుచటి హైడ్రోక్లోరిక్ ఆమ్లాన్ని చల్లారు. అప్పుడు చెట్టు నుంచి బుడగలు రావటం గమనించారు. చెట్టు కాండంలోనే కాకుండా దాని చుట్టుపక్కల నేలలోనూ రాళ్ల రూపంలో కార్బన్ ఉండటం విచిత్రం. ఇందుకు సూక్ష్మక్రిములు కాండం వెలుపల, కలప లోపల స్ఫటికాలను క్షీణింపజేయటం కారణం కావొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. మేడి చెట్లను మరింత ఎక్కువగా నాటితే వాతావరణం నుంచి కార్బన్ డయాక్సైడ్‌ను అధికంగా సంగ్రహించుకునే అవకాశముందని సూచిస్తున్నారు.

## డివైస్ సలహా

### యూట్యూబ్ మ్యూట్




యూట్యూబ్‌లో చాలా ఆసక్తిగా సినిమా చూస్తున్నారు. అంతలో ఎవరో వచ్చారు. ముఖ్యమైన విషయమేదో చెప్పాలనుకున్నారు. ఇలాంటప్పుడు యూట్యూబ్‌ను వెంటనే మ్యూట్ చేయాలంటే? కీబోర్డులో ఎం మీటను నొక్కితే సరి. సౌండ్ ఆగిపోతుంది. అన్‌మ్యూట్ చేయాలంటే తిరిగి ఎం మీట నొక్కండి. వీడియో మధ్యలో ఎవరైనా మాట్లాడుతున్నప్పుడు ఈ చిట్కా బాగా ఉపయోగపడుతుంది.

### డేటా పరిమితి మించుతోందా?



విండోస్ పరికరాన్ని వాడుతున్నప్పుడు డేటా పరిమితి దాటుతుందేమోనని ఆందోళన చెందుతున్నారా? అయితే హెచ్చరిక సంకేతం అందేలా సెట్ చేసుకోండి. సెటింగ్స్ ద్వారా నెట్‌వర్క్ అండ్ ఇంటర్నెట్‌లోకి వెళ్తే అడ్వాన్స్‌డ్ నెట్‌వర్క్ సెటింగ్స్ కనిపిస్తుంది. ఇందులో డేటా యూసేజ్ ఆప్షన్ ద్వారా వై-ఫై లేదా ఎథర్‌నెట్ కనెక్షన్ ఎంచుకోవాలి. తర్వాత ఎంటర్ లిమిట్ మీద తాకి లిమిట్ టైప్ (మంత్లీ వంటి) ఎంచుకోవాలి. పరిమితిని విధించుకొని, సేవ్ మీద క్లిక్ చేయాలి.

### పాడ్‌కాస్ట్ షేర్



ఐప్యాడ్‌లో మంచి పాడ్‌కాస్ట్ వింటున్నారనుకోండి. అప్పుడే దాన్ని ఇష్టమైనవారికో, స్నేహితుడికో షేర్ చేయాలంటే? ఆ పాడ్‌కాస్ట్ ప్లే అవుతున్నప్పుడు మూడు చుక్కల మెనూ మీద క్లిక్ చేసి, షేర్ ఎపిసోడ్‌ను ఎంచుకోవాలి. మొత్తం మొదటి నుంచీ షేర్ చేయాలనుకుంటే ఫ్రమ్ స్టార్ట్ ఆప్షన్ ఎంచుకోవచ్చు. లేదూ కచ్చితమైన సమయం నుంచే పంపించాలంటే ఫ్రమ్, సమయాన్ని (ఉదా: ఫ్రమ్ 1:30) క్లిక్ చేయాలి. తర్వాత డన్ మీద నొక్కి ఇష్టమైనట్టుగా సెండ్ చేసుకోవాలి.

### ఇన్‌స్టా పోస్ట్ జూమ్



ఫోన్‌లో ఇన్‌స్టాగ్రామ్ వాడుతున్నారా? చిన్న చిన్న అక్షరాలు, వివరాలు సరిగా కనిపించటం లేదా? అయితే ఫొటోలు, వీడియోల మీద రెండు వేళ్లను ఆనించి దూరంగా జరిపి చూడండి. అప్పుడవి పెద్దగా అవుతాయి. చిన్న చిన్న అక్షరాల వంటివి పెద్దగా కనిపిస్తాయి.

# నక్షత్ర మరణం రెండుసార్లు!




సాధారణంగా నక్షత్రాలు అంత్యదశలో విస్ఫోటం చెందుతుంటాయి. నక్షత్రం పేలిపోవటమంటే అది మరణించటమే. కానీ అది రెండు సార్లు పేలిపోతే? రెండు సార్లు మరణించినట్టే కదా. ఇలాంటి విచిత్రాన్నే ఈఎస్ఓ శాస్త్రవేత్తలు గుర్తించారు. వెరీ లార్జ్ టెలిస్కోప్, మల్టీ యూనిట్ స్పెక్ట్రోస్కోపిక్ ఎక్స్‌ప్లోరర్ సాయంతో ఎస్ఎన్ఆర్ 0509-67.5 సూపర్‌నోవా అవశేషాలను పరిశీలించారు. భూమికి 1,60,000 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న ఇవి 300 ఏళ్ల క్రితం ఏర్పడ్డాయని అనుకుంటున్నారు. విస్ఫోటానికి మూలమైన నక్షత్రం రెండు సార్లు పేలిందనటానికి ఎస్ఎన్ఆర్ 0509-67.5 స్పష్టమైన నిదర్శనమని భావిస్తున్నారు. దీర్ఘకాలంగా అంతుచిక్కని రహస్యాన్ని పరిష్కరించటానికిది దారిచూపటమే కాకుండా అద్భుతమైన ఖగోళ దృశ్యంగానూ కనువిందు గొలుపుతుండటం విశేషం.

### విస్ఫోటం ఎలా?

తెల్ల మరుగుజ్జు నక్షత్రాల పేలుళ్లకు ఖగోళ శాస్త్రం చాలా ప్రాధాన్యమిస్తుంది. అయితే ఇవి పేలిపోవటానికి ప్రేరేపించే కచ్చితమైన ప్రక్రియ ఏంటనేది ఇప్పటికీ తెలియదు. టైప్ 1ఏ సూపర్‌నోవా పుట్టుకురావటానికి రెండు నక్షత్రాల వ్యవస్థ కారణమని శాస్త్రవేత్తలు చాలావరకూ అభిప్రాయపడుతుంటారు. జంట నక్షత్రాల్లో ఒకటి అంత్యదశకు చేరుకుంటూ, తెల్ల మరుగుజ్జు రకంగా మారుతుంది. ఇది సజీవంగా ఉన్న మరో నక్షత్రం సమీపంలోకి వచ్చినప్పుడు 'నక్షత్ర భూతం'గా తయారవుతుంది. సజీవ నక్షత్రం నుంచి పదార్థాన్ని తనలోకి లాగేసుకుంటుంది. చివరికి చంద్రశేఖర్ పరిమితిని అధిగమించి పేలిపోయి, టైప్ 1ఏ సూపర్‌నోవాగా మారుతుంది. దీంతో నక్షత్రం మరణించినట్టేనని ఇంతకుముందు అనుకునేవారు. కానీ అక్కడితోనే కథ ఆగిపోదన్నది శాస్త్రవేత్తల భావన. తెల్ల మరుగుజ్జు నక్షత్రంలో రెండు సార్లు విస్ఫోటం జరిగే అవకాశముందని చెబుతోన్న తాజా పరిశోధన దీనికి మరింత బలం చేకూర్చింది.

### పేలుడులో మతలబు

నక్షత్రం అంత్యదశ సమీపిస్తున్నకొద్దీ దానిలో అణు ఇంధనం నిండుకొని, ఆవలి పొరలు తొలగిపోతుంటాయి. కేంద్ర భాగం మాత్రమే మిగిలి.. తెల్ల మరుగుజ్జు నక్షత్రంగా కనిపిస్తుంది. దీన్ని నక్షత్రం పేలిపోవటానికి ముందు దశ అనుకోవచ్చు. ఇలాంటి మరుగుజ్జు నక్షత్రాలు గరిష్ఠంగా భరించగలిగే ద్రవ్యరాశిని చంద్రశేఖర్ పరిమితి అంటారు. ఇది సూర్యుడి ద్రవ్యరాశికి 1.4 రెట్లు ఎక్కువ. నక్షత్రం ద్రవ్యరాశి ఈ పరిమితిని దాటితే అది పేలిపోతుంది (సూపర్‌నోవా). అయితే కొన్ని నక్షత్రాలు చంద్రశేఖర్ పరిమితికి చేరుకోకుండానే సూపర్‌నోవాలుగా మారుతున్నట్టు ఎస్ఎన్ఆర్ 0509-67.5 సూచిస్తోంది. ఇది నిజానికి తెల్ల మరుగుజ్జు నక్షత్రమని హబుల్ టెలిస్కోప్ సాయంతో వేధశాలలు సంగ్రహించిన సమాచారం, ఈఎస్ఓ పరిశోధనలు ధ్రువీకరించాయి. ఇలాంటి నక్షత్రాలు విస్ఫోటం చెందుతాయి. వీటిని టైప్ 1ఏ సూపర్‌నోవాగా వర్ణిస్తుంటారు. ఖగోళ దూరాలను కొలవటానికి ఇవి శాస్త్రవేత్తలకు ఎంతగానో ఉపయోగపడతాయి. ఎందుకంటే ఇలాంటి సూపర్‌నోవాలు వెదజల్లే కాంతి ఒకేలా ఉంటుంది. కాబట్టే వీటిని 'ప్రామాణిక క్యాండిల్స్' అనీ శాస్త్రవేత్తలు ముద్దుగా పిలుచుకుంటారు.

### రెండు సార్లు ఎలా?

తాజా సిద్ధాంతం ప్రకారం- తెల్ల మరుగుజ్జు తారలు నక్షత్ర భూతాలుగా మారినప్పుడు అవి తమ దాత నక్షత్రాల నుంచి పదార్థాన్ని లోపలికి లాక్కుంటాయి. దొంగిలించిన హీలియంతో నిండిపోతాయి. ఇది అస్థిరత్వానికి దారితీసి జ్వలనాన్ని ప్రేరేపిస్తుంది. చివరికి తొలి పేలుడుకు దారితీస్తుంది. దీంతో నక్షత్రం లోపల ఘర్షణ తరంగాల ప్రకంపనలు పుట్టుకొస్తాయి. ఇవి నక్షత్రం కేంద్ర స్థానాన్ని తాకటం వల్ల రెండో పేలుడు సంభవిస్తుంది. ఫలితంగా నిజమైన సూపర్‌నోవా ఏర్పడుతుంది. తెల్ల మరుగుజ్జు నక్షత్రం ద్రవ్యరాశి చంద్రశేఖర్ పరిమితికి చేరుకోకముందే ఇది సంభవిస్తుండటం గమనార్హం. సూపర్‌నోవా అవశేషాల రూపంలో రెండో పేలుడు దీర్ఘకాల ముద్ర వేయగలదని శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు. తాజాగా ఎస్ఎన్ఆర్ 0509-67.5 వ్యర్థాల్లో దీని ఉనికిని నిర్ధారించినట్టయ్యింది.

## షావోమీ కాంపాక్ట్ పవర్ బ్యాంక్



షావోమీ సంస్థ మనదేశంలో కొత్త పవర్ బ్యాంక్‌ను పరిచయం చేసింది. దీని పేరు షావోమీ కాంపాక్ట్ పవర్ బ్యాంక్. 20,000 ఎంఏహెచ్ సామర్థ్యం గల ఇది ఇన్‌బిల్ట్ కేబుల్‌తో వస్తోంది. 22.5డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్‌ను సపోర్టు చేస్తుంది. 10,000 ఎంఏహెచ్‌తో కూడిన రెండు బ్యాటరీ సెల్స్ ఉండటం వల్ల త్వరగా ఛార్జింగ్ నిండుకుంటోందన్న బెంగ ఉండదు. 12 పొరల సర్క్యూట్ చిప్ రక్షణ గల పరికరాల శ్రేణిలో ఇది సురక్షితమైందని కంపెనీ చెబుతోంది. దీని ధర రూ.1,799. జులై 10 నుంచి అమ్మకాలు మొదలవుతాయి.

# చదువు

21 ■ e-mail: edc@eenadu.in

హైదరాబాద్
బుధవారం జులై 9, 2025
ఈనాడు


# పదితోనే అత్యాధునిక శిక్షణ!

**కేవలం పదోతరగతి అర్హత ఉంటే చాలు. విశాఖలోని నైపుణ్యాభివృద్ధి సంస్థ (స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్) ఆ నిరుద్యోగులకు శిక్షణ ఇస్తోంది. పారిశ్రామిక అవసరాలు, కొరత ఉన్న మానవ వనరుల విభాగాలను గుర్తించి.. అత్యాధునిక సాంకేతిక ప్రయోగశాలలు, ఆధునిక తరగతిగదులు, బోధకులతో.. ఉపాధి పొందేలా తీర్చిదిద్దుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడి విద్యార్థులైనా ఇందులో చేరే వీలుంది.**





2016లో ఎనిమిది ఇంధన కంపెనీల సహకారంతో విశాఖలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ సంస్థలో ఇప్పటివరకు 25 వేల మంది శిక్షణ తీసుకున్నారు. వీరిలో 80 శాతం మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. దేశంలోనే స్కిల్ ఇండియాకు ఉన్న శిక్షణ కేంద్రాల్లో ఏపీకి కేటాయించిన ఈ కేంద్ర సేవలను అభ్యర్థులు మరింత ఉపయోగించుకునే వీలుంది.

## శిక్షణ సంస్థ లక్ష్యం..

★ నైపుణ్యాలు కల్పించడం, ఉపాధి అందించడం, ఇంటర్న్‌షిప్స్, కార్పొరేట్ ఉద్యోగాలు, సాఫ్ట్‌వేర్, ఐటీ ప్రోగ్రామ్‌లు, పారిశ్రామిక అవసరాలకు తగిన నైపుణ్యాల పెంపు, మార్కెటింగ్‌లో డిజిటల్ పరిజ్ఞానం, క్వాలిటీ - సేఫ్టీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం, మేనేజీరియల్ డెవలప్‌మెంట్, ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్, నాయకత్వ లక్షణాలు, ప్రాజెక్టుల నిర్వహణ.. ఇలా ఎన్నో విభాగాల్లో ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు.

★ గ్రామీణ యువతకు ఉపయోగపడేలా ఇందులో కోర్సులను డిజైన్ చేశారు. శిక్షణ కాలం తక్కువగా ఉండేలా.. రెండు, మూడు నెలల కాలపరిమితితో ప్రాథమిక అవగాహన అందించేలా ఇవి ఉంటాయి. చాలా కోర్సులకు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ అర్హతతో చేర్పించుకుంటారు.

1. హైడ్రోకార్బన్ కేటగిరీలో ఫైర్ సేఫ్టీ టెక్నీషియన్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్, వెల్డర్, ఎల్‌పీజీ మెకానిక్, పైపు ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మెన్ మెకానికల్ వంటి కోర్సులున్నాయి.
2. లైఫ్ సైన్సెస్‌లో ఫార్మా, బయాలజిక్స్, మెడికల్ డివైస్ ఫెసిలిటీ, కాస్మొటిక్స్‌లో మెయింటెనెన్స్, మాన్యుఫ్యాక్చరింగ్, ప్రొడక్షన్, ల్యాబ్ టెక్నీషియన్.
3. గ్రీన్ జాబ్స్‌లో సౌరఫలకాల ఏర్పాటు, సాంకేతిక వినియోగం.
4. మేనేజ్‌మెంట్‌లో ఆఫీస్ అసిస్టెంట్, రిటైల్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్.
5. టూరిజంలో హాస్పిటాలిటీ, ఆటోమోటివ్, హెల్త్‌కేర్, లాజిస్టిక్స్, బ్యూటీ వెల్‌నెస్‌లో ఇలా శిక్షణలుంటాయి.

**30 రోజుల శిక్షణ కాలం కోర్సులు..**

★ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ ఆన్ వేరియబుల్ ఫ్రీక్వెన్సీ డ్రైవ్స్ (వీఎఫ్‌డీఎస్) ★ ఏఐ మెషిన్ లెర్నింగ్ ఇంజినీర్ ★ ఏఐ డీప్ లెర్నింగ్ ఇంజినీర్ ★ ప్రాసెస్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీర్ ★ క్వాలిటీ కంట్రోల్ టెక్నీషియన్, కాలిబరేషన్ ఇంజినీర్స్ ★ ఎలక్ట్రో హైడ్రాలిక్ ఇంజినీర్

**స్పెషలైజ్డ్ కోర్సులు (90 రోజుల శిక్షణ కాలంతో..)**

★ బ్రైడల్ ఫ్యాషన్ ★ ప్రాజెక్ట్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ ఇంజినీర్ ★ సేల్స్ అండ్ మార్కెటింగ్ మేనేజర్ ★ కాస్ట్ అకౌంటింగ్, కంపెనీ కంప్లయన్స్ ఎగ్జిక్యూటివ్

**90 రోజుల శిక్షణ కాలం కోర్సులు**

★ ప్రోగ్రామబుల్ లాజిక్ కంట్రోలర్ (పీఎల్‌సీ) ★ ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నీషియన్ ★ హెచ్ఎంఐ, ఎస్‌సీఏడీఏ ప్రోగ్రామర్, ట్రబుల్ షూటర్ ★ ఇండస్ట్రియల్ ఆటోమేషన్ టెక్నీషియన్, స్పెషలిస్టు ★ మెకానిక్స్ మెయింటెనెన్స్ స్పెషలిస్టు, ఎలక్ట్రో హైడ్రాలిక్ సిస్టమ్ ★ మాస్టర్ సర్టిఫికేషన్ ఇన్ ఇండస్ట్రియల్ ఆటోమేషన్, మెకానిక్స్

## అడ్వాన్స్‌డ్ కోర్సులకు..

ఈ ఇన్‌స్టిట్యూట్ వివిధ పరిశ్రమలతో నిరంతరం అందుబాటులో ఉంటూ ఏ రంగంలో మానవ వనరులు అవసరమో గుర్తించి సంబంధిత కోర్సుల్లో అభ్యర్థులకు శిక్షణ ఇస్తుంది. వీటిలో చాలా కోర్సులను ఉచితంగా నిర్వహిస్తుండగా, కొన్నింటికి మాత్రం నామమాత్రపు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. కొన్ని కంప్యూటర్, ఐటీ అడ్వాన్స్‌డ్ కోర్సులకు బయట రూ.50 వేలు ఖర్చయితే ఇక్కడ రూ.10 వేలతో నేర్పిస్తారు.

★ ఐటీ ప్రోగ్రామింగ్‌లలో జావా, అడ్వాన్స్‌డ్ పైథాన్, వెబ్ డెవలప్‌మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఉంటాయి. ఇంజినీరింగ్ సర్వీసెస్‌లో మెడికల్ కోడింగ్, ఎస్‌ఏపీ ఫికో, డిజిటల్ మార్కెటింగ్, సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్ నేర్పిస్తారు.

★ టెక్నికల్ కోర్సుల్లో సివిల్, ఆర్కిటెక్చర్‌కి సంబంధించి.. ఆటోకాడ్ సివిల్, రివిట్, 3డీస్ మ్యాక్స్, స్టాడ్ ప్రో, ఆర్కిటెక్ట్ ఇంజినీర్, స్ట్రక్చరల్ డిజైనర్. మెకానికల్‌లో సీఏడీ (సీఆర్ఈవో, సీఏటీఐఏ), సీఏఎం (మాస్టర్‌క్యామ్, డీక్లామ్) సీఏఈ ఉన్నాయి. ఆరు నెలల సర్టిఫికెట్ కోర్సుల్లో సీఏడీ, సీఏఎం, సీఏఈలో మాస్టర్ సర్టిఫికెట్ కోర్సు, సీఎన్‌సీ టెక్నీషియన్ వంటివి ఉన్నాయి.

## అత్యాధునికంగా..

లక్ష చదరపు అడుగుల్లో నిర్వహిస్తున్న ఈ శిక్షణ కేంద్రంలో అత్యాధునిక ప్రయోగశాలలు, తరగతి గదులున్నాయి. వర్చువల్ ల్యాబ్, ప్రయోగశాలలు, పరిశ్రమలకు చెందిన ప్రయోగాలు, ఫిట్టర్, ఫ్యాబ్రికేషన్, ఏఆర్‌సీ వెల్డింగ్, ప్రొడక్షన్ మెషిన్ ఆపరేటింగ్ విధానాలుంటాయి. 500 మందికి సరిపడా వసతి సౌకర్యం అందులోనే కల్పిస్తున్నారు. భోజన వసతి ఉచితం. భవిష్యత్తులో ఏటా 5 వేల మంది శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇది నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ) గుర్తింపు పొందిన సంస్థ.

★ ఆసక్తి ఉన్న వారు విశాఖలోని ద్వారకానగర్ బస్‌స్టాండ్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలో సంప్రదించొచ్చు. అక్కడున్న హెల్ప్‌డెస్క్‌లో వివరాలు అందజేస్తే కోర్సులు ప్రారంభించే ముందు సమాచారం ఇచ్చి చేర్చుకుంటారు.


**మరిన్ని వివరాలకు వెబ్‌సైట్:** www.sdivisakh.in

– సురేశ్ రావివలస, ఈనాడు–విశాఖపట్నం

# కెరియర్‌కు గట్టి పునాది

**నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంత ముఖ్యమో, వ్యక్తిత్వ, సామాజిక నైపుణ్యాలూ అంతే కీలకం. మీనాక్షి రామన్, శాలిని ఉపాధ్యాయ రచించిన 'సాఫ్ట్ స్కిల్స్' ఈ నైపుణ్యాలను సమగ్రంగా వివరిస్తుంది. కెరియర్‌కు చక్కని పునాది వేసుకునేందుకు ఉపయోగపడుతుంది. తద్వారా వృత్తి జీవితంలో సమర్థంగా రాణించవచ్చు.**

వ్యక్తిత్వాన్ని మెరుగుపరుచుకోవడం, సమర్థంగా కమ్యూనికేట్ చేయడం, బృందంలో కలిసి పని చేయడం, వివిధ పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో నేర్చుకోవడం కళాశాల విద్యార్థులకూ, ఉద్యోగార్థులకూ ఎంతో అవసరం. కళాశాల దశలో నేర్చుకునే సాంకేతిక నైపుణ్యాలు నిర్దిష్ట ఉద్యోగానికి అర్హులుగా చేస్తాయి. కానీ సాఫ్ట్ స్కిల్స్ కెరియర్ ఎదుగుదలకు తోడ్పడటమే కాకుండా వ్యక్తిగత జీవితంలో కూడా విజయం సాధించడానికి పునాది వేస్తాయి. ఈ పుస్తకం నేర్పే కొన్ని ముఖ్య విషయాలు చూద్దాం.




పుస్తకం

**సమర్థ కమ్యూనికేషన్:** ఈ పుస్తకం మౌఖిక, లిఖితపూర్వక కమ్యూనికేషన్ నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తుంది. ఇంటర్వ్యూల్లో ఎలా మాట్లాడాలి, ప్రజెంటేషన్లు ఎలా ఇవ్వాలి, ఈ-మెయిల్స్ ఎలా రాయాలి, వృత్తిపరమైన సంభాషణల్లో ఎలా పాల్గొనాలి అనే విషయాలను చర్చిస్తుంది. పని ప్రదేశాల్లో మన ఆలోచనలను సమర్థంగా వ్యక్తపరచడానికీ, అపార్థాలను నివారించడానికీ స్పష్టమైన, సంక్షిప్త కమ్యూనికేషన్ చాలా అవసరం. ఎదుటివారి మాటలను వినడం, హావభావాలను అర్థం చేసుకోవడం లాంటి నైపుణ్యాలను కూడా ఇందులో చర్చించారు.

**వ్యక్తిత్వ వికాసం, ప్రొఫెషనలిజం:** పని ప్రదేశంలో వ్యక్తిత్వం, ప్రొఫెషనలిజం చాలా ముఖ్యమైనవి. సమయపాలన, నైతిక ప్రవర్తన, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం గురించి ఈ పుస్తకం మార్గనిర్దేశం చేస్తుంది. ఆత్మవిశ్వాసం, అనుకూల వైఖరి, సమస్యా పరిష్కార నైపుణ్యాలు వ్యక్తిత్వాన్ని మెరుగుపరుస్తాయి. విలువైన ఉద్యోగిగా మారుస్తాయి.

**టీమ్ వర్క్, పరస్పర సహకారం:** ఆధునిక పని ప్రదేశాలలో టీమ్ వర్క్‌కు ప్రాధాన్యం ఎక్కువ. ఈ పుస్తకం టీమ్‌లో ఎలా మెరుగ్గా పని చేయాలి, అభిప్రాయ భేదాలను ఎలా పరిష్కరించాలి, ఉమ్మడి లక్ష్యాలను ఎలా సాధించాలి అనే విషయాలపై దృష్టి సారిస్తుంది. బృందంలో భాగంగా ఇతరులతో ఎలా సహకరించాలి, మన బాధ్యతలను ఎలా నిర్వర్తించాలి, ఇతరులకు ఎలా సహాయం చేయాలి అనేవి చాలా ముఖ్యం.

**సమస్యా పరిష్కారం, నిర్ణయం తీసుకోవడం:** క్లిష్ట పరిస్థితుల్లో సరైన నిర్ణయాలు, సమస్యా పరిష్కారం అనేవి వృత్తి జీవితంలో ప్రధాన నైపుణ్యాలు. సమస్యలను గుర్తించడం, విశ్లేషించడం, తార్కిక పరిష్కారాలకు ఉపకరించే వివిధ పద్ధతులను గ్రహించాలి.

**ఆఫీస్ ఎటికెట్, నెట్‌వర్కింగ్:** పని ప్రదేశాల్లో సరైన ప్రవర్తన, వృత్తికి ఉపకరించే సంబంధాలను పెంచుకోవడం చాలా అవసరం. ఈ పుస్తకం ఆఫీస్ ఎటికెట్, సమావేశాల నియమాలు, ఫోన్ ఎటికెట్, నెట్‌వర్కింగ్ ద్వారా సంబంధాలను ఎలా విస్తరించుకోవాలి అనే విషయాలపై దృష్టి సారిస్తుంది. బలమైన నెట్‌వర్క్ భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలకూ, కెరియర్ ఎదుగుదలకూ ఎంతో ఉపయోగపడుతుంది.

**టైమ్ మేనేజ్‌మెంట్, ఒత్తిడి నిర్వహణ:** కళాశాలలో అయినా, ఉద్యోగ జీవితంలో అయినా సమయ నిర్వహణ, ఒత్తిడిని ఎదుర్కోవడం చాలా అవసరం. పనులకు ప్రాధాన్యం ఇవ్వడం, గడువులను పాటించడం, ఒత్తిడిని తగ్గించుకోవడం లాంటివాటికి వివిధ ఆచరణీయ పద్ధతులను పాటించాలి.

కళాశాల విద్యార్థులుగా ఈ పుస్తకాన్ని చదవడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవచ్చు. విజయవంతమైన కెరియర్‌ను నిర్మించుకోవడానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చు. కెరియర్ ప్రారంభదశలో ఉన్న యువతీ యువకులు ఈ పుస్తకాన్ని రెఫరెన్స్ గైడ్‌గా ఉపయోగించుకుని నైపుణ్యాలను మెరుగుపరుచుకోవచ్చు. అలా కార్యాలయంలో తమ ఉనికిని చాటుకోవచ్చు. గుర్తుంచుకోండి- సాంకేతిక నైపుణ్యాలు కెరియర్‌కు ప్రవేశ ద్వారాలు మాత్రమే. సాఫ్ట్ స్కిల్స్ మాత్రం కెరియర్‌లో పైకి తీసుకువెళ్లే అమూల్య సాధనాలు!

– రహ్మాన్ & సంపత్

# హోం స్కూలింగ్‌తో చిక్కులొస్తాయా?

**మా పిల్లలు చదివే స్కూల్లో హోంవర్క్‌లో తప్పులు రాసినా రైట్ పెడుతున్నారు. ఇంగ్లిష్ స్పీకింగ్ కూడా మెరుగ్గా లేదు. పిల్లలను ఈ ఒక్క సంవత్సరం నా పర్యవేక్షణలో హోం స్కూలింగ్ చేయించాలనివుంది. ఇలా చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయా? - వి.ఎస్ రావు**



■ ఈ సమస్య మీ ఒక్కరిదే కాదు. మీలాంటి చాలామంది తల్లిదండ్రులు ఈ విషయంలో ఎలా ముందుకు వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. హోమ్ స్కూలింగ్ అంటే పిల్లలను ఒక రిజిస్టర్డ్ పాఠశాలలో చేర్పించకుండా తల్లిదండ్రులో, ప్రత్యేక ట్యూటర్లో ఇంట్లోనే చదివిస్తారు.

విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం 6- 14 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలకు నిర్బంధ ప్రాథమిక విద్యా హక్కు ఉంది. దీని ప్రకారం ఆ వయసులో ఉన్న ప్రతి ఒక్కరూ ఏదో ఒక స్కూల్లో అడ్మిషన్ తీసుకొని చదవాలి.

హోమ్ స్కూలింగ్ వల్ల కొన్ని ప్రయోజనాలూ, ఇబ్బందులూ ఉంటాయి. పిల్లలు నేర్చుకొనే స్థాయికి తగ్గట్టు సిలబస్ బోధించవచ్చు. ప్రాథమిక అంశాలూ, విలువలూ, నైపుణ్యాలపై శ్రద్ధ పెట్టవచ్చు. ర్యాంకులు, గ్రేడ్ల లాంటి అనవసరపు ఒత్తిడి తగ్గుతుంది. మార్కుల కోసం బట్టీ పట్టడం తగ్గుతుంది. ప్రాథమిక అంశాలపై పట్టు పెరుగుతుంది. ఆసక్తి ఉంటే డాన్స్/ మ్యూజిక్/ స్పోర్ట్స్‌ను సమాంతరంగా నేర్పించవచ్చు. కానీ తల్లిదండ్రులే ఉపాధ్యాయులుగా మారినప్పుడు పిల్లలు వారి మాటను పట్టించుకోకపోయే ప్రమాదం ఉంది. సాధారణ పాఠశాలలో ఉండే గ్రూప్ యాక్టివిటీస్, తోటి విద్యార్థుల నుంచి నేర్చుకోవడం, బృంద క్రీడలు ఉండవు. హోమ్ స్కూలింగ్ తరువాత రెగ్యులర్ స్కూల్లో చేర్చాలనుకొంటే హోమ్ స్కూలింగ్ చదివిన విద్యా సంవత్సరపు రికార్డులు ఉండవు. తల్లిదండ్రులు కానీ, ట్యూటర్లు గానీ దాదాపు తొమ్మిది నెలలపాటు ఉదయం నుంచి సాయంత్రం వరకూ విధిగా పిల్లలతోనే ఉండాలి. హోమ్ స్కూలింగ్‌లో ఓరల్ కమ్యూనికేషన్ స్కిల్స్ పెద్దగా మెరుగవ్వవు. విద్యాసంవత్సరం వృథా కాకుండా ఉండాలంటే ప్రస్తుతం వాళ్లు చదువుతున్న స్కూలును మార్చి, ఇంట్లో మరికొంత శ్రద్ధ పెట్టే ప్రయత్నం చేయండి. తరచుగా స్కూల్ ప్రిన్సిపల్‌నూ, ఉపాధ్యాయులనూ కలుస్తూ, మీ సమస్యను చెప్పండి. చివరిగా..పాఠశాలలు, తల్లిదండ్రులు చేసే వివిధరకాల ప్రయోగాల వల్ల పిల్లలకు చదువు భారంగా మారకుండా చూడాల్సిన అవసరం ఉంది. విద్యను క్రీడలాగా, సంగీతంలాగా వినోదంగా, ఆహ్లాదంగా నేర్చుకునే వాతావరణం ఉండేట్లు చూడండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

# రిమోట్ సెన్సింగ్‌లో రిసెర్చ్ సైంటిస్టులు

**హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ).. 34 పోస్టులను భర్తీ చేయనుంది. తాత్కాలిక ప్రాతిపదికన ఏడాది కాలానికి ఎంపిక చేస్తారు. కొన్ని పోస్టులను ఐదేళ్లకు పొడిగించే అవకాశం ఉంది.**

మొత్తం ఖాళీల్లో రిసెర్చ్ సైంటిస్ట్-4, ప్రాజెక్ట్ సైంటిస్ట్-3, ప్రాజెక్ట్ అసోసియేట్-10, జూనియర్ రిసెర్చ్ ఫెలో-17 ఉన్నాయి.

◆ **రిసెర్చ్ సైంటిస్ట్:** రిమోట్ సెన్సింగ్, జీఐఎస్/ జియో ఇన్ఫర్మాటిక్స్/ జియోమాటిక్స్/ స్పేషియల్ ఇన్ఫర్మేషన్/ జియాలజీ/ అప్లైడ్ జియాలజీతో ఎంఈ/ఎంటెక్. లేదా ఎంఎస్సీ/ ఎంఎస్సీటెక్.

◆ **ప్రాజెక్ట్ సైంటిస్ట్:** ఎంఎస్సీ/ ఎంఎస్సీ టెక్/ ఎంటెక్- జియాలజీ / మీటీయొరాలజీ/ అట్మాస్ఫియరిక్ సైన్స్/ క్లైమేట్ సైన్స్/ ఎర్త్ సైన్స్/ క్లైమేట్ మోడలింగ్/ ఎర్త్ సిస్టమ్ మోడలింగ్/ ల్యాండ్ సర్ఫేజ్ మోడలింగ్‌తో డాక్టరల్ డిగ్రీ.

◆ **ప్రాజెక్ట్ అసోసియేట్:** రిమోట్ సెన్సింగ్, జీఐఎస్/ జియో ఇన్ఫర్మాటిక్స్/ జియో స్పేషియల్ టెక్నాలజీ/ స్పేషియల్ సైన్స్/ స్పేషియల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతో మాస్టర్స్ డిగ్రీ.

◆ **జూనియర్ రిసెర్చ్ ఫెలో:** ఫిజిక్స్/ ఓషనోగ్రఫీ/ ఓషన్ సైన్స్/ మెరైన్ సైన్స్/ ఎర్త్ సిస్టమ్ సైన్స్/ జియో ఫిజిక్స్/ అప్లైడ్ జియోఫిజిక్స్/ అట్మాస్ఫియరిక్ సైన్స్/ మీటీయొరాలజీ/ ఎర్త్ సిస్టమ్ సైన్స్/ క్లైమేట్ సైన్స్/ జియోఫిజిక్స్‌తో మాస్టర్స్ డిగ్రీ.

ఎంఈ/ఎంటెక్ 65 శాతంతో, ఎంఎస్సీ/ఎంస్సీ టెక్ 60 శాతంతో పూర్తిచేయాలి.

**వయసు:** 11.08.2025 నాటికి జేఆర్ఎఫ్‌కు 28 ఏళ్లు, రిసెర్చ్ సైంటిస్ట్‌కు 28-30 సంవత్సరాలు, ప్రాజెక్ట్ అసోసియేట్‌కు 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుంది. దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సడలింపులు వర్తిస్తాయి.

**దరఖాస్తు ఫీజు:** అభ్యర్థులందరూ రూ.250 చెల్లించాలి. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు/ మాజీ సైనికోద్యోగులు/ మహిళలకు ఎంపిక దశలో ఫీజును రిఫండ్ చేస్తారు.

**వేతనం:** రిసెర్చ్ సైంటిస్ట్‌కు నెలకు రూ.56,100, హెచ్ఆర్ఏ, డీఏ అదనం. రిసెర్చ్ సైంటిస్ట్‌కు నెలకు రూ.56,000, హెచ్ఆర్ఏ అదనం. ప్రాజెక్ట్ అసోసియేట్‌కు నెలకు రూ.31,000, హెచ్ఆర్ఏ అదనం. జేఆర్ఎఫ్‌కు నెలకు రూ.37,000.





**ఎంపిక ఇలా**

◆ విద్యార్హతల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఈ జాబితాను వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు.
◆ ధ్రువపత్రాల పరిశీలన అనంతరం ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.
◆ ఇంటర్వ్యూ సమయంలో 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్'ను సమర్పించాలి.
◆ వ్యక్తిగత ప్రతిభ ఆధారంగా.. జూనియర్ రిసెర్చ్ ఫెలో, రిసెర్చ్ సైంటిస్ట్ పోస్టుల కాలవ్యవధిని ఐదేళ్లకు పొడిగించే అవకాశముంది.
◆ జేఆర్ఎఫ్ పోస్టుకు దరఖాస్తు చేసేవారు.. గేట్/ నెట్ అర్హత సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలి.
◆ ఒకటికంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసేవారు.. వేర్వేరుగా దరఖాస్తులు పంపాలి.
◆ ఇంటర్వ్యూకు ఎంపికైన వారికే ప్రయాణ ఛార్జీలను చెల్లిస్తారు.
◆ జేఆర్ఎఫ్ అభ్యర్థులను పీహెచ్‌డీ చేసే దిశగానూ సంస్థ ప్రోత్సహిస్తుంది.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 11.07.2025
**వెబ్‌సైట్:** https://www.nrsc.gov.in/Career_Apply

# ఇంటర్న్‌షిప్స్

## వర్క్ ఫ్రమ్ హోమ్

### బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)

**సంస్థ:** మైండ్‌స్పేస్ ఇండస్ట్రీస్ ప్రై.లి.
**నైపుణ్యాలు:** డిజిటల్, ఈమెయిల్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హిందీ మాట్లాడటం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్ **స్టైపెండ్:** రూ.5,000
**దరఖాస్తు గడువు:** జులై 31
https://lnk.ink/gWLtm

### వీడియో ఎడిటింగ్/ మేకింగ్

**సంస్థ:** లిట్‌మార్క్‌డ్ **నైపుణ్యాలు:** అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, యానిమేషన్, ఆడియో ఎడిటింగ్, క్యాప్‌కట్, కలర్ కరెక్షన్, కలర్ గ్రేడింగ్, డావెన్సీ రిజాల్వ్, ఫైనల్ కట్ ప్రో, మోషన్ గ్రాఫిక్స్, వీడియో ఎడిటింగ్, వీడియోగ్రఫీ, వీడియో మేకింగ్, విజువల్ డిజైన్, విజువల్ స్టోరీటెల్లింగ్
**స్టైపెండ్:** రూ.7,000-15,000
**దరఖాస్తు గడువు:** ఆగస్టు 2
https://shorturl.at/rgs1W

### కాపీరైటింగ్

**సంస్థ:** ఇన్‌ఎమిగోస్ ఫౌండేషన్
**నైపుణ్యాలు:** కంటెంట్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
**స్టైపెండ్:** రూ.2,000-3,000
https://lnk.ink/fwSKd

### గ్రాఫిక్ డిజైన్

**సంస్థ:** ఓర్‌టెక్స్‌వెబ్ **నైపుణ్యాలు:** అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, అడోబ్ క్రియేటివ్ సూట్, ఇలస్ట్రేటర్, ఇన్‌డిజైన్, ఫొటోషాప్, ఫొటోషాప్ లైట్‌రూమ్ సీసీ, ప్రీమియర్ ప్రో, కోరల్‌డ్రా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్, వీడియో ఎడిటింగ్ **స్టైపెండ్:** రూ.3,000-5,000
https://lnk.ink/voQHh

ఈ రెండిటికీ దరఖాస్తు గడువు: ఆగస్టు 1

# నోటీస్ బోర్డు

## ఉద్యోగాలు

### పోలీస్ అకాడమీలో విజిటింగ్ ప్రొఫెసర్లు

సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ, హైదరాబాద్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 3 విజిటింగ్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**విభాగాలు:** లా, టీచింగ్ మెథడాలజీ, సైబర్ లా & సైబర్ సెక్యూరిటీ. **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఫిల్/పీహెచ్‌డీతో పాటు పని అనుభవం.
**వయసు:** 28 ఏళ్ల నుంచి 65 ఏళ్లు.
**వేతనం:** నెలకు రూ.1,50,000. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా.
**దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ:** 28.08.2025
**చిరునామా:** సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ, శివరామ్‌పల్లి హైదరాబాద్-500052, తెలంగాణ.
**వెబ్‌సైట్:** https://www.svpnpa.gov.in/home

### హెచ్ఎస్ఎల్ విశాఖపట్నంలో..

హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(హెచ్ఎస్ఎల్) విశాఖపట్నం వివిధ విభాగాల్లో 47 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**విభాగాలు:** టెక్నికల్, సబ్‌మెరైన్, సివిల్, హెచ్ఆర్, సెక్యూరిటీ, కార్పొరేట్ కమ్యూనికేషన్, డిజైన్, లీగల్, బిజినెస్.

- మేనేజర్(టెక్నికల్): 03
- ప్రాజెక్ట్ సూపరింటెండెంట్(టెక్నికల్): 02
- డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్(టెక్నికల్): 14
- డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్(సబ్‌మెరైన్): 09
- డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్(సివిల్): 03
- డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్(హెచ్ఆర్): 06
- డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్(సెక్యూరిటీ): 01
- డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్(కార్పొరేట్ కమ్యూనికేషన్): 01
- డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్(డిజైన్): 02
- సీనియర్ కన్సల్టెంట్(డిజైన్): 01
- సీనియర్ కన్సల్టెంట్(లీగల్): 01
- సీనియర్ కన్సల్టెంట్(బిజినెస్ & వెండర్ డెవలప్‌మెంట్): 01 ● కన్సల్టెంట్(సబ్‌మెరైన్): 02
- కన్సల్టెంట్(ఢిల్లీ ఆఫీస్): 01

**అర్హత:** పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీటెక్/బీఈ, ఎల్ఎల్‌బీ, పీజీ, డిప్లొమాతో పాటు పని అనుభవం. **గరిష్ఠ వయసు:** 2025 ఆగస్టు 9వ తేదీ నాటికి మేనేజర్‌కు 40 ఏళ్లు, ప్రాజెక్ట్ సూపరింటెండెంట్‌కు 57 ఏళ్లు, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్‌కు 40 - 45 ఏళ్లు, సీనియర్ కన్సల్టెంట్, కన్సల్టెంట్‌కు 62 ఏళ్లు.
**వేతనం:** నెలకు మేనేజర్‌కు రూ.60,000 - రూ.1,80,000, ప్రాజెక్ట్ సూపరింటెండెంట్‌కు రూ.1,70,000, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్‌కు రూ.73,000, సీనియర్ కన్సల్టెంట్‌కు రూ.1,20,000, కన్సల్టెంట్‌కు రూ.1,00,000.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 09.08.2025
**దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.300. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌లకు ఫీజు లేదు. **ఎంపిక:** ఇంటర్వ్యూతో.
**వెబ్‌సైట్:** https://hslvizag.in/en/careers

### నేషనల్ హౌసింగ్ బ్యాంకులో..

దిల్లీలోని నేషనల్ హౌసింగ్ బ్యాంకు ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 10 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్: 01
- చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్: 01
- చీఫ్ రిస్క్ ఆఫీసర్: 01
- హెడ్(లెర్నింగ్ & డెవలప్‌మెంట్): 01
- అడ్మినిస్ట్రేటర్(లెర్నింగ్ & డెవలప్‌మెంట్): 01
- సీనియర్ ట్యాక్స్ ఆఫీసర్: 02
- సీనియర్ అప్లికేషన్ డెవపలర్: 01
- అప్లికేషన్ డెవలపర్: 02

**అర్హత:** పోస్టును అనుసరించి డిగ్రీ, బీటెక్/బీఈ, సీఏ, పీజీ, ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ/పీజీడీఎం, ఎంసీఏ.
**వయసు:** 2025 జులై 1వ తేదీ నాటికి చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్‌కు 40 - 55 ఏళ్లు, చీఫ్ రిస్క్ ఆఫీసర్‌కు 35 - 62 ఏళ్లు, అడ్మినిస్ట్రేటర్, హెడ్‌కు 62 ఏళ్లు, సీనియర్ ట్యాక్స్ ఆఫీసర్‌కు 62 ఏళ్లు, సీనియర్ అప్లికేషన్ డెవలపర్‌కు 25 - 35 ఏళ్లు, అప్లికేషన్ డెవలపర్‌కు 23 - 32 ఏళ్లు ఉండాలి.
**వేతనం:** నెలకు చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్‌కు రూ.5,00,000, చీఫ్ రిస్క్ ఆఫీసర్‌కు రూ.5,00,000, హెడ్‌కు రూ.3.5 లక్షలు, సీనియర్ ట్యాక్స్ ఆఫీసర్‌కు రూ.2,00,000, అడ్మినిస్ట్రేటర్‌కు రూ.2.5 లక్షలు, సీనియర్ అప్లికేషన్ డెవలపర్‌కు రూ.1.25 లక్షలు, అప్లికేషన్ డెవలపర్‌కు రూ.85,000.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 22.07.2025
**దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.850, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు రూ.175.
**ఎంపిక:** ఇంటర్వ్యూతో.
**వెబ్‌సైట్:** https://www.nhb.org.in/

## వాక్-ఇన్స్

### క్యాన్సర్ హాస్పిటల్‌లో..

టాటా మెమోరియల్ సెంటర్‌కు చెందిన వారణాసిలోని హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ మదన్‌మోహన్ మాలవీయ క్యాన్సర్ సెంటర్‌లో ఒప్పంద ప్రాతిపదికన 15 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
● ఫైర్‌మెన్- 06 ● డ్రైవర్- 02 ● ఫార్మసిస్ట్- 03 ● క్లర్క్- 03 ● రేడియోథెరపీ టెక్నాలజిస్ట్- 01
**అర్హత:** పోస్టును అనుసరించి టెన్త్, సంబంధిత విభాగంలో డిగ్రీ, బీఎస్సీ/ బీఫార్మసీ, డీఫార్మసీతోపాటు ఉద్యోగానుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం.
**వేతనం:** నెలకు ఫార్మసిస్ట్‌కు రూ.24,804, రేడియోథెరపీ టెక్నాలజిస్ట్‌కు రూ.25,000-రూ.30,000; ఇతర పోస్టులకు రూ.22,568. **వయసు:** ఫైర్‌మ్యాన్, క్లర్క్‌లకు 27 ఏళ్లు; డ్రైవర్‌కు 28 ఏళ్లు; ఇతర పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు.
**ఇంటర్వ్యూ తేదీలు:** జులై 09, 10, 11, 14
**వేదిక:** మహామన్నా పండిట్ మదన్‌మోహన్ మాలవీయ క్యాన్సర్ సెంటర్ సుందర్ బాగియ, బీహెచ్‌యూ క్యాంపస్, వారణాసి. **వెబ్‌సైట్:** https://tmc.gov.in/

### ఆచార్య ఎన్‌జీరంగా వర్సిటీలో..

ఆచార్య ఎన్‌జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆంధ్రప్రదేశ్ కేవీకే బనవాసి ఒప్పంద ప్రాతిపదికన 6 యంగ్ ప్రొఫెషనల్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
● యంగ్ ప్రొఫెషనల్-1: 05 ● యంగ్ ప్రొఫెషనల్-2: 01
**అర్హత:** పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ (అగ్రికల్చర్), డిప్లొమా, పీజీతో పాటు పని అనుభవం.
**వయసు:** 21 ఏళ్ల నుంచి 45 ఏళ్లు.
**వేతనం:** నెలకు యంగ్ ప్రొఫెషనల్-1కు రూ.30,000, యంగ్ ప్రొఫెషనల్-2కు రూ.42,000.
**ఎంపిక:** ఇంటర్వ్యూతో. **ఇంటర్వ్యూ తేదీ:** 14.07.2025
**వేదిక:** ఆఫీస్ ఆఫ్ ది అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్, రీజినల్ అగ్రికల్చరల్ రిసెర్చ్ స్టేషన్ (ఆర్ఏఆర్ఎస్), నంద్యాల. **వెబ్‌సైట్:** https://angrau.ac.in/ANGRU/Recruitment_Notification_2021.aspx

### ఈఎస్ఐసీలో సీనియర్ రెసిడెంట్లు

కోల్‌కతాలోని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ).. ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ రెసిడెంట్, జీడీఎంఓ (క్లినికల్, నాన్ క్లినికల్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**అర్హత:** మెడికల్ పీజీ డిగ్రీ (ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ)తో పాటు ఉద్యోగ అనుభవం. **వయసు:** ఇంటర్వ్యూ తేదీ నాటికి 45 ఏళ్లు మించకూడదు. **ఇంటర్వ్యూ తేదీలు:** 30.07.2025, 31.07.2025. **వేదిక:** ఈఎస్ఐ-పీజీఐఎంఎస్ఆర్, ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్ అండ్ ఈఎస్ఐసీ హాస్పిటల్.
**వెబ్‌సైట్:** https://www.esic.gov.in/

## అప్రెంటిస్

### ఏఏఐలో 34 అప్రెంటిస్‌లు

ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఎన్ఎస్‌సీబీఐ ఎయిర్ పోర్ట్, కోల్‌కతా, వివిధ విభాగాల్లో 34 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**విభాగాలు:** సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, టెలి కమ్యూనికేషన్, ఐటీఐ, మెకానిక్స్, సీఓపీఏ
● గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: 09 ● డిప్లొమా అప్రెంటిస్: 12 ● ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్: 13
**అర్హత:** పోస్టును అనుసరించి బీటెక్, డిప్లొమా, ఐటీఐ.
**వయసు:** 18 - 26 ఏళ్లు ఉండాలి.
**స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.15,000, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.12,000, ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌కు రూ.9000.
**శిక్షణ వ్యవధి:** 12 నెలలు.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 30.07.2025
**ఎంపిక:** విద్యార్హతల్లో సాధించిన మార్కులతో.
**వెబ్‌సైట్:** https://www.aai.aero/en/recruitment/release/609344



పదాలు లేదా సంఖ్యలు లేదా చిహ్నాల ద్వారా ఒక సందేశాన్ని ఎవరికీ అర్థం కాకుండా నిర్దిష్ట నమూనాల్లో గుప్తీకరణ (ఎన్‌క్రిప్ట్) చేయడాన్ని కోడింగ్ అంటారు. ఆ సందేశ నిజమైన అర్థాన్ని సాధారణ స్థితికి (డీక్రిప్ట్) తీసుకురావడాన్ని డీకోడింగ్‌గా నిర్వచిస్తాం. దీన్ని ఎక్కువగా వైర్‌లెస్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్ పరికరాలు, రక్షణ రంగాలు, సైబర్ సెక్యూరిటీలో ఉపయోగిస్తారు. ఈ రకమైన సమస్యలను అభ్యర్థి విశ్లేషణాత్మక శక్తి, తార్కిక జ్ఞానాన్ని అంచనా వేయడానికి అడుగుతుంటారు. వీటిని సాధించడానికి ఆంగ్ల అక్షరమాల, సంఖ్యా విధానం, సాధారణ గణిత పరిక్రియలపై పట్టు ఉండాలి.

# తార్కికంగా ఆలోచించు జవాబును గుర్తించు

పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్



## కోడింగ్ - డీకోడింగ్

**1.** ఒక కోడ్ భాషలో BUTTER అనేది EXWWHU గా, CHEESE అనేది FKHHVH గా రాస్తే, SESAME ను ఎలా రాస్తారు?

1) UCGOUG 2) WEIQWI 3) VHVDPH 4) VDHPVH

సాధన: B U T T E R → (+3 each) → E X W W H U

C H E E S E → (+3 each) → F K H H V H

ఇదేవిధంగా S E S A M E → (+3 each) → V H V D P H

**సమాధానం: 3**

**2.** ఒక కోడ్ భాషలో 'butter milk ghee' ని 'dy la mt' గా, 'biscuit ghee salad'ని 'bz qp la' గా, 'salad butter egg' ని 'st bz dy' గా కోడ్ చేశారు. అయితే ghee ని ఏవిధంగా కోడ్ చేస్తారు?

1) la 2) mt 3) bz 4) qp

సాధన: మొదటి రెండు వాక్యాల్లో ఉమ్మడి పదంగా ghee ఉంది. ఆ వాక్యాలను కోడ్ చేస్తే వాటిలోని ఉమ్మడి పదం la. కాబట్టి ghee కోడ్ la అవుతుంది. **సమాధానం: 1**

**3.** ఒక కోడ్ భాషలో 924 అంటే they like tomato, 935 అంటే we love tomato, 956 అంటే tomato love mangoగా పేర్కొన్నారు. అయితే mangoకు ఉపయోగించిన కోడ్ ఏమిటి?

1) 2 2) 9 3) 4 4) 6

సాధన: 924 ⇒ they like tomato

935 ⇒ we love tamato

956 ⇒ tomato love mango

కోడ్‌లను పరిశీలిస్తే... tomato - 9, love - 5, mango - 6 అవుతుంది. **సమాధానం: 4**

**4.** ఒక కోడ్ భాషలో 'Ram is boy'ని 'qaz wsx edc'గా, 'boy has car'ని 'plm qaz ijb'గా, 'car is blue'ని 'edc ijb ftb' అని రాశారు. అదే కోడ్ భాషలో Ram ను ఏ విధంగా రాస్తారు?

1) ftb 2) wsx 3) edc 4) qaz

సాధన: Ram is boy ⇒ qaz wsx edc

boy has car ⇒ plm qaz ijb

car is blue ⇒ edc ijb ftb

కోడ్‌లను పరిశీలిస్తే... boy - qaz, is - edc, Ram - wsx అవుతుంది.

**సమాధానం: 2**

**5.** ఒక కోడ్ భాషలో 'travel for fun'ని 'dv pa vi' గా, 'fun will begin'ని 'cr dv em'గా, 'will travel today'ని 'vi cr hz'గా రాశారు. అయితే అదే కోడ్ భాషలో 'for today' అనే పదాన్ని ఏ విధంగా రాస్తారు?

1) dv hz 2) hz pa 3) pa em 4) cr dv

సాధన: travel for fun ⇒ dv pa vi

fun will begin ⇒ cr dv em

will travel today ⇒ vi cr hz

మొదటి రెండు వాక్యాల్లో ఉమ్మడి పదం fun, ఉమ్మడి కోడ్ dv మొదటి, మూడో వాక్యాల్లో ఉమ్మడి పదం travel, ఉమ్మడి కోడ్ vi రెండు, మూడు వాక్యాల్లో ఉమ్మడి పదం will, ఉమ్మడి కోడ్ cr కోడ్‌ను పరిశీలిస్తే for కోడ్ pa, today కోడ్ hz అవుతుంది.

**సమాధానం: 2**

**6.** ఒక కోడ్ భాషలో 'FABRIC' ని 'GZCQJB'గా, 'BITTER' ని 'CHUSFQ' గా రాశారు. అయితే అదే కోడ్ భాషలో 'ANIMAL' ఏ విధంగా రాస్తారు?

1) CNJMCL 2) CMIMBJ 3) ANINCL 4) BMJLBK

సాధన:

| | | |
|---|---|---|
| F + 1 = G | B + 1 = C | A + 1 = B |
| A − 1 = Z | I − 1 = H | N − 1 = M |
| B + 1 = C | T + 1 = U | I + 1 = J |
| R − 1 = Q | T − 1 = S | M − 1 = L |
| I + 1 = J | E + 1 = F | A + 1 = B |
| C − 1 = B | R − 1 = Q | L − 1 = K |

**సమాధానం: 4**

**7.** ఒక కోడ్ భాషలో CBVQ ని 652520గా, FRJT ని 9211323గా రాస్తే, అదే కోడ్ భాషలో EHLPని ఏ విధంగా రాస్తారు?

1) 8111519 2) 7910520 3) 8012514 4) 80121421

సాధన: అక్షరాలు, కోడ్‌లను పరిశీలిస్తే, ఇచ్చిన ఆంగ్ల వర్ణమాలలోని అక్షరాలకు అదనంగా 3 కలిపారు.

C B V Q → (+3 each) → 6 5 25 20

F R J T → (+3 each) → 9 21 13 23

ఇదేవిధంగా E H L P → (+3 each) → 8 11 15 19

**సమాధానం: 1**

**8.** ఒక కోడ్ భాషలో ZEAL ని 9476 గా, LAME ని 8694 గా రాస్తే, అదే కోడ్ భాషలో M ని ఎలా రాస్తారు?

1) 4 2) 6 3) 8 4) 9

సాధన: ఇచ్చిన పదాల్లో ఉమ్మడి అక్షరాలు E, A, L. వీటి కోడ్‌లలో ఉమ్మడి అంకెలు 4, 6, 9.

మనకు కావాల్సింది M అనే అక్షరం కోడ్. ఆ అక్షరం LAME అనే పదంలో ఉంది.

LAME అనే పదం కోడ్ 8694. ఉమ్మడి అంకెలు తీసివేయగా మిగిలే అంకె 8 మాత్రమే. అదే M కోడ్ అవుతుంది.

**సమాధానం: 3**

**9.** ఒక కోడ్ భాషలో TOP అనే పదాన్ని 102 గా, BAD ను 14 గా కోడ్ చేశారు. అదే కోడ్ భాషలో DOG ని ఎలా రాస్తారు?

1) 51 2) 52 3) 53 4) 50

సాధన: ఆంగ్ల వర్ణమాలలో T అనేది 20వ అక్షరం, O అనేది 15వ అక్షరం, P అనేది 16వ అక్షరం.

$T = 20, O = 15, P = 16$

$20 + 15 + 16 = 51$

$\Rightarrow 51 \times 2 = 102$

$BAD \Rightarrow B = 2, A = 1, D = 4$

$2 + 1 + 4 = 7$

$\Rightarrow 7 \times 2 = 14$

అదే విధంగా, $DOG \Rightarrow D = 4, O = 15, G = 7$

$4 + 15 + 7 = 26 \Rightarrow 26 \times 2 = 52$

**సమాధానం: 2**

**10.** ఒక కోడ్ భాషలో BEHOLD ను BDEHLO గా, INDEED ను DDEEIN గా రాశారు. అదే కోడ్ భాషలో COURSE ఏ విధంగా రాస్తారు?

1) CEROSU 2) CEORUS 3) CEOSUR 4) CEORSU

సాధన: ప్రశ్నను జాగ్రత్తగా పరిశీలిస్తే ఇచ్చిన పదంలోని అక్షరాలను ఆరోహణ క్రమంలో అమర్చారు.

BEHOLD ను ఆంగ్ల అక్షరమాల ప్రకారం ఆరోహణ క్రమంలో రాస్తే BDEHLO వస్తుంది. అదేవిధంగా రెండో పదాన్ని రాస్తే,

INDEED ⟶ DDEEIN

COURSE ను ఆరోహణ క్రమంలో రాస్తే వచ్చే క్రమం...

COURSE ⟶ CEORSU

**సమాధానం: 4**




రచయిత

రాజేశ్ మధు, విషయ నిపుణులు


## 705 Word of the Day

### Facsimile

*Telugu meaning:* ప్రతిరూపం, నకలు

*English meaning:* The word facsimile (ఫ్యాక్సిమిలి) is a noun that refers to an exact copy or reproduction of a document, artwork, or object.

*Synonyms:* Replica, Duplicate

*Antonyms:* Original, Authentic

*Usage:* **1.** The museum displayed a facsimile of the ancient manuscript to protect the fragile original.

**2.** Although it looked authentic, the letter was just a facsimile created for archival purposes.

## కరెంట్ అఫైర్స్



భారత ప్రభుత్వ చేనేత, జౌళి మంత్రిత్వశాఖ 2025, జులై 7న జాతీయ చేనేత పురస్కారాలు-2024ను ప్రకటించింది. తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాకకు చెందిన ఇద్దరు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. గజం నర్మద అనే మహిళను మార్కెటింగ్ విభాగంలో, గూడ పవన్‌ను యువ చేనేత విభాగంలోనూ ఎంపిక చేశారు. దేశవ్యాప్తంగా 19 మంది ఎంపికవగా రాష్ట్రం నుంచి ఇద్దరికి పురస్కారాలు దక్కాయి.



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) సీఈఓగా భారత్‌కు చెందిన సంజోగ్ గుప్తా నియమితులయ్యారు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు వ్యక్తిగత కారణాలతో సీఈఓ పదవి నుంచి జెఫ్ అలర్డైస్ (ఆస్ట్రేలియా) తప్పుకోగా, అతని స్థానంలో సంజోగ్ ఎంపికయ్యారు. సంజోగ్ ప్రస్తుతం జియోస్టార్ సీఈవో (స్పోర్ట్స్- లైవ్ ఎక్స్‌పీరియన్స్)గా వ్యవహరిస్తున్నారు. ఐసీసీకి ఈయన ఏడో సీఈవోగా వ్యవహరించనున్నారు.



అంతరిక్ష (స్పేస్) పరిశోధన రంగంలో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఏపీ స్పేస్ పాలసీ 4.0'ను రూపొందించింది. 2024-29 మధ్య పెట్టుబడులు పెట్టే సంస్థలకు పాలసీ నిబంధనలు వర్తిస్తాయని, రాబోయే పదేళ్లలో రూ.25 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని, ప్రత్యక్షంగా, పరోక్షంగా 35 వేల మందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం పేర్కొంది.

శత్రువుల గగనతల దాడి యత్నాలను మరింత ముందుగా, విస్పష్టంగా పసిగట్టే కీలక టెక్నాలజీ అయిన 'ఫొటానిక్ రాడార్'ను భారత్ తొలిసారిగా రూపొందించింది. తద్వారా అతికొద్ది దేశాల సరసన భారత్ చేరింది. రాడార్లను ఏమార్చే స్టెల్త్ యుద్ధ విమానాలనూ ఇది ఇట్టే పసిగడుతుంది. శత్రువుల ఎలక్ట్రానిక్ జామింగ్ తంత్రాలకు ఇది లొంగదు. బెంగళూరులో డీఆర్‌డీవోకు సంబంధించిన ఎలక్ట్రానిక్స్ అండ్ రాడార్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ ల్యాబ్ దీన్ని అభివృద్ధి చేసింది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

## బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటైన రోజు

జులై 9 చరిత్రలో ఈనాడు

సెక్యూరిటీ కాంట్రాక్టుల (క్రమబద్ధ) చట్టం - 1956 ప్రకారం 'సెక్యూరిటీల కొనుగోలు, అమ్మకాల వ్యాపారాన్ని నియంత్రించడానికి లేదా సులభతరం చేయడానికి ఏర్పాటు చేసిన సంఘాన్ని 'స్టాక్ ఎక్స్ఛేంజ్' అంటారు. నమోదైన లేదా నమోదు కాని వ్యక్తులు ఈ సంఘంలో ఉంటారు. ఇది వివిధ కంపెనీల షేర్లను కొనడానికి లేదా అమ్మడానికి ఏర్పాటు చేసిన వేదిక. దేశంలోని ఆర్థిక వాతావరణానికి దీన్ని భారమితిగా పేర్కొంటారు. ఇది దేశ ఆర్థిక ప్రగతిలోనూ ముఖ్య భూమిక పోషిస్తోంది. షేర్లలో పెట్టుబడి ద్వారా త్వరితగతిన లాభాలు పొందవచ్చనేది సాధారణ ప్రజల భావన. 1875, జులై 9న బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)ను స్థాపించారు. ఇది ఏర్పడి నేటికి 150 ఏళ్లు. ఈ సందర్భంగా బీఎస్ఈకి సంబంధించిన ముఖ్య విషయాలను తెలుసుకుందాం..!

◆ బీఎస్ఈ ఆసియాలోనే మొట్టమొదటి స్టాక్ మార్కెట్. దీన్ని సూరత్ వ్యాపారవేత్త ప్రేమ్‌చంద్ రాయ్‌చంద్ నెలకొల్పారు. అప్పట్లో ఇది 'ది నేటివ్ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ అసోసియేషన్' అనే పేరుతో ఏర్పడింది. తర్వాతి కాలంలో ఇది బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌గా మారింది. 2011, జులైలో దీని పేరును బీఎస్ఈ లిమిటెడ్‌గా మార్చారు.

◆ 1957, ఆగస్టు 31న ఇది శాశ్వత ప్రాతిపదికన గుర్తింపు పొందింది. భారత్‌లో తొలి గుర్తింపు పొందిన స్టాక్ ఎక్స్ఛేంజ్ కూడా ఇదే. దీని ప్రధాన కార్యాలయం ముంబయిలోని దలాల్ స్ట్రీట్‌లో ఉంది. ప్రస్తుతం సుందరరామన్ రామమూర్తి బీఎస్ఈకి ఎండీ, సీఈఓగా ఉన్నారు. 2025, జూన్ నాటికి ఇందులో 5647 లిస్టెడ్ కంపెనీలు ఉన్నాయి.




**సూచీలు:** బీఎస్ఈ సెన్సెక్స్, ఎస్ అండ్ పీ బీఎస్ఈ స్మాల్‌క్యాప్, ఎస్ అండ్ పీ బీఎస్ఈ మిడ్ క్యాప్, ఎస్ అండ్ పీ బీఎస్ఈ లార్జ్ క్యాప్, బీఎస్ 500.

◆ 2025, జూన్ నాటికి మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ 5.5 ట్రిలియన్ డాలర్లు (రూ.461 లక్షల కోట్లు).

◆ ఇది విలువపరంగా ప్రపంచంలోనే ఆరో అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్‌గా ఉంది.

## జనరల్ స్టడీస్ - జాగ్రఫీ

## ఆసియా ఖండం




ప్రపంచంలో మొత్తం ఏడు ఖండాలు ఉన్నాయి. అవి.. ఆసియా, ఆఫ్రికా, ఐరోపా, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, ఆస్ట్రేలియా, అంటార్కిటికా. అనేక వైవిధ్యాలకు నెలవైన ఆసియా ఖండం విస్తీర్ణంలో ప్రపంచంలోనే పెద్దది. జనాభా పరంగానూ అన్నింటికంటే ముందుంది. విశాలమైన పర్వత శ్రేణులు, మైదానాలు, పీఠభూములు, ఎడారులు ఈ ఖండంలో ఉన్నాయి. ఆయా అంశాలతో పాటు శీతోష్ణస్థితి, ఖనిజాలు, నదులు, వ్యవసాయం తదితరాలపై పోటీపరీక్షార్థులు దృష్టిసారించాలి.

### హద్దులు

☛ తూర్పున - పసిఫిక్ మహాసముద్రం, పడమరన - యూరల్ పర్వతాలు, కాస్పియన్ సముద్రం, ఉత్తరాన - ఆర్కిటిక్ మహాసముద్రం, దక్షిణాన - హిందూ మహాసముద్రం ఆసియా ఖండానికి హద్దులుగా ఉన్నాయి.

### ఆసియాలోని ఎడారులు

☛ థార్ ఎడారి - భారతదేశం, అరేబియన్ ఎడారులు - ఇరాక్, ఇరాన్, సిరియా ఎడారులు - ఉష్ణ ఎడారులు.

### దీవుల సముదాయం

☛ హిందూ, పసిఫిక్ మహాసముద్రాల్లో అనేక ద్వీపతోరణాలు, ప్రవాళ ద్వీపాలు ఉన్నాయి.

ఉనికి, నదులు, భౌతిక స్వరూపం, శీతోష్ణస్థితి, వర్షపాతం, ఖనిజాలు, జనాభా మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

## Latest Updates

### Advanced Computing Research Posts

Centre for Development of Advanced Computing (CDAC), Bengaluru invites applications for the Advanced Computing Research posts on a contractual basis. The total number of posts is 280. Eligible candidates can apply online before 20 July 2025.

### Manager Posts

Cotton Corporation of India (CCI), a department of the Ministry of Textiles, Government of India, is inviting applications for the 13 Manager and Deputy Manager posts in various departments. The last date for offline applications is 16 July 2025.

### Apprentice Recruitment 2025

Nuclear Power Corporation of India Limited (NPCIL), Kudankulam Nuclear Power Project (KKNPP), Tamil Nadu, invites offline applications for engagement of Apprentices under the Apprentices Act, 1961 in various trades/ disciplines for one-year training. The total no. of posts is 337. The application's last date is 21 July 2025.

## Did You Apply..?

*Today (July 9) is the last date for the following jobs*

☛ 59 Paramedical Staff posts in Damodar Valley Corporation.
*Eligibility:* Diploma or Degree in Nursing, Pharmacy, Physiotherapy, Radiography, Lab Technology, etc.

☛ 42 ASHA posts in DMHO Kakinada.
*Qualification:* 10th class.

*For more information and other notifications - scan QR code*

## Error Detection

*Directions (1 - 30): In the following question, a sentence is divided into four parts and one of those fragments may have errors. Find out which part of the sentence has an error and select the appropriate option. If a sentence is free from error, select 'No Error' as your answer.*

**1.** Everyone in the department (A) / are expected to attend (B) / the training session (C) / scheduled for Friday. (D) / No error (E)

**2.** The manager, along with his team members (A) / have planned (B) / a detailed strategy (C) / to boost sales. (D) / No error (E)

**3.** The committee (A) / were unable to (B) / reach a consensus (C) / on the matter. (D) / No error (E)

**4.** The audience (A) / was very quiet (B) / as the speaker (C) / began his speech. (D) / No error (E)

**5.** Despite he was tired, (A) / he continued (B) / to work late (C) / into the night. (D) / No error (E)

**6.** The engineer who (A) / designed these machines (B) / were awarded (C) / by the ministry. (D) / No error (E)

**7.** My cousin is (A) / the only one of the applicants (B) / who have been selected (C) / for the scholarship. (D) / No error (E)

**8.** He is better (A) / than any student (B) / in his class (C) / in solving puzzles. (D) / No error (E)

**9.** The teacher gave (A) / me an useful advice (B) / which helped me (C) / solve the problem. (D) / No error (E)

**10.** She is not only (A) / talented in singing (B) / but also (C) / in painting. (D) / No error (E)

**11.** You must (A) / to complete the assignment (B) / before the supervisor (C) / checks the final report. (D) / No error (E)

**12.** We discussed about (A) / the budget issues (B) / in yesterday's (C) / staff meeting. (D) / No error (E)

**13.** She has the fewest (A) / experience among all (B) / the candidates appearing (C) / for the interview. (D) / No error (E)

**14.** The teacher asked the students (A) / to write neatly, (B) / behave respectfully, and (C) / they should listen attentively. (D) / No error (E)

**15.** There is no denying (A) / that hard work and (B) / consistent practice (C) / leads to success. (D) / No error (E)

## Bank Exams
## English

**16.** Each of the players (A) / must bring their (B) / own kit to (C) / the practice session. (D) / No error (E)

**17.** If I will see him (A) / at the conference, (B) / I will surely (C) / convey your message. (D) / No error (E)

**18.** He performed (A) / remarkable (B) / well under (C) / extreme pressure. (D) / No error (E)

**19.** The results of the survey (A) / differ significantly (B) / from the ones (C) / we obtained in last year. (D) / No error (E)

**20.** They took the manager's criticism (A) / in the right spirit (B) / and decided to (C) / mend their ways at once. (D) / No error (E)

**21.** The employee was instructed (A) / to complete the report (B) / before he leaves (C) / for the seminar. (D) / No error (E)

**22.** One of the most important (A) / reason for his success (B) / is his ability to (C) / adapt to change. (D) / No error (E)

**23.** He insisted that (A) / the report is submitted (B) / by the end of (C) / the day. (D) / No error (E)

**24.** Neither the board members (A) / nor the CEO (B) / have agreed to (C) / the revised policy. (D) / No error (E)

**25.** I have visited (A) / a European country (B) / during my (C) / last vacation. (D) / No error (E)

**26.** Despite of (A) / facing multiple challenges, (B) / the team managed to (C) / deliver the project on time. (D) / No error (E)

**27.** The principal along with (A) / his staff members (B) / are attending the (C) / workshop this week. (D) / No error (E)

**28.** He is senior (A) / than most of (B) / the employees in (C) / the department. (D) / No error (E)

**29.** Hardly had the speech begun (A) / when a member of the audience (B) / interrupt the speaker (C) / with a loud question. (D) / No error (E)


**30.** She is fond of (A) / to watch (B) / old documentaries (C) / in her free time. (D) / No error (E)

*Scan the QR code for Key*


*Writer: P. Manoj Kumar, Subject Expert*

ఈనాడు ప్రతిభ
హైదరాబాద్, బుధవారం, జులై 9, 2025
23 ♦ https://pratibha.eenadu.net ♦ https://eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

# ప్రజారోగ్యం రక్షణకు కవచాలు!


జనరల్ స్టడీస్ సైన్స్ అండ్ టెక్నాలజీ

**మానవ దేహానికి వ్యాధి నిరోధకతను పెంచడానికి వాడేవే వ్యాక్సిన్లు లేదా టీకాలు. ప్రధానంగా వైరస్, బ్యాక్టీరియాల ద్వారా వ్యాపించే వ్యాధుల నుంచి ఇవి సమర్థంగా రక్షిస్తాయి. ప్రజలను అంటువ్యాధుల నుంచి కాపాడుతూ అనారోగ్యాన్ని దరి చేరనీయకుండా ఆరోగ్య సంరక్షణ ఖర్చును తగ్గిస్తాయి. శక్తిమంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడతాయి. నిర్ణీత వ్యాధులను ఎదుర్కొనే విధంగా శరీరంలో యాంటీబాడీలను ఉత్పత్తి చేసే ఈ బయోటెక్నాలజీ ఉత్పత్తుల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. వీటి ఆవశ్యకత, ఉపయోగాలతో పాటు దేశంలో వినియోగిస్తున్న ముఖ్యమైన టీకాలు, అవి నివారిస్తున్న వ్యాధులు, దేశీయ టీకా కార్యక్రమం ప్రస్థానాన్ని తెలుసుకోవాలి.**

## ఇమ్యూనైజేషన్

(వ్యాక్సిన్లు)

'చికిత్స కంటే నివారణ మేలు' అనే సూత్రం వ్యాక్సిన్లకు సరిగ్గా సరిపోతోంది. వాటిని తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధకత పెరిగి వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుంది. వ్యాధి నివారణ అంశాల్లో మొదటిది, అత్యుత్తమమైనది వ్యాక్సిన్లు ఇవ్వడం. వ్యాక్సిన్ల వల్ల వ్యాధులు రాకుండా నివారించవచ్చు లేదా వ్యాధి సోకినా దాని తీవ్రత తక్కువగా ఉంటుంది. వ్యాధి నిరోధకతను గురించిన అధ్యయనాన్ని ఇమ్యునాలజీ అంటారు. వ్యాక్సిన్ల తయారీ, అభివృద్ధి సాంకేతికతను 'ఇమ్యునైజేషన్ టెక్నాలజీ' అంటారు. ఎడ్వర్డ్ జెన్నర్‌ను 'ఇమ్యూనాలజీ పితామహుడు' అంటారు. మొదటిసారిగా అభివృద్ధి చేసిన వ్యాక్సిన్ మశూచి (స్మాల్‌పాక్స్) వ్యాక్సిన్.


ఎడ్వర్డ్ జెన్నర్

**వ్యాక్సిన్లు పనిచేసే విధానం:** వ్యాక్సిన్లు శరీరంలోకి ప్రవేశించిన తర్వాత యాంటీజెన్లు (ప్రతిరక్షక జనకాలు)గా పనిచేసి యాంటీబాడీలను (ప్రతిరక్షక దేహాలు) ఉత్పత్తి చేస్తాయి. ఇవి సూక్ష్మజీవులు లేదా వాటి పదార్థాలపై పనిచేసి వ్యాధిని నివారిస్తాయి. ఒక్కో రకమైన వ్యాక్సీన్‌కు ఒక్కో రకమైన యాంటీబాడీలు ఉత్పత్తి అయ్యి వ్యాధి నిరోధకతను కలుగజేస్తాయి.

## వ్యాక్సిన్లు - నివారించే వ్యాధులు

### స్మాల్‌పాక్స్ వ్యాక్సిన్

ఎడ్వర్డ్ జెన్నర్ దీనిని అభివృద్ధి చేశాడు. ఇది వారియోలా వైరస్ వల్ల కలిగే మశూచి వ్యాధిని నివారిస్తుంది. ప్రపంచంలోనే మొదటిసారిగా నిర్మూలించిన వ్యాధి మశూచి. అందుకే ప్రస్తుతం ఈ వ్యాక్సీన్‌ను ఎవరూ తీసుకోవడం లేదు.

### హెపటైటిస్-ఎ వ్యాక్సిన్

దీనిని హెపటైటిస్-ఎ వైరస్ వల్ల కలిగే హెపటైటిస్-ఎ వ్యాధి నివారణకు ఇస్తారు.

### హెపటైటిస్-బి వ్యాక్సిన్

దీనిని హెపటైటిస్-బి వైరస్ వల్ల కలిగే హెపటైటిస్-బి వ్యాధి నివారణకు ఇస్తారు. ఈ వైరస్ కలుషిత రక్తం, సూదుల ద్వారా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి కాలేయాన్ని ప్రభావితం చేస్తుంది.

### బీసీజీ వ్యాక్సిన్

దీని పూర్తి పేరు బాసిల్లై కాల్‌మెట్టి గురినో. ఇది మైకోబ్యాక్టీరియం ట్యూబర్‌క్యులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల కలిగే క్షయ వ్యాధి నుంచి రక్షణ కల్పిస్తుంది. దీనిని కుడిచేతిపై ఇస్తారు.

### హిబ్ వ్యాక్సిన్

హిబ్ పూర్తి పేరు హీమోఫిలస్ ఇన్‌ఫ్లూయెంజా టైప్-బి. ఇదొక బ్యాక్టీరియా. మెనెంజైటిస్, న్యుమోనియా, సెప్టీమియా అనే ఇన్‌ఫెక్షన్లను కలిగిస్తుంది. వీటి నివారణకు హిబ్ వ్యాక్సీన్‌ను ఇస్తారు.

### డీపీటీ వ్యాక్సిన్

దీని పూర్తిపేరు డిఫ్తీరియా పెర్టుసిస్ టెటనస్. ఈ వ్యాక్సీన్ మూడు రకాల వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. అవి- 1) కార్నీ బ్యాక్టీరియం డిఫ్తీరియె అనే బ్యాక్టీరియా వల్ల కలిగే డిఫ్తీరియా వ్యాధి (అంగుడు వాపు) 2) బోర్డిటెల్లా పెర్టుసిస్ అనే బ్యాక్టీరియా కలుగజేసే కోరింత దగ్గు. పెర్టుసిస్‌ను 'ఊపింగ్ కాఫ్' అని కూడా అంటారు. 3) క్లాస్ట్రీడియం టెటనీ అనే బ్యాక్టీరియా వల్ల కలిగే టెటనస్ (ధనుర్వాతం). దీనిని ట్రిపుల్ యాంటీజెన్ అని కూడా అంటారు.

### ఎంఎంఆర్ వ్యాక్సిన్

దీని పూర్తి పేరు మంప్స్, మీజిల్స్, రూబెల్లా. ఇది మూడు రకాల వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. అవి-

1) మిక్సోవైరస్ పెరటిడిస్ అనే వైరస్ వల్ల కలిగే మమ్స్ (గవద బిళ్లలు) వ్యాధి. ఈ వ్యాధి చెవుల కింద భాగంలో ఉన్న పెరోటిడ్ లాలాజల గ్రంథులకు సంక్రమిస్తుంది. 2) మీజిల్స్ వైరస్ వల్ల కలిగే తట్టు (మీజిల్స్) వ్యాధి. 3) రూబెల్లా వైరస్ వల్ల కలిగే రూబెల్లా వ్యాధి. ఈ వ్యాధిని జర్మన్ మీజిల్స్ అని కూడా అంటారు.

ఈ వ్యాధులకు ఎంఎంఆర్ వ్యాక్సీన్ అందుబాటులో లేకపోతే మీజిల్స్ రూబెల్లా వ్యాక్సీన్, రూబెల్లా వ్యాక్సీన్‌ను కూడా ఇస్తారు.

### హెక్సావాలెంట్ వ్యాక్సిన్

ఇది ఆరు రకాల వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. అవి డిఫ్తీరియా, పెర్టుసిస్, టెటనస్, హెపటైటిస్-బి, పోలియో, హీమోఫిలస్ ఇన్‌ఫ్లూయెంజా టైప్-బి బ్యాక్టీరియా కలుగజేసే వ్యాధులు.

### కలరా వ్యాక్సిన్

ఇది విబ్రియో కలరే అనే బ్యాక్టీరియా వల్ల కలిగే కలరా వ్యాధిని నివారిస్తుంది.

### పోలియో వ్యాక్సిన్

పోలియో వైరస్ వల్ల వచ్చే పోలియో వ్యాధిని నివారించడానికి దీనిని అభివృద్ధి చేశారు. పోలియోను 'శిశు పక్షవాతం' అని కూడా అంటారు. పోలియో వైరస్‌లో 1, 2, 3 అనే ఉపరకాలు ఉన్నాయి. ఈ మూడు రకాల వైరస్‌ల బారి నుంచి ఈ వ్యాక్సీన్ రక్షణ కల్పిస్తుంది. దీనిని నోటి ద్వారా లేదా ఇంజక్షన్‌తో తీసుకోవచ్చు.

### చికెన్ పాక్స్ వ్యాక్సిన్

ఇది 'వారిసెల్లా జోస్టర్' అనే వైరస్ వల్ల వచ్చే చికెన్‌పాక్స్ (అమ్మవారు) వ్యాధిని నివారిస్తుంది.




### రోటావైరస్ వ్యాక్సిన్

రోటా వైరస్ వల్ల కలిగే 'రోటా వైరల్ డయేరియా' నుంచి రక్షణ కలిగిస్తుంది. ఈ వ్యాధి చిన్నపిల్లల్లో మరణాన్ని కలుగజేస్తుంది. ఈ వ్యాక్సీన్‌ను ఏడాది లోపు పిల్లలకు ఇవ్వడం వల్ల ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది.

### టీఏబీ వ్యాక్సిన్

దీని పూర్తిపేరు సాల్మోనెల్లా టైఫీ, సాల్మోనెల్లా పారాటైఫీ-ఎ, బి. ఈ వ్యాక్సీన్ టైఫాయిడ్, పారాటైఫాయిడ్ వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది.

### టీటీ వ్యాక్సిన్

దీని పూర్తిపేరు టెటనస్ టాక్సాయిడ్. ఇది టెటనస్ (ధనుర్వాతం) నుంచి రక్షణ కల్పిస్తుంది. క్లాస్ట్రీడియం టెటనీ అనే బ్యాక్టీరియా వల్ల ధనుర్వాతం కలుగుతుంది.

### రేబిస్ వ్యాక్సిన్

రేబిస్ వైరస్ వల్ల కలిగే రేబిస్ వ్యాధి నివారణకు దీనిని ఇస్తారు. రేబిస్‌ను 'హైడ్రోఫోబియా' అని కూడా అంటారు. కుక్క, అడవి జంతువులు కరవడం/గీరడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. ఈ వ్యాక్సీన్‌ను జంతువులు కరవక ముందే లేదా కరచిన తర్వాత కూడా ఇస్తారు.




### జేఈ వ్యాక్సిన్

జపనీస్ ఎన్‌సెఫలైటిస్ అనే వైరస్ వల్ల కలిగే మెదడువాపు వ్యాధి నుంచి రక్షణ కల్పిస్తుంది. దీనిని భారతదేశంలోని నిర్దిష్ట ప్రాంతాల్లో, వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న జిల్లాల్లో ఇస్తున్నారు.

### పీసీవీ-వ్యాక్సిన్

దీని పూర్తిపేరు న్యూమోకోకల్ కాంజుగేట్ వ్యాక్సీన్. ఇది బ్యాక్టీరియా వల్ల కలిగే న్యుమోనియా, చెవి ఇన్‌ఫెక్షన్, సెప్టీమియా నుంచి రక్షణ కల్పిస్తుంది.

### కరోనా వైరస్



దీనిని కొత్తరకం కరోనా వైరస్ లేదా సార్స్ కరోనా వైరస్-2 వల్ల కలిగే కొవిడ్-19 వ్యాధిని నివారించడానికి ఇస్తారు.

### హెచ్‌పీవీ వ్యాక్సిన్

హ్యూమన్ పాపిలోమా వైరస్ స్త్రీలలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను కలుగజేస్తుంది. ఈ వ్యాధిని నివారించడానికి హెచ్‌పీవీ వ్యాక్సీన్‌ను యుక్తవయసులో ఉన్న ఆడవారికి ఇస్తారు.

### పెంటావాలెంట్ వ్యాక్సిన్

ఇది అయిదు రకాల వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. అవి డిఫ్తీరియా, పెర్టుసిస్, టెటనస్, హెపటైటిస్-బి, హిబ్ వ్యాధి.


**భారతదేశంలో ఇమ్యూనైజేషన్ కార్యక్రమం**

దేశంలో మొదటిసారి 1962లో క్షయ నివారణకు బీసీజీ వ్యాక్సీన్‌ను నేషనల్ ట్యూబర్‌క్యులోసిస్ కంట్రోల్ ప్రోగ్రాంలో భాగంగా ఇచ్చారు. 1978లో నేషనల్ ఇమ్యూనైజేషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. 1985లో యూనివర్సల్ ఇమ్యూనైజేషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించి, దేశమంతటా వ్యాక్సిన్లు ఇస్తున్నారు. 1997లో యూనివర్సల్ ఇమ్యూనైజేషన్ ప్రోగ్రామ్‌ను నేషనల్ రిప్రొడక్టివ్ అండ్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రామ్‌లో భాగంగా చేర్చారు.

2005 నుంచి యూనివర్సల్ ఇమ్యూనైజేషన్ ప్రోగ్రామ్‌ను నేషనల్ రూరల్ హెల్త్‌మిషన్‌లో ఉంచారు. నేషనల్ ఇమ్యూనైజేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా గర్భిణులు, పిల్లలకు వివిధ రకాల వ్యాక్సిన్లు ఇస్తున్నారు.

**వ్యాక్సిన్లను శరీరంలోకి ప్రవేశపెట్టే విధానం**

వ్యాక్సిన్లను శరీరంలోకి ఇంజక్షన్ రూపంలో ఇస్తారు. కండరం లేదా చర్మం లోపల, చర్మం కింద ఇంజెక్షన్ చేస్తారు. నోటి ద్వారా చుక్కలమందు రూపంలో, ముక్కు ద్వారా స్ప్రే రూపంలో ఇస్తారు.



రచయిత: డాక్టర్ బి.నరేశ్

## మాదిరి ప్రశ్నలు



కరెంట్ అఫైర్స్

✿ ఆస్ట్రేలియా ప్రధాన మంత్రిగా ఇటీవల తిరిగి ఎవరు ఎన్నికయ్యారు? (గత 20 ఏళ్లలో ఆస్ట్రేలియాలో వరుసగా రెండో సారి గెలిచిన మొదటి ప్రధానిగా ఈయన ఘనత సాధించారు.)

జ: ఆంథోనీ ఆల్బనీస్

✿ 2025 మే నెలలో భారత్‌లో పర్యటించిన అంగోలా అధ్యక్షుడెవరు? (పర్యటన సందర్భంగా ఆయుర్వేదం, వ్యవసాయం, సంస్కృతికి సంబంధించి ఇరు దేశాల మధ్య అవగాహన ఒప్పందాలు కుదిరాయి. అంగోలా సాయుధ దళాల ఆధునీకరణకు 200 మిలియన్ డాలర్ల లైన్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ)కి భారత్ ఆమోదం తెలిపింది. అంగోలా ఇటీవల అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ)లో 123వ సభ్యదేశంగా చేరింది.) జ: జోవోలౌరెంకో

✿ ఇటీవల జరిగిన సింగపూర్ సార్వత్రిక ఎన్నికల్లో ప్రస్తుత ప్రధాన మంత్రి లారెన్స్ వాంగ్ నేతృత్వంలోని పాలక పీపుల్స్ యాక్షన్ పార్టీ (పీఏపీ) మొత్తం 97 సీట్లకు గాను ఎన్ని సీట్లలో విజయం సాధించింది? జ: 87

✿ ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవాన్ని ఏటా ఎప్పుడు నిర్వహిస్తున్నారు? (1993 నుంచి ఈ దినోత్సవాన్ని ఏటా నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం ఆమోదించిన ఈ దినోత్సవాన్ని యునెస్కో ఏటా నిర్వహిస్తోంది.)

జ: మే 3

మరింత సమాచారం




## భారత రాజ్యాంగం-చారిత్రక నేపథ్యం

# 'కొల్లగొట్టిన ధనాన్ని పంచుకోడానికే ఆ చట్టం!'


**అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా పేరు పొందిన భారత రాజ్యాంగానికి చారిత్రక నేపథ్యం కూడా సుదీర్ఘంగానే ఉంది. దేశంలో బ్రిటిష్ వలస పాలన మొదలైనప్పటి నుంచి క్రమంగా చోటు చేసుకున్న పరిపాలనా పరమైన పరిణామాలు, స్థిరపడిన చట్టపరమైన సంప్రదాయాలన్నీ స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ రచనపై ప్రభావాన్ని చూపాయి. కేంద్రీకృత పాలన, పరిపాలనా వ్యవస్థలు, పన్నుల యంత్రాంగం, న్యాయవ్యవస్థ, చట్టసభలు, శాసనాల రూపకల్పన తదితరాలన్నీ వారసత్వంగా మిగిలిపోయాయి. అందుకే బ్రిటిష్ ప్రభుత్వం తొలుత రెగ్యులేటింగ్ చట్టాలు, ఆ తర్వాత భారత ప్రభుత్వ చట్టాల రూపంలో పాలన సాగించిన తీరు, వాటిలోని ప్రధానాంశాలు, అవి తెచ్చిన మార్పులపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి.**

## ఇండియన్ పాలిటీ



1. భారత రాజ్యాంగ పరిణామక్రమాన్ని ఆరు దశలుగా చేయవచ్చని పేర్కొన్న రాజనీతిజ్ఞుడు ఎవరు?
   1) కె.ఎన్.రావు 2) టి.పి.శేషన్
   3) బి.సి.రావత్ 4) బి.ఎన్.రావు

2. ఈస్టిండియా కంపెనీలో జరుగుతున్న అవినీతిని నియంత్రించడానికి ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని ఏ రహస్య కమిటీ సిఫార్సు చేసింది?
   1) జనరల్ బుర్గోయిన్
   2) జనరల్ కాడ్మిన్
   3) జనరల్ నార్త్‌బ్రూక్
   4) జాన్ హైడ్


జనరల్ బుర్గోయిన్

3. భారతదేశంలో ఈస్టిండియా కంపెనీ కార్యకలాపాలను నియంత్రించే 'రెగ్యులేటింగ్ చట్టం'కు సంబంధించిన బిల్లును అప్పటి బ్రిటన్ ప్రధాని లార్డ్ నార్త్ పార్లమెంట్‌లో ఎప్పుడు ప్రవేశపెట్టారు?
   1) 1773, మార్చి 18 2) 1773, మే 18
   3) 1773, ఆగస్టు 18 4) 1774, ఫిబ్రవరి 18

4. రెగ్యులేటింగ్ చట్టం-1773కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) భారతదేశంలో మొదటి లిఖిత రాజ్యాంగ చట్టంగా పేరొందింది.
   బి) భారతదేశంలో కేంద్రీకృత పరిపాలనకు పునాదులు వేసింది.
   సి) ఈస్టిండియా కంపెనీకి మొదటిసారిగా రాజకీయ, పరిపాలనా అధికారాలు కల్పించింది.
   డి) భారతదేశంలో తొలిసారిగా హైకోర్టుల ఏర్పాటుకు అవకాశం కల్పించింది.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

5. 'రెగ్యులేటింగ్ చట్టం-1773' లోని అంశాన్ని గుర్తించండి.
   ఎ) 'బెంగాల్ గవర్నర్' హోదాను 'గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్'గా మార్పు చేశారు.
   బి) ముంబయి, మద్రాస్ గవర్నర్లను 'బెంగాల్ గవర్నర్ జనరల్' పరిధిలోకి తీసుకొచ్చారు.
   సి) 'గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్'కు పరిపాలనలో సహకరించేందుకు నలుగురు సభ్యులతో కూడిన కార్యనిర్వాహక మండలిని ఏర్పాటు చేశారు.
   డి) 'కార్యనిర్వాహక మండలి' కాలపరిమితి ఆరేళ్లుగా నిర్ణయించారు.
   1) ఎ, సి డి 2) ఎ, బి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

6. 'రెగ్యులేటింగ్ చట్టం, 1773' ప్రకారం ఏర్పాటు చేసిన కార్యనిర్వాహక మండలి (ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్)లోని సభ్యులను గుర్తించండి.
   ఎ) ఫిలిప్ ఫ్రాన్సిస్, రాబర్ట్ చాంబర్స్
   బి) రిచర్డ్ బార్‌వెల్, జాన్ విలియమ్స్
   సి) జాన్ క్లావెరింగ్, మాన్‌సన్
   డి) ఫిలిప్ ఫ్రాన్స్ రిచర్డ్ బార్‌వెల్
   1) ఎ, బి 2) ఎ, సి
   3) బి, సి 4) సి, డి

7. రెగ్యులేటింగ్ చట్టం, 1773 ప్రకారం 1774లో మన దేశంలో కోల్‌కతాలోని 'ఫోర్ట్ విలియం'లో ఏర్పాటుచేసిన తొలి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
   1) సర్ జాన్ హైడ్
   2) సర్ ఎలిజా ఇంఫే
   3) సర్ విలియం జాన్
   4) సర్ విలియం పిట్


సర్ ఎలిజా ఇంఫే

8. కోల్‌కతాలో ఏర్పాటుచేసిన తొలి సుప్రీంకోర్టులో పని చేయని న్యాయమూర్తి?
   1) సర్ జాన్ హైడ్ 2) విలియం జాన్స్
   3) రాబర్ట్ ఛాంబర్స్ 4) సీజర్ లైమెస్టర్

9. బెంగాల్‌కు మొదటి గవర్నర్ జనరల్‌గా ఎవరు నియమితులయ్యారు?
   1) కారన్ వాలీస్ 2) లార్డ్ వెల్లస్లీ
   3) విలియం బెంటింక్ 4) వారన్ హేస్టింగ్స్

10. రెగ్యులేటింగ్ చట్టం-1773లోని లోపాలను సరిచేయడం కోసం ఏ సంవత్సరంలో సవరణ చట్టాన్ని (అమెండ్‌మెంట్ యాక్ట్) బ్రిటిష్ పార్లమెంట్ రూపొందించింది?
   1) 1775 2) 1777 3) 1781 4) 1783

11. పిట్స్ ఇండియా చట్టం-1784కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) ఈ చట్టాన్ని అప్పటి బ్రిటిష్ ప్రధాని 'విలియం పిట్' ప్రతిపాదించారు.
   బి) ఈస్టిండియా కంపెనీ రాజకీయ, వాణిజ్య విధులను వేరు చేశారు.
   సి) భారతదేశంలో బ్రిటిష్ పాలిత ప్రాంతాలు అనే అంశాన్ని తొలిసారిగా ప్రస్తావించారు.
   డి) గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలిలో ఉన్న సభ్యుల సంఖ్యను నాలుగు నుంచి మూడుకు తగ్గించారు.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

12. 'పిట్స్ ఇండియా చట్టం-1784'లోని అంశాన్ని గుర్తించండి.
   ఎ) ఈస్టిండియా కంపెనీలో మొదటిసారిగా 'ద్వంద్వ పాలన' ప్రవేశపెట్టారు.
   బి) ఈస్టిండియా కంపెనీ రాజకీయ వ్యవహారాలను నియంత్రించడానికి 'బోర్డు ఆఫ్ కంట్రోల్'ను ఏర్పాటు చేశారు.
   సి) ఈస్టిండియా కంపెనీ వ్యాపార, వాణిజ్య వ్యవహారాలను నియంత్రించడానికి 'కోర్టు ఆఫ్ డైరెక్టర్స్'ను ఏర్పాటు చేశారు.
   డి) జాతీయ స్థాయిలో 'ఇంపీరియల్ పార్లమెంట్'ను ఏర్పాటు చేశారు.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

13. భారతదేశంలో కొల్లగొట్టిన ధనాన్ని పంచుకోవడానికి బ్రిటిషర్లు 'పిట్స్ ఇండియా చట్టం-1784' ద్వారా ప్రయత్నించారని ఎవరు వ్యాఖ్యానించారు?
   1) దాదాభాయ్ నౌరోజీ 2) మోతీలాల్ నెహ్రూ
   3) కారల్ మార్క్స్, ఏంగిల్స్ 4) దంతెవాలా


14. 'చార్టర్ చట్టం-1793'కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) భారతీయుల హక్కులు, ఆస్తులు, వారసత్వం, వివాహం, మత విషయాలకు సంబంధించి గవర్నర్ జనరల్ చేసే నిబంధనలకు చట్టాలతో సమానమైన విలువ ఉంటుంది.
   బి) బొంబయి, మద్రాసు ప్రెసిడెన్సీల పౌర మిలిటరీ ప్రభుత్వాలపై గవర్నర్ జనరల్‌కు పూర్తి అధికారం కల్పించారు.
   సి) 'బోర్డు ఆఫ్ కంట్రోల్'లోని సభ్యుల జీతభత్యాలు, ఇతర ఖర్చులు భారతదేశ రెవెన్యూ నుంచి చెల్లిస్తారు.
   డి) ఈ చట్టం రూపొందే సమయానికి భారత గవర్నర్ జనరల్‌గా కారన్‌వాలీస్ ఉన్నారు.
   1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

15. ఈస్టిండియా కంపెనీకి భారతదేశంలో ఉన్న 'వర్తక గుత్తాధిపత్యాన్ని' ఏ చట్టం ద్వారా తొలగించి, దాన్ని కేవలం పరిపాలనా సంస్థగా మార్చారు?
   1) పిట్స్ ఇండియా చట్టం - 1784
   2) చార్టర్ చట్టం - 1813
   3) చార్టర్ చట్టం - 1793
   4) చార్టర్ చట్టం - 1833

16. చార్టర్ చట్టం – 1813 కు సంబంధించిన అంశాన్ని గుర్తించండి.
   ఎ) గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలికి ప్రెసిడెన్సీ ప్రాంతాలపై ప్రత్యక్ష నియంత్రణ అధికారాన్ని కల్పించారు.
   బి) భారతదేశంలో విద్యాభివృద్ధి కోసం 'లక్ష రూపాయల'తో ప్రత్యేక నిధి ఏర్పాటు.
   సి) స్థానిక సంస్థలకు పన్నులు విధించి, వసూలు చేసే అధికారాన్ని కల్పించారు.
   డి) భారతదేశంలో క్రైస్తవ మిషనరీల ఏర్పాటుకు అవకాశం కల్పించారు.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

17. ఏ చట్టం ప్రకారం 'బెంగాల్ గవర్నర్ జనరల్' పదవిని 'భారతదేశ గవర్నర్ జనరల్' పదవిగా మార్పు చేశారు?
   1) చార్టర్ చట్టం - 1813 2) చార్టర్ చట్టం-1833
   3) చార్టర్ చట్టం - 1793
   4) ఇండియన్ కౌన్సిల్ చట్టం - 1861


18. భారతదేశపు మొదటి గవర్నర్ జనరల్ ఎవరు?
   1) లార్డ్ వెల్లస్లీ
   2) లార్డ్ డల్హౌసీ
   3) వారన్ హేస్టింగ్స్
   4) విలియం బెంటింక్


విలియం బెంటింక్

19. చార్టర్ చట్టం – 1833లోని అంశాన్ని గుర్తించండి.
   ఎ) ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ఎలాంటి వివక్ష లేకుండా అందరికీ సమాన అవకాశాల కల్పన.
   బి) తేయాకు వ్యాపారం, చైనాతో వ్యాపారాన్నీ ఈస్టిండియా కంపెనీ నియంత్రణ నుంచి తొలగించారు.
   సి) యూరోపియన్లు భారతదేశానికి వలస వచ్చేందుకు, భూమి, ఆస్తులు సంపాదించుకునేందుకు అవకాశం కల్పించారు.
   డి) సివిల్ సర్వీసుల నియామకాల్లో బహిరంగ పోటీ పద్ధతిని ప్రతిపాదించారు. కానీ దీన్ని 'కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్' వ్యతిరేకించింది.
   1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

20. చార్టర్ చట్టం – 1833 ద్వారా భారతదేశంలో బానిసత్వాన్ని రద్దు చేయాలని నిర్ణయించినప్పటికీ ఎవరు వ్యతిరేకించడం వల్ల అమల్లోకి రాలేదు?
   1) లార్డ్ ఉడ్స్ 2) లార్డ్ ఎలిన్‌బరో
   3) సర్ జాన్ క్లిఫ్స్ 4) విలియం బెంటింక్

21. చార్టర్ చట్టం – 1833 ద్వారా భారతీయ శాసనాలను క్రోడీకరించడానికి ఒక 'లా కమిషన్'ను ఏర్పాటు చేశారు. దీని తొలి అధ్యక్షుడు ఎవరు?
   1) లార్డ్ మెకాలే
   2) చార్లెస్ విల్కిన్స్
   3) విలియం క్లిఫ్స్
   4) రాబర్ట్ మెకాలే


లార్డ్ మెకాలే

22. చార్టర్ చట్టం – 1853కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) బ్రిటిషర్లు రూపొందించిన చార్టర్ చట్టాల్లో ఇది చివరి చట్టం.
   బి) గవర్నర్ జనరల్ అధికారాలను శాసన, కార్యనిర్వాహక అధికారాలుగా విభజించారు.
   సి) శాసనాల రూపకల్పనకు ఇండియన్ సెంట్రల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు.
   డి) శాసన నిర్మాణంలో భారతీయులకు తొలిసారిగా అవకాశం కల్పించారు.
   1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

23. ఈస్టిండియా కంపెనీ పాలనా కాలంలో 'లా కమిషన్' సిఫార్సుల మేరకు రూపొందించిన న్యాయ అంశాలకు సంబంధించి సరైన సమాధానాన్ని గుర్తించండి.
   ఎ) సివిల్ ప్రొసీజర్ కోడ్ - 1859
   బి) ఇండియన్ పీనల్ కోడ్ - 1860
   సి) క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ - 1861
   డి) ఇండియన్ సివిల్ కోడ్ - 1862
   1) ఎ, సి, డి 2) ఎ, బి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

24. చార్టర్ చట్టం – 1853 ప్రకారం కేంద్ర లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో నలుగురు సభ్యులకు ఏ ప్రాంతాల నుంచి ప్రాతినిధ్యం కల్పించారు?
   1) బెంగాల్, ముంబయి, మద్రాస్, ఆగ్రా
   2) ముంబయి, బెంగాల్, గ్వాలియర్, దిల్లీ
   3) బెంగాల్, ముంబయి, మద్రాస్, మైసూర్
   4) ముంబయి, బెంగాల్, పంజాబ్, సెంట్రల్ ప్రావిన్సెస్

25. ఏ చట్టం ద్వారా భారతదేశంలో ఈస్టిండియా కంపెనీ పాలన అంతమై భారతదేశ పాలన నేరుగా బ్రిటిష్ రాణి పరిధిలోకి వెళ్లింది?
   1) చార్టర్ చట్టం-1853
   2) భారత ప్రభుత్వ చట్టం-1858
   3) ఇండియన్ కౌన్సిల్ చట్టం-1861
   4) ఇండియన్ కౌన్సిల్ చట్టం-1892



రచయిత: బంగారు సత్యనారాయణ

**సమాధానాలు**

1-3; 2-1; 3-2; 4-1; 5-3; 6-4; 7-2; 8-2; 9-4; 10-3; 11-4; 12-1; 13-3; 14-4; 15-2; 16-4; 17-2; 18-4; 19-4; 20-2; 21-1; 22-4; 23-3; 24-1; 25-2.